టార్గెట్ ఏపీపీఎస్సీ
ప్రణాళికతో పఠనం.. ఉద్యోగానికి సోపానం!
▪వీడియో పాఠాలు ▪ఈ-బుక్స్ ▪ప్రాక్టీస్ టెస్ట్స్
▪కరెంట్ అఫైర్స్ ▪రియల్ టైం ఆన్‌లైన్ గ్రాండ్ టెస్ట్స్
SCAN HERE
www.epratibha.net 8008001640


ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

విజయవాడ 3-2-2026 మంగళవారం సిటీ సంపుటి 52 . సంచిక 174 | రూ. 6-50 పేజీలు 14 | www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

తాజా బిజినెస్ వార్తలు, ఆర్థిక సందేహాల నివృత్తికై సిరి చూడండి
www.eenadusiri.net

వాణిజ్య ఒప్పందానికి ఓకే

భారత్‌పై సుంకాల్ని 18 శాతానికి తగ్గిస్తున్నాం

- మా వస్తువులపై సున్నా సుంకాలకు, రష్యా చమురు నిలిపివేతకు ఆ దేశం అంగీకరించింది
- మోదీ నాకు గొప్ప స్నేహితుడు
- ప్రధానితో ఫోన్ చర్చల అనంతరం ట్రంప్ ప్రకటన
- 25 శాతం అదనపు సుంకాలూ ఉండబోవన్న శ్వేతసౌధం
- ట్రంప్‌నకు 140 కోట్ల మంది తరఫున కృతజ్ఞతలు
- 18 శాతానికి సుంకాల తగ్గింపుపై మోదీ వ్యాఖ్య
- వాణిజ్య ఒప్పందాన్ని ప్రస్తావించని ప్రధాన మంత్రి

దిల్లీ: భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికాపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం(ఇందులో రష్యా నుంచి చమురు కొంటున్నందుకు విధించిన 25 శాతం అదనపు సుంకం ఉంది) సుంకాలు 18 శాతానికి తగ్గుతాయి. శ్వేతసౌధం కూడా ఈ అదనపు సుంకాల తొలగింపును ధ్రువీకరించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి సోమవారం ట్రంప్ ఫోన్ చేశారు. అనంతరం తన సోషల్ మీడియా వేదిక ట్రూత్‌లో ప్రకటన చేశారు. ''ప్రధాని మోదీతో మాట్లాడటాన్ని గౌరవంగా భావిస్తున్నా. నాకున్న గొప్ప స్నేహితుల్లో ఆయన ఒకరు. భారత్‌కు ఆయన శక్తిమంతమైన, గౌరవప్రదమైన నాయకుడు. (మిగతా 3లో)


రెండు చక్రాల మధ్య నిండు ప్రాణాలు!

ప్రమాదం రాకడ...
ప్రాణం పోకడ...
ఎవరూ చెప్పలేని పరిస్థితి.
బైక్‌తో రోడ్డెక్కిన మనిషి ఇంటికి వచ్చిందాకా ఆందోళనే. రాష్ట్రంలో జరుగుతున్న ప్రమాదాల్లో ఎక్కువమంది ద్విచక్రవాహనదారులే ప్రాణాలు కోల్పోతున్నారు. మితిమీరిన వేగం... హెల్మెట్ పెట్టుకోవాలన్న స్పృహకూడా లేకపోవడం... శాపాలవుతున్నాయి

ఈనాడు - అమరావతి

9 ముప్పులు

1. ప్రమాదకరంగా ఓవర్ టేకింగ్ చేయటం
2. నిర్లక్ష్యంగా డ్రైవింగ్
3. వాహన నిర్వహణ సరిగ్గా లేకపోవడం
4. ఎక్కువ దూరం బైక్‌పై ప్రయాణించటం వల్ల అలసిపోవటం
5. మంచు కమ్మేసిన సందర్భాల్లో ముందున్న వాహనాలు సరిగ్గా కనిపించకపోవటం
6. రాత్రి వేళల్లో రహదారులు సరిగ్గా కనిపించకపోవటం
7. జాతీయ, రాష్ట్ర రహదారులపై వాహనం నడిపేటప్పుడు లేన్ డిసిప్లేన్ పాటించకపోవటం
8. వ్యతిరేక దిశలో వాహనాలు నడపటం
9. నైపుణ్యం, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడపటం



ఓ ప్రాణం విలువ... కోల్పోయిన ఆ కుటుంబానికి తెలుస్తుంది. కాస్త నిర్లక్ష్యం అంతులేని విషాదాన్ని నింపుతుంది. నిండు ప్రాణాలను హరిస్తుంది. వారిని ప్రేమించే వారిని, వారిపై ఆధారపడ్డవారిని సుడిగుండంలోకి నెట్టేస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఏటా సగటున 8వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో 50 శాతం ద్విచక్రవాహనదారులే. తలకు బలమైన గాయాలవ్వడం వల్ల ఎక్కువ మరణాలు చోటుచేసుకుంటున్నాయి. బైక్ నడిపేవాళ్లు, వెనక కూర్చొన్న వాళ్లు హెల్మెట్ ధరిస్తే ప్రమాదం జరిగినా, ప్రాణాలు నిలబడతాయని తెలిసినా ఇంకా చాలామంది నిర్లక్ష్యంగానే ఉంటున్నారు. ఏమవుతుందిలే అన్న ధీమా వారి ప్రాణాలను బలిగొంటోంది. హెల్మెట్ ధరించకపోవటం వల్ల రాష్ట్రంలో ఏటా సగటున 2,500-3,000 ప్రాణాలు రోడ్డుపాలవుతున్నాయి.

ప్రయాణం ప్రమాదం

- ద్విచక్ర వాహనాల ప్రమాదాలకు అతి వేగం ప్రధాన కారణం. మితిమీరిన వేగంతో నడిపేటప్పుడు వాహనాన్ని ఆకస్మికంగా అదుపు చేయడం కష్టమవుతోంది. దీంతో తీవ్ర ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బైక్ డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్లో మాట్లాడటం, మద్యం మత్తులో వాహనం నడపటం, నిబంధనలు సరిగ్గా పాటించకపోవడం కూడా ప్రమాదాలను పెంచుతున్నాయి.
- ఓవర్‌టేక్ చేస్తున్నప్పుడు ఎక్కువ యాక్సిడెంట్లు చోటుచేసుకుంటున్నాయి. ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించాలంటే ఎంత వేగంతో వెళ్లాలనేది కచ్చితంగా అంచనా వేయలేకపోవటం, ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయటం వంటివి ఘటనల సంఖ్యను పెంచుతున్నాయి.
- రాష్ట్రంలో 2020 నుంచి 2025 నవంబరు వరకూ 1,20,657 రోడ్డు ప్రమాదాలు జరగ్గా.. అందులో 59,724 (49.49 శాతం) ద్విచక్ర వాహన ప్రమాదాలే. ఆరేళ్ల గణాంకాలు విశ్లేషిస్తే సగటున ప్రతి గంటకూ రెండు నుంచి, మూడు ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలింది. వాటిలో ఒకటి ద్విచక్ర వాహన ప్రమాదం.
- 2025లో నవంబరు 30 వరకూ రాష్ట్రంలో 18,837 ప్రమాదాలు జరగ్గా.. 8,466 మంది ప్రాణాలు కోల్పోయారు. అందులో దాదాపు 45 శాతానికి పైగా ప్రమాదాలు, ప్రమాద మరణాలు ద్విచక్ర వాహనాలతో చోటుచేసుకున్నవే. ద్విచక్ర వాహనాలు ప్రమాదాలకు గురైనప్పుడు కనీసం ఒక్క మరణమైనా చోటుచేసుకునే ముప్పు అధికంగా ఉంటోంది.

అలా చేస్తే... 11,139 మంది సేఫ్!

- వివరాలు 3లో


రాష్ట్రంలో ద్విచక్ర వాహనాల ప్రమాదాలు..

2025 (నవంబరు)	8,476
2024	8,800
2023	10,415
2022	9,965
2021	11,853
2020	10,215
మొత్తం	59,724

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE
Vencobb FRESH CHICKEN Vencobb No.1 Tastiest Chicken
సూచించిన నేటి గ్రుడ్లు & చికెన్ విజయవాడ జోన్ ధరలు
12 గ్రుడ్ల రిటైల్ ధర ₹ 75
ఫారం దగ్గర లైవ్ బర్డ్ 133 కిలో
డ్రెస్సేడ్ స్కిన్‌తో 232 కిలో
రిటైల్ లైవ్ బర్డ్ 160 కిలో
స్కిన్‌లెస్ 264 కిలో
Conditions Apply
వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

6న క్వాంటమ్ వ్యాలీకి భూమిపూజ 2లో

క్యాన్సర్‌ను ఓడిద్దాం!



ప్రత్యేక కథనాలు సుఖీభవలో

మనదేశంలో క్యాన్సర్ మహమ్మారిలా విస్తరిస్తోంది. ఏటా 15 లక్షలకు పైగా కేసులు నమోదవుతున్నాయి. జనాభా, వృద్ధుల సంఖ్య, కాలుష్యం పెరుగుతున్న తరుణంలో కేసులు ముమ్ముందు మరింత ఎక్కువయ్యే అవకాశముంది. వెంటనే కళ్లు తెరవకపోతే పరిస్థితి విషమించటం ఖాయం. ఎంతో ప్రమాదకరం అయిన క్యాన్సర్‌ను నివారించుకునే మార్గం లేకపోలేదు. తొలిదశలో గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది. ఇప్పుడు అత్యాధునిక చికిత్సలూ భరోసానిస్తున్నాయి. క్యాన్సర్‌ను ఓడించటానికి కంకణ బద్ధులం కావాలి. ఇందుకు వరల్డ్ క్యాన్సర్ డే (ఫిబ్రవరి 4) కన్నా మించిన సందర్భం ఏముంటుంది?

పచ్చని రాష్ట్రంలో చిచ్చుకు వైకాపా కుట్ర

కూటమి శ్రేణులు వారి ట్రాప్‌లో పడొద్దు

భాజపా ఎంపీల పిలుపు

కేంద్ర బడ్జెట్ వికసిత ఆంధ్రప్రదేశ్‌కు బాటలు వేస్తుందని కితాబు 10లో

నరవణె పుస్తకంపై వాగ్వాదం

లోక్‌సభలో చైనా దురాక్రమణ రగడ

చీరపై కాదు.. బడ్జెట్‌పై దృష్టిపెట్టండి

నిర్మలా సీతారామన్ అసహనం 14లో

సర్పంచి పదవిపై వ్యామోహంతో కన్నబిడ్డను చంపేశాడు

ముగ్గురు పిల్లలుంటే పోటీ చేయలేనని కుమార్తెను హత్య చేసిన తండ్రి

మహారాష్ట్రలోని కెరూర్ గ్రామంలో దారుణ ఘటన



ప్రాచి

ఎడపల్లి, న్యూస్‌టుడే: సర్పంచి పదవిపై కాంక్ష.. అతన్ని కర్కోటకుడిగా మార్చింది. ముగ్గురు పిల్లలు ఉంటే పోటీలో నిలిచేందుకు అర్హత కోల్పోతానని భావించి.. ఓ చిన్నారిని నీటిలో పడేసి హత్యకు పాల్పడ్డాడు. సోమవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి ఠాణాలో సీపీ సాయిచైతన్య ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఎడపల్లి మండలం ఏఆర్పీక్యాంపు శివారులో గత నెల 29న డి46 సాగునీటి కాల్వలో ఓ బాలిక మృతదేహం తేలియాడుతూ కనిపించింది. శరీరంపై గాయాలు ఉండటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక చిత్రాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయగా.. కానిస్టేబుల్ సుధీర్ పోస్టును (మిగతా 3లో)

వైకాపా వారి ఉచ్చులో పడొద్దు



- కావాలనే రెచ్చగొడుతున్నారు
- తాము చేసిన ఘోర పాపాల్ని డైవర్ట్ చేయాలని చూస్తున్నారు
- తప్పు చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించి తీరతాం
- పార్టీ ముఖ్యనేతలతో అధినేత చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'హింస, విధ్వంసం, అవినీతి పునాదులపై పుట్టిన వైకాపా రెచ్చగొట్టినా వారి ఉచ్చులో పడొద్దు. అలా చేస్తే వారికి మనకీ తేడా ఉండదు. ప్రజలకు మేలు చేయడమే మన పార్టీ సిద్ధాంతం. ఇదే విషయాన్ని పార్టీ శ్రేణులకు స్పష్టం చేయండి' అని తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శ్రేణులు సంయమనంతో వ్యవహరించేలా మంత్రులు, సీనియర్ నేతలు బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. సోమవారం ఉదయం పలువురు పార్టీ ముఖ్యనేతలతో ఆయన మాట్లాడారు. 'రాష్ట్రంలో హింసను ప్రేరేపించేలా వైకాపా వాళ్లు కుట్రలు పన్నుతున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి ఘోర పాపం చేసిన వాళ్లు రెచ్చగొట్టే వ్యాఖ్యలతో ఆ అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు సాధించి అభివృద్ధి చేయాలనేదే మన ప్రధాన ఎజెండా. దీన్ని చెడగొట్టేందుకు వైకాపా వాళ్లు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరతాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

బలమైన బ్రాండ్ ఇమేజ్ మనకుంది

పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు పార్టీ కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. చట్టాన్ని గౌరవించేవారిగా తెదేపా నాయకులు, (మిగతా 3లో)

ఏపీకి గేమ్ ఛేంజర్‌గా బుల్లెట్ రైళ్లు

చెన్నై- కోల్‌కతా కారిడార్ నాలుగు లైన్లుగా నిర్మాణం

శరవేగంగా దక్షిణ కోస్తా జోన్ కార్యాలయ పనులు

ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.10,134 కోట్ల కేటాయింపు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్



ఈనాడు, అమరావతి: కొత్తగా చేపట్టనున్న బుల్లెట్ రైళ్ల ప్రాజెక్టులు ఏపీకి గేమ్ ఛేంజర్ కానున్నాయని, ఇది రాష్ట్రానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. హైస్పీడ్ రైల్ కారిడార్లు అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం గణనీయంగా తగ్గిపోతుందన్నారు. బుల్లెట్ రైళ్లలో హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా చెన్నైకి 2.55 గంటల్లో, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు 2 గంటల్లో, బెంగళూరు నుంచి చెన్నైకి 1.13 గంటల్లో చేరుకోవచ్చని మంత్రి వెల్లడించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాల వారీగా రైల్వే ప్రాజెక్టులకు జరిపిన కేటాయింపులను ఆయన సోమవారం (మిగతా 3లో)

తిరుమలలో వైకాపా చేసింది ముమ్మాటికీ మహాపచారమే



వైకాపా నాయకులతో వ్యక్తిగత ద్వేషం, వైరం లేవు. వాళ్ల భాష, నేర స్వభావంతోనే సమస్య. ఇళ్లలోకి వస్తాం, దాడులు చేస్తాం, నరికేస్తాం అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. వాళ్ల భాష సరిగా లేని కారణంగానే ఈరోజు దాడులు జరుగుతున్నాయి.

- కాసుల కక్కుర్తితో నెయ్యికాని నెయ్యితో లడ్డూ తయారీ.. సిట్ తేల్చి చెప్పింది ఇదే
- భక్తుల మనోభావాలు దెబ్బతినకూడదనే.. జంతు కొవ్వు కలిసిందో లేదో బహిర్గతం చేయలేదు
- వైకాపా నాయకులు గోబెల్స్ ప్రచారం.. అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే యత్నం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆగ్రహం
- ప్రజలకు తెలియజెప్పాలంటూ శ్రేణులకు ఉద్బోధ
- వైకాపా నేతల భాష సరిగా లేనందునే వారిపై దాడులు
- దాడులను ఏ పార్టీ సమర్థించదని వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: 'వైకాపా పాలనలో తిరుమల వేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించిన నెయ్యి అసలు నెయ్యే కాదని సిట్ తేల్చింది. రసాయనాలు, పామాయిల్ ఉపయోగించి తయారు చేసిన నూనెతో లడ్డూలు తయారు చేసి శ్రీవారి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. కోట్లమంది భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని.. జంతువుల కొవ్వు కలిసిందా లేదా అనే విషయాన్ని సిట్ బహిర్గతం చేయలేదు. లడ్డూ విషయంలో వైకాపా నేతలు చేస్తున్న గోబెల్స్ ప్రచారం ఆగాలంటే వాస్తవాలు ప్రజలకు తెలియజేయాలి' అని ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో సోమవారం జనసేన సర్వసభ్య సమావేశంలో ఆయన (మిగతా 3లో)

జంతుకొవ్వు నుంచి వచ్చిన రసాయనాలతోనే నెయ్యి తయారీ

వైకాపా నేతల రూ.235 కోట్ల దోపిడీని ప్రజలకు తెలియజేయాలి

జనసేన సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు 3లో

ఇదీ సంగతి!



ఇప్పుడెళ్లండి బయటికి!
మీ వల్ల మాకు తంటాలొస్తున్నాయి!!

పెద్ద చేపల్ని వదిలేశారా?

- నిబంధనలు మార్చేసి.. కల్తీ నెయ్యికి గేట్లెత్తడం నేరం కాదా?
- దాన్ని ఆమోదించి అమలుకు సహకరించిన ఛైర్మన్, అధికారులు నిందితులు కాదా?
- అయినా పట్టించుకోని సిట్
- చర్యలు తీసుకోవాలంటూ నామమాత్రపు సిఫార్సు

ఈనాడు - అమరావతి



తితిదేలో ఛైర్మన్, ఈవో, అదనపు ఈవో ఎంతో కీలకం.. వారికి తెలియకుండా, ఆమోదం లేకుండా ఎలాంటి నిర్ణయాలూ జరగవు. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరాకూ వారు తీసుకున్న నిర్ణయాలే కారణం. ఇవి కుట్రపూరితంగా కనిపిస్తున్నా.. సిట్ వారిని నిందితులుగా చేర్చలేదు. అప్పటి ఈవో, అదనపు ఈవోలపై చర్యలు తీసుకోమంటూ కేవలం కంటితుడుపుగా సిఫారసు చేసింది. తెదేపా హయాంలో పకడ్బందీగా రూపొందించిన నెయ్యి సరఫరా నిబంధనల్ని మార్చేసి కల్తీ నెయ్యికి ద్వారాలు తెరిచినప్పుడే నేరానికి అంకురార్పణ జరిగింది. ఈ కేసులో వారే కీలకమనడానికి సిట్ దాఖలు చేసిన ఛార్జిషీట్‌లోనే బోలెడు సాక్ష్యాలున్నాయి. నెయ్యి కల్తీ జరిగిందని 2022లోనే సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక ఇచ్చింది. లంచం అడుగుతున్నారనే ఫిర్యాదూ అందింది. దానికి కింది స్థాయిలోని వారిని బాధ్యుల్ని చేస్తే సరిపోతుందా? నిబంధనలు సడలించడమే అన్నింటికీ మూలం. కుట్రకు బీజం పడిందక్కడే. అంత పెద్ద నిర్ణయం తీసుకుని అమలు చేసిన వారిని నిందితుల జాబితాలో చేర్చకుండా వదిలేయడంలో ఆంతర్యమేంటి, కుట్ర ఎలా జరిగిందో, ఎవరు సూత్రధారులో చెప్పడంలో సిట్ విఫలమైనట్లు కాదా?

కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు.. అయినా ఛైర్మన్ బాధ్యుడు కాదా?

తితిదే వార్షిక బడ్జెట్ రూ.5 వేల కోట్లకు పైనే. దానిలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి వినియోగించే దినుసుల కొనుగోలుకు రూ.750 కోట్లకు పైగా వెచ్చిస్తారు. అందులో సగం నెయ్యి కొనుగోలుకే ఖర్చు పెడతారు. అంత భారీ మొత్తం వెచ్చించి, అదీ కోట్లమంది భక్తుల మనోభావాలతో ముడిపడిన లడ్డూ ప్రసాదానికి ఉపయోగించే నెయ్యి కొనేటప్పుడు నిబంధనలు సడలించి కల్తీకి అవకాశం కల్పించారు. ఐదేళ్లలో ఏకంగా 59.71 లక్షల కిలోల కల్తీ నెయ్యి కళ్లుమూసుకుని కొనేశారు. దానితో 20.01 కోట్ల లడ్డూల్ని తయారు చేసి, రూ.234.51 కోట్ల తితిదే నిధుల్ని (మిగతా 3లో)

లంచం అడిగారని చెప్పినా.. ఛైర్మన్ ఎందుకు పట్టించుకోలేదు?

2022లో నెయ్యి నమూనాలను మైసూరులోని సీఎఫ్‌టీఆర్ఐకి పంపాలని ఆదేశించిన ఛైర్మన్.. నెయ్యిలో కల్తీ జరిగిందని రిపోర్టు వచ్చినా ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఆ నెయ్యి సరఫరా చేసిన డెయిరీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టకపోవడం నేరం కాదా? కల్తీ జరిగిందని నివేదిక వచ్చినా తొక్కిపెట్టిన ఛైర్మన్ నిందితుడు కాదా? నేరానికి ఆయన సహకరించినట్లు కాదా?

బాలుడికి మోమోలు పెట్టి.. ఆభరణాలు కొట్టేశారు!

రూ.85 లక్షల నగలు కాజేత



ఊహాచిత్రం

ఇద్దరు నిందితుల అరెస్టు

దేవరియా: మోమోలంటే ఆ అబ్బాయికి ఎంతో ఇష్టం. ఎన్ని పెట్టినా హాయిగా లాగించేస్తాడు. ఈ అమితమైన మక్కువే ఆ ఇంటికి ఓ సమస్యను తెచ్చిపెట్టింది. రూ.85 లక్షల విలువైన నగలు పోగొట్టుకునేందుకు కారణమైంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని దేవరియాకు చెందిన బాలుడు ఏడో తరగతి చదువుతున్నాడు. మోమోలు తినేందుకు తరచూ ఓ దుకాణానికి వెళ్లేవాడు. ఆ అబ్బాయి (మిగతా 3లో)

(c) eenadu

6న క్వాంటమ్ వ్యాలీకి భూమిపూజ

• ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతిలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న క్వాంటమ్ వ్యాలీ నిర్మాణానికి ఈ నెల 6న భూమిపూజ జరగనుంది. ఉద్దండరాయునిపాలెం సమీపంలో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరై భూమిపూజ నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం ఇప్పటికే 50 ఎకరాలను కేటాయించింది. ఇక్కడి ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం పరిశీలించారు.

5న 'మన నీరు-మన భవిష్యత్తు' సదస్సు

రాయపూడి సమీపంలో ఇటీవల గణతంత్ర దినోత్సవం జరిగిన ప్రాంతంలో ఈ నెల 5న 'మన నీరు-మన భవిష్యత్తు, సాగు నీటి సంఘాల ప్రాత' అంశంపై సదస్సు జరగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు, సభ్యులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు.

గ్రహం అనుగ్రహం

3–2–2026 మంగళవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
విదియ: రా. 2-15 తదుపరి తదియ
మఖ: రా. 11-56 తదుపరి పుబ్బ
వర్జ్యం: మ. 12-02 నుంచి 1-38 వరకు
అమృత ఘడియలు: రా. 9-33 నుంచి 11-08 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-51 నుంచి 9-36 వరకు తిరిగి రా. 10-37 నుంచి 11-48 వరకు
రాహుకాలం: సా. 3-00 నుంచి 4-30 వరకు
సూర్యోదయం: ఉ.6.36; **సూర్యాస్తమయం:** సా.5.52

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	13.7	31.6
విజయనగరం	14.0	26.0
అనంతపురం	18.0	32.6
శ్రీకాకుళం	19.0	29.0
కడప	19.0	31.0
తాడేపల్లిగూడెం	19.0	31.0
తిరుపతి	19.2	30.3
కర్నూలు	19.2	31.9
నరసాపురం	20.5	30.6
విజయవాడ	20.8	29.8
గుంటూరు	21.0	32.0
రాజమహేంద్రవరం	21.0	33.5
విశాఖపట్నం	21.4	29.2
ఒంగోలు	21.5	30.2
నెల్లూరు	21.8	29.6

క్యాన్సర్ అట్లాస్ సిద్ధం

• దేశంలోనే తొలిసారి రాష్ట్రంలో రూపకల్పన
• పీడితులపై భారం తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక
• 2030 నాటికి అత్యాధునిక చికిత్స అందుబాటులోకి

ఈనాడు, అమరావతి: క్యాన్సర్‌కు అధునాతన చికిత్స కోసం ఎవరూ ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండకూడదని, రాష్ట్రంలో అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2030 నాటికి ఇది సాకారం కావాలని లక్ష్యం నిర్దేశించుకుంది. నివారణ, ప్రాథమిక పరీక్షలు, ప్రారంభ దశలో గుర్తింపు ద్వారా వ్యాధి తీవ్రతను తగ్గించేలా పూర్తిగా దృష్టిపెట్టారు. నానాటికీ పెరుగుతున్న క్యాన్సర్ కేసులతోపాటు.. పీడితులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే చర్యలు చేపట్టారు. ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ప్రభుత్వ సలహాదారుగా నియమించి ఈ వ్యాధి కట్టడి దిశగా కార్యాచరణ చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ కేసులను గుర్తించేందుకు ప్రత్యేకంగా అసాంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) 4.0 సర్వే చేపడుతున్న ప్రభుత్వం.. దేశంలోనే తొలిసారిగా క్యాన్సర్ అట్లాస్‌ను రూపొందించింది. జిల్లాలవారీ పరిస్థితులకు అనుగుణంగా ఈ మహమ్మారిపై సమరానికి అడుగులు వేస్తోంది.

అట్లాస్‌తో సమగ్ర కార్యాచరణ..

■ క్యాన్సర్‌ను నోటిఫై వ్యాధిగా ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. తాజాగా రూపొందించిన అట్లాస్ ద్వారా ఎక్కడికక్కడ పరిస్థితి చక్కదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. ఇందుకు ప్రాధాన్య అంశాలు నిర్దేశించుకుంది.



■ ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ఆరోగ్య విద్యకు ప్రాధాన్యం.
■ క్యాన్సర్ భయాలు తొలగించడం, అవగాహన కార్యక్రమాలు. ■ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్త చర్యలు. ■ ప్రమాదస్థాయిలో ఉన్నవారిని గుర్తించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు.
■ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించడం.
■ తక్కువ ఖర్చుతో, సులువుగా అందుబాటులో ఉండే వైద్యం. ■ దీర్ఘకాలిక రోగులకు జీవన ప్రమాణాలు మెరుగుపరిచే చర్యలు. ■ ఎన్టీఆర్ వైద్య సేవ పథకం ద్వారా నగదు రహిత సేవలు.

వయసులవారీగా క్యాన్సర్ పీడితులు (శాతాల్లో..)

వయసు	పురుషులు	స్త్రీలు
0– 29	2.3	2.3
30– 39	3.5	5.3
40– 49	7.1	14.7
50– 59	9.5	18.8
60– 69	9.3	12.1
70 ఏళ్ల పైబడి..	7.9	7.3

అంతటా.. ప్రమాద ఘంటికలు

క్యాన్సర్ అట్లాస్‌లో పేర్కొన్న గణాంకాల ప్రకారం.. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ ఈ వ్యాధి పీడితులు ఉన్నారు. అత్యధిక కేసులు కాకినాడ జిల్లాలో (8,101) ఉన్నాయి. అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో (1,495) ఉన్నాయి. పీడితుల్లో మహిళలు ఎక్కువగా ఉన్నారు. 50-59 ఏళ్ల వయసు వారు అధికంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారు.

జిల్లాల వారీగా కేసులు..

జిల్లా	పీడితులు	జిల్లా	పీడితులు
కాకినాడ	8,101	పల్నాడు	6,353
విజయనగరం	7,987	తిరుపతి	6,281
శ్రీకాకుళం	7,609	అనకాపల్లి	6,240
గుంటూరు	7,479	కర్నూలు	6,038
విశాఖపట్నం	7,205	అనంతపురం	5,964
నెల్లూరు	7,115	చిత్తూరు	5,800
ఏలూరు	6,857	కృష్ణా	5,741
తూర్పుగోదావరి	6,829	వైఎస్సార్ కడప	5,694
ప్రకాశం	6,711	నంద్యాల	5,358
ఎన్టీఆర్	6,697	బాపట్ల	5,227
పశ్చిమ గోదావరి	6,441	అన్నమయ్య	5,211
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	6,441	శ్రీసత్యసాయి	5,173
		పార్వతీపురం మన్యం	2,992
		అల్లూరి సీతారామరాజు	1,495

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి:

■ జనాభా: 5.24 కోట్లు. ■ ఏటా నమోదవుతున్న క్యాన్సర్ కేసులు: 35,658 ■ డబ్ల్యూహెచ్‌ఓ, ఐసీఎంఆర్ అంచనా ప్రకారం 2020 నుంచి 2030 మధ్యకాలంలో కేసుల పెరుగుదల: 20%

క్యాన్సర్ తీవ్రత ఇలా..

■ రాష్ట్రంలో కొత్తగా వెలుగుచూసిన కేసులు: 1,59,963
■ పీడితులు: పురుషులు 35.82%, స్త్రీలు: 64.19%
■ చికిత్సలు (అడ్మిషన్లు, కీమో/రేడియో థెరపీ వంటివి..): 12,60,453
■ పొందుతున్న సేవలు: మెడికల్ 81.68%, రేడియేషన్: 11.71%, సర్జికల్ 6.62%
■ వైద్యం ఖర్చు: రూ.3,061 కోట్లు



బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షిస్తున్న మంత్రులు ఆనం, జనార్దన్‌రెడ్డి, అనిత

భక్తులకు గొప్ప అనుభూతి కలగాలి

• శ్రీశైల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రులు

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 8 నుంచి 18 వరకు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు గొప్ప అనుభూతి కలిగేలా ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీశైలంలోని సదాశివయ్య సత్రంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంత్రులు బి.సి.జనార్దన్‌రెడ్డి, వంగలపూడి అనితతో కలిసి సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆనం మాట్లాడుతూ.. సీఎం నిర్ణయం మేరకు బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యమివ్వాలన్నారు. క్యూలైన్లలో పాలు, బిస్కెట్లు, అల్పాహారం, మంచినీరు సరఫరాతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. నాలుగు రోజుల పాటు భక్తులకు ఉచిత లడ్డూలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ఈ నెల 14, 15 తేదీల్లో శ్రీశైలం వైపు ఉన్న అన్ని టోల్‌గేట్ల వద్ద టోల్ రుసుం తీసుకోకుండా భక్తుల వాహనాలను అనుమతించాలని ఆదేశించారు. గతేడాది కంటే 50 శాతం అదనంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. హోం మంత్రి అనిత మాట్లాడుతూ.. పోలీస్, ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తూ.. ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మూడు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 8 లోపు ఆత్మకూరు-దోర్నాల మధ్య రహదారికి ఇరువైపులా బెర్మ్ పనులు పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ రామచంద్రమోహన్, ఈవో ఎం.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ ఈఎన్సీగా వరప్రసాద్



ఈనాడు, అమరావతి: రాష్ట్ర జలవనరుల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ (పాలన)గా ఎం.ఎల్.ఎన్.వరప్రసాద్ నియమితులయ్యారు. తిరుపతి ఎన్టీఆర్ తెలుగుగంగ చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఈ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఉన్న శ్యాంప్రసాద్ జనవరి నెలాఖరున పదవీ విరమణ చేయడంతో పోస్టు ఖాళీ అయింది. వరప్రసాద్ సోమవారం విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.

తెదేపా ఎంపీలకు ఓం బిర్లా తేనీటి విందు

• అందరి నేపథ్యాన్ని వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్న లోక్‌సభ స్పీకర్

ఈనాడు, దిల్లీ: తెదేపా ఎంపీలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం సాయంత్రం తేనీటి విందు ఇచ్చారు. వివిధ పార్టీల ఎంపీలతో వ్యక్తిగతంగా సమావేశమవుతూ వస్తున్న ఆయన అందులో భాగంగా తెదేపా ఎంపీలతో సమావేశమై వ్యక్తిగతంగా వారితో వివిధ అంశాలపై చర్చించారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరు, ఇంకా మెరుగుపరచడానికి అందులో మార్పులు, చేర్పులు చేయాల్సిన అంశాలు, చర్చల్లో ఎంపీల భాగస్వామ్యం, తొలిసారి పార్లమెంటుకు వచ్చిన ఎంపీల అనుభవాలు, వారికి తమవైపు నుంచి కావాల్సిన మద్దతు గురించి అడిగి తెలుసుకున్నారు. ఇందుకు తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు స్పందిస్తూ ప్రశ్నోత్తరాల సమయం సరిపోవడం లేదు కాబట్టి దాని సమయాన్ని మరో అరగంట పెంచాలని సూచించారు. ప్రశ్నోత్తరాలకు సభ్యులు సమాయత్తమై వచ్చినప్పటికీ అనుబంధ ప్రశ్నలు అడగడానికి సమయం సరిపోవడంలేదు కాబట్టి దాన్ని పొడిగించడానికి ప్రయత్నించాలని కోరారు. అలాగే సభ్యుల పరిశోధనకు పార్లమెంటు పరంగా తగిన మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాతో తెదేపా ఎంపీలు హరీష్ బాలయోగి, లక్ష్మీనారాయణ, అప్పలనాయుడు, ప్రసాదరావు, శ్రీకృష్ణదేవరాయలు, శ్రీభరత్, నాగరాజు

అన్ని పార్టీలకూ ప్రశ్నలు సమానంగా వచ్చేలా చూడాలని కోరారు. స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావడం కోసం తొలిసారి ఎంపికై వచ్చిన వారికి జీరో అవర్‌లో ఎక్కువ సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఒక రాష్ట్ర ఎంపీలు మరో రాష్ట్ర ఎంపీలను పరిచయం చేసుకునేందుకు వీలుకల్పించేలా వేదికను ఏర్పాటుచేయాలని కోరారు. నియోజకవర్గాల సమస్యలను సభ్యులు మరింత సమర్థంగా వినిపించేందుకు శూన్య గంట నిడివిని రెండు గంటలకు పెంచాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ సభ్యుల వ్యక్తిగత నేపథ్యం గురించి అడిగినప్పుడు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు గురించి లావు వివరించారు. ఎంపీటీసీగా ఉన్న సామాన్య కార్యకర్తను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రోత్సహించి ఎంపీగా పోటీచేయించి దిల్లీ వరకు వచ్చేలా చేశారని చెప్పారు. దగ్గుమళ్ల ప్రసాదరావు ఆదాయపన్ను శాఖ అధికారిగా పదవీవిరమణ చేసిన తర్వాత రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. సామాన్య కార్యకర్తగా ఉన్న అప్పలనాయుడిని చంద్రబాబు ప్రోత్సహించారన్నారు. అప్పుడు స్పీకర్ అందరినీ అభినందించారు. సైకిల్‌మీద పార్లమెంటుకు వచ్చే ఎంపీగా అప్పలనాయుడిని గుర్తుచేస్తూ, ఆయన విజ్ఞప్తి మేరకు తొలిసారి పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. అందరు సభ్యులు మరింత ఉత్సాహంతో సభా కార్యకలాపాల్లో పాల్గొని నియోజకవర్గాల సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని సూచించారు.

లండన్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన

• ఆ నగరాభివృద్ధిపై అధ్యయనం
• అమరావతిలో పర్యాటక ప్రాజెక్టులు, రివర్ ఫ్రంట్ అభివృద్ధిపై పరిశీలన

ఈనాడు, అమరావతి: లండన్ నగరానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్, అభివృద్ధి ప్రణాళికలు, రవాణా సౌకర్యాలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ ఆధ్వర్యంలో అధికారుల బృందం సోమవారం అధ్యయనం చేసింది. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక, వాణిజ్య, సాంస్కృతిక కేంద్రాల్లో ఒకటై రెండు వేల ఏళ్ల చరిత్ర కలిగిన లండన్ నగరాభివృద్ధిపై అక్కడి నగర ప్రణాళికాభివృద్ధి విభాగం డైరెక్టర్ గిన్ రిచర్డ్స్‌తోనూ సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో భాగంగా పలు ప్రాజెక్టుల అభివృద్ధికి లండన్, దోహాల్లో అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణతోపాటు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్, అమరావతి గ్రోత్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ ఆదివారం విజయవాడ నుంచి బయలుదేరి వెళ్లారు. అమరావతిలో పర్యాటక ప్రాజెక్టులు, రివర్ ఫ్రంట్ అభివృద్ధి, అంతర్జాతీయ క్రీడా నగరం నిర్మాణం కోసం పలు ప్రాంతాలకు వెళ్లి పరిశీలించాలన్నది వీరి పర్యటన ఉద్దేశం. సోమవారం లండన్ చేరుకున్న వీరు.. లండన్ సిటీ మినియేచర్ ద్వారా నగర నిర్మాణ తీరును పరిశీలించారు. లండన్‌లో బాటర్సీ పవర్‌స్టేషన్‌ను మంత్రి బృందం సందర్శించింది. దశాబ్దాలపాటు విద్యుత్తు ఉత్పత్తి చేసి మూతపడిన పవర్ స్టేషన్‌ను ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసిన తీరును అడిగి తెలుసుకున్నారు.



మంత్రి నారాయణతో సిటీ ఆఫ్ లండన్ కార్పొరేషన్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గిన్ రిచర్డ్స్. చిత్రంలో అధికారులు సురేష్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు


✦ థేమ్స్ నది ఒడ్డున అత్యంత సుందరంగా ఆహ్లాదకర వాతావరణంలో ఐకానిక్ భవనంతో పాటు పర్యాటకుల గమ్యస్థానంగా బాటర్సీ పవర్ స్టేషన్‌ను తీర్చిదిద్దారని మంత్రి నారాయణ అభిప్రాయపడ్డారు. బోటింగ్‌తోపాటు రివర్ ఫ్రంట్ అభివృద్ధి పర్యాటకంగానే కాకుండా వాణిజ్య కేంద్రంగా మారిందని ఆయన వివరించారు. అమరావతిలో కూడా పర్యాటక ప్రాజెక్టులు పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నందున.. థేమ్స్ నది రివర్ ఫ్రంట్‌ను పరిగణనలోకి తీసుకునే అవకాశాలపై సంబంధిత వర్గాలతో మంత్రి చర్చించారు.

✦ ప్రపంచంలో అత్యంత ఎత్తైన కాంటిలివర్ అబ్జర్వేషన్ వీల్‌ను సందర్శించారు. అమరావతిలో కృష్ణా నది ఒడ్డున ఇదే తరహా వీల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే సూచనప్రాయంగా అంగీకరించింది. లండన్ ఐ పనితీరును అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎస్.కోటలో 100 పడకల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రం ప్రారంభం

• రాష్ట్రంలో కొత్తగా 11 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు పిలిచాం
• మంత్రి సత్యకుమార్ యాదవ్

విజయనగరం కంటోన్మెంట్, శృంగవరపుకోట, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి నేషనల్ డయాలసిస్ ప్రోగ్రాం కింద రాష్ట్రంలో కొత్తగా 11 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు టెండర్లు పిలిచామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శృంగవరపుకోట ప్రాంతీయ ఆసుపత్రి ఆవరణలో రూ.12.60 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి, డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. భీమవరం, జమ్మలమడుగు, వెంకటగిరి, అద్దంకి, పీలేరు, సున్నిపెంట, రైల్వేకోడూరు, కొండపి, కొవ్వూరు, మైదుకూరు, నందిగామ ఆసుపత్రుల్లో ఏప్రిల్ నాటికి సేవలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు అనుబంధ ఆసుపత్రుల్లో గతేడాది డిసెంబరు వరకు 13,514 మంది రోగులకు 10,58,350 సెషన్ల ద్వారా డయాలసిస్ సేవలందించామన్నారు. ఈ మేరకు రూ.92.14 కోట్లు ఖర్చు చేశామన్నారు. పీఎంఎన్‌డీపీ, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు ద్వారా 19,939 మంది చికిత్స చేయించుకున్నారని, ఇందుకు కూటమి ప్రభుత్వం రూ.139 కోట్లు ఖర్చు చేసిందన్నారు.




ఎస్.కోటలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్. చిత్రంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

✦ తిరుపతి లడ్డూలో పంది కొవ్వు కలిసినట్లు సిట్ నివేదికలో ఉందని, వైకాపా నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకే లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. సోమవారం విజయనగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నివేదికలో జంతు కొవ్వు కలవలేదని ఎక్కడా చెప్పలేదని, దాని సారాంశాన్ని పూర్తిగా తెలుసుకోకుండా మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. గొడవలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, భాజపా జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి దివ్యాంగుల సమస్యలు

• భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



ఈనాడు, అమరావతి: దివ్యాంగులకు వైకల్య ధ్రువీకరణ పత్రాల జారీలో అధికారుల నిర్లక్ష్యం సరికాదని, నాణ్యమైన సేవలందేలా చర్యలు తీసుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పేర్కొన్నారు. భాజపా నిర్వహిస్తున్న జనతా వారధికి దివ్యాంగులు వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఎదురవుతున్న ఇబ్బందులపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం జారీచేసే సర్టిఫికెట్ ద్వారా పింఛను, విద్య, ఉద్యోగాలు, రిజర్వేషన్లు, పథకాలు లభిస్తున్నా.. ఆ ధ్రువపత్రం కోసం దివ్యాంగులు సచివాలయం, ప్రభుత్వాసుపత్రి, జిల్లా మెడికల్ బోర్డు, ఇలా కనీసం ఆరు నుంచి తొమ్మిది మంది అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. స్లాట్ల కోసం నెలల నిరీక్షణ, పలుమార్లు తిరగడం వల్ల మానసిక వేదన, ఆర్థికభారం తప్పడం లేదన్నారు. మండల స్థాయిలో మెడికల్ బోర్డు శిబిరాలు నిర్వహించి, తీవ్ర వైకల్యంతో బాధపడుతున్నవారి ఇళ్లకే వెళ్లి పరీక్షలు నిర్వహించి, ధ్రువీకరణ పత్రాల జారీ సులభతరం చేయాలని కోరారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

కార్యదర్శి కార్యాలయము
ఎ.పి. సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
డి.నం. 12-467-9, మోక్ష సాయి ప్లాజా, సర్వీసు రోడ్, తాడేపల్లి, గుంటూరు జిల్లా-522501
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No.30 to 32/APSWRE-Tech-2025. Dated: 02.02.2026.
డౌన్‌లోడ్ 05.02.2026 నుంచి ప్రారంభం అవుతుంది మరియు ముగింపు తేదిని e-Procurement.gov.inలో చూడవచ్చును. రిజిస్టర్డ్ కంపెనీలు/ రిజిస్టర్డ్ బిడ్డరుల సంస్థల నుంచి APSWREISకు మూడు పనులలో సేవలు అందించుటకు టెండర్లు కోరబడుచున్నవి. 1) మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 190 డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలలో థర్డ్ పార్టీ కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ (కెపిఐ)ని అమలు చేయుట 2) మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో (4 జోన్లలో) డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలలోని ఆర్‌ఓ ప్లాంట్లకు మరమ్మతులు. 3) మొత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని (4 జోన్లలో) డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులాలలో గల పని చేయని డెస్క్‌టాప్‌లు మరియు లాప్‌టాప్‌లకు మరమ్మతులు. అదనపు వివరాలను http://tenders.apeprocurement.gov.inలో చూడవచ్చును మరియు సంప్రదించాల్సిన నం.0863–2347445. గమనిక: మార్పులు/ సవరణలు ఏవైనా ఉంటే, అవి పై ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా మాత్రమే తెలుపబడును.
DIPR No.4789PP/CL/ADVT/1/1/2021-22 సం/- కార్యదర్శి, APSWREIS, తాడేపల్లి.

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA, VIJAYAWADA-520 004
APGENCO
TENDER NOTICE NO: 610002193
APGENCO invites Competitive Bids (in Two Parts) on APGENCO e-procurement platform from eligible bidders for "Transportation of 80.0 Lakh MT (40.0 Lakh MT per annum) of raw coal from M/s MCL & M/s ECL or washed coal from M/s ACB (India) Talcher Washery siding (SSMT) / any other washery sidings of MCL, Talcher or part quantity of both raw coal & washed coal to Dr.NTTPS on "FOR" destination basis by Rail cum Sea cum Rail route via Paradip and Kakinada ports for a period of 2 years."
Schedule available date and time: **19.00 Hrs on 30-01-2026 onwards.**
Pre-bid Meeting date and time: **10.30 Hrs on 10-02-2026.** Bid submission closing date and time: **15.00 Hrs on 20-02-2026.**
Pre-qualification bid opening date and time: **15.30 Hrs on 20-02-2026.**
Price Bid opening date and time: **12.00 Hrs on 26-02-2026.** For details, visit **www.apgenco.gov.in (or) https://etender.apgenco.gov.in.**
DIPR No. 4787PP/CL/Advt/1/1/2021-22

IN THE SUPREME COURT OF INDIA
EXTRA-ORDINARY APPELLATE JURISDICTION
PETITION FOR SPECIAL LEAVE TO APPEAL (C) Diary No. 21711 OF 2025 WITH PRAYER FOR INTERIM RELIEF WITH 117850/2025- APPLICATION FOR CONDONATION OF DELAY IN FILING
Between:
THE CHIEF GENERAL MANAGER (HRD)
SOUTHERN POWER COMPANY OF DISTRIBUTION AND ANOTHER TELANGANA LIMITED ...Petitioner(s)/Appellant(s)
VERSUS
R. SRINIVASA RAO AND OTHERS ...Respondent(s)
To,
R. SRINIVASA RAO S/o KOTAIAH, PID: 306151/2025 FOR AE/TELECOM/APTRANSCOR[1] IN DIARY No. HYDERABAD21711/2025 (SEC XII-A)
R/o H.No. 616/1 VIJAYAWADA, KAMAYYATHOPU, KANNURU, DISTRICT-VIJAYAWADA, ANDHRA PRADESH
WHEREAS the above Petition for Special Leave to Appeal with prayer for interim relief along with application for CONDONATION OF DELAY IN FILING SLP AGAINST THE IMPUGNED JUDGMENT. The above-mentioned application was listed for hearing before the Hon'ble Judge in Chambers on 08-12-2025. The Hon'ble Judge allowed **IA.No. 315514/2025** for publication of notice through substituted service through paper publication.
NOW, THEREFORE, TAKE NOTICE that the above petitions with prayer for interim relief along with application for CONDONATION OF DELAY IN FILING will be posted for hearing before the Hon'ble Court in due course and you may enter appearance before the Hon'ble Court either in person or through an Advocate on Record of the Hon'ble Court duly appointed by you in that behalf within **30 days** from the date of service of notice.
TAKE FURTHER NOTICE that if you fail to enter appearance as aforesaid, no further notice shall be given to you even after the grant of special leave for hearing of the resultant appeal and the matter above mentioned shall be disposed of in your absence.
//By Order of the Court//
DIPR R.O. No.14892-PP/CL/ADVT/1/2025-26, Dt:02.02.2026 Sd/- **Chief Engineer (HRD & Trg.)**

ఉద్యోగ అవకాశాలు

ALL INDIA INSTITUTE OF MEDICAL SCIENCES
Mangalagiri, Guntur District
Andhra Pradesh - 522503
[Ref. Advt. F.No./AIIMS/MG/Admin/Recruitment/03/Non Faculty/ Deputation/2026/01 dtd. 17.01.2026]
Advertisement for Recruitment of Non-Faculty Group "A" Post on Deputation Basis at AIIMS, Mangalagiri
AIIMS Mangalagiri invites Online applications from eligible candidates for One (01) Senior Accounts Officer (Non-Faculty Group A) post on Deputation Basis. The closing date of applications will be 30 days from the date of publication of advertisement in Employment News. For more details, please visit website www.aiimsmangalagiri.edu.in.
Sd/-
Executive Director
AIIMS, Mangalagiri

DAMODARAM SANJIVAYYA NATIONAL LAW UNIVERSITY
(Estd under Govt of A.P. Act No. 32 of 2008)
"NYAYAPRASTHA", Sabbavaram, Visakhapatnam-531035, AP, India
Phone & Fax: 08924-248216, website: www.dsnlu.ac.in
RECRUITMENT NOTIFICATION Advt. No. DSNLU/NTS-01/2026.
DSNLU invites application(s) from eligible individuals for the following Non-Teaching Posts. Deputy Registrar (2), Assistant Registrar (2), Personal Secretary (1), Accounts Officer (1), Junior Accounts Officer (1).
DSNLU also invites applications from eligible candidates for the appointment of IPR Chair Professor (on consolidated pay of Rs.1,00,000/- per month) and Research Assistants(2)(on consolidated payment) for a period of 5 years.
For application form, eligibility criteria, scale of pay, rule of reservation and other details, visit DSNLU website: www.dsnlu.ac.in. The filled-in application with Registration Fee of Rs.1,000/- (Rupees One Thousand Only).(Rs. 500/- (Rupees Five Hundred Only) in case of SC/ST/BC/PH), by way of Demand Draft drawn in favour of "The Registrar, Damodaram Sanjivayya National Law University" payable at Visakhapatnam or Online Payment should reach "The Registrar, Damodaram Sanjivayya National Law University, "NYAYAPRASTHA", Sabbavaram, Visakhapatnam – 531 035, Andhra Pradesh" on or before 26.02.2026 by 5.00 P.M.
Visakhapatnam Sd/-
Date: 03.02.2026 REGISTRAR I/c

WALK IN INTERVIEW
Wanted Faculties for a Reputed CBSE Senior Secondary School
SHRI VIDHYA MANDHIR CBSE SCHOOL
Pushpathur Palani, Dindigul, Tamilnadu. Ph.No: 7981403424, 6379006348
IIT FOUNDATION FACULTIES: MATHS, PHYSICS & CHEMISTRY
Salary: 4 to 6 lakh + Food + Accomodation
CBSE BOARD TEACHERS (10, +1, +2):
Chemistry-1 | Computer Sci-2 | Economics-1 | English-1
Salary: 4 to 6 lakh + Food + Accomodation
MODE OF SELECTION: Written Test, Demo Class, Interview
Venue: Taj Mahal Hotel, Beside Narayanaguda Flyover, Narayanaguda Road, Hyderabad.
Date: 7-2-2026 (Saturday) & 8-2-2026 (Sunday) Time: 9.00 AM TO 4.00 PM

GMR Institute of Technology
An Autonomous Institute Affiliated to JNTU-GV, Vizianagaram
GMRIT Training Tomorrow's Engineers Today
EMBARK ON AN UNIQUE WORKING EXPERIENCE FOR A BETTER CAREER
WALK IN INTERVIEWS
Promoted by GMR group, GMRIT is one of the leading Engineering Institutions in the country, which is accredited by NAAC for three consecutive cycles and the departments are accredited by NBA (4th Cycle). To strengthen its intellectual capital and create a diversified work culture, it seeks qualified and committed professionals from across the country for the following positions:
Professors/ Associate Professors/ Assistant Professors:

Department/Specialization	Qualification As per AICTE
CSE/ IT/ AI&ML/ AI&DS	M.Tech / M.E. /Ph.D. from reputed Institutions/Universities
Resident Warden for Boys and Girls Hostels	Graduation with 8-10 years of experience in handling University Hostels / Engineering college Hostes

• Candidates pursuing/ submited Ph.D. thesis will be given preference.
• Higher compensation for candidates with Good Research credentials & Experience.
• Career 1st class with no backlog history are given weightage.
• Retired faculty in CSE/IT may also apply

A COMPLETE WORK – LIFE BALANCE SCENARIO FOR SELF DEVELOPMENT
Interested and Eligible Candidates are requested to attend walk in interview with detailed resume along with all supporting documents with regard to qualifications, experience and last drawn salary.
Entry Level Salary:

Designation	Gross Salary Per Month	Date	Venue & Time
Professor	1,43,600	07.02.2026	09:30 AM to 01:00 PM Hotel Meghalaya, Near APSRTC Complex Visakhapatnam
Asso Prof.	1,31,000		
Asst Prof (with Ph.D.)	85,000		
Asst Prof with 2 years Exp and pursuing PhD	65,000– 70,000	08.02.2026	09:30 AM to 01:00 PM Hotel The Eden Park, Opp: Layola College Near Ramesh Hospitals Vijayawada
Asst Prof – Fresher with M.Tech	55,000– 60,000		

For further details contact: **9866903004 / 7738894207** | E: **opportunities@gmrit.edu.in**
Please refer to the HR policies on the Institute website for additional benefits.
Visit us at: www.gmrit.edu.in
GMR Nagar, Rajam-532127, Vizianagaram Dist., A.P., Ph.: 08941-251592/593
GMR GROUP–IT/45/PREM ASSOCIATES

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
విజయవాడ
Cell: 80080 03297

(c) eenadu

తిరుమలలో వైకాపా చేసింది
ముమ్మాటికీ మహాపచారమే

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడారు. ఈ సమావేశంలో పార్టీ కార్యవర్గ సభ్యులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, వీర మహిళ ప్రాంతీయ సమన్వయ కర్తలు, అధికార ప్రతినిధులు, వివిధ విభాగాల ఛైర్మన్లు పాల్గొన్నారు. పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ ఏం మాట్లాడారంటే..


'కాసులకు కక్కుర్తి పడి వైకాపా నాయకులు తిరుమలలో అపచారం చేశారు. నిబంధనల్ని అడ్డగోలుగా మార్చేసి టన్నుల కొద్దీ కల్తీ నెయ్యి కొని తెచ్చి ప్రసాదాల్లో కలిపేశారు. రూ.400కి కిలో నాణ్యమైన నువ్వుల నూనె కూడా దొరకదు. అలాంటిది నెయ్యి ఎక్కడ దొరుకుతుంది? అధికారంలో ఉన్నప్పుడు చేయాల్సిందంతా చేసి ఇప్పుడు తప్పుడు మాటలు మాట్లాడుతున్నారు. అబద్ధాలు, బుకాయింపులతో తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వైకాపా అపరాధాలను మనం ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలి' అని అన్నారు. 'వైకాపా నాయకులతో వ్యక్తిగత ద్వేషం, వైరం లేదు. వాళ్ల భాష, నేర స్వభావంతోనే సమస్య. ఇళ్లల్లోకి వస్తాం, దాడులు చేస్తాం, నరికేస్తాం అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారు. వాళ్ల భాష సరిగా లేని కారణంగానే ఈరోజు దాడులు జరుగుతున్నాయి. దాడులను, హింసను ఏ రాజకీయ పార్టీ సమర్థించదు. సీఎం చంద్రబాబు కూడా చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోకూడదని చెబుతున్నారు. వైకాపా నాయకులు ప్రజల్లో భయం సృష్టిస్తున్నారు. మళ్లీ తాము అధికారంలోకి వస్తే.. అంటూ భయపెడుతున్నారు. గతంలో వాళ్ల ప్రవర్తన వల్ల 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయారు. రాష్ట్రంలో స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. మరో 15 ఏళ్ల కూటమి అధికారానికి ఢోకా లేదు. ప్రజలు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని ఉప ముఖ్యమంత్రి అన్నారు.

ఎన్నికలు నిర్వహించి పార్టీ పదవులు

'నియోజకవర్గాల్లో జనసేన పార్టీ పదవులకు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించి బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించాం. పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురం నియోజకవర్గంలో ఇలా చేశాం. అన్ని నియోజకవర్గాల్లో ఇదే ప్రక్రియ అమలు చేస్తాం. రాష్ట్రంలో జిల్లాలను జోన్లుగా విభజించుకుని సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలి. మార్చి 14న పార్టీ ఆవిర్భావ దినోత్సవం 'జెన్ జి డే' ఏర్పాట్లపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి. సామాజిక మాధ్యమాలు గెలుపు ఓటముల్ని నిర్ణయించే ఆయుధం కాదు. అది గెలుపునకు ఒక కారణం మాత్రమే అవుతుంది. సామాజిక మాధ్యమాలే గెలుపును ప్రభావితం చేస్తే అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ గెలిచేవారే కాదు. ఆయనపై వచ్చినన్ని ట్రోలింగులు ఎవరిపైనా రాలేదు. మన పార్టీపై వచ్చిన వ్యతిరేక వార్తలను మనమే వైరల్ చేస్తున్నాం. దానివల్ల మరింత బలం చేకూరుతోంది. ఆ పద్ధతి మనం మార్చుకోవాలి' అని జనసేన అధ్యక్షులు చెప్పారు.

32 మందితో క్రమశిక్షణ కమిటీ

పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా 32 మందితో క్రమశిక్షణ కమిటీని నియమిస్తున్నాం. ప్రారంభంలో ఈ కమిటీకి నేనే అధ్యక్షుడిగా ఉంటాను. కమిటీలో ఉండే ప్రతి ఒక్కరూ జవాబుదారీతనంతో ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఈ కమిటీలో మూడోవంతు మారుస్తూ ఉంటాం. పార్టీ కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాలి. అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం' అని పవన్ కల్యాణ్ అన్నారు.



వైకాపా వారి ఉచ్చులో పడొద్దు

(మొదటి పేజీ తరువాయి)

కార్యకర్తలకు బలమైన బ్రాండ్ ఇమేజ్ ఉందని పల్లా తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం సరైన మార్గం కాదని పేర్కొన్నారు. తెదేపాకు నిబద్ధత, ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని స్పష్టం చేశారు. 'సోషల్ మీడియాలో జరుగుతున్న అన్ని ప్రచారాలకూ స్పందించాల్సిన అవసరం లేదు. ఆదివారం రాష్ట్రంలో జరిగిన కొన్ని ఘటనలపై మన అధినేత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో వైకాపా నేతలు చట్టాల్ని కాలరాస్తూ.. అరాచక పాలన చేశారు. అప్పట్లో దాన్ని మనం తీవ్రంగా వ్యతిరేకించాం. ఇప్పుడు మనమే చట్టాల్ని చేతుల్లోకి తీసుకోవడం తగదు' అని ఆయన వివరించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన మేలును క్షేత్రస్థాయిలో వివరించాలని పల్లా శ్రీనివాసరావు కార్యకర్తలకు నిర్దేశించారు.

నీచ కుట్రలకు తెరలేపారు: అచ్చెన్నాయుడు

సీనియర్ నేత, మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించిన వ్యవహారంలో అడ్డంగా దొరికిపోయిన వైకాపా నేతలు నీచ కుట్రలకు తెరలేపారని దుయ్యబట్టారు. 'వైకాపా నాయకుల దుర్భాషలు అసహ్యం కలిగిస్తున్నాయి. సీనియర్ నాయకులు కూడా జుగుప్సాకరంగా మాట్లాడటం సిగ్గుచేటు. వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడమే సరైన మార్గం. దాడులు, హింస తెదేపా సంస్కృతి కాదు. వైకాపా వాళ్ల ఉచ్చులో పడకుండా ఓపికతో వ్యవహరించాలి. రాష్ట్రానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తపడాలి. ఇప్పటికే రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలని వాళ్లు చేసిన కుట్రల్ని సమర్థంగా ఎదుర్కొన్నాం' అని ఆయన తెలిపారు.

జంతుకొవ్వు నుంచి వచ్చిన రసాయనాలతోనే నెయ్యి తయారీ

- దాన్నే తిరుమల లడ్డూ కోసం సరఫరా చేశారు
- ఆ డెయిరీలకు ఆవులే లేవు.. పాలు, వెన్న సేకరించిన దాఖలాలు లేవు
- నువ్వుల నూనె కంటే చౌకగా నెయ్యి సరఫరా.. ప్రతి చుక్కా కల్తీయే..
- వైకాపా నేతల రూ.235 కోట్ల దోపిడీని ప్రజలకు తెలియజేయాలి
- కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం
- జనసేన సర్వసభ్య సమావేశంలో తీర్మానాలు


జనసేన సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్. చిత్రంలో నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, కొణతాల రామకృష్ణ, పులపర్తి రామాంజనేయులు, దేవ వరప్రసాద్, పంతం నానాజీ, మండలి బుద్ధప్రసాద్, ఆరణి శ్రీనివాసులు, బత్తుల బలరామకృష్ణ తదితరులు

ఈనాడు, అమరావతి: జంతుకొవ్వు నుంచి వచ్చిన రసాయనాలతో తయారు చేసిన నెయ్యినే వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీ కోసం సరఫరా చేశారని జనసేన సర్వసభ్య సమావేశం తీర్మానించింది. ఈ సింథటిక్ నెయ్యి సరఫరా చేసిన డెయిరీలకు అసలు ఆవులే లేవని, పాలు, వెన్న సేకరించిన దాఖలాలు లేవని పేర్కొంది. అయినా వైకాపా పాలనలో 60 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేశారని ధ్వజమెత్తింది. ఈ నెయ్యిలో జంతుకొవ్వులు లేవని సీబీఐ నేతృత్వంలోని సిట్ నివేదికలో ఎక్కడా లేదని వివరించింది. ఆ నెయ్యి తయారీలో వాడిన రసాయనాలు జంతుకొవ్వు నుంచి వచ్చినవేనంటూ శాస్త్రవేత్తలు చెబుతున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని చెప్పింది. ఇన్ని వాస్తవాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నా, ఘోర అపచారం చేసి కూడా క్లీన్‌చిట్ లభించిందంటూ వైకాపా నాయకులు ప్రచారం చేసుకోవటం దౌర్భాగ్యమని తెలిపింది. కల్తీ నెయ్యి కొనుగోలు, సరఫరాకు ద్వారాలు తెరిచి రూ.233 కోట్ల శ్రీవారి నిధులు దోచుకున్నది వైకాపా వారేనని, స్వామి వారి ఆలయానికి ధర్మకర్తలుగా ఉండాల్సిన వారే నీతి బాహ్యమైన చర్యలకు ఒడిగట్టటం అత్యంత హేయమని అభిప్రాయపడింది. మంగళగిరిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం జనసేన పార్టీ సర్వసభ్య సమావేశం ఈ మేరకు తీర్మానించింది.

- 'వైకాపా హయాంలో నువ్వుల నూనె కంటే చౌకధరకే నెయ్యి సరఫరా చేశారు. అందులోని ప్రతి చుక్కా కల్తీయే. ఆవు, పాలు, వెన్న లేకుండా నెయ్యి సృష్టించటం శాస్త్రవేత్తల వల్ల కూడా సాధ్యం కాదు. కేవలం వైకాపా వారికే సాధ్యం.
- తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారి ప్రసాదం తయారీలో కల్తీ జరిగిందనేది నూటికి నూరు శాతం వాస్తవం. రసాయనాలతో సృష్టించిన ద్రవ్యాన్నే నెయ్యిగా చూపించి.. దాంతోనే 20 కోట్ల లడ్డూలు చేసి ప్రసాదంగా విక్రయించారు. ఈ కఠోర వాస్తవాలను సీబీఐ నివేదిక స్పష్టంగా చెబుతోంది.
- ఎన్‌డీడీబీ ఇచ్చిన నివేదిక ఆధారంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగించారనే విషయాన్ని వెల్లడించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి భక్తకోటిని కదిలించారు. వెంకటేశ్వర స్వామి కొండపై అపచారం జరిగితే మాట్లాడకుండా ఎలా ఉంటాం?
- సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు ఏర్పాటుపై చర్చించే సమయం ఆసన్నమైంది. తిరుమల లడ్డూ తయారీకి అవసరమైన ఆవు నెయ్యిలో ప్రమాదకర రసాయనాలు కలిపి అపచారానికి పాల్పడ్డ వైకాపా నీచత్వాన్ని ప్రతి ఒక్కరికీ తెలియజేసేలా శాసనసభలో చర్చించాలి. ప్రజలకు తెలియజేసేందుకు జనసేన సన్నద్ధం కావాలి' అని తీర్మానంలో పేర్కొన్నారు.
- భారత భవిష్యత్తు శక్తిని ఆవిష్కరించే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ప్రధాని నరేంద్ర మోదీకి జనసేన పార్టీ కార్యవర్గ సమావేశం అభినందనలు తెలుపుతూ తీర్మానాన్ని ఆమోదించింది. 'వికసిత్ భారత్-2047 లక్ష్యంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ 2026-27 బడ్జెట్ రూపుదిద్దుకుంది. మన దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతమయ్యే విధంగా ఈ బడ్జెట్ చేస్తుంది' అని పేర్కొంది.

అలా చేస్తే... 11,139 మంది సేఫ్!



2020 నుంచి 2023 మధ్య రాష్ట్రంలో జరిగిన ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో 16,141 మంది మృతిచెందారు. అందులో 11,139 మంది (69.01 శాతం) ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించలేదు. తలకు బలమైన గాయాలవడం వల్లే వారు ప్రాణాలు కోల్పోయారు. శిరస్త్రాణం ధరించుంటే ఆ ప్రాణాలన్నీ దక్కేవి.

- 11,139 మందిలో 7,765 మంది బైక్ నడిపే వారు కాగా, 3,374 మంది వెనక సీట్లో కూర్చొన్న వారు. బైక్ నడిపేవారికే కాదు.. వెనక కూర్చొన్న వారు కూడా హెల్మెట్ ధరించటం ఎంత కీలకమో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.
- ప్రమాదానికి గురై బైక్ మీద నుంచి కింద పడిపోయినప్పుడు తల రోడ్డు పక్కన ఉన్న డివైడర్ లేదా పేవ్‌మెంట్‌ను ఢీకొడితే ప్రాణాపాయం ఎక్కువ. ఇలాంటి సందర్భాల్లో హెల్మెట్ రక్షణ కీలకం.
- ద్విచక్ర వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం మరణాలు తలకు గాయాలవ్వటం వల్లే సంభవిస్తున్నాయనేది పోలీసులు, రవాణా శాఖాధికారుల మాట. తలపై ఓ మోస్తరు దెబ్బ తగిలినా లోపలి భాగంలో రక్తస్రావమయ్యే ప్రమాదముంది. ఇది ప్రాణాంతకమవుతోంది. ప్రాణాలతో బయటపడ్డా కొన్ని సందర్భాల్లో నెలల తరబడి కోమాలోనే ఉండాల్సి వస్తోంది.
- 2025లో విజయవాడ కమిషనరేట్ పరిధిలో గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 366 మంది మృతిచెందగా... అందులో 209 మంది ద్విచక్ర వాహన ప్రయాణికులే. వీరిలో ఎక్కువ మంది ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించిలేరు. ప్రాణనష్టం అధికంగా ఉండటానికి ఇదే కారణమైంది.

– ఈనాడు, అమరావతి

పెద్ద చేపల్ని వదిలేశారా?

(మొదటి పేజీ తరువాయి)

దుర్వినియోగం చేశారు. అయినా ఈ వ్యవహారంలో అప్పటి ఛైర్మన్, ఈవోలు నిందితులు కాకపోవడమేంటి?

పెద్దల అండ లేకుండా దిల్లీ పిలిచి కమీషన్ డిమాండ్ చేయగలరా?

- కల్తీ నెయ్యిలో ఇంత భారీ కుంభకోణం 'పెద్దలకు' తెలియకుండానే జరుగుతుందా? కింది స్థాయి అధికారులే కీలక నిర్ణయాలు తీసుకోగలరా? అప్పటి తితిదే ఛైర్మన్‌కు పీఏగా వ్యవహరించిన చిన్నప్పన్న అనే సాధారణ ఉద్యోగి ఏటా రూ.వందల కోట్లలో టర్నోవర్ చేస్తున్న నకిలీ నెయ్యి సరఫరా సంస్థ భోలేబాబా యాజమాన్యాన్ని ఎవరి అండా లేకుండానే దిల్లీ పిలిచి మరీ కమీషన్ డిమాండ్ చేయగలడా? 'పెద్దల' ప్రమేయం లేకుండానే డెయిరీ ప్రతినిధుల్ని దిల్లీ పిలిపించుకోగలిగాడా?
- చిన్నప్పన్న వంటి ఒక సాధారణ కాంట్రాక్ట్ ఉద్యోగి, తితిదేలోని కొందరు కిందిస్థాయి అధికారులు, ఇన్‌స్పెక్షన్ కమిటీల సభ్యులు డెయిరీలతో కుమ్మక్కయితే అంత పెద్ద కుంభకోణానికి పాల్పడగలరా? ఏదో ఒకటి రెండు ట్యాంకర్లలో కల్తీకి పాల్పడ్డారంటే అర్థముంది. అసలు నెయ్యి అనేదే లేకున్నా ఏళ్ల తరబడి కల్తీ జరుగుతున్నా తితిదే వంటి వ్యవస్థలో కనిపెట్టలేకపోవడమేంటి?
- పెద్దల అండ లేకుండానే అంత పెద్ద కుంభకోణం జరుగుతుందా? మరి వారిని నిందితులుగా చేర్చకపోవడంలోని మతలబేంటి? దర్యాప్తు సంస్థలు పెద్ద తలకాయల జోలికి వెళ్లకుండా, కేవలం కిందిస్థాయి అధికారుల్నే బాధ్యులుగా చేయడంలోని ఆంతర్యమేంటి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఏపీకి గేమ్ ఛేంజర్‌గా బుల్లెట్ రైళ్లు

(మొదటి పేజీ తరువాయి)

దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. హైస్పీడ్ రైల్ కారిడార్లు ఆర్థికవృద్ధి కారిడార్లుగా పనిచేస్తాయని.. విద్య, ఆరోగ్యం, వ్యాపార రంగాలను ప్రోత్సహిస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టుల తుది ఎలైన్‌మెంట్ ఖరారు, డీపీఆర్ తయారీ జరుగుతోందని వెల్లడించారు. అహ్మదాబాద్-ముంబయి మధ్య తొలి ప్రాజెక్ట్ చేపట్టామని, ఇందులో అనుభవం సాధించడంతో రెండో దశలో దేశవ్యాప్తంగా ఏడు ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. ఈ రైళ్లు గంటకు 350 కి.మీ. వేగంతో ప్రయాణిస్తాయని, ఇవన్నీ ఎలివేటెడ్ కారిడార్లు కావడంతో కింద ప్రజలు తిరిగేందుకు ఇబ్బందులు ఉండవని చెప్పారు. 2026-27 బడ్జెట్‌లో ఏపీలోని రైల్వే ప్రాజెక్టులకు రూ.10,134 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2009-14 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి రాష్ట్రానికి ఏటా రూ.886 కోట్ల చొప్పున కేటాయింపులు ఉండగా, ఈసారి బడ్జెట్‌లో దానికంటే 11 రెట్లు అధికంగా నిధులు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు.

ఏపీ, ఒడిశాల్లో 3,4 లైన్లు

- కోల్‌కతా నుంచి చెన్నై వరకు ఉన్న మార్గమంతా నాలుగు లైన్ల కారిడార్‌గా మార్చనున్నాం. ఇందులో భాగంగా ఏపీ, ఒడిశాలో పూర్తిగా మూడు, నాలుగో లైన్లు నిర్మిస్తాం.
- ప్రస్తుతం ఏపీలో రూ.92,649 కోట్ల ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఆయా రైల్వే ప్రాజెక్టుల పనులు వేగంగా చేస్తున్నాం.
- అమృత్ స్టేషన్ పథకం కింద ఏపీలో 73 స్టేషన్లలో పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వీటిలో సూళ్లూరుపేట, రాయనపాడు, కాకినాడ టౌన్, మంగళగిరి, తుని స్టేషన్ల పనులు పూర్తయ్యాయి.
- ప్రస్తుతం ఏపీ మీదుగా 8 జతల వందేభారత్ రైళ్లు, మరో 8 జతల అమృత్ భారత్ రైళ్లు నడుపుతున్నాం.
- రాష్ట్రంలో 100 శాతం రైల్వే లైన్లు విద్యుదీకరణ చేశాం. 2014 తర్వాత నుంచి 1,949 కి.మీ. లైన్లు విద్యుదీకరించాం.
- 2014 నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో దాదాపు 1,700 కి.మీ. మేర ట్రాక్స్ నిర్మించాం. ఇది శ్రీలంకలోని రైల్ నెట్‌వర్క్ కంటే ఎక్కువ.
- ప్రమాదాలు నియంత్రించే కవచ్‌ను 130 కి.మీ. మేర ఏర్పాటు చేశాం. 2,507 కి.మీ.ల్లో ఏర్పాటుకు టెండర్లు, పనుల దశలో ఉన్నాయి. మరో 3,137 కి.మీ.ల్లో పనులు మంజూరు కావాల్సి ఉంది.

వేగంగా రైల్వే జోన్ పనులు

విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యాలయ పనులు వేగంగా జరుగుతున్నాయని మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. కొత్త జోన్ ఏర్పాటైనప్పుడు వేరొక జోన్ నుంచి సిబ్బంది, కంట్రోల్, కమాండ్, టైమ్‌టేబుల్.. ఇలా అన్నీ మారతాయని, అనేక ఆపరేషన్ అంశాలు ఉంటాయని చెప్పారు. గతంలో కొత్త జోన్ కార్యాలయ పనులకు 3, 4 ఏళ్లు పట్టేదని, విశాఖలో జోన్ కార్యాలయ పనులు మాత్రం శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలను ఎప్పటికప్పుడు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి తెలియజేస్తున్నామన్నారు.

గంటలో అమరావతి నుంచి హైదరాబాద్

- హైస్పీడ్ రైల్ కారిడార్లు సిద్ధమై, బుల్లెట్ రైళ్లు పరుగులు పెడితే.. కేవలం గంటలోనే అమరావతి నుంచి హైదరాబాద్ చేరుకోవచ్చు. అమరావతి నుంచి చెన్నైకి రెండు గంటల్లో వెళ్లిపోవచ్చు.
- కర్నూలు నుంచి హైదరాబాద్‌కు 45 నిమిషాల్లో చేరుకోవచ్చు. కర్నూలు నుంచి బెంగళూరుకు 80 నిమిషాల ప్రయాణమే.
- అనంతపురం నుంచి హైదరాబాద్‌కు 90 నిమిషాలు, అనంతపురం నుంచి బెంగళూరుకు కేవలం 45 నిమిషాల్లో చేరుకోవచ్చు.
- చెన్నై- బెంగళూరు కారిడార్‌లో చిత్తూరు నుంచి చెన్నైకు 30 నిమిషాలు, చిత్తూరు నుంచి బెంగళూరుకు 45 నిమిషాలు ప్రయాణిస్తే చేరుకోవచ్చు.

గేటెడ్ కమ్యూనిటీలో కిలోన్నర బంగారం దోచేశారు!

- మొత్తం విలువ రూ.2.36 కోట్లని అంచనా
- రాజాం పట్టణంలో ఘటన


ఘటనాస్థలిలో చిందరవందరగా వస్తువులు


సీసీటీవీ ఫుటేజీలో నిందితులు

రాజాం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఉన్న గేటెడ్ కమ్యూనిటీ సముదాయాల్లోని రెండిళ్లలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీలు జరిగాయి. గుర్తుతెలియని దుండగులు రూ.2.36 కోట్ల విలువైన సుమారు కిలోన్నర బంగారం, వెండి వస్తువులను దోచుకెళ్లారు. పోలీసుల వివరాల ప్రకారం.. జీఎంఆర్ వరలక్ష్మి కేర్ ఆసుపత్రిలో చిన్న పిల్లల వైద్య నిపుణుడిగా పనిచేస్తున్న డి.నగేష్ జీఎంఆర్ఐటీ ప్రాంగణంలోని వైద్యుల నివాస సముదాయంలోని మూడో అంతస్తులో ఉంటున్నారు. కుటుంబం విశాఖపట్నంలో ఉంటోంది. శనివారం విధులు ముగించుకుని ఆయన విశాఖ వెళ్లారు. సోమవారం వచ్చేసరికి ప్రధాన ద్వారం గొళ్లెం విరిగి ఉంది. బీరువాలోని బంగారు నాణేలు, వడ్డాణం, ఆరు నక్లెస్‌లు, ఇతర వస్తువులతో కలిపి మొత్తం 1,275 గ్రాముల బంగారు నగలు, కిలో వెండి మాయమయ్యాయి. వీటి విలువ రూ.1.93 కోట్లు ఉంటుందని అంచనా. అలాగే జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జి.మాధవకృష్ణారెడ్డి ఇక్కడి స్టాఫ్ క్వార్టర్స్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. శనివారం పాలకొండలోని అత్తారింటికి కుటుంబంతో వెళ్లారు. సోమవారం ఇంటికి వచ్చేసరికి ప్రధాన తలుపు గొళ్లెం విరగ్గొట్టి ఉంది. బీరువాలోని రూ.43.65 లక్షల విలువైన 291 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. సీసీటీవీ ఫుటేజీలో ముగ్గురు వ్యక్తులు ఆదివారం వేకువజామున 2.23 గంటల ప్రాంతంలో చోరీకి వచ్చినట్లు నమోదైంది. రెండు చోరీలు జరిగిన తీరు, సీసీటీవీ ఫుటేజీ చూస్తుంటే నేరాల్లో ఆరి తేరినవారు ఈ ఘటనకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు ఆధ్వర్యంలో 10 బృందాలను నియమించినట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ తెలిపారు.

సర్పంచి పదవిపై వ్యామోహంతో కన్నబిడ్డను చంపేశాడు

(మొదటి పేజీ తరువాయి)

మహారాష్ట్రలోని ముఖేడ్ తాలూకా కెరూర్ గ్రామంలో ఉంటున్న అతని బంధువులు చూసి గుర్తుపట్టారు. పోలీసులు అక్కడికి వెళ్లి విచారణ చేపట్టగా.. దిగ్భ్రాంతికర విషయాలు తెలిశాయి. కెరూర్‌కు చెందిన పాండురంగకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. గ్రామంలోనే క్షౌర వృత్తి చేస్తుంటాడు. త్వరలో పంచాయతీ ఎన్నికలు జరగనుండటంతో సర్పంచిగా పోటీ చేయాలని ఆశపడ్డాడు. అయితే మహారాష్ట్రలో నిబంధనల ప్రకారం.. ముగ్గురు పిల్లలు ఉంటే ఎన్నికల్లో పోటీకి అనర్హులవుతారని, ఒక బిడ్డను తనకు ఇచ్చేయాలని ప్రస్తుత గ్రామ సర్పంచి షిండే గణేశ్ పాండురంగకు సూచించాడు. దీంతో అతను తన కొడుకు జనన ధ్రువీకరణపత్రంలో షిండేకు జన్మించినట్లుగా మార్పులు చేసి దత్తత ఇచ్చేయాలని ప్రయత్నించాడు. ఇందుకు పుణె కార్పొరేషన్ కార్యాలయానికి సైతం వెళ్లినా పని కాలేదు. దీంతో ఒక బిడ్డను చంపేసి తప్పిపోయినట్లుగా చెప్పి పోటీ చేయాలని భావించాడు. పథకం ప్రకారం తన పెద్దకుమార్తె ప్రాచి(6)ని ద్విచక్రవాహనంపై కెరూర్ నుంచి సుమారు 60 కి.మీ. దూరంలోని ఏఆర్పీక్యాంపు శివారుకు తీసుకొచ్చాడు. ఆమె ప్రాథేయపడుతున్నా వినకుండా నిర్దాక్షిణ్యంగా డి46 కాల్వలో పడేసి వెళ్లిపోయాడు. ఒకసారి ముగ్గురు పిల్లలు పుట్టిన తరువాత వారు చనిపోయినా, తప్పిపోయినా ఎన్నికల్లో అనర్హులేనని పూర్తి నిబంధనలు తెలుసుకోకుండా అభంశుభం తెలియని కుమార్తెను కడతేర్చాడు. నిందితులు పాండురంగ, షిండే గణేశ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామని సీపీ వెల్లడించారు.

వాణిజ్య ఒప్పందానికి ఓకే

(మొదటి పేజీ తరువాయి)

మేం చాలా విషయాలు మాట్లాడుకున్నాం. వాణిజ్యం, రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై చర్చించాం. ఇది ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకగలదని అనుకుంటున్నా. మోదీపై గౌరవంతో ఆయన విజ్ఞప్తిమేరకు వెంటనే వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నా. అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత ప్రధాని కట్టుబడి ఉన్నారు. 500 బిలియన్ డాలర్లకుపైగా విలువైన ఇంధనం, టెక్నాలజీ, వ్యవసాయ ఉత్పత్తులు, బొగ్గు, ఇతర ఉత్పత్తుల కొనుగోళ్లకు అదనంగా మరిన్ని దిగుమతులకు ఆ దేశం సిద్ధంగా ఉంది. వారితో మాకున్న అద్భుతమైన బంధం మునుపెన్నడూ లేనంత బలంగా ముందుకు సాగనుంది. మోదీ, నేను అన్ని విషయాలను చక్కబెడుతున్నాం' అని ట్రంప్ పేర్కొన్నారు.

- ట్రంప్ ప్రకటనపై మోదీ స్పందించారు. భారత ఉత్పత్తులపై ఇక నుంచీ 18 శాతం అమెరికా సుంకమే అమలు కానుందని ప్రధాని మోదీ వెల్లడించారు. ఇది ఎంతో సంతోషకరమని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు. 'అద్భుత ప్రకటన చేసినందుకు 140 కోట్ల మంది భారతీయుల తరఫున అధ్యక్షుడు ట్రంప్‌నకు చాలా చాలా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. అయితే ఆయన వాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించలేదు. 'ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు, అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి పని చేస్తే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఎన్నో అవకాశాలకు ద్వారాలు తెరుచుకుంటాయి. ప్రపంచ శాంతికి, సుస్థిరతకు, సుసంపన్నతకు ట్రంప్ నాయకత్వం ఎంతో కీలకం. శాంతి కోసం ఆయన చేసే ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుంది. రెండు దేశాల భాగస్వామ్యాన్ని అత్యున్నత స్థాయికి చేర్చేందుకు ఆయనతో సన్నిహితంగా కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నా' అని మోదీ వివరించారు.
- మోదీ, ట్రంప్ ఫోన్‌లో మాట్లాడుకున్నారని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఎక్స్‌లో తెలిపారు. విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్ జైశంకర్ మూడు రోజుల అమెరికా పర్యటన ప్రారంభమైన నేపథ్యంలో ఈ సంభాషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇండియాగేట్ గ్రేట్



ఇండియా గేట్‌ను అందమైన విజయోత్సవ తోరణంగా ట్రంప్ అభివర్ణించారు. అమెరికాలోనూ అలాంటి గొప్ప నిర్మాణం చేపడతామని తెలిపారు. ఇండియా గేట్ ఫొటోను తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన పంచుకున్నారు. దీంతోపాటు పారిస్‌లోని ఆర్క్ డి ట్రయాంఫి లాంటి దానినీ నిర్మిస్తామని వివరించారు. 42 మీటర్ల ఎత్తైన ఇండియాగేట్‌ను మొదటి ప్రపంచ యుద్ధంలో, మూడో ఆంగ్లో-అఫ్గాన్ యుద్ధంలో బ్రిటీష్ సైన్యం తరఫున పోరాడి అసువులు బాసిన 70,000 మంది సైనికుల జ్ఞాపకార్థం నిర్మించారు.


అమెరికాకు లొంగిపోయిన ప్రధాని: కాంగ్రెస్

అమెరికాకు ప్రధాని మోదీ పూర్తిగా లొంగిపోయారని కాంగ్రెస్ విమర్శించింది. అమెరికాతో ఒప్పందమేమీ ఫాదర్ ఆఫ్ ఆల్ డీల్స్ కాదని స్పష్టం చేసింది. ప్రధాని మోదీపై ట్రంప్ కొంత ఆధిపత్యం సాధించినట్లు కనిపిస్తోందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

రూ.85 లక్షల నగలు కాజేత

(మొదటి పేజీ తరువాయి)

జిహ్వాచాపల్యాన్ని దుకాణంలోని ముగ్గురు వ్యక్తులు గుర్తించారు. 'నీకు కావాల్సినన్ని మోమోలు ఉచితంగా ఇస్తాం. అయితే నువ్వు దుకాణానికి వచ్చినప్పుడల్లా మాకు మీ ఇంట్లోని బంగారు నగలు తెచ్చివ్వాలి.. సరేనా..' అని మాయ చేశారు. ఆ పిల్లాడు సరేనన్నాడు. ఇంకేముంది... పెద్దలకు తెలియకుండా ఇంట్లోని బీరువా తెరిచి చేతికి అందిన ఆభరణాన్ని తీసుకోవడం... దుకాణంలో ఇచ్చేయడం... మోమోలు తినడం.. ఇలా సాగింది. ఓ రోజు బాలుడి ఇంటికి అతని అత్త వచ్చారు. శుభకార్యానికి వెళ్లేందుకు ఆభరణాలు పెట్టుకుని ఇస్తానని బాలుడి కుటుంబసభ్యులను అడిగారు. వారు బీరువాలోని నగల పెట్టెను తెరిచి చూశారు. అందులో నగలు కనిపించక పోవడంతో నిర్ఘాంతపోయారు. నగలు ఏమయ్యాయా అని తలలు పట్టుకున్నారు. పిల్లాడిని అడిగేసరికి... తాను నగల్ని మోమో దుకాణంలోని వారికి ఇచ్చినట్లు అసలు విషయాన్ని చల్లగా చెప్పేశాడు. ఈ ఉదంతంపై వారణాసిలోని గుడిలో పూజారిగా పనిచేస్తున్న ఆ బాలుడి తండ్రి విమ్లేశ్ మిశ్రా పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఓ యువతి, మరో యువకుడిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నాడు.



ఈనాడు

మురికి మాటల దుర్గంధం

మనిషికొక మాట, గొడ్డుకొక దెబ్బ అంటారు. అచ్చోసిన ఆంబోతుల మాదిరిగా వీధుల్లో వీరంగాలాడుతూ, ప్రత్యర్థులనూ విమర్శకులనూ పచ్చిబూతులు తిడుతూ రాజకీయాలను జుగుప్సాకరంగా మార్చిన వైకాపాకు ఏపీ ప్రజలు 2024 ఎన్నికల్లో కర్రు కాల్చి చాలా గట్టిగా వాతలు పెట్టారు. సభ్యతా సంస్కారాలకు అర్థం తెలియని అరాచక మంద మొత్తాన్నీ ఓటు ఆయుధంతో నేలకేసి కొట్టారు. అయినప్పటికీ గడ్డితినే బుద్ధిని మార్చుకోని అసురగణాలు తమ నేలబారు రాజకీయాలను మానుకోవట్లేదు. వీళ్లసలు మనుషులేనా అని జనమంతా ఛీత్కరిస్తున్నా ఆ ప్రబుద్ధుల తీట నోళ్లలోంచి తిట్ల దండకాలు ఆగట్లేదు. మొన్న శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అంబటి రాంబాబు ఉపయోగించిన భాష వైకాపా బూతుల కుప్పతొట్టి కంపును భరించలేని స్థాయికి తీసుకెళ్లింది. ఆ అసహ్యకర అశ్లీల దూషణలను ఖండించి, క్షమాపణ చెప్పించాల్సింది పోయి 'పార్టీ మొత్తం అండగా ఉంటుంది, ధైర్యంగా ఉండండి' అని అంబటికి అధినేతే భరోసా ఇచ్చారంటే- ఆయనను ఎలా అర్థం చేసుకావాలి? ప్రతిపక్షంగా ప్రజలకు పనికొచ్చే పనులూ పోరాటాలూ చేయడం మానేసి సిగ్గుమాలిన చిల్లర భాషలో అధికారపక్షాన్ని ఇంకా తిట్టమని వెన్నుతట్టి ప్రోత్సహించడమేగా ఇది!?

తనను 'గారు' అనొద్దని ఏపీ శాసనసభ మొదటి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు అప్పట్లో సూచిస్తే- 'అది మీ స్థానానికి అనుకూలమైనటువంటి మర్యాద' అంటూ ప్రకాశం పంతులు సవినయంగా బదులిచ్చారు. ప్రజాజీవితంలో అంత హుందాగా ఉండటం చేతకాక, రాష్ట్ర రాజకీయాలనే తన స్థాయికి దిగజార్చాలని జగన్ కంకణం కట్టుకున్నారు. 2019కి మునుపు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడే పరమ చవుకబారు భాషలో చంద్రబాబును దూషించిన ఆయన- సీఎం అయ్యాక కూడా అదే వదరుబోతుతనంతో ఆ పదవికి మచ్చతెచ్చారు. ప్రసంగాల్లో అగ్రనేతలు గీతదాటితే కిందివారికి ఇక అడ్డూఅదుపూ ఉండదని, అది హింసకూ నేరగ్రస్త రాజకీయాలకు దారితీస్తుందని న్యాయపాలిక ఏనాడో హెచ్చరించింది. వైకాపా 'జంగిల్ రాజ్' జమానాలో ఏపీలో అదే నిజమైంది. కొడాలి నాని, వల్లభనేని వంశీ, జోగి రమేష్, పేర్ని నాని లాంటివారు కన్నూమిన్నూ కానని కండకావరంతో పేట్రేగిపోవడానికి వైకాపా అధినేత వేసిన వక్రమార్గమే కారణమైంది. చేసిన పాతకాలకు శిక్షగా పదకొండు సీట్లతో చావుతప్పి కన్నులొట్టబోయినట్లుగా మిగిలిన తరవాత కూడా ఆ పార్టీ నేతల నోటికి హద్దూపద్దూ ఉండట్లేదంటే ఏంటి అర్థం? బాధ్యతాయుతమైన ప్రజోపయోగ రాజకీయాలకు వైకాపా వాళ్లెవరూ పనికిరారనే కదా! సమాజ శాంతిభద్రతలకు హానికరమైన విద్వేష వ్యాఖ్యలకు అడ్డుకట్ట పడాలంటే- మ్యాన్‌హోళ్ల వంటి నోళ్లతో మురికి మాటల దుర్గంధాన్ని వ్యాపింపజేస్తున్న అనాగరిక గుంపును కటకటాల్లోకి నెట్టకతప్పదు!

'ప్రభుత్వం, ప్రతిపక్షాలు మనమందరం ప్రజలకు సేవచేయడానికే వచ్చాం. హుందాతనాన్ని ఎంతగా పెంచుకుంటే అంతగా మన బాధ్యతల్లో రాణించగలం' అని 1970లలో ఉమ్మడి రాష్ట్ర శాసనసభాపతిగా పిడతల రంగారెడ్డి ప్రబోధించారు. నాటి విలువలు లుప్తమైన నేటి రాజకీయాల్లో సాటి ఎమ్మెల్యేను 'వాడూ వీడు' అంటూ తూలనాడటం మొదలు ముఖ్యమంత్రిని రాయలేని భాషలో తిట్టేవారే నేతలుగా చలామణీ అవుతున్నారు. చంద్రబాబుపై అంబటి రోత మాటల నేపథ్యంలో ఏపీ హైకోర్టు తాజాగా స్పందిస్తూ రాజకీయ నాయకులు అలా అసభ్యంగా మాట్లాడకూడదని హితవుపలికింది. దాన్ని ఆలకించి నేతలు ఇప్పటికైనా తమ బుర్రల్లోని బురదను వదిలించుకుంటే వాళ్లకే మంచిది. బూతుల గోతిలోంచి బయటికి రాబోమంటే మాత్రం వాళ్లక్కడే రాజకీయంగా భూస్థాపితమైపోతారు!



అభివృద్ధికి వ్యతిరేకంగా ప్రపంచంలో ఏ మూల ఏం జరిగినా దాని ఫలితం అన్ని దేశాలమీదా ఉంటుంది. కొన్ని దేశాల ఎకానమీలు మాత్రమే నిలకడగా ప్రగతి సాధించడానికి కారణం- బూమ్, బస్ట్ లాంటి ఆకస్మిక పరిణామాలు ఎదురుకాకుండా అవి బలమైన విధానాలను రూపొందించుకోవడమే.

– రఘురామ్ రాజన్, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్

సృష్టికి మార్గదర్శకుడు

సృష్టి... యాదృచ్ఛికంగా నడిచే ప్రక్రియ కాదు. దానికి ఒక క్రమం ఉంది, నియమం ఉంది, ధర్మం ఉంది. ఆ ధర్మానికి దిశానిర్దేశం చేసే శక్తే శ్రీకృష్ణుడు. ఆయన ద్వాపర యుగ అవతార పురుషుడు మాత్రమే కాదు. కాలం, దేశం, పరిస్థితులను దాటి నిలిచిన పరమసత్యానికి సాకార రూపం. సృష్టి ఎలా సాగాలి, జీవితం ఎలా నడవాలి అనే ప్రశ్నలకు సమాధానం నిలిచిన తత్వమే కృష్ణుడు.

భగవద్గీతలో కృష్ణుడు 'అహం సర్వస్య ప్రభవః' అని ప్రకటించాడు. 'ఈ సృష్టి నా నుంచే ఉద్భవించింది. నా వల్లనే కొనసాగుతుంది' అన్న ఆ వాక్యం కృష్ణతత్వానికి మూలం. భౌతిక ప్రకృతి నుంచి జీవాత్మ వరకు అన్నీ ఒకే పరమసత్యానికి భిన్న రూపాలు. ఆ చైతన్యం మానవాళికి అందుబాటులోకి వచ్చినప్పుడే కృష్ణస్వరూపంగా అవతరిస్తుంది. అందుకే ఆయన బోధ మాటకే పరిమితం కాక జీవన మార్గదర్శనంగా మారింది.



ధర్మం క్షీణించినప్పుడు ఆయుధాలెత్తడం కాదు, ఆలోచనలను దారిమార్చడమే కృష్ణుడి ప్రత్యేకత. కురుక్షేత్రంలో ఆయన యోధుడు కాదు సారథి. యుద్ధాన్ని నడిపించడమే కాదు జీవితాన్ని నడిపించే విధానాన్నీ నేర్పాడు. అర్జునుడి విషాదం కేవలం ఒక యోధుడి సందేహం కాదు. అది ప్రతి మనిషి హృదయంలో జరిగే అంతర్మథనం. ఆ సందేహానికి గీత రూపంలో ఇచ్చిన సమాధానం సమస్త సృష్టికి మార్గదర్శకత్వం. కృష్ణుడు చెప్పిన కర్మ యోగం సృష్టిని నడిపించే సహజ నియమం. ఫలితాలను ఆశించకుండా కర్తవ్యాన్ని నిర్వహించడమే నిజమైన జీవన ధర్మం. సూర్యుడు వెలుగును పంచినట్టే, నది ప్రవహించినట్టే, చెట్టు నీడనిచ్చినట్టే మనిషి కూడా తన బాధ్యతను నిర్వర్తించాలి. ఫలితంపై మోహం పడినప్పుడు మనిషి బంధనాల్లో చిక్కుకుంటాడు. కర్తవ్యంపై నిలిచినప్పుడు విముక్తి దిశగా సాగుతాడు. ఈ సత్యాన్ని అత్యంత సరళంగా అర్థమయ్యేలా వివరించినవాడే కృష్ణుడు.

అంతర్యామి

ఆయన కృష్ణుడు సంపూర్ణతకు ప్రతీక. గోపికల ప్రేమలో, యశోదమ్మ వాత్సల్యంలో, సుదాముడి స్నేహంలో భక్తికి విశాల అర్థం ఇచ్చాడు. భగవంతుడికి చేరువయ్యే మార్గం భయం కాదు, నిష్కపట హృదయం చాలని స్పష్టంగా బోధించాడు. భక్తి... ప్రేమతో పుట్టాలనేదే ఆయన సందేశం. కృష్ణుడు ధర్మానికి సమతుల్యతకు ప్రతీక. క్షమ ఎక్కడ అవసరమో, శిక్ష ఎక్కడ తప్పదో ఆయనకు తెలుసు. ఈ సమతుల్యతే సృష్టి నిలకడకు కారణం.


నేటి మానవక్షేత్రంలో పోరాటం ఆయుధాలతో కాదు; లోపలి భయాలతో, లోభాలతో, అస్థిరతలతో. ఇటువంటి సమయంలో కృష్ణ సందేశం మరింత అవసరం. అందుకే కృష్ణుడు దేవుడిగానే కాదు, జీవన మార్గదర్శకుడిగానూ మనల్ని మెప్పిస్తాడు. వ్యక్తిగత జీవితంలోనూ, సామాజిక వ్యవస్థలోనూ మనిషి దారితప్పుతున్న వేళ, లోపలుండి దారిచూపే శక్తిగా ఆయన నిలుస్తాడు. మనిషి అయోమయంలో చిక్కుకొన్నప్పుడు, ధర్మబలంతో నడవాలంటే కృష్ణతత్వాన్ని అర్థం చేసుకోవాలి. దాన్ని మనసులో నిలుపుకొన్నప్పుడే జీవితం అర్థవంతమవుతుంది.

– జీడిగుంట నరసింహమూర్తి



స్టార్టప్‌లకు సాయం... ప్రగతికి మార్గం!

స్టార్టప్‌ల సంఖ్యలో భారత్ నేడు ప్రపంచంలో మూడో స్థానం ఆక్రమిస్తోంది. ఇండియాలో నేడు సాధికారంగా గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య 1.8 లక్షలకు పైగానే ఉంది. వాటిలో 120 యూనికార్న్ హోదా సాధించాయి. ఫైనాన్స్, ఆరోగ్యం, న్యాయ సేవలు, వాతావరణ మార్పుల నిరోధ, రక్షణ, అంతరిక్ష సాంకేతికతలు తదితరాల్లో భారతీయ స్టార్టప్‌ల కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన స్టార్టప్ ఇండియా, వ్యాపార సౌలభ్య సాధన, జాతీయ, అంతర్జాతీయ వెంచర్ పెట్టుబడుల లభ్యత కార్యక్రమాల వల్ల స్టార్టప్‌లు వేగంగా ముందంజ వేస్తున్నాయి. ఫలితంగా కేంద్ర బడ్జెట్ నుంచి అవి ఏటా మరింత ఆశిస్తున్నాయి. అధిక ఉత్పాదన శక్తి, ఉద్యోగ కల్పన, నవీకరణలతో అభివృద్ధి సాధనకు, అంతర్జాతీయ పోటీలో నెగ్గుకురావడానికీ స్టార్టప్‌లు తోడ్పడతాయి. ఇది సాధ్యపడాలంటే స్టార్టప్‌లు ప్రారంభమైనప్పుడు ప్రభుత్వమిచ్చిన అండదండలు చివరివరకు కొనసాగాల్సి ఉంది. తాజా బడ్జెట్లో తదనుగుణమైన ప్రతిపాదనలు ఉన్నాయి.




ఉపాధి అవకాశాల విస్తరణకు...

గత బడ్జెట్లో రూ.11.2 లక్షల కోట్లుగా ఉన్న పెట్టుబడి వ్యయాన్ని ఈసారి కేంద్రం రూ.12.2 లక్షల కోట్లకు పెంచింది. ఈ నిధులను మౌలిక వసతుల విస్తరణ, రవాణా-బట్వాడా, నెట్‌వర్క్ అనుసంధానత, పట్టణ వసతుల విస్తరణపై ఖర్చుచేస్తారు. అది ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ స్టార్టప్‌ల అభివృద్ధికి ఊతమిస్తుంది. ఈ బడ్జెట్ కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు, హరిత ఇంధనాలు, ఎలక్ట్రానిక్స్, బయోఫార్మా, కర్బనాన్ని గాలి నుంచి ఒడిసిపట్టి భూగర్భంలో నిల్వచేసే పరిజ్ఞానాలకు ప్రాధాన్యమిస్తోంది. అందువల్ల ఆయా రంగాల్లో స్టార్టప్‌లు చొచ్చుకుపోవడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. బడ్జెట్‌లో ఇండియా సెమీకండక్టర్ మిషన్ 2.0ను ప్రకటించడం, బయోఫార్మా శక్తి రంగానికి రూ.10వేల కోట్లు, ఎలక్ట్రానిక్స్ విడిభాగాల ఉత్పత్తికి దాదాపు రూ.17వేల కోట్లు కేటాయించడం ఈ రంగాలలో స్టార్టప్‌లకు అవకాశాలను పెంచుతుంది. రూ.10వేల కోట్లతో చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎస్ఎంఈల) అభివృద్ధి నిధి ఏర్పాటు, ఆత్మనిర్భర భారత నిధికి కేటాయింపుల పెంపు వంటివి స్టార్టప్‌లు చిన్న, మధ్యతరహా పరిశ్రమలుగా ఎదగడానికి ఊతమిస్తుంది. తమ వ్యాపారాభివృద్ధి కోసం పూర్తిగా వెంచర్ పెట్టుబడులపై ఆధారపడాల్సిన అగత్యాన్ని తప్పిస్తుంది. బడ్జెట్ కేటాయింపులను సద్వినియోగం చేసుకుని పూర్తి స్థాయి కంపెనీలుగా ఎదిగే స్టార్టప్‌లు ఉపాధి అవకాశాలను విస్తరించి దేశార్థికానికి దన్నుగా నిలుస్తాయి. అయితే, పెద్ద నగరాల్లోనే కాకుండా చిన్న పట్టణాలలోని విద్యాసంస్థల ప్రాంగణాలలో స్టార్టప్‌ల ఏర్పాటుకు ఆర్థికంగా, ఇతరత్రా తోడ్పాటు కావాలి. అంటే నవీకరణలను వికేంద్రీకరించాలి. ఈ ఏటి బడ్జెట్ ఈ దిశగా కేటాయింపులు జరపకపోవడం ఒక లోటు!

జీఎస్టీ సరళీకరణ, కార్మిక కోడ్ తదితరాలకు సంబంధించి ఇప్పటికే చేపట్టిన 350 సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రస్తావించారు. కానీ, తక్కువ సిబ్బంది, అస్థిర ఆదాయం, అధిక వైఫల్యాల రేటుతో ఇబ్బంది పడే కొత్త స్టార్టప్‌లు ఇంకా నియంత్రణ పరంగా కఠిన సవాళ్లనే ఎదుర్కొంటున్నాయి. బాగా నిలదొక్కుకున్న కంపెనీల కోసం రూపొందించిన నియమాలనే వీటికీ వర్తింపజేస్తున్నారు. ఉద్యోగులకు తమ కంపెనీలో వాటాలను తక్కువ ధరకు కొనడానికి వీలు కల్పించే ఈఎస్ఓపీ పథకంపై పన్నులు, ప్రతిభావంతులకిచ్చే ప్రోత్సాహకాలపై శ్రద్ధ చూపి ఉండాల్సింది. తాజా బడ్జెట్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలకు) ప్రత్యేక రుణాలు, ఆధునిక సాంకేతికతల అన్వయం, క్లస్టర్ల ఏర్పాటు వంటి పలు ప్రోత్సాహకాలను విస్తరించింది. వీటిని స్టార్టప్‌లకూ వర్తింపజేయాలి. నిజానికి అనేక చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్టార్టప్‌లుగానే ప్రారంభమై వృద్ధి చెందాయి. వాటికీ అధిక రుణాలు, ప్రభుత్వ వస్తు, సేవల సేకరణలో ప్రాధాన్యం, అధునాతన టెక్నాలజీల బదిలీ వంటివి చేపట్టాలి. స్టార్టప్‌లు ఎంఎస్ఎంఈలుగా పరిణామం చెందడానికి చేయూతనివ్వాలి. తద్వారా వాటి వైఫల్య ప్రమాదాన్ని తప్పించాలి. అది ఎంఎస్ఎంఈల నవీకరణకూ ఊతమిస్తుంది. కానీ, ఈ మేరకు ప్రత్యేక చర్యలు కొరవడుతున్నాయి.


నవకల్పనలతో వర్ధిల్లాలంటే...

ఏ స్టార్టప్ అయినా నిలదొక్కుకోవాలంటే ఆరంభ స్థాయిలో పెట్టుబడులు, ఇతర వసతులు కల్పించాలి. అవి ఎదిగిన తరవాత స్టాక్ మార్కెట్లో ఐపీఓల ద్వారా కొత్త పెట్టుబడులు సమీకరించే వెసులుబాటు ఉండాలి. విలీనాలు, స్వాధీనాలకు సంబంధించి పెద్ద కంపెనీలకు ఉండే వెసులుబాటు స్టార్టప్‌లకు కల్పించాలి. ఈ ఏటి బడ్జెట్ వాతావరణ మార్పుల నిరోధ కార్యక్రమాలకు, సాంకేతికతలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ రంగంలో స్టార్టప్‌లకూ విస్తృత అవకాశాలు కల్పించాల్సి ఉంది. యువతరం విద్య నుంచి ఉపాధికి పయనించడానికి వీలుగా విశ్వవిద్యాలయ టౌన్‌షిప్‌ల ఏర్పాటు, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించింది. అయితే మన వర్సిటీలు ఇప్పటికీ స్టార్టప్‌ల సృష్టి కేంద్రాలుగా ఎదగలేదు. ఈ లోపాన్ని తొలగించడానికి విశ్వవిద్యాలయ మూలధన నిధుల ఏర్పాటు, మేధాహక్కుల వ్యాపారీకరణ, ప్రభుత్వ సేకరణ యంత్రాంగంలో ప్రాధాన్యం వంటి చర్యలు తీసుకోవాలి. తద్వారా నవకల్పనలతో స్టార్టప్‌లు వర్ధిల్లడానికి ఊతమివ్వాలి.



ప్రొఫెసర్ పి.శ్రీనివాస్ సుబ్బారావు
మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి,
నల్సార్ లా యూనివర్సిటీ

అదేంది బిడ్డా... జ్వరం వస్తోందంటే, ఆస్పత్రికి తీసుకెళ్లి మందులు ఇప్పిస్తానని తీసుకొచ్చి ఇక్కడెక్కడో కూర్చోబెట్టి వెళ్లిపోయావు. ఇంకా రావేంది బిడ్డా! చీకటైంది. చుట్టూ ఏమీ కనిపిస్తలేదు. చలికి ముసలి డొక్కలు అల్లాడుతున్నాయి. కొవ్వంతా కరిగిపోయిన చర్మం సాగిపోయి, ముడతలు పడింది. ఇంక చలినెక్కడ కాచుకుంటుంది. కడుపులో పేగులూ వణికి పోతున్నాయి. రక్తం ఎండిన ఒంట్లో వేడి ఎక్కణ్నుంచి వస్తుంది. ఎటు వెళ్దామన్నా కాళ్లు కనికరించవాయె! డోక్కుంటూ వెళ్దామంటే నువ్వొచ్చి ఎక్కడని వెతుక్కుంటావని ఆగిపోయిన. అదేంది బిడ్డా, ఆలోచనకు కూడా అనుమానించకూడదనుకున్నా, తప్పడం లేదు. నువ్వు నన్ను కావాలనే విడిచిపెట్టి పోయావా బిడ్డా. ఏదో పనిలోపడి మరిచిపోయి ఉంటావులే. దేవుడా, నా ఆలోచనలన్నీ తప్పే కావాలి, నా బిడ్డే కరక్టు కావాలి.



చిన్నప్పుడు గదిలో ఆడుకుంటూ లోపల్నుంచి గడిపడితేనే భయపడి ఏడ్చిఏడ్చి సొమ్మసిల్లిపోయావు. ఇప్పటికీ కరెంటు పోతేనే వణికిపోతావు. మరి, చీకట్లో నన్ను ఒంటరిగా ఎలా వదిలేస్తావు కన్నా? చిన్నప్పుడు తినకుండా ఏడుస్తుంటే, వీపు మీద కూర్చోబెట్టుకుని మోకాళ్లు డోక్కుపోతున్నా, చేతులు పీక్కుపోతున్నా, ఏనుగు సవారీ చేయించేవాణ్ని. నువ్వు తింటే చాలు, నొప్పులు ఏపాటివి అనుకునేవాణ్ని. పొద్దున్నుంచి తిండిలేదు బిడ్డా, కడుపు కాలిపోతోంది. చిన్నప్పుడు నానాకష్టాలు పడి నిద్రపుచ్చితే, గుక్కపట్టి ఏడ్చేవాడివి. చీమ కుడితే ఏడ్చావని కందిపోయిన పాదాన్ని చూసి కళ్లలో నీళ్లు తిరిగేవి. ఇక్కడ చాలాసేపట్నుంచి కదలకుండా కూర్చుని కాళ్లూచేతులూ బిగుసుకుపోయాయి. చీమలు కుడుతున్నా, కాలిని దగ్గరికి లాక్కుందామంటే మొద్దుబారిపోయింది. చీమలే కదా ఏం కాదులే!

అయినా, అదేంది బిడ్డా అలా వదిలేసి వెళ్లావు. నాకు పెట్టే తిండే నీకు బరువైందా? నేను ముడుచుకుని పడుకునే మూలే నీకు తక్కువైందా? వద్దంటే, నీ దగ్గరే పడి ఉంటున్నానని అనుకుంటున్నావేమో! మరి నా ఆశలన్నీ నువ్వే! నా కష్టం, నా జీవితమంతా నీకే! చచ్చేదాకా కళ్లారా నిన్ను చూసుకుంటూ గడపాలని నువ్వు పుట్టకముందటి కోరిక. మరి, నిన్నొదిలి ఎలా ఉంటాను. చివరిదాకా తోడుంటానని మాటిచ్చిన మీ అమ్మ, మాటతప్పి ముందే వెళ్లిపోయింది. ఇప్పుడిక నువ్వేకదా బిడ్డా మిగిలింది. ఇంత ప్రయోజకుణ్ని చేస్తే, ఇదా నువ్వు నాకిచ్చేది. ఈ మాత్రం తిండి, నీడా నా జీవితకాలంలో ఎంతమందికిచ్చానో తెలుసా! ఒక మనిషికి తిండిపెట్టడం మాకొక లెక్కే కాదు. మీకేంది బిడ్డా ఇన్ని నొప్పులవుతున్నాయ్. అమ్మానాన్నల్నే బరువనుకునే బాధేంది బిడ్డా! పెంపకం లోపం అనుకుందామన్నా, ఇదెప్పుడూ నేను నేర్పలేదు కదరా! అడగకున్నా అవతలివాడి ఆకలి తీర్చాలనే చెప్పాకదా! నేను చెప్పని పాఠాలను నాకే నేర్పుతున్నావా బిడ్డా!

(వృద్ధులైన తల్లిదండ్రులను ఎక్కడోచోట కట్టుబట్టలతో వదిలేసి వెళ్లిపోతున్న ఉదంతాలు ఇటీవల పెరుగుతున్నాయి. అలాంటి నిర్భాగ్య అమ్మానాన్నల మనోవేదనకు అక్షర రూపమిది)

– శ్రీనివాస్ దరెగోని



స్వాగతం.. సుస్వాగతం!

మన పర్యాటక రంగం క్రమంగా ప్రగతి బాటలో నడుస్తోంది. కానీ, రద్దీ సమయాల్లో దేశంలో రెండు లక్షలకు పైగా హోటల్ గదుల కొరత వేధిస్తోంది. దీన్ని తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం హోం స్టేలను ప్రోత్సహిస్తోంది. చాలా దేశాల్లో ఈ విధానం బాగా ప్రాచుర్యంలో ఉంది. ఇండియాలో ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. 2024లో ఇండియాలో హోం స్టేల ఆదాయం రూ.4,722 కోట్లు. ఆయా ప్రాంతాలతో పోలిస్తే 2024-31 మధ్య హోంస్టేల వార్షిక చక్రీయ వృద్ధి రేటు (సీఏజీఆర్) ఇండియాలోనే ఎక్కువగా ఉంటుందని అంచనా. ఆ వివరాలు...

(శాతాల్లో)

ప్రాంతం	హోం స్టే సీఏజీఆర్
ఉత్తర అమెరికా	5.4
ఐరోపా	5.7
ఆసియా పసిఫిక్	9.2
దక్షిణ అమెరికా	6.6
పశ్చిమాసియా, ఆఫ్రికా	6.9
ఇండియా	11.0

(ఆధారం: నీతి ఆయోగ్ నివేదిక)

జోరుగా ఆయుధాల ఎగుమతి



ఆపరేషన్ సిందూర్ అనుభవాలతో మరిన్ని ఆధునిక ఆయుధాలను తయారుచేయాలని కేంద్రం లక్షిస్తోంది. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేటాయింపులు పెంచింది. మరోవైపు విదేశాల నుంచి అవకాశాలను అందిపుచ్చుకుని ఆయుధోత్పత్తినీ ఇండియా జోరెత్తిస్తోంది. తద్వారా క్రమంగా వాటి కొనుగోలుదారు నుంచి విక్రేతగా భారత్ అవతరిస్తోంది.

చైనా, పాక్‌ల నుంచి నిరంతరం ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో రక్షణ రంగానికి కేంద్రం రూ.7.85 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది కన్నా ఇది 15శాతం ఎక్కువ. అందులోనూ మూలధన వ్యయానికి రూ.2.19 లక్షల కోట్లు ప్రత్యేకించారు. ఇది గతేడాదితో పోలిస్తే 22శాతం అధికం. మూలధన వ్యయంలో 75శాతాన్ని స్వదేశీ రక్షణ పరిశ్రమల నుంచి జరిపే కొనుగోళ్లకే కేటాయిస్తారు. ఆధునిక ఆయుధాలలో అరుదైన లోహాలు, సెమీ కండక్టర్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఈ క్రమంలో మోనజైట్ ఇసుక నిక్షేపాలు విస్తృతంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాలలో ప్రత్యేక కారిడార్లను ఏర్పాటు చేయాలని బడ్జెట్లో ప్రతిపాదించారు. మరోవైపు అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ దేశాల నుంచి పొందిన లైసెన్సులతో భారత్ చాలా కాలంగా ఫైటర్ విమానాలు, హెలికాప్టర్లు, శతఘ్నులు, క్షిపణులు, రైఫిళ్లను తయారు చేస్తోంది. అందుకోసం హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్), భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) వంటి ప్రభుత్వ సంస్థల్లో, భారత్ ఫోర్జ్, టాటా, అదానీ, మహీంద్రా వంటి ప్రైవేటు సంస్థల్లో విస్తృత వసతులు ఏర్పడ్డాయి. అమెరికా, ఐరోపా దేశాల ఆయుధ విడిభాగాలను ఇక్కడ కూర్చు చేసి తిరిగి వాటికే ఎగుమతి చేస్తున్నారు.



సంయుక్తంగా క్షిపణుల ఉత్పత్తి

ఎడతెగని యుద్ధాల వల్ల డ్రోన్లు, ఫిరంగులు, మందుగుండు వినియోగం విపరీతంగా పెరిగింది. వాటిని గిరాకీకి తగినట్లు సరఫరా చేయడం ఇజ్రాయెల్, ఐరోపా ఆయుధ కంపెనీలకు సాధ్యపడటం లేదు. ఈ క్రమంలో అవి ఇండియాతో కలిసి సంయుక్తంగా ఆయుధోత్పత్తి చేపడుతున్నాయి. మేకిన్ ఇండియా కింద అదానీ గ్రూపుతో కలిసి ఇజ్రాయెల్ కంపెనీ ఎల్బిట్- హైదరాబాద్‌లో సంయుక్త కర్మాగారాన్ని నెలకొల్పింది. ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్(ఐఏఐ), రఫేల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సంస్థలు అదానీ, హెచ్ఏఎల్, బీఈఎల్ సంస్థలతో సంయుక్తంగా డ్రోన్లతో పాటు క్షిపణులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇటీవల ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్థాన్ గగనతల రక్షణ వ్యవస్థను ఛేదించడానికి తోడ్పడిన ఇజ్రాయెలీ ఎయిర్ లోరా, ఐస్ బ్రేకర్ క్షిపణి వ్యవస్థలను భారత్‌లోనే రూపొందించడానికి ఒప్పందం కుదిరింది. ఆత్మనిర్భర్ కార్యక్రమం కింద ఈ క్షిపణులను హెచ్ఏఎల్, బీఈఎల్‌లు తయారుచేస్తాయి. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు అవసరమైన డ్రోన్లు, ఫిరంగి గుండ్లు, ఇతర మందుగుండును జర్మనీ, ఫ్రాన్స్ వంటి నాటో దేశాలు భారత్ నుంచి దిగుమతి చేసుకుని ఇటలీ, చెక్‌రిపబ్లిక్‌ల మీదుగా పంపుతున్నాయి. ఇటీవల జర్మన్ ఛాన్స్‌లర్ ఫ్రీడ్రిక్ మెర్జ్ భారత్ పర్యటనకు వచ్చినప్పుడు రక్షణ పారిశ్రామిక సహకార ప్రణాళిక ముడిపడింది. మహారాష్ట్రలోని రత్నగిరిలో రెండు దేశాలూ ఏడాదికి రెండు లక్షల ఫిరంగి గుండ్లు, 10 వేల టన్నుల మందుగుండు ఉత్పత్తికి ప్రత్యేక కర్మాగారాన్ని నిర్మిస్తున్నాయి.

ఇండియాలోనే రఫేల్ తయారీ!

ఫ్రాన్స్ కంపెనీ డసో ఏవియేషన్ నుంచి భారత వైమానిక దళం ఇప్పటికే 36 రఫేల్ ఎఫ్3 ఫైటర్లను కొనుగోలు చేసింది. నౌకాదళం కోసం మరో 26 రఫేల్ ఎం ఫైటర్ల కొనుగోలుకు ఒప్పందం కుదిరింది. రిలయన్స్ సంస్థతో కలిసి నాగ్‌పూర్‌లో రఫేల్ ఫైటర్ జెట్ విడిభాగాలను డసో రూపొందిస్తోంది. హైదరాబాద్‌లో టాటా సంస్థతో కలిసి రఫేల్ ఫ్యూజ్‌లాజ్(బాడీ)లను తయారుచేస్తోంది. ఇండియా కొనుగోలు చేయాలనుకుంటున్న 114 మల్టీరోల్ ఫైటర్ ఎయిర్ క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) కాంట్రాక్టును తనకిస్తే నెలకు రెండు అధునాతన రఫేల్ ఎఫ్4 జెట్ల తయారీకి అనువైన కర్మాగారాన్ని భారత్‌లో నెలకొల్పుతామని డసో ప్రతిపాదించింది. ప్రస్తుతం ఏడాదికి 26 జెట్లను డసో తయారు చేస్తోంది. భారత కాంట్రాక్టు లభిస్తే డసో ఉత్పత్తి సామర్థ్యం రెట్టింపవుతుంది. ఆ విమానాలను భారత్ నుంచి ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి లైసెన్సు ఇస్తామనీ డసో ప్రతిపాదించింది. ఈ ఆకర్షణీయ ఆఫర్‌ను భారత్ అంగీకరించి డసో(రఫేల్)తో రూ.3.25 లక్షల కోట్ల ఒప్పందాన్ని సూత్రప్రాయంగా కుదుర్చుకుంది. ఇంకా గగనతలం నుంచి భూతలానికి ప్రయోగించే హామర్ క్షిపణులను భారత్‌లో తయారుచేయడానికి ఫ్రాన్స్ సిద్ధమవుతోంది. స్వీడన్ కంపెనీ సాబ్ ఇప్పటికే ఇండియాలో కార్ల్ గుస్తాఫ్ తుపాకుల తయారీ కర్మాగారం నెలకొల్పింది. భారత ప్రభుత్వం చేపట్టిన మేకిన్ ఇండియా కార్యక్రమం ఐరోపా ఆయుధ కంపెనీలను బాగా ఆకర్షిస్తోందనడానికి నిదర్శనాలివి!

– అడపా వరప్రసాద్



అయిదో తరగతిలో పాఠం చెప్పడం పూర్తయింది. ఇంకా సమయం ఉండటంతో టీచర్.. 'పిల్లలూ మీకు పెన్ను ఎలా తయారు చేశారో తెలుసా?' అని అడిగారు. ఏమీ చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు విద్యార్థులు. 'సరే అయితే చెబుతా వినండి. ఏదైనా రాయాల్సి వస్తే మొదట్లో పక్షి ఈకను సిరాలో ముంచి రాసేవారు. ఆ తరవాత


పెన్ను కథ తెలుసా!

ఫౌంటెన్ పెన్నులను వాడేవారు. కానీ వాటి నుంచి సిరా ఎక్కువగా బయటికి వచ్చేది. 1888లో జాన్ జె.లౌడ్ అనే వ్యక్తి బాల్ పాయింట్ పెన్నును తయారుచేశారు. ఇది కఠినమైన ఉపరితలం మీద రాయడానికి అనువుగా ఉండేది, కానీ కాగితం మీద రాయడానికి వీలుపడేది కాదు. హంగేరీకి చెందిన లాస్లో బీరో అనే జర్నలిస్ట్ ఎప్పుడూ వార్తలు రాయడానికి ఫౌంటెన్ పెన్నులు ఉపయోగించేవారు. కానీ వాటితో రాస్తే ఇంకో వైపు అచ్చులు పడేవి. దాన్ని సరిగ్గా పట్టుకోవడానికి ఇబ్బందిగా అనిపించేదట. దాంతో తాను వార్తలను చక్కగా రాయలేకపోతున్నానని బాధపడేవారట. అప్పుడు ఆయనే కాగితం మీద రాయడానికి వీలుండేలా బాల్ పాయింట్ పెన్నులను తయారు చేయాలనుకున్నారు. ఒకసారి వార్తాపత్రిక ముద్రణ కోసం ఉపయోగించే సిరా తొందరగా ఆరిపోవడం, ఎలాంటి మరకలు లేకుండా ముద్రణ తరవాత కూడా కాగితం పొడిగా ఉండటం గమనించారు. అలాంటి సిరానే ఇందులోనూ వాడాలనుకున్నారు. ఆయన తమ్ముడు, రసాయన శాస్త్రవేత్త గ్యోర్గీ సాయంతో బాల్ పాయింట్ పెన్నుకు సరిపోయే సిరాను తయారుచేశాడు. మొత్తానికి కాగితం మీద ఎలాంటి అచ్చులు లేకుండా రాయగలిగేలా పెన్ను కనుగొన్నారు' అని చెప్పారు టీచర్.

హాయ్! బుజ్జీ!!

'ఒక పెన్ను తయారు చేయడం వెనక ఇంత కథ ఉందా?' ఆశ్చర్యంగా అన్నారు విద్యార్థులు. 'అవును పిల్లలూ.. మనం వాడే ప్రతి వస్తువు వెనకాల పెద్ద కథే ఉంటుంది' చెప్పారు టీచర్.

★



అక్షరాల చెట్టు

ఈ అక్షరాలతో అర్థవంతమైన పదం తయారు చేయండి.

జవాబు: MANAGEMENT

(c) eenadu



ఈ చిత్రంలో ప్రయాణికులు చూడండి రైల్వేస్టేషన్‌లో 5వ ప్లాట్‌ఫాం నుంచి 6వ ప్లాట్‌ఫాంపైకి ఎలా ప్రమాదకరంగా దాటుతున్నారో.. రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు రాకపోకలు సాగించడానికి వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించారు. వీటిపైకి ఎక్కేందుకు దిగేందుకు మెట్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు సైతం ఏర్పాటు చేశారు. అయినా పట్టాలపై ఇలా పరుగులు పెట్టడం సరికాదు.

- ఈనాడు, అమరావతి

డీటీసీగా పురేంద్ర



సూర్యారావుపేట, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా ఎం.పురేంద్రను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్టీఆర్ జిల్లా డీటీసీగా పని చేస్తున్న ఎ.మోహన్‌కు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. అయినప్పటికీ ఆయన కొద్ది నెలలుగా జిల్లా బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. తాజాగా ప్రభుత్వం రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో డీటీసీ (ఐటీ)గా పని చేస్తున్న ఎం.పురేంద్రను జిల్లా డీటీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా పనిచేశారు.

ముందే గంతలు.. ముున్ముందు గెంతులు

వెస్ట్ బైపాస్‌పై వెలుగు చూస్తున్న లోపాలు

పరిశీలన



ఆరంభంలోనే అతుకులు...

పశ్చిమ బైపాస్‌పై పెద్దగా వాహనాలు తిరిగింది లేకున్నా.. ఇలా అతుకులు వేశారు. పైవంతెనల నిర్మాణం సమయంలో మెరక పనులు సవ్యంగా చేయకపోవడంతో లోపలకు కుంగిపోయాయి. వాటిని దాచిపెట్టేందుకే ఈ అతుకులు వేశారు. గన్నవరం మండలం మర్లపాలెంలో రెండుచోట్ల, పి.నైనవరం పరిధిలో రెండుచోట్ల ఇలా కుంగిపోవడంతో అతుకులు వేశారు. ఇంకా పూర్తిస్థాయి ప్రయాణాలు మొదలవకనే ఈ పరిస్థితి ఉంటే భవిష్యత్తులో పైవంతెనల పరిస్థితి ఏంటి?

ఈనాడు – అమరావతి

పశ్చిమ బైపాస్‌ను ఏళ్లుగా నిర్మిస్తున్నా.. ఆది నుంచి నిర్మాణ లోపాలు వెక్కిరిస్తూనే ఉన్నాయి. పై వంతెన, ఆర్వోబీల నిర్మాణంలో గుత్తేదారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపిస్తోంది.. అసంపూర్తి పనులు సైతం ప్రయాణికులకు పరీక్షలు పెడుతూ ప్రమాదాల్లోకి నెడుతున్నాయి. అధికారులు సత్వరమే స్పందించి దృష్టి సారించాల్సిన కీలక తరుణమిది.

అడుగడుగునా ఇక్కట్లే...

★ పశ్చిమ బైపాస్ ప్యాకేజీ 3, 4 కలిపి 47 కిలోమీటర్లు ఉంది. ఇటీవలే రాకపోకలు మొదలుపెట్టగా అసంపూర్తి పనులు.. నిర్మాణ లోపాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ★ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ దశలోనే గన్నవరం, బీబీగూడెం మధ్య ఆర్వోబీ గోడలు బయటకు పొడుచుకుని రాగా పునర్నిర్మించారు. కొద్దిరోజుల కిందట జక్కంపూడిలో సైతం ఇదే పరిస్థితి కనిపించింది. * పైవంతెనల నిర్మాణ సమయంలో వేసిన మట్టి పూడిక సవ్యంగా లేదు. భారీ లారీలు వెళ్లడంతో పైవంతెనలపై రోడ్డు కుంగిపోతోంది. దీనిని పైకి కనిపించకుండా ఆయా ప్రాంతాల్లో తారు పూసి అతుకులు వేస్తున్నారు. ★ ప్యాకేజీ 3లో 30 కిలోమీటర్లలో ఐదు ప్రాంతాల్లో ఈ అతుకులు ఉన్నాయి. ఈ తరహా లోపాలతో ఇప్పటికే బైపాస్‌పై ఐదారు ప్రమాదాలు జరిగాయి. ★ తాజాగా గన్నవరం పరిధిలో జరిగిన ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. ★ స్లిప్ రహదారులు గ్రామాల్లోకి వెళ్లే ప్రాంతంలో యూటర్న్ ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలకు అవకాశం ఉంది. ★ కాజ, చినఅవుటపల్లి పరిధిలో ఎన్‌హెచ్-16తో అనుసంధాన పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.



అసంపూర్తితో అవస్థలు...

ఇదీ... ముస్తాబాద్-నున్న మధ్యలో అసంపూర్తిగా నిలిచిన రెయిలింగ్ పనులు. కొన్నిచోట్ల సెంటర్ డివైడర్ నిర్మాణం ప్రారంభ దశలో ఉండడంతో ప్రయాణికులు, వాహనదారులు మధ్యలో నుంచి ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్నారు. వెరసి ప్రమాదాలు జరుగుతున్నాయి.

సరిచేస్తాం.. ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్ వివరణ కోరగా.. 'అతుకులు వేసిన ప్రాంతాలను స్వయంగా పరిశీలిస్తాను.. సమస్య తెలుసుకుని లోపాలు ఉంటే సరిచేసి నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నాను.'



ప్రమాదాలకు తావిక్కడ...

ఇది అసంపూర్తిగా నిలిచిన అంబాపురం పైవంతెన ప్రాంతంలో అస్తవ్యస్త ట్రాఫిక్. వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో అటు హైదరాబాద్ నుంచి విజయవాడ వచ్చేవారు.. గన్నవరం నుంచి గుంటూరు వెళ్లేవారు.. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే వారు ఈ కూడలి నుంచే అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్నారు. భారీ వాహనాలు రావడంతో ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉంది.

ఆపదని.. తెలుసుకోండబ్బా!



రహదారులపై ఎంత అప్రమత్తంగా ప్రయాణాలు చేసినా ఒక్కో సమయంలో అనుకోకుండా ప్రమాదాలకు గురవుతారు. అలాంటిది వాహనాలపై ఏమాత్రం జాగ్రత్త తీసుకోకుండా ప్రయాణిస్తే ప్రమాదాలు మరింత జరిగే వీలుంది. ద్విచక్ర వాహనంపై ఇలా ఓ పెద్దసైజు డబ్బాల్లో వస్తువులను తీసుకెళ్తున్నారు. ఇలాంటి ప్రయాణాలు వారికే కాకుండా... రహదారులపై రాకపోకలు సాగించే ఇతరులకు సైతం ప్రమాదకరంగా మారే వీలుంది.

- ఈనాడు, అమరావతి

కథలు ఇంపు.. భాషా నైపుణ్యాల పెంపు

ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాలకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

విద్యార్థులు కేవలం పాఠ్యాంశ పరమైన పుస్తకాలకే పరిమితం అవుతున్నారు. ఇతర పుస్తకాలు చదవాలంటే తడబడుతున్నారు. అందుకే ప్రాథమిక స్థాయి నుంచే పిల్లల్లో వాక్య నిర్మాణం, సంభాషణ, రచన, భాషా సామర్థ్యాలు పెంచడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాన్నింటికీ కథల పుస్తకాలు సరఫరా చేసింది.

ప్రాథమిక నుంచి ఇంటర్ వరకు..

● ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులకు ఉపయోగపడేలా జిల్లా సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 19 రకాల తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ భాషల పుస్తకాలు సరఫరా చేసింది.

● ఎన్టీఆర్ జిల్లాలోని 687 ప్రాథమిక, 18 ప్రాథమికోన్నత, 167 జడ్పీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 39 పది ప్లస్ కళాశాలల్లోని గ్రంథాలయాలకు 1,18,470 పుస్తకాలు అందజేసినట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎం.రజనికుమారి తెలిపారు.

● కృష్ణా జిల్లాలో 1054 ప్రాథమిక, ప్రాథమికోన్నత, 341 జడ్పీ ఉన్నత పాఠశాలలకు 1,40,481 పుస్తకాలు సరఫరా చేసినట్లు సమగ్ర శిక్ష కృష్ణా జిల్లా ఏఎంవో శ్యామ్ వివరించారు. ఇంకా ఉర్దూ పుస్తకాలు ఇవ్వాల్సి ఉంది.

● వ్యక్తిత్వ వికాసం, ఆత్మకథలు, సైన్స్, విజ్ఞాన విషయాలు తెలియజేసే పుస్తకాలు గ్రంథాలయాల్లో ఉంచారు. నో బ్యాగ్ డే రోజు ఉపాధ్యాయులు కథలు చెబుతున్నారు. పిల్లలతో తిరిగి చెప్పిస్తున్నారు. ఫలితంగా వారిలో పఠనాసక్తి పెరిగిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

● 75 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం సాధారణ తరగతులు, మధ్యాహ్నం నుంచి జాదూయి పిటార కిట్లు, ఇతర మెటీరియల్ వాడి కథలు, ఇతర అంశాలను బోధిస్తున్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి

అన్ని మాధ్యమాల పిల్లల కోసం గ్రంథాలయాలకు పుస్తకాలు సరఫరా చేశాం. వాటిని చదవడం వల్ల విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి, పఠనాసక్తి, నైతిక విలువలు పెరుగుతున్నాయి. చదవడం, రాయడంలో కూడా మార్పు కనిపిస్తోంది. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్ర చదవడం వల్ల వారిని స్ఫూర్తిగా తీసుకోవాలనే ఆలోచన కలుగుతోంది.

– ఎస్.అశోక్‌బాబు, సమగ్ర శిక్ష ఏఎంవో



వృక్ష విన్నపం

నగరాలు కాంక్రీట్ వనాలుగా మారుతున్నాయి. చెట్ల పెంపకంపై ఎన్నో రకాలుగా ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు ప్రచారాలు చేస్తున్నా ప్రయోజనం అంతంతమాత్రంగానే ఉంటోంది. విజయవాడ నగరంలో దుర్గామల్లేశ్వర మహిళా కళాశాలలో పెద్ద పెద్ద వృక్షాలు, వివిధ రకాల మొక్కలు చక్కగా నిర్వహణ చేస్తుండడంతో పచ్చదనంతో కళకళలాడుతోంది. ఈ కళాశాల ఆవరణలో ఒక చెట్టుకు కళాశాల యాజమాన్యం వృక్ష ప్రాధాన్యం తెలియజేసేలా ఏర్పాటు చేసిన వృక్ష విన్నపం అందరినీ ఆలోచింపజేసేలా ఉంది.

- ఈనాడు, అమరావతి

స్టార్టప్‌లకు సరికొత్త ప్రోత్సాహం



ఇగ్నైట్ సెల్‌లో కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న ఆర్టీఐహెచ్ స్పోక్ బృంద సభ్యులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని కలెక్టరేట్‌లోని ఇగ్నైట్ సెల్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్టీఐహెచ్) ఆధ్వర్యంలో సోమవారం మూడు స్టార్టప్‌లు, రెండు ఎంఎస్ఎంఈలు తమ ఉత్పత్తులను ప్రదర్శించాయి. సింటాక్స్ లెన్స్, ఈటీ ఆర్గానిక్స్ తదితర సంస్థల ఉత్పత్తులను కలెక్టర్ జి.లక్ష్మీశ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎనికేపాడులోని ఆర్టీఐహెచ్ స్పోక్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. విద్యాసంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుంటూ.. యువతను పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే 8,000 మందికి పైగా ఔత్సాహికులకు అవగాహన కల్పించినట్టు వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, అగ్రిటెక్, హెల్త్‌టెక్, ఫుడ్ టెక్, ఎడ్యూ టెక్ వంటి ఎమర్జింగ్ సాంకేతికతలను ప్రోత్సహించడమే కాకుండా, ఆయా రంగాల్లో సుస్థిర ఉపాధి అవకాశాలను సొంతం చేసుకునేలా కృషి చేస్తున్నట్టు వివరించారు. ఆర్టీఐహెచ్ స్పోక్ బృంద సభ్యులు సి.హెచ్.శ్రీనివాస్, ఇమ్మాన్యుయేల్ తదితరులు పాల్గొన్నారు.

లాభం ఎర.. కష్టం చెర

నగరంలో నయా కేసుల నమోదు

ఈనాడు, అమరావతి

'మీ సొమ్మును సరైన స్టాక్‌లో పెట్టుబడి పెట్టండి. అనూహ్యంగా లాభాలు వస్తాయి. క్రిప్టోలో పెట్టే పెట్టుబడితో అనేక రెట్లు ఆదాయం సమకూరుతుంది' అంటూ సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలకు పలువురు మోసపోతున్నారు. ఇలాంటి బూటకపు ప్రకటనలతో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. లాభాలు ఆశ చూపి నిలువునా ముంచుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో బోగస్ ఇంటర్వ్యూలు, ఏఐ ఆధారిత వీడియోలు, మోసపూరిత ప్రకటనలు పోస్ట్ చేస్తున్నారు. వీటిని నమ్మి చాలా మంది తమ సొమ్ము పోగొట్టుకుంటున్నారు.

మాయమాటలు నమ్మి మోసపోయి..

★ నగరానికి చెందిన ఓ యువతి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తోంది. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తూ అధిక డబ్బులు సంపాదించవచ్చని ఆమెకు ఎస్ఎంఎస్ వచ్చింది. అందులోని నంబరుకు ఫోన్ చేస్తే యూట్యూబ్‌లో వీడియోలను లైక్ చేస్తే చాలని, అన్నింటికి లెక్కగట్టి డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని నమ్మించారు. నిజమే అని నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చింది. మూడు వీడియోలు లైక్ చేసినందుకు ఆమె ఖాతాలో రూ.150 జమ అయింది. మరో ఆరు వీడియోలను లైక్ చేస్తే రూ.300 ఖాతాలో వేశారు. ప్రీపెయిడ్ టాస్కులు చేస్తే పర్మినెంట్ అవుతుందని మోసగాళ్లు నమ్మబలికారు. ఇందులో భాగంగా రూ.వెయ్యి చెల్లిస్తే తిరిగి రూ.1,600 ఆమెకు వచ్చాయి. ఇలా ఆమె విడతల వారీగా రూ.19లక్షలు మోసగాళ్ల బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసింది.

ఖాతాలు ఖాళీ చేస్తారు

మొదట లింక్ పంపి యాప్ డౌన్‌లోడ్ చేయిస్తారు. వందల మంది దీని ద్వారా లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు చూపిస్తారు. మీ పేరుతో ఖాతా తెరిచి మొదట రూ.వందల్లో పెట్టించి రూ.వేలల్లో లాభం ఇస్తారు. లాభం విత్ డ్రా చేసుకునే వెసులుబాటు ఇస్తారు. మీతో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టించి రూ.కోట్లలో ఆదాయం ఉన్నట్లు చూపించి నమ్మిస్తారు. ఆ తరువాత సైబర్ నేరగాళ్లు మీ ఖాతా నుంచి డబ్బులు విత్‌డ్రా కాకుండా ఆపేస్తారు.

ప్రకటనలు చూసి పెట్టుబడులు పెట్టొద్దు

– సాయి సతీష్, సైబర్ నిపుణుడు, విజయవాడ

■ సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రకటనలను నమ్మి మోసపోవద్దు. ■ పెట్టుబడులు పేరుతో అనేక సైట్లు, యాప్‌లు ఇటీవల కాలంలో వచ్చాయి. వీటిల్లో పెట్టుబడి పెట్టేముందు ఆలోచించాలి. ■ మీ పెట్టుబడికి అనేక రెట్లు ఎక్కువ సొమ్ము వస్తుందని ఊరిస్తారు. వీటి వలలో చిక్కుకోవద్దు. ■ ఆర్బీఐ, సెబి ఆమోదించిన సంస్థల్లోనే పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరం.

రెవెన్యూ క్లినిక్ అర్జీలపై ప్రత్యేక దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కలెక్టరేట్ రెవెన్యూ క్లినిక్‌లో దాఖలవుతున్న అర్జీల సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. మొత్తం 211 అర్జీలు అందినట్టు చెప్పారు. వీటిలో రెవెన్యూ క్లినిక్ ద్వారా 75, మిగతా 136 పీజీఆర్ఎస్‌లో వచ్చాయి. పురపాలక శాఖకు 36, పోలీస్ 21, డీఆర్డీఏ 10, గృహ నిర్మాణానికి 6 చొప్పున అందాయి. విభిన్న ప్రతిభావంతుల శాఖ, ఆరోగ్య, ఉపాధి కల్పన, రిజిస్ట్రేషన్ శాఖలకు మూడేసి, వ్యవసాయ, విద్యుత్తు, అడవులు, జలవనరులు, గనులు, పర్యాటక, ఖజానా శాఖలకు రెండేసి చొప్పున వచ్చాయి. మిగతావి వివిధ శాఖలవి ఉన్నాయి. జేసీ ఎస్.ఇలక్కియా, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలు కావూరి చైతన్య, కె.బాలకృష్ణ, కె.మాధురి, సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, ఏసీపీ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి పోరాటము పోరాడితిని, నా పరుగు కడముట్టించితిని, విశ్వాసము కాపాడుకొంటిని ॥ తిమోతి 4:7



జ్ఞాపకార్థ కూడిక

కాలానికి ఎదురు నిలిచి, సత్యానికి తోడుగా నడిచి మీ నడతతో తరతరాలకు దారి చూపిన మహనీయుడా! మీరు భౌతికంగా మమ్ము వీడినా, మీ సంకల్పం మా శ్వాసగా మీ ఆశీర్వాదం మా శక్తిగా మా ప్రతి అడుగును నడిపిస్తున్నది. భావితరాలకు స్ఫూర్తిగా మా జీవిత పయనం ఎలా సాగాలో నేర్పించిన నిరాడంబర ఆదర్శమూర్తీ.. మీ పవిత్ర ఆత్మకు నిత్య శాంతి ప్రసాదించమని ప్రభువుని ప్రార్థిస్తూ..

శ్రీ బొడ్డు యోహాన్ గారు
B.A., B.Ed.
CSI, కృష్ణా గోదావరి అధ్యక్ష మండల పూర్వపు కార్యదర్శి
శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలని, విజయవాడ
జననం: 10-3-1933, మరణం: 27-1-2026

భార్య
ఎస్. హేమలత
కుటుంబ సభ్యులు మరియు బంధుమిత్రులు

జ్ఞాపకార్థకూడిక : ది. 4-02-2026 బుధవారం ఉదయం 10-00 గంటలకు విజయవాడ గవర్నరుపేట గోపాలరెడ్డి రోడ్డు CSI సెయింట్ పాల్స్ బసిలికా నందు జరుగును. ✆ 82975 55101, 94401 21626

పట్టుకుంది కొంత... పక్కదారి మరింత

భారీగా దారి మళ్లుతున్న చౌక బియ్యం

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం



మచిలీపట్నం నుంచి అక్రమంగా కాకినాడ తరలిస్తుండగా పట్టుబడిన బియ్యం లారీ

జిల్లాలో రేషన్ బియ్యం మాఫియా ఆగడాలకు అడ్డుకట్ట పడట్లేదు. ఎంఎల్ఎస్ పాయింట్లు, డీలర్ల నుంచి రేషన్ బియ్యం మాఫియాకు చేరుతోంది. నియోజకవర్గానికొకరు రేషన్ డాన్‌గా అవతరిస్తున్నారు. గ్రామాలు, మండలాల పరిధిలో మనుషులు పెట్టుకుంటున్నారు. చౌక దుకాణాల నుంచి జనాలకు బియ్యం అందగానే... ఆటోలు వేసుకొని బియ్యం కొని రైస్ మిల్లులు, శివారు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. అధికారులు పట్టుకుంటున్న బియ్యం... పక్కదారి పడుతున్న సరకులో 10 శాతం కూడా ఉండడం లేదు. కొంతమంది అధికారులు, నేతల అండతో పెనమలూరు, గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన తదితర ప్రాంతాల్లో కొందరు రేషన్ మాఫియాగా తయారయ్యారు. అధికారులకు నెలవారీ మూటలు అందుతున్న నేపథ్యంలో చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో పట్టుకున్న బియ్యం

ఏడాది	కేసులు	టన్నులు
2023	232	512.80
2024	374	1240.62
2025	196	620

★ విస్సన్నపేటలో 10 క్వింటాళ్ల బియ్యాన్ని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా పట్టుకున్నారు.

★ ఎ.కొండూరు మండలంలోని వివిధ గ్రామాల నుంచి సేకరించిన రెండు టన్నుల చౌక బియ్యాన్ని ఇబ్రహీంపట్నానికి అక్రమంగా తరలిస్తుండగా మైలవరం పోలీసులు పట్టుకున్నారు.

తరలిస్తున్నా చూస్తారంతే...

★ విజయవాడ నుంచి తూర్పుగోదావరి జిల్లాకు 15 టన్నుల అక్రమ రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని గత ఆగస్టులో అధికారులు పట్టుకున్నారు.

★ ఇటీవల కంచికచర్ల మండలంలోని ఓ రైస్ మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన చౌక బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. వీటిని పాలిష్ చేసి సోనా మసూరిలో కలుపుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

★ కృష్ణా జిల్లాలో బియ్యాన్ని గన్నవరం, మల్లవల్లి పారిశ్రామికవాడ, పెనమలూరు కొత్త ఆటోనగర్, మచిలీపట్నంలోని కొన్ని వీధులు, గుడివాడలోని రైస్ మిల్లులు, దుకాణ సముదాయాలు, అవనిగడ్డ శివారు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. లారీల్లోకి రాత్రి లోడ్ చేస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా కాకినాడ తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులే అక్రమార్కులకు అండగా నిలవడం గమనార్హం.

జోగి ఇంటిపై దాడి కేసు దర్యాప్తు ముమ్మరం

సమగ్ర ఆధారాలు సేకరించిన క్లూస్ టీమ్

ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో అంబటిపైనా కేసు



పెట్రోలు సీసా విసురుతున్న వ్యక్తి

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే - ఇబ్రహీంపట్నం: వైకాపా నేత జోగి రమేష్ ఇంటిపై తెదేపా శ్రేణులు దాడి చేసిన కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జోగి ఇంటిని ఇబ్రహీంపట్నం పోలీసులు, క్లూస్ టీం సోమవారం రాత్రి పరిశీలించారు. ఇంటి మొదటి అంతస్తు పోర్టికోలో పగిలిన అద్దాలు, పెట్రోల్ సీసా విసిరినప్పుడు దగ్ధమైన ప్రదేశాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. తెదేపా నాయకులపై నమోదు చేసిన కేసులో మొత్తం 43 మందిని నిందితులుగా చేర్చారు. సీసీ కెమెరాల్లో దృశ్యాలు, డ్రోన్ ద్వారా చిత్రీకరించిన విజువల్స్ ద్వారా దాడిలో పాల్గొన్న వారిని గుర్తించారు. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన వ్యక్తి పెట్రోల్ సీసా విసిరినట్లుగా దృశ్యాల ఆధారంగా తేల్చారు. మహిళా ఎస్సై సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తెదేపా నాయకులు కాకి నాగరాజు, బెజవాడ గణపతి, మైక్ బాబూరావు, తదితరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీరిలో 11 మందికి నోటీసులు ఇచ్చి పిలిచి... వారి నుంచి స్టేట్‌మెంట్లను తీసుకుని పంపించారు.

★ జోగి రమేష్ కార్యాలయంలో పనిచేసే రాంబాబు పోలీసులకు సోమవారం ఫిర్యాదు ఇచ్చారు. జోగి కుటుంబ సభ్యులను అంతమొందించేందుకు తెదేపా శ్రేణులు ఇంటిపై దాడి చేసి, నిప్పుపెట్టాయని పేర్కొన్నారు. దాడి సమయంలో కార్యాలయంలో ఉన్న వారిని మంగళవారం పోలీసులు విచారించి, వారి నుంచి స్టేట్‌మెంట్లను తీసుకోనున్నారు. దాడి ఘటన దృశ్యాలను కార్యాలయ ఉద్యోగులు పోలీసులకు పెన్‌డ్రైవ్‌లో అందజేశారు. జోగి ఇంటి వద్ద పోలీసు పికెట్ కొనసాగుతోంది.

★ సీఎం చంద్రబాబుపై మురికి వ్యాఖ్యలు చేసిన అంబటి రాంబాబుపై ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. తెదేపా నాయకుడు కాకి నాగరాజు ఫిర్యాదు మేరకు జోగి రమేష్‌పై ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. జోగిని ఏ1గా... ఏ2గా అంబటి రాంబాబు పేరు నమోదు చేశారు. ఇందులో మరికొందరు వైకాపా నేతల పేర్లు చేర్చే వీలుంది.

దేవినేని అవినాష్, మొండితోక జగన్మోహన్‌లపై.. జోగి ఇంటిపై దాడి ఘటన అనంతరం ఇబ్రహీంపట్నం వెళ్లేందుకు ప్రయత్నించిన ఎన్టీఆర్ జిల్లా వైకాపా నేత దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావులను పోలీసులు ఆదివారం రాత్రి ముందస్తు అరెస్టు చేశారు. వీరిపై బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 170 కింద హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి



ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

(c) eenadu

4న ఈఎఫ్‌ఎం ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై వాకథాన్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించాలనే లక్ష్యంతో ఈఎఫ్‌ఎం 91.9 ఆధ్వర్యంలో ఈనెల 4న 'గులాబీ అడుగు' పేరుతో మహిళలతో ప్రత్యేక వాకథాన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం ఉదయం 10.30 నిమిషాలకు నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులోని భానునగర్ సిగ్నల్ నుంచి ప్రారంభమై... హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి వరకు వాకథాన్ కొనసాగుతుంది. మహిళలు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. వాక్‌థాన్ అనంతరం బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన సమావేశం నిర్వహించి తీసుకో వాల్సిన ముందస్తు జాగ్రత్తలు, పరీక్షల గురించి వైద్య నిపుణులు వివరిస్తారని తెలిపారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సహాయ కార్మిక కమిషనర్ ధనలక్ష్మి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : అసంఘటిత, వలస కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని.. వాటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ధనలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గవర్నర్‌పేట రాజగోపాలచారివీధిలో కేంద్ర ప్రభుత్వ పథకాలు పీఎంఎస్‌వైఎం, ఈ శ్రమ్, ఎన్‌పీఎస్‌పై అవగాహనా ప్రచార రథాన్ని ఆమె ప్రారంభించారు. ఈ రథం గ్రామ గ్రామాలకు వెళ్లి కేంద్ర పథకాలపై కార్మికులకు అవగాహన కలిగిస్తారు. కార్మికులు పథకాలపై అవగాహన పెంచుకుని.. వాటిలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు నరేష్, ఈశ్వర్, సురేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెదవడ్లపూడిలో సాయి మందిర వార్షికోత్సవం నేడు



వంటల తయారీని పరిశీలిస్తున్న పాతూరి నాగభూషణం

మంగళగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదవడ్లపూడి గ్రామంలోని భగవాన్ శ్రీ సత్య శిర్డీ సాయిబాబా మందిర 20వ వార్షికోత్సవ ఏర్పాట్లను ఆలయ కమిటీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నిర్వహించే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, ఉదయం 5 గంటల నుంచి కాగడా హారతితో పూజలు మొదలవుతాయని, బాబా వారికి విశేషంగా క్షీరాభిషేకం, అన్నాభిషేకం జరుగుతాయని తెలిపారు. సినీ సంగీత గాయని గాయకులతో సంగీత విభావరి, 'జబర్దస్త్' కామెడీ కళాకారులతో నాటికలు, మ్యాజిక్ షో, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉదయం 8 గంటల నుంచే అన్న సంతర్పణ మొదలవుతుందని, భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

ఘనంగా జలబిందెల మహోత్సవం



మునేరు జలాలతో ఊరేగింపుగా బయలుదేరిన వంశీకులు



బిందెలతో వేచి ఉన్న మహిళలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే : తిరుపతమ్మ అమ్మవారి పెద్ద తిరునాళ్లల్లో భాగంగా రెండో రోజు జలబిందెల మహోత్సవం సోమవారం జరిగింది. అమ్మవారి ఆలయం వద్ద నుంచి వంశీకులు డాక్టర్ కర్ల రవి, సూరంపల్లి గోపి, వడ్లమూడి శేషగిరి, నల్లపునేని హనుమంతు, గజ్జి శివకృష్ణ జలబిందెలతో ఊరేగింపుగా మునేరుకు బయలుదేరారు. అక్కడ పూజ అనంతరం మునేరు జలాలను బిందెల్లో నింపుకొని స్థానిక కాజ్‌వే మీదుగా గ్రామంలోకి వచ్చారు. డాక్టర్ రవి స్నేహితుడు, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు ఉత్సవంలో పాల్గొని, కర్ల వారి జలబిందెను ఎత్తుకుని ముందుకు సాగారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే దంపతులు, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అర్జున్ తదితరులు పూజలు చేసి ఊరేగింపులో భాగస్వామ్యులయ్యారు. అనంతరం ఊరేగింపు భారీ జనసందోహం మధ్య అమ్మవారి ఆలయానికి చేరుకుంది. ఈ జలాలతో మంగళవారం ఆలయంలో ఉదయ పొంగళ్లు, అంకసేవను నిర్వహించనున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ బాబు, శ్రీవాణి, పాకాలపాటి అనసూయ, జ్యోత్స్నప్రియాంక, వెంకటేశ్వరరావు శాస్త్రి, ఆలయ ఈఈ రమాదేవి, ఏఈవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డ్రగ్స్ నియంత్రణ



ప్రతిజ్ఞ చేస్తున్న సీపీ రాజశేఖరబాబు, సరిత, కృష్ణకాంత్ పాటిల్, రామకోటేశ్వరరావు, శ్రీధర్

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : 'సమాజంలో డ్రగ్స్‌ను నామరూపాలు లేకుండా చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్ష. ఈ యజ్ఞంలో అన్ని వర్గాలు తమ వంతు పాత్ర పోషించాలి. అందుకే ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు పేర్కొన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర చేపట్టిన అయిదుగురు మహిళా పోలీసుల సైకిల్ యాత్ర సోమవారం సూర్యారావుపేటలోని శ్రీధర్ సీసీఈకి చేరుకుంది. మహిళలు, విద్యార్థులు పూలు జల్లుతూ.. హారతులు ఇస్తూ వారికి స్వాగతం పలికారు. దాదాపు 1200 మంది పోటీ పరీక్షలకు శిక్షణ పొందుతున్న అభ్యర్థులతో డ్రగ్స్‌కు దూరంగా ఉంటామంటూ.. సీపీతోపాటు డీసీపీలు కృష్ణకాంత్ పాటిల్, కె.జి.వి.సరిత ఇతర అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఒక జాతి నిర్వీర్యం అయ్యే ఈ పరిస్థితిని ఎవరూ ఉపేక్షించవద్దని పేర్కొన్నారు. ఈ దండయాత్రలో భాగంగా 29 రకాల కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. బి.ఆర్.టి.ఎస్.రోడ్డులో భారీ యోగా కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. డ్రగ్స్ కేసుల్లో 2517 మందిని అరెస్టు చేశామని.. వీరు ఏం చేస్తున్నారో గమనిస్తున్నామని తెలిపారు. కలిసి కట్టుగా ముందుకు వెళితేనే డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టగలమన్నారు. డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ బైరా రామకోటేశ్వరరావు ఎన్డీపీఎస్ యాక్ట్ విశేషాలను వివరించారు. ఈ సెక్షన్ కింద కేసు నమోదైతే.. తీవ్రతను బట్టి మరణశిక్ష విధించే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ప్రత్యేక ఆకర్షణగా పోలీస్ జాగిలం: ఈ కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాలను గుర్తించే పోలీసు జాగిలం పనితీరును ప్రత్యక్షంగా చూపించారు. పోలీసు సిబ్బంది ఒకరికి డ్రగ్స్ ఇచ్చి.. జనాల్లోకి పంపించారు. పోలీసు జాగిలం అతనిని గుర్తించి అందరి ప్రశంసలు అందుకుంది. యువతీ యువకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ సీసీఈ అధినేత కొమ్మూరి శ్రీధర్, ఏడీసీపీ మురళీకృష్ణ, ఏసీపీ పావన్‌కుమార్, సీఐ అహ్మద్ ఆలీ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగు.. ఆరోగ్యానికి బాగు

రైతేరాజు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

అన్నదాతలు ప్రకృతి సాగు విధానాన్ని అనుసరించాలని నిపుణులు చెబుతున్నారు. వ్యవసాయ శాఖ కూడా అవగాహన కల్పిస్తూ, ప్రోత్సాహాలు అందిస్తూ.. రైతుల్ని ఆ దిశగా మళ్లించేందుకు కృషి చేస్తోంది. ఆ క్రమంలోనే బాపులపాడు మండలం వైశంరం లక్ష్మీపురానికి చెందిన అట్లూరి బాల సత్యనారాయణ ప్రకృతి సేద్య విధానంలో పంటలు పండించి ఆదర్శంగా నిలుస్తున్నారు.



అట్లూరి బాల సత్యనారాయణ

ప్రయోగాత్మకంగా బస్మతి రకం వేసి..: సాధారణ రైతు కుటుంబానికి చెందిన సత్యనారాయణ వ్యవసాయాన్ని మొదటి నుంచి ఆసక్తి ఉన్నా.. పదేళ్ల నుంచి సాగు పంథా మార్చారు. తొలుత ప్రయోగాత్మకంగా బస్మతి రకం సాగు చేసి మంచి ఫలితాలను సాధించారు. తర్వాత అవగాహన పెంచుకుని ప్రకృతి విధానంలోనే పంటలు పండిస్తున్నారు. ఆవుల్ని పోషిస్తూ, ప్రకృతి సాగుకు అవసరమైన ఎరువులు, కషాయాలు ఇంటి వద్దే స్వయంగా తయారు చేసుకుంటున్నారు.



పండించిన వివిధ రకాల ధాన్యం

★ మొత్తం 5 ఎకరాల్లో అరుదైన వరి రకాలు పండించడం విశేషం. ఒక ఏడాది పండించిన రకాన్ని మరో సంవత్సరం విక్రయించడం ఆయన ప్రత్యేకత. ఈ ఏడాది ఆయన 12 రకాలు సాగు చేశారు. గోవింద్, గురుడన్ సాంబ, [illegible], చిట్టి ముత్యాలు, కుంకుమశాలి, [illegible], బస్మతి, బహురూపి, రాజముడి, బ్లాక్‌రైస్ తదితర 12 రకాలు పండించారు.

ఉచితంగా విత్తనాలు ఇస్తూ...: సాగు గిట్టుబాటు కావడం లేదని, రైతులు ప్రత్యామ్నాయ మార్గాల వైపు వెళ్లిపోతున్న తరుణంలో, సత్యనారాయణ మాత్రం కౌలు పొలంలో నిరంతరం సేద్యం చేస్తున్నారు. మనం తినే ఆహారం రసాయనాల వల్ల విషతుల్యంగా మారిపోతున్న నేపథ్యంలో ఆరోగ్యకరమైన ధాన్యాన్ని అందించాలనే లక్ష్యంతో ప్రకృతి సాగుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. పండించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి సొంతంగా మార్కెటింగ్ చేసుకుంటున్నారు. విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరుకు సరఫరా చేస్తున్నారు. కొత్తగా ప్రకృతి సాగు ప్రారంభించే వారిని ప్రోత్సహించేందుకు ఒక్కొక్కరికి అర ఎకరానికి సరిపడా విత్తనాలు ఉచితంగా అందిస్తున్నారు. జిల్లా గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్‌కు వచ్చిన కలెక్టర్ డీకే బాలాజీ ప్రకృతి సాగు గురించి వివరించారు.



రైతు ప్రశ్న? శాస్త్రవేత్త సలహా

ప్రశ్న: టమాట నారు పోసుకునే కాలం, ఆకుమాడు తెగులు(ఎర్లీబ్లైట్) నివారణ చర్యలు వివరించండి? - సీహెచ్ రాజు, రైతు, మల్లంపల్లి

సమాధానం: టమాట పంటను సంవత్సరం పొడవునా సాగుచేయవచ్చు. ప్రస్తుతం ఫిబ్రవరి నెలలో నారుపోసుకోవచ్చు. ఆకుమాడు తెగులు (ఎర్లీ బ్లైట్) ఆశించినప్పుడు ఆకుల మీద, కాండం మీద, కాయలు పైన గోధుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణ ఆకులు మాడి, ఎండిపోతాయి. ముఖ్యంగా ఏ దశలో అయినా ఆశించవచ్చు. తేమ ఉన్న చల్లని వాతావరణంలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు 3 గ్రాముల కాప్టాన్ లేదా మాంకోజెబ్ మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 లేక 4 సార్లు పిచికారీ చేయాలి. - వి.మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞానకేంద్రం, ఘంటసాల

నిమ్మ.. సూక్ష్మ పోషక యాజమాన్యమే కీలకం



తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: సేంద్రియ ఎరువులు, సూక్ష్మపోషక యాజమాన్యంతో నిమ్మ తోటలను దీర్ఘకాలం కాపాడుకోవచ్చని ఉద్యాన అధికారిణి మానస సూచించారు. కాపు దశలో ఏడాదికి రెండుసార్లు ఎరువులు వేయాలి. నత్రజని ఎరువు ఒక భాగం, వేప, ఆముదం పిండి ఈనెలలో, రసాయన ఎరువులు రెండు భాగాలు వేయాలి. భాస్వరాన్ని సూపర్ ఫాస్ఫేట్ రూపంలో పొటాష్‌ను ఎంవోపీ రూపంలో వేయాలి. కాపు దశలో ఏడాదికి 1500 గ్రాముల నత్రజని, 250 గ్రాముల భాస్వరం, 400 గ్రాముల పొటాష్ వేయాలి. కాండానికి 1.5 మీటర్ల దూరంలో గాడితీసి అందులో ఎరువు వేసి మట్టి కప్పి నీరు పెట్టాలి. సూక్ష్మపోషకాల నివారణకు లీటరు నీటికి అయిదు గ్రాముల జింకు సల్ఫేట్, రెండేసి గ్రాముల మాంగనీసు, మెగ్నీషియం సల్ఫేట్, గ్రాము బోరాన్‌తో పాటు ఐదు గ్రాముల సున్నం, పది గ్రాముల యూరియా కలిపి లేత ఆకులు విస్తరించిన తరువాత, పిందెలు బఠాణీ గింజ పరిమాణంలో ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఏడాదికి రెండుసార్లు సూక్ష్మ పోషక లోపం ఏర్పడితే చెట్టుకు 500 గ్రాముల జింక్ సల్ఫేట్, 250 గ్రాముల ఫెర్రస్ సల్ఫేట్, 50 గ్రాముల బోరాన్‌ను పాదుల్లో వేస్తే ప్రయోజనం ఉంటుంది. ప్రాంతాలను బట్టి నిమ్మ, బత్తాయి తోటలు పూత దశలో ఎరువులు వేస్తే మంచి దిగుబడులు వస్తాయి. కొమ్మలు కత్తిరించాక బోర్డో(కాపర్ సల్ఫేట్) మిశ్రమాన్ని చెట్టు మొదళ్లకు రాయాలి. వేరు కుళ్లు తెగులు రాకుండా పాదు తడిసేలా కాపర్‌సల్ఫేట్ ద్రావణం పోయాలి.

మినుములో కాండం గజ్జి తెగులు.. నివారణ

ఘంటసాల: మినుము పంటను సోకిన 'కాండం గజ్జి తెగులు' నివారణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, సస్యరక్షణ శాస్త్రవేత్త కె.రేవతి రైతులకు సూచించారు. మినుము పైరుపై ఈ తెగులు 20- 30 రోజుల దశ నుంచి సోకుతుంది. కాండం పై ఉబ్బెత్తుగా తెల్లటి మచ్చలు లేదా బొబ్బలు వస్తాయి. క్రమేపీ పెరిగి ముదురు గోధుమ రంగులోకి మారి చారలుగా మారి కాండం పొడవునా వ్యాపిస్తుంటాయి. దీంతో పూత, పిందె తగ్గడమేగాక, ఉద్ధృతిగా ఉన్నప్పుడు మొక్కలు వడలి పోయి చనిపోతాయి. తెగులు సోకిన మొక్కలు కాండం నిలువుగా చీల్చి పరిశీలిస్తే లోపలి కణజాలం గోధుమ రంగులో ఉంటుంది. వరి తర్వాత మాగాణుల్లో సాగుచేసే మినుము పంటలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. నివారణకు టెబుకొనజోల్ 1.5 మి.లీ లేదా మెటలాక్సిల్+ మాంకోజెబ్ 2.0 గ్రాములు లీటరు నీటికి కలిపి నేల తడిసేలా పిచికారీ చేయాలి. జీవ శిలీంద్రనాశిని ట్రైకోడెర్మా విరిడీ పొడి మందును 10 గ్రాములు లీటరు నీటికి కలిపి నేల తడిసేలా చూసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడీని వినియోగించిన వారం ముందు, వారం తరువాత ఎటువంటి రసాయనాలు వినియోగించకూడదు. నూతనంగా సాగు చేపట్టే రైతులు ట్రైకోడెర్మా విరిడీ పొడి 10 గ్రాముల కిలో మినుము విత్తనాలకు కలుపుకొని చల్లుకున్నట్లైతే ఈ తెగులును కొంతవరకు తగ్గించుకోవచ్చు. - ఘంటసాల, న్యూస్‌టుడే



తెగులు సోకిన మినుము పైరును పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు సుధారాణి, రేవతి

తారక రామ ఎత్తిపోతల మరమ్మతులకు అంచనాలు



కలెక్టర్ లక్ష్మీశకు వివరిస్తున్న జమలయ్య తదితరులు

రైతుల వినతిపై కలెక్టర్ స్పందన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నిర్వహణ లోపంతో కునారిల్లుతున్న తారక రామ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించాలని తాము విన్నవించిన నేపథ్యంలో కలెక్టర్ జి.లక్ష్మీశ స్పందించి అంచనాలు రూపొందించాలని జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారని ఏపీ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడు యలమందరావు తెలిపారు. తారకరామ పథకం మరమ్మతులు కోరుతూ సోమవారం వారు నగరంలోని కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం సమర్పించి, కలెక్టర్‌కు వివరించారు. ఈ పథకం కింద విజయవాడ గ్రామీణ, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో 13,500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. 23 మోటార్లతో సగం పని చేయడం లేదని, ఎడమ కాల్వపై ఉన్న మోటార్లు ప్రారంభం నుంచే నిలిచిపోయాయని వివరించారు. కాల్వల్లో గుర్రపు డెక్క, ముళ్లకంప పెరిగి నీటి ప్రవాహానికి ఆటంకంగా ఉన్నాయని తెలిపారు. అండర్ టన్నెల్‌లో పూడిక వల్ల పొలాలు ముంపునకు గురవుతున్నట్టు చెప్పారు. కొండపల్లి ఆటోనగర్ పారిశ్రామిక వ్యర్థాలు కాలువలో కలవడం వల్ల పంటలు దెబ్బతినడంతో పాటు, ఆ నీరు తాగిన పశువులు మృత్యువాత పడుతున్నట్టు తెలిపారు. శాంతినగర్ వద్ద ప్రభుత్వ భూమిలో రిజర్వాయర్ నిర్మించాలని పేర్కొన్నారు. ముంపు బారిన పడిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని విన్నవించారు. జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్, తారకరామ ఎత్తిపోతల సాధన కమిటీ కో-కన్వీనర్ చెరుకూరి శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకుడు కె.ఎస్.ఎస్.ప్రసాద్, ఎత్తిపోతల పథక కమిటీ సభ్యులు ధనేకుల శ్రీనివాసరావు, గరిమెళ్ల శ్రీనివాసరావు, చంద్రశేఖర్, జొన్నలగడ్డ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

వంద దాటిన ఫిర్యాదులు



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న డీసీపీ ఉదయరాణి

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 107 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఉదయరాణి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. వీటిల్లో అత్యధికంగా భూ, ఆస్తి వివాదాలు, నగదు లావాదేవీలపై 64 అందాయి. మోసాలు 8, కుటుంబ కలహాలు 6, మహిళా సంబంధ నేరాలు 6, దొంగతనాలు 6, కొట్లాటలు 2, ఇతర ఫిర్యాదులు 16 చొప్పున వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు పంపి సత్వరమే పరిష్కరించాలని ఆమె ఆదేశించారు.

బెదిరించి.. సొమ్ము కాజేసి



నిందితురాలితో తిరువూరు పోలీసులు

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరుకు చెందిన కనపర్తి రేణుక ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన ఓ వ్యక్తిని శనివారం రాత్రి ట్రాప్ చేసి అతని వద్ద నుంచి నగదు, బంగారపు ఉంగరం దోచుకుని అతనిపై దాడి చేసి బెదిరించింది. అనంతరం అత్యాచారం కేసు పెడతానని.. రూ.రెండు లక్షలు డిమాండ్ చేయగా బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి నిందితులపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు వారిని సోమవారం అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించగా న్యాయమూర్తి నిందితులకి రిమాండ్ విధించారు. దీనిపై సెక్టార్1 ఎస్సై శాతకర్ణి మాట్లాడుతూ.. యువకులను మోసగించి, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, భయపడాల్సిన అవసరం లేదని సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -133 రిటైల్ ధర 160 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 264.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 150, 159, 170 చికెన్ విత్ స్కిన్ - 290 చికెన్ స్కిన్‌లెస్ - 300.

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రి, విజయవాడ-1
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన Rc. No.REV62-FESTOFETE(FETE)2/2026, Dt:02-02-2026
శ్రీ అమ్మవారి దేవస్థానము నందు ఒక సంవత్సరం కాల పరిమితికి అనగా ది.01-04-2026 నుండి ది.31-03-2027 వరకు ఈ దేవస్థానముకు ప్రతి నిత్యము మరియు పర్వదినములలో అవసరమైన వివిధ రకములైన పండ్లు, పండ్ల రసములు మరియు తమలపాకులు మొదలైనవి సప్లయి చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వివరములకు టెండరు ప్రకటన https://apeprocurement.gov.in లో Endowments Department నందు దర్శించుకొనవచ్చును. బిడ్ డాక్యుమెంట్ డౌన్ లోడు ది:03-02-2026 ఉ॥ 11.00 గం॥ల నుండి, టెండరు దాఖలు చేయు ఆఖరు తేది:18-02-2026 మ॥ గం॥ 02.30 ని॥లు. పూర్తి వివరములకు కార్యాలయము పనిచేయు వేళలో లేదా ఫోన్:0866-2425733 ద్వారా సంప్రదించగలరు.
ఆర్జిత సేవ, పరోక్ష సేవా మరియు విరాళముల కొరకు https:// kanakadurgamma.org నందు చూడగలరు.
శ్రీ బొర్రా రాధాకృష్ణ — చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు
సం/- వి.కె. శీనా నాయక్, యమ్.ఎ — స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరు & కార్యనిర్వహణాధికారి

'రాజకీయ లబ్ధి కోసమే నాడు తప్పుడు కేసులు'

పటమట, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో రాజకీయ లబ్ధి పొందేందుకు అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబును అక్రమంగా స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో కేసు పెట్టారని తెదేపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. తాజాగా ఆ కేసులో సీఎం చంద్రబాబుకు ఈడీ క్లీన్‌చిట్ ఇవ్వడంతో జగన్ ప్రభుత్వం సాగించిన కుట్రలు, కుతంత్రాలు పూర్తిగా బయటపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకొని కేసులు పెట్టారని, యువత భవిష్యత్తు కోసం తీసుకొచ్చిన స్కిల్ డెవలప్‌మెంట్ వంటి విప్లవాత్మక కార్యక్రమాన్ని కూడా వదలకుండా వాడుకోవడం వైకాపా నేతల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు.


'అసభ్య మాటల వల్లే ఘర్షణలు'



మాట్లాడుతున్న శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్

గొల్లపూడి, న్యూస్‌టుడే: ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా అసభ్యకరమైన పదజాలంతో మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ మాట్లాడడం వల్లే గుంటూరు, ఇబ్రహీంపట్నంలో ఘర్షణలు జరిగాయని ఎన్టీఆర్ జిల్లా మైలవరం శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం గొల్లపూడిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జోగి రమేష్ కల్తీ మద్యం కేసులో జైలుకు వెళ్లొచ్చినా తన బుద్ధి మార్చుకోలేదని పేర్కొన్నారు. పోలీసు అధికారులపై అనుచిత వ్యాఖ్యలతో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లను కించపరిచేలా మాట్లాడుతున్నారన్నారు. జోగి రమేష్ అసాంఘిక శక్తి అని, అతని భాషనే ప్రస్తుత పరిస్థితికి కారణమన్నారు. జోగి రమేష్ ఇంటిపైకి వెళ్లాలనే ఉద్దేశం ఎవరికీ లేదని, అతడు మాట్లాడిన విధానం కారణంగానే కార్యకర్తలు అసహనానికి గురై వెళ్లడం జరిగిందన్నారు. వ్యక్తిగత దూషణలు చేయడం, బూతులు తిట్టడాన్ని వైకాపా అధినాయకత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. తప్పు ఎవరు చేసినా కూటమి ప్రభుత్వం సహించదని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురించి అమర్యాదగా జోగి రమేష్ మాట్లాడితే తాము జగన్‌ను అలాగే మాట్లాడవలసి వస్తుందన్నారు.

మేరీమాత ఉత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు



వేడుకల పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితర గురువులు

గుణదల(పటమట), న్యూస్‌టుడే: ఈ నెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించనున్న మేరీ మాత 102వ మహోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నామని విజయవాడ కథోలిక పీఠాధిపతి బిషప్ తెలగతోటి రాజారావు తెలిపారు. గుణదల సోషల్ సర్వీస్ సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 10 లక్షలకుపైగా భక్తులు వస్తారని పేర్కొన్నారు. మేరీ మాత చరిత్రపై నృత్య రూపక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం భక్తులు, గురువులకు ఉపయోగపడేలా నూతన గృహ సముదాయాల నిర్మాణానికి బిషప్ శంకుస్థాపన చేశారు. విజయవాడ కథోలిక పీఠం మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, డైరెక్టర్ ఫాదర్ కొలకాని మరియన్న, సోషల్ సర్వీస్ సెంటర్ ఫాదర్ తోట సునీల్ తదితర గురువులు పాల్గొన్నారు.

2,421 టన్నుల యూరియా నిల్వలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: జిల్లాలో రబీ పంటల సాగు నేపథ్యంలో ఈ నెల 2వ తేదీ నుంచి రాబోవు 26 రోజులకు 5,351 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంది. ప్రస్తుతం 2,421 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్.విజయకుమారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు.

హైదరాబాద్‌లోనూ అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం

ఈనాడు, హైదరాబాద్: ఏపీలోని విజయవాడలో ప్రకంపనలు రేపిన అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం నగరంలోనూ బయటపడింది. పెట్టుబడికి వడ్డీలు ఇస్తామంటూ ప్రచారం చేసిన కంపెనీ యజమాని తాడేపల్లి వెంకట ఆదిత్య, ఆయన భార్య సుజాత, కంపెనీలో వివిధ హోదాల్లో పని చేస్తున్న నరసింహ, పుష్యమి కీర్తి, రవికిరణ్, కిరణ్‌కుమార్ తదితరుల మీద సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. రూ.కోట్లలో డబ్బు వసూలు చేసి మోసగించినట్లు ఫిర్యాదు అందడంతో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఇదే కంపెనీ విజయవాడలో రూ.వందల కోట్లు వసూలు చేసి మోసగించినట్లు గతేడాది అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. దాదాపు 1200 మంది బాధితులు ఉన్నారు. రూ.లక్ష పెట్టుబడికి నెలకు 6 శాతం చొప్పున వడ్డీ ఇస్తామని సంస్థ ప్రతినిధులు డిపాజిట్లు సేకరించారు. కొన్ని నెలలు వడ్డీ ఇచ్చినా తర్వాత బోర్డు తిప్పేశారు. నగరంలోనూ ఇదే తరహాలో మోసం జరిగినట్లు సమాచారం.

91.9 FM Vijayawada
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 8008003297

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

భవానీపురం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో జరుగుతున్న వరుస పరిణామాలు ఆవేదన కలిగిస్తున్నాయని విజయవాడ పశ్చిమ శాసన సభ్యుడు సుజనా చౌదరి ఎక్స్‌లో స్పందించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా అసభ్యకరంగా మాట్లాడడం బాధించదగ్గిన విషయమన్నారు. అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే.. వ్యక్తిగత, భౌతిక దాడులకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని తెలిపారు. ఇలాంటి ఘటనలను చంద్రబాబు సహించరనేది అందరికి తెలిసిన విషయమేననీ, చట్టబద్ధంగా పరిస్థితిని నియంత్రిస్తారనే నమ్మకం ప్రజల్లో ఉందని చెప్పారు.

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధిక ధర చెల్లించి కొనబడును. స్పాట్‌క్యాష్. ✆ 81422 92071
బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం విడిపించి అధికధరకు కొనబడును (స్పాట్ క్యాష్). ✆ 87907 41166

FINANCIAL SERVICES
స్థిరాస్తులపై ఆంధ్రప్రదేశ్ అంతటా మార్టిగేజ్ లోన్స్ మరియు ప్రైవేట్ ఏ సంస్థలో ఉన్నా Xerox పేపర్స్‌తో 2nd మార్టిగేజ్ లోన్. సిబిల్, ITR అవసరంలేదు. అయోధ్య క్రెడిట్ సొల్యూషన్స్ ప్రైవేట్ బ్యాంక్. ✆ 93969 99669.

PERSONAL CLASSIFIEDS

MISSING
కనబడుటలేదు

ఈ ఫోటోలోని కోన మహేష్‌కుమార్, S/o. (లేట్) సాంబశివరావు, వయస్సు: 48 సం. తెలుపు రంగు, ... వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది ఫోన్ నెం. సంప్రదించగలరు. ✆ 93818 38094

JOBS
బ్యాంక్ లోన్స్ పనులు చేయుటకు (MS), ఆఫీసులో పనులు చేయుటకు (ఫీమేల్) టెలికాలర్స్ కావలెను. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత. ✆ 98855 96666.
NTR, కృష్ణాలో, జగ్గయ్యపేట, తిరువూరు, పామర్రు, అవనిగడ్డ, గుడివాడలో మార్కెటింగ్ PROలు కావలెను. జీతం. 40K, 50K, 60K. ✆ 89195 20094.
SVR ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్, గుంటూరు & జగ్గయ్యపేట బ్రాంచీలలో పని చేయుటకు అకౌంటెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్ట్రికల్ & మెకానికల్ ఇంజినీర్స్, డిప్లొమా ఎలక్ట్రికల్ & మెకానికల్ ఇంజినీర్స్ వెల్డర్స్, ఫిట్టర్స్, హెల్పర్స్ కావలెను. 91333 55781 (10 AM-5 PM) svrelectricalsgnt@gmail.com.
(విజయవాడ) ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు టీమ్ లీడర్స్ మరియు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఫోన్: 91335 74455.
సింగ్‌నగర్‌లోని ప్రముఖ కంపెనీకి Tally, MS ఆఫీస్‌లో అనుభవం గల అకౌంటెంట్ మరియు ఆఫీస్ బాయ్, డ్రైవర్ కావలెను. ✆ 63091 24492
KOTAK BANK అనుభవం ఉన్న Managers కావలెను. అర్హత: Rtd, VRS, టీచర్స్, గృహిణులు కావలెను. ✆ 83175 95259.
ఫీమేల్ నర్స్ కావలెను. విజయవాడ సీతారాంపురం, చిన్నారి ఒంటరిగా నిద్రపోయే ఇంటికి పేషెంట్ ఇంటి వద్ద (2 Legs) డ్రెస్సింగ్ చేయుటకు ఫీమేల్ నర్స్ కావలెను. ✆ 93482 86381
అన్ని ఇన్ఫర్మేషన్ కంపెనీలో పనిచేయుటకు అకౌంటెంట్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ & వెల్డర్స్, హెల్పర్స్, 10th ఫెయిల్, ITI, B. టెక్. ✆ 18K 35K. ✆ 96736 35594, 90305 69428
ఇంజనీర్ ఏరియాలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12గం॥ డ్యూటీ. 14,000 శాలరీ. అర్హత: 10th, 50సం॥లోపు వారు. ✆ 88014 97437.
విజయవాడలో సోషల్ మీడియా ఏజెన్సీ నందు పని చేయుటకు గ్రాఫిక్ డిజైనర్స్, వీడియో ఎడిటర్స్ కావలెను. ✆ 93943 71987.
[illegible] 12 P.M to 3P.M ఆఫీసులో ... ✆ ...

ACCOUNTING
Accountant with 5 years experience to work in Jharkhand construction site. WhatsApp resume to: 95023 93999.

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? రాఘవాపురం గ్రామంలో పాలసేకరణ కేంద్రం-2 దగ్గరలో డ్రెయినేజీలో జమ్మిగడ్డి పెరిగి మురుగు ప్రవాహానికి అడ్డుగా మారింది.- **స్థానికుడు, గణేష్** ✔ పరిశీలించి డ్రెయినేజీలో జమ్మిగడ్డి తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- ఎస్.నాగబాబు- రెడ్డిగూడెం పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి. –రెడ్డిగూడెం, న్యూస్‌టుడే**



స్పందన: ★ మూలపాడు గ్రామంలోని సీసీ రోడ్ల పక్క మురుగు కాలువలు పూడికలతో నిండి మురుగు పారుదల లేక దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికుడు రామస్వామి మేమున్నాం మీకు తోడుగా ద్వారా కార్యదర్శి అనిల్ కుమార్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సిబ్బందితో పూడికలను తొలగింపజేసి సమస్యను పరిష్కరించారు.– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం

★ పట్టణంలోని 8వ వార్డు డ్రెయినేజీల్లో మట్టి, చెత్త పేరుకుని మురుగు పారుదలకు ఆటకంగా ఉందని స్థానికుడు ప్రకాశరావు మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి సంతోష్ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. ★ పట్టణ 14వ వార్డులోని కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోయి మురుగు పారడంలేదని స్థానికుడు అమీర్ చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, తిరువూరు**

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు, విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట మండలం నరసాపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ గురుకుల పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్యామల తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు విద్య అందిస్తామన్నారు. ప్రవేశం కోరుకునే విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు సమీపంలోని ఎంఈవో, లేదా పాఠశాల కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు.

ఉపకార వేతనానికి ఎంపిక

మైలవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి స్కాలర్‌షిప్ పరీక్షలో మండలంలోని వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థిని కొత్తపల్లి సుష్మ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.బస్వారావు తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎడ్యుకేషన్ ఏపీ ఫర్ మెరిట్‌టెస్ట్ 2026లో ప్రథమ స్థానం సాధించడం ద్వారా రూ.12 వేల వార్షిక ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించినట్లు వివరించారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు, పీఎంసీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

బాధ్యతల స్వీకరణ



ప్రమాణ స్వీకారం చేస్తున్న గుడి కమిటీ సభ్యులు

గోసవీడు (గంపలగూడెం): మండలంలోని గోసవీడు గంగా పార్వతి సమేత విశ్వేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బాధ్యతలు స్వీకరించినట్లు తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కొత్తా రజనీకాంత్ సోమవారం తెలిపారు. గుడి నూతన కమిటీ అధ్యక్షులుగా కందిమళ్ల రజనీకాంత్, సభ్యులుగా కె.పద్మ, వి.విజయలక్ష్మి, బి.సుజాత, ఎ.సుబ్బరాజు, కె.శ్రీను, జ.సామేలు, పి.సంగయ్య (అర్చకులు) నియమితులయ్యారు. తెలుగు రైతు జిల్లాధ్యక్షుడు సీహెచ్.రాజేశ్వరరావు, తెదేపా మండల శాఖ అధ్యక్షుడు ఎం.రామకృష్ణ, మాజీ అధ్యక్షుడు ఆర్.వీరారెడ్డి, భాజపా నాయకులు ఎ.క్రాంతికుమార్, కె.సూర్యప్రకాశ్, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.రామకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆకలి గుర్తించి.. అల్పాహారం అందించి

ఉపాధ్యాయుల విరాళం.. పది విద్యార్థులకు ఊరట

గంపలగూడెం, న్యూస్‌టుడే:

విద్యాబోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై వినగడప జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సాయంత్రం ప్రత్యేక తరగతుల్లో పాల్గొనే బాలబాలికలకు సొంత ఖర్చుతో గతేడాది అక్టోబరు నుంచి ప్రధానోపాధ్యాయుడు కుంచం రవికిరణ్ ఆధ్వర్యంలో.. ఉపాధ్యాయుల వితరణతో రోజూ సాయంత్రం అల్పాహారం అందజేస్తున్నారు.



వినగడప జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం వడ్డిస్తున్న ఉపాధ్యాయులు

కోరిన ఆహారం అందిస్తూ..

వినగడప ప్రాథమికోన్నత పాఠశాలను గతేడాది ఉన్నత పాఠశాలగా వర్గోన్నతి కల్పించారు. తొలి ఏడాది పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించి 10వ తరగతిలో 13 మంది విద్యార్థులను చేర్పించారు. వారంతా క్రమం తప్పకుండా బడికి వచ్చేలా పర్యవేక్షిస్తూ నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యాబోధన చేస్తున్నారు. నిత్యం వంట ఏజెన్సీ సభ్యురాలు రమణ సహకారంతో విద్యార్థుల ఇష్టం మేరకు అల్పాహారంగా పూరి, ఉప్మా, అట్టు, బోండా, గుగ్గిళ్లు, ఎగ్ ఫ్రైడ్ రైస్, గుంట పునుగులు.. ఆపైన ఆరోగ్యం కోసం అరటికాయలు అందజేస్తున్నారు. ఇలానే తుది పరీక్ష వరకు అందిస్తామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు బడిలోనే ఉంటున్నామని, సాయంత్రం ప్రత్యేక తరగతి సమయంలో శక్తి కోసం కోరిన అల్పాహారాన్ని మా గురువులు అందిస్తున్నారని విద్యార్థులు ఆనందంగా తెలిపారు.

స్పందిస్తున్నారిలా..

★ విస్సన్నపేట మండలంలోని నాలుగు జడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన 190 మంది విద్యార్థులకు కూడా సాయంత్రం అల్పాహారంగా అందించేందుకు 3 క్వింటాళ్ల మంచి శనగలను ప్రవాసాంధ్రుడు వల్లభనేని గిరిబాబు వితరణగా అందించారు.

★ తిరువూరు బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వితరణతో ప్రతి రోజు సాయంత్రం అల్పాహారం అందిస్తున్నట్లు హెచ్ఎం పి.సత్యనారాయణ రాజు తెలిపారు.

★ ఏటా తుది పరీక్షలకు సిద్ధమవుతున్న పది విద్యార్థులకు సాయంత్రం అలసట లేకుండా ప్రత్యేక తరగతిలో చదువుకునేందుకు జడ్పీ నుంచి నిధులు మంజూరు చేసి గోధుమ రవ్వ ఉప్మా, మంచి శనగల గుగ్గిళ్లు ఇచ్చేవారు. ఈ ఏడాది జడ్పీ నుంచి నిధులు మంజూరు లేదు. దీంతో దాతలు, ఉపాధ్యాయులు స్పందించిన పాఠశాలల్లో పిల్లలకు ప్రస్తుతం సాయంత్రం అల్పాహారం అందుతోంది. మిగిలిన బడుల్లో విద్యార్థులకు ఆకలితోనే పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

పాత చట్టం కొనసాగించాలని వినతి



రామచంద్రాపురంలో సచివాలయ ఉద్యోగులకు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు

ఎ.కొండూరు: కేంద్రం ప్రభుత్వం ఉపాధి హామీ పథకంపై అమలు చేయనున్న కొత్త చట్టాన్ని రద్దు చేసి పాత చట్టాన్ని కొనసాగించాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం చీమలపాడు, రామచంద్రాపురం గ్రామ సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. 2025లో అమలు చేసిన ఉపాధి చట్టం ద్వారా కూలీలకు పనులు, ఆర్థిక చేయూత లభించిందని, 2025 చట్టం ద్వారా రాష్ట్రాలకు ఉపాధి నిధులు కోత విధించి అభివృద్ధి కుంటుపడేలా కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. లక్ష్మయ్య, చెన్నయ్య, శేషగిరి పాల్గొన్నారు.

ప్రసవాలకు ప్రభుత్వ ఆసుపత్రులే మేలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుహాసిని, వేదికపై అధికారులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు కాన్పులకు ప్రభుత్వ వైద్యశాలలో చేరేలా వారి కుటుంబాలకు ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి ఎం.సుహాసిని ఆదేశించారు. ప్రసవాలకు కార్పొరేట్ వైద్యం వద్దు..ప్రభుత్వ వైద్యమే ముద్దు నినాదంతో ప్రతి గర్భిణిని కలిసి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసుకునేందుకు కల్పిస్తున్న వైద్య సదుపాయాలపై ప్రచారం చేయాలన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, అంగన్‌వాడీ ఉద్యోగులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేందుకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో గర్భిణుల వివరాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేస్తున్నారని, అదేవిధంగా ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేసుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో సాధారణ కాన్పులు చేయడం లేదని, అదే ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ కాన్పులకు వైద్యులు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఎ.కొండూరు పీహెచ్‌సీలో గతంలో పదుల సంఖ్యలో కాన్పులు చేసేవారని, ఇప్పుడా పరిస్థితి కన్పించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రిలో కాన్పు చేయాలంటే రూ.లక్ష వరకు ఖర్చు చేయాలని, అదే ప్రభుత్వాసుపత్రిలో పైసా ఖర్చు లేకుండా ప్రసవాలు చేస్తున్నారనే విషయాన్ని గర్భిణులకు, వారి కుటుంబ సభ్యులు వివరించాలన్నారు. గర్భిణుల విషయంలో ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో జె.ఇందుమతిదేవి, డీఐవో శరత్‌బాబు, ఎంపీడీవో శ్రీనివాసరావు, వైద్యులు స్వాతి, దివ్య పాల్గొన్నారు.

పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ధ్రువపత్రాలతో చిన్నారులు

మైలవరం, న్యూస్‌టుడే: అప్పా డెమొక్రటిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి స్పెల్‌బీ పోటీల్లో స్థానిక వివేకానంద హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించడంతో పాటు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం మైలవరంలో నిర్వహించిన పోటీల్లో 15 పాఠశాలల నుంచి 700 మంది వరకు విద్యార్థులు పాల్గొనగా, జిల్లాస్థాయి పోటీలకు 55 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వారిలో తమ పాఠశాల విద్యార్థులు 19 మంది, 20 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఎం.వి.శ్రీనివాసరావు, పి.రాజారెడ్డి తెలిపారు.

మైలవరం, న్యూస్‌టుడే: అప్పా డెమొక్రటిక్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వివేకానంద హైస్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి స్పెల్ బీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎల్‌కేజీ నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన పోటీల్లో 55 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు అప్పా డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి సురేష్ తెలిపారు. విజేతలకు కుమార్ స్కూల్ అధినేత కుమార్, తివిధ స్కూల్ అధినేత శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు బహుమతులు అందజేశారు.

ప్రమాదాలు జరుగుతాయ్.. పూడ్చండి సారు



స్థానిక పంచాయతీలోని 1 వార్డులో నిరుపయోగంగా ఉన్న బావిని పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు. ఏళ్లతరబడి ఈ బావిలో నీటిని స్థానికులు వాడకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో బావి చుట్టూ చెట్లు పెరిగాయి. వర్షాకాలం నీరు బావిలోకి చేరుతుంది. దానిపై పెరిగిన గడ్డిని తినేందుకు మూగజీవాలు అటుగా వెళ్తే అందులో పడుతాయని పశుపోషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ బావిని పూడ్చించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

తెదేపా.. వైకాపా నేతల నిరసన



సీఐ చంద్రశేఖర్‌తో మాట్లాడుతున్న తెదేపా నాయకులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: జోగి ఇంటిపై దాడి కేసులో తెదేపాకు చెందిన 11 మంది వద్ద ఇబ్రహీంపట్నం పోలీసులు సోమవారం వివరాలు సేకరించారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటిపై దాడి ఘటనలో ప్రాథమిక ఆధారాలను సేకరించిన పోలీసులు తెదేపాకు చెందిన 43 మందిపై, వైకాపాకు చెందిన 13 మందిపై ఈ కేసులు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో దాడిలో ఆనవాలుగా గుర్తించిన కొందరు తెదేపా కార్యకర్తలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకొన్న విజయవాడ నుంచి వచ్చిన తెదేపా నాయకులు స్టేషన్‌కు చేరుకొని తమ కార్యకర్తలపై కేసులు నమోదు చేయడం అన్యాయమని స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు.

అవన్నీ ఆరోపణలే: జోగి రమేష్ చేస్తున్న ఆరోపణలన్నీ అబద్ధాలేనని తెదేపా నాయకులు చెప్పారు. ఇబ్రహీంపట్నం స్టేషన్ ముందుకు చేరుకొన్న విజయవాడ, భవానీపురానికి చెందిన తెదేపా నాయకులు మాట్లాడుతూ.. జోగి ఇంటిపై రాళ్లు వేయడం, పెట్రోలు సీసాలు విసిరేయడం అంతా జోగి పథక రచనలో భాగమేనని పేర్కొన్నారు. తమ నాయకుల దిష్టిబొమ్మలు దహనం చేసిన నేపథ్యంలో నిరసన ప్రదర్శన చేశామన్నారు. ఆ సందర్భంగా జోగి ఇంట్లో ఉన్న వారే మంటలు వచ్చేలా చేశారని పేర్కొన్నారు. నిరసన తెలుపుతూ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగానే ఆ ఇంట్లోనే వైకాపా వారు మీడియా సమావేశాన్ని నిర్వహించారు. అంటే ద్వితీయ శ్రేణి నాయకులందరూ ఆ ఇంట్లోనే ఉన్నారని పేర్కొన్నారు. మంటలు వ్యాపించడం, అద్దాలు పగలకొట్టడం వారి ఆధ్వర్యంలోనే జరిగించారన్నారు. కానీ తెదేపాపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమ కార్యకర్తలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సీఐకి వినతి పత్రం: జోగి ఇంటిపై దాడి ఘటనకు సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని వైకాపా నాయకులు పేర్కొన్నారు. ఆయనకు సంబంధించిన పెన్‌డ్రైవ్‌ను సీఐకి స్థానిక స్టేషన్‌లో సోమవారం అందజేశారు. దాడి జరిగిన సందర్భంలో జోగి, మోహనరావు ఇంట్లోనే ఉన్నారని తెలిపారు. ఆయనను కాపాడుకొనే క్రమంలో తామంతా ఓ గదిలోకి వెళ్లి ఉన్నామని చెప్పారు. దాడి చేసింది కాకుండా తమపై ఆరోపణలు చేయడం విచారకరమని పేర్కొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో లాభాలు

తిరువూరు, విస్సన్నపేట: సేంద్రియ వ్యవసాయంతో లాభాలు సాధించవచ్చని వ్యవసాయ అధికారి టిప్పుసుల్తాన్ రైతులకు అవగాహన కల్పించారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం మట్టి నమూనా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఆయన రైతుల పొలాల నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..మట్టి సారాన్ని పరీక్షించడం ద్వారా పంటలకు అవసరమైన పోషకాలు, సేంద్రియ పదార్థాల స్థాయిన తెలుసుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించడం వల్ల భూసారం పెరిగి, దిగుబడులు పెరుగుతాయని సూచించారు. మట్టి పరీక్షల ప్రాముఖ్యత, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని సాగుచేయాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగానికి చెందిన బి.శ్రీనివాసరావు, సిహెచ్.రాణి, రవి కుమార్, ఆర్ ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



గుంటుపల్లి రైజ్ కేంద్రం వద్ద కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు రైజ్ సెంటరులో ఏర్పాటు చేసిన మౌలిక వనరులను సద్వినియోగం చేసుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టరు లక్ష్మీశ సూచించారు. గుంటుపల్లిలో ఏర్పాటు చేసిన రూరల్ ఇంక్యుబేషన్ స్కిల్లింగ్ అండ్ ఆంత్రప్రెన్యూర్ షిప్ (రైజ్) కేంద్రాన్ని ఆయన ఇబ్రహీంపట్నానికి చెందిన స్వయం సహాయక సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త సంకల్పాన్ని నెరవేర్చేందుకు రైజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రంలో మహిళలకు స్కిల్ డెవలప్మెంట్, మార్కెటింగ్, ఫైనాన్స్, సోషల్‌మీడియా ప్లాట్ఫామ్ వినియోగం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తామన్నారు. మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని గుర్తించి ప్రోత్సహించేందుకు ఇక్కడ అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రంలో ఇంటర్నెట్, కంప్యూటర్ల సౌకర్యం కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు, ఏబీపీ బ్లాక్ కోఆర్డినేటరు శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ ప్రత్యేకాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా రథోత్సవం



స్వామివారి ఊరేగింపు

మైలవరం : ద్వారకాతిరుమల దత్తత దేవస్థానమైన స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన కల్యాణోత్సవం అనంతరం సోమవారం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కోలాట ప్రదర్శన, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

కనులపండువగా అమ్మవారి కల్యాణం



క్రతువు నిర్వహిస్తున్న పండితులు

రెడ్డిగూడెం: స్థానిక పంచాయతీ పరిధి రాఘవాపురం గ్రామంలోని పద్దమ్మతల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి శ్రీసత్తిరెడ్డిసమేత పద్దమ్మతల్లి అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రెడ్డిగూడెం, రాఘవాపురం, కొత్తరెడ్డిగూడెం, రంగాపురం గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్ని అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కమిటీ నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించారు.

ఉమాగౌరీ శంకరా శరణు



కొత్తపల్లిలో ప్రత్యేక అలంకరణ

గంపలగూడెం, న్యూస్‌టుడే: మండలంలోని కొత్తపల్లి, పెనుగొలను, మేడూరు, నెమలి, గోసవీడు, గంపలగూడెం గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం శివలింగాలకు అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో పసుపు కొట్టే ఉత్సవం



కంభంపాడు (ఎ.కొండూరు): మండలంలోని కంభంపాడు గంగా, విజయదుర్గ నాగమల్లేశ్వరస్వామి గుడిలో శివరాత్రి వేడుకలకు సోమవారం శ్రీకారం చుట్టారు. శివరాత్రి సందర్భంగా పక్షం రోజుల్లో విజయదుర్గాంబ, నాగమల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవానికి ఆలయాన్ని ముస్తాబు చేసేందుకు తొలిగా మహిళలు పసుపు ఉత్సవం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు పసుపు కొమ్ములు రోటిలో వేసి రోకలితో దంచి భక్తిశ్రద్ధలో వేడుకలను ప్రారంభించారు.

ఘనంగా పూజలు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీ వేంకటాచలస్వామి తిరునాళ్లు.. స్వామివారి కల్యాణ మహోత్సవంతో, వేద పండితుల మంత్రోచ్చారణలు, మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

మార్కెట్ విలువకే నష్టపరిహారం చెల్లించండి



నినాదాలు చేస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని కంచికచర్ల, వీరులపాడు, మైలవరం, జి.కొండూరు మండలాల్లో అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)కు భూసేకరణ చేస్తున్న నేపథ్యంలో బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని, రోడ్డు వెడల్పు తగ్గించాలని ఆయా ప్రాంతాల రైతులు, భూ యజమానులు, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియాలకు సోమవారం వినతి పత్రాలు సమర్పించారు. భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఓఆర్ఆర్ తొలుత 140 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించారని చెప్పారు. తాజాగా 250కు విస్తరించారని, బఫర్ జోన్‌లో ఇది 500 మీటర్ల వరకు ఉంటుందనే ఊహాగానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై అధ్యయనం చేసి వెడల్పు కుదించాలని కోరారు. ప్రస్తుతం అక్కడి భూములు ప్రభుత్వ విలువ కంటే అధికంగా ఉన్నట్లు వివరించారు. ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించాలని విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యేల ద్వారా అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ ఎంపీకి కూడా తెలియజేయనున్నట్టు పేర్కొన్నారు. సన్న, చిన్న కారు రైతులు ఎన్నో కష్టాలుపడి సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారని, తగు న్యాయం చేయాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల వీరాంజనేయులు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, రైతులు నన్నపనేని భాస్కరరావు, మల్లెల సుబ్బారావు, బుడ్డి వీర ప్రసాద్, గంగిరెడ్డి రంగారావు, కె.ఎస్.ఎస్.ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకే బూతు రాజకీయాలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి దేవినేని

గొల్లపూడి, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంలో బయటపడుతున్న నిజాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే అంబటి రాంబాబు, జోగిరమేష్‌లు బూతుల రాజకీయాలకు తెరలేపారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. సోమవారం గొల్లపూడిలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జగన్, వైవీ సుబ్బారెడ్డి కనుసన్నల్లో బూతు పురాణం మొదలుపెట్టారని పేర్కొన్నారు. జోగి రమేష్ పిచ్చి ప్రేలాపనలతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మహిళలను కించపరుస్తూ చేసిన దుర్మార్గమైన మాటల వల్లే వైకాపా 11 సీట్లకే పరిమితమైందన్నారు. కల్తీ మద్యం వ్యవహారంలో జోగిరమేష్, జనార్దనరావు మధ్య రూ.కోట్లు చేతులు మారాయన్నారు. తిరుపతి, మైలవరంలో జోగి రమేష్ చేసిన వ్యాఖ్యల్లో ఎక్కడా పశ్చాతాపం కనిపించడం లేదన్నారు.

'అసత్య ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోండి'

కొండపల్లి, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులను కించపరిచేలా మాట్లాడిన పురపాలిక సంఘ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. ఇద్దరు మహిళా కార్మికులను ప్రస్తావిస్తూ పురపాలిక ఉద్యోగి ఒకరు బయట వ్యక్తితో చరవాణిలో కొన్ని రోజుల కిందట మాట్లాడారు. ఆ చరవాణి సంభాషణ సామాజిక మాధ్యమాల్లో సోమవారం హల్‌చల్ చేసింది. దీనిపై ఆగ్రహం చెందిన పారిశుద్ధ్య కార్మికులు ఇబ్రహీంపట్నం స్టేషన్‌లో సదరు ఉద్యోగిపై పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడంతో పాటు కించపరిచినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంలో జరిగిన వివాదంలో ఓ పారిశుద్ధ్య కార్మికురాలు అక్కడ ఉన్న ఓ వ్యక్తిపై తిరగబడింది. వెంటనే స్పందించిన పోలీసులు వారిని వారించి సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకుంటామని చెప్పి వారిని పంపించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

మూడేళ్లుగా పైప్‌లైన్ లీకేజీ

పదే పదే కలెక్టరేట్‌లో వినతులు



ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లిలో సర్వే నంబరు 8/2 కింద 4.52 ఎకరాల మెట్ట వ్యవసాయ భూమికి తారకరామ ఎత్తిపోతల పైపులైన్ లీకేజీ వల్ల ఇబ్బందిగా మారింది. పంటలు వేసుకోవడానికి వీలు పడడం లేదు. ఈ విషయమై ఆ గ్రామానికి చెందిన రైతు అలిగినేని శ్రీపద్మ మూడేళ్ల నుంచి కలెక్టరేట్‌లో రాతపూర్వక ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. అయినా ఫలితం లేకుండా పోయిందని కలెక్టర్ జి.లక్ష్మీశకు సోమవారం మరోమారు విన్నవించారు. ఖరీఫ్ అయ్యాక లీకేజీ సమస్యను సరి చేస్తామని అధికారులు చెప్పారని, నేటికీ పరిష్కరించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

సర్వం సమస్యల పర్వం

సాంకేతిక ఇబ్బందులతో నెమ్మదిస్తున్న కుటుంబ సర్వే



గుంటుపల్లిలో సర్వే పరిశీలిస్తున్న ఇబ్రహీంపట్నం ఎంపీడీవో శకుంతల

ఇబ్రహీంపట్నం గ్రామీణం, గుంటుపల్లి, న్యూస్‌టుడే

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏకీకృత కుటుంబ సర్వే మైలవరం నియోజకవర్గంలో నెమ్మదిగా కొనసాగుతోంది. గత వైకాపా ప్రభుత్వం నిర్వహించిన హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో తప్పిదాల వల్ల పలువురు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకోలేకపోతున్నారు. ప్రతి కుటుంబంలో అర్హుల వివరాలు తెలిసేలా కూటమి ప్రభుత్వం ఈ సర్వేను సచివాలయ సిబ్బందితో చేయిస్తోంది. దీని వల్ల అర్హుల వివరాలు తెలిసి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు దక్కే వీలుంటుంది.

నియోజకవర్గంలో ఇలా	
సచివాలయాలు:	69
సర్వే చేయాల్సిన ఇళ్లు :	99,315
పూర్తయింది :	72 శాతం

నమోదులో జాప్యం: ప్రారంభంలో జనవరి 12 నాటికి సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. యాప్‌నకు సంబంధించి కొన్ని ఇబ్బందులు రావడంతో ఫిబ్రవరి 10వ తేదీ వరకు పొడిగించారు. గ్రామాల్లో జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తే అప్పటికి కూడా పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదని ఎక్కడికక్కడే సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నట్లు సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది పేర్కొంటున్నారు. ఒక్కో ఇంటికి వెళ్లి 20 రకాల సమాచారం సేకరించాలి. కుటుంబ ఐడీ, సభ్యుల జాబితా, ఈ కేవైసీ, ఓటరు ఐడీ, రేషన్ కార్డు, ఆదాయ వివరాలు, సామాజిక వర్గం తదితర వివరాలు ప్రతి ఒక్కటీ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా ఒక ఇంట్లోని సభ్యుల సంఖ్యను బట్టి కనీసం 30 నిముషాల నుంచి 50 నిముషాల వరకు పడుతోందంటున్నారు. అన్ని వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేశాక సాంకేతిక కారణాలతో యాప్ పనిచేయకపోతే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి ఉంటుంది. దీంతో సర్వే నెమ్మదిగా సాగుతోందంటున్నారు. సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీవోలు, మండల సచివాలయాల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

(c) eenadu

గోదావరి పుష్కరాలకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్

ఈనాడు, అమరావతి: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాల కోసం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ద్వారా అందించే సేవలపై పురపాలక అనుబంధ విభాగాల మధ్య సమన్వయం కోసం రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్‌కు వైస్‌ఛైర్మన్ పురపాలకశాఖ కమిషనర్ పి.సంపత్‌కుమార్, కన్వీనర్‌గా పురపాలకశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.రవీంద్రబాబు వ్యవహరించనున్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అదనపు డైరెక్టర్ జీజీఎస్ వరప్రసాద్, ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీ ఎంఎస్ స్వామి నాయుడు, ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ (టెక్నికల్) ఎ.సుధాకర్, మెప్మా అదనపు డైరెక్టర్ కేవీ వెంకటేశ్వరరావు, స్వచ్ఛాంధ్ర సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డి.దశరథరామిరెడ్డి, ఏపీ టిడ్కో డిప్యూటీ డైరెక్టర్ హరిప్రసాద్, ఏపీయూఎఫ్ఐడీసీ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాస్ లక్ష్మీనారాయణ సభ్యులుగా ఉంటారు.

గీతం వర్సిటీకి భూమిని క్రమబద్ధీకరించకుండా అడ్డుకోండి

హైకోర్టులో వ్యాజ్యం

ఈనాడు, అమరావతి: విశాఖలోని గీతం విశ్వవిద్యాలయానికి నిబంధనలకు విరుద్ధంగా 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించబోతున్నారని, ఈ ప్రక్రియను అడ్డుకుని ఆక్రమణలు తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ న్యాయవాది నక్కా నిమ్మిగ్రేస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. రుషికొండ, ఎండాడ గ్రామాల పరిధిలో ఉన్న ఈ భూములు రస్తా, కొండ, పోరంబోకు, కాలువ భూములుగా రికార్డుల్లో ఉన్నాయన్నారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, విశాఖ జిల్లా కలెక్టర్, విశాఖ గ్రామీణ మండల తహసీల్దార్, గీతం వర్సిటీ అధ్యక్షుడు శ్రీభరత్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా పేర్కొన్నారు. మంగళవారం ఈ వ్యాజ్యంపై హైకోర్టు విచారణ జరపనుంది.



ఇతరులను అర్థం చేసుకోవడం కీలకం

ఇతరులను అర్థం చేసుకోవడమనేది ఏ రంగంలోనైనా అత్యంత కీలకం. మొదటగా మీరు ఎంచుకున్న రంగంలో రాణించడానికి కావలసిన సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలి. తర్వాత కీలక వ్యక్తులను ఒప్పించడం, ఇతరులతో కలిసి పనిచేయడం, నమ్మకాన్ని కలిగించడం వంటి వాటిపై పట్టు సాధించాలి. విజయం అనేది ఇతరులతో మీరు ఏర్పరుచుకునే సంబంధాలపై, తోటివారిని ఒప్పించగలిగే సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది.

– మైఖేల్ స్ట్రాంగ్, కంటెంట్ క్రియేటర్

గిరిజన విద్యార్థుల్లో ప్రమాదకర సికిల్‌సెల్ ఎనీమియా

- 373 మందిలో వ్యాధి నిర్ధారణ
- మరో 810 మంది క్యారియర్లుగా ఉన్నట్లు గుర్తింపు
- కొనసాగుతున్న స్క్రీనింగ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రానికి చెందిన ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన విద్యార్థుల్లో ప్రమాదకర సికిల్‌సెల్ ఎనీమియా బయటపడుతోంది. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 'ఎలిమినేషన్ ఆఫ్ సికిల్‌సెల్ ఎనీమియా మిషన్' స్క్రీనింగ్‌లో ఈ విషయం వెలుగు చూసింది. ఇప్పటివరకు 373 మంది విద్యార్థుల్లో ఈ వ్యాధి ఉన్నట్లు తేలింది. మరో 810 మంది సికిల్‌సెల్ ఎనీమియా క్యారియర్లుగా ఉన్నట్లు బయటపడింది. కేంద్రం 2023 జులై నుంచి 0-40 ఏళ్ల వయసు మధ్య ఉన్న వారికి స్క్రీనింగ్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. ఈ వ్యాధి ఉన్న వారిని గుర్తించి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టింది.


70 వేల మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పూర్తి...

రాష్ట్రవ్యాప్తంగా 548 గిరిజన ఆశ్రమ పాఠశాలలు, ప్రీమెట్రిక్, పోస్టు మెట్రిక్ వసతి గృహాలున్నాయి. ఇందులో 305 ఏజెన్సీ ప్రాంతంలో మిగతావి మైదాన ప్రాంతంలో ఉన్నాయి. మొత్తంగా 1,25,560 మంది విద్యార్థులున్నారు. వీరిలో ఇప్పటివరకు 70,278 మంది విద్యార్థులకు స్క్రీనింగ్ పూర్తయింది. మిగతా వారికి కొనసాగుతోంది. సికిల్‌సెల్ ఎనీమియా రెండు రకాలుగా ఉంటుంది. పుట్టుకతోనే ఇది తల్లిదండ్రుల నుంచి సంక్రమిస్తుంది. ఈ జబ్బు ఉన్న వారు కొందరయితే..., తనలో ఈ వ్యాధి ఉందని తెలియని(క్యారియర్లుగా) వారూ ఉంటారు. ఇలాంటి పిల్లలకు ఎక్కువగా శారీరక శ్రమ ఉండకూడదు. తీవ్రమైన ఆటలు కూడా ఆడరాదు. ఈ విషయం తెలియక ఆ విద్యార్థులు ఆటల్లో పాల్గొని ఒక్కొక్కి గురై చనిపోతున్న సందర్భాలు చాలానే ఉన్నాయి.

ఎయిమ్స్ వైద్య బృందం ద్వారా అధ్యయనం...

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆశ్రమ పాఠశాలల్లో చనిపోతున్న విద్యార్థుల్లో ఎక్కువగా ఆస్తమాతో కూడిన, న్యూరో సంబంధిత సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, మూత్రపిండాల వైఫల్యం తదితర కారణాలను అధికారులు గుర్తించారు. ఈ సమస్యలు వారిలో ఉన్నట్లు సకాలంలో గుర్తించకపోవడం, చికిత్స అందించడంలో జాప్యం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని వైద్య వర్గాలు విశ్లేషిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో ఈ సమస్యలు ఉత్పన్నం కావడానికి మూల కారణాలు, ఇతర అంశాలను శాస్త్రీయంగా నిర్ధారించడానికి మంగళగిరి ఎయిమ్స్ వైద్య బృందంతో అధ్యయనం చేయించాలని గిరిజన సంక్షేమశాఖ అధికారులు నిర్ణయించారు. తొలుత పైలట్‌గా అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో అధ్యయనం చేయాలని ఎయిమ్స్‌కు లేఖ రాశారు.

విజ్ఞానాన్ని పెంచుకుందాం!



అవయవాల చిత్రాలతో ఏర్పాటు చేసిన ప్రవేశ ద్వారాలు.. ఆహ్వానం పలుకుతున్నట్లు ఉన్న అస్థిపంజరాలు... ఇలా ఎన్నో ప్రత్యేకతలతో గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో రాష్ట్రస్థాయి మెడికల్ ఎగ్జిబిషన్ ట్రయల్ రన్ సోమవారం ప్రారంభమైంది. ఈ నెల 4న వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. 35 విభాగాలకు సంబంధించి 350 ఎగ్జిబిట్లు ప్రదర్శనకు సిద్ధమయ్యాయి. వైద్య విజ్ఞానాన్ని అందరికీ అందించేందుకు ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు జీఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి 'ఈనాడు'కు తెలిపారు. –ఈనాడు, అమరావతి

ఉద్యోగం నుంచి తొలగించడం పెద్ద శిక్ష

- ఏకపక్షంగా తొలగింపు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధం
- విద్యాశాఖ అధికారుల అప్పీలును కొట్టేసిన హైకోర్టు ధర్మాసనం

ఈనాడు, అమరావతి: ఉద్యోగిని సర్వీసు నుంచి తొలగించడం పెద్ద శిక్ష అని, ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగింపు సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని హైకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పింది. అలాంటి తొలగింపు చట్టం ముందు చెల్లవని స్పష్టంచేసింది. ఓ కళాశాలలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు, వాచ్‌మన్‌ను ఉద్యోగాల నుంచి తొలగిస్తూ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ 2005 ఫిబ్రవరి 7న జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి 2023 డిసెంబరులో ఇచ్చిన తీర్పును సమర్థించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాలు చేస్తూ విద్యాశాఖ అధికారులు 2024లో దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మలతో కూడిన ధర్మాసనం ఇటీవల ఈమేరకు తీర్పు ఇచ్చింది. ★ పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడపలోని ఏకేఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్లుగా పనిచేస్తున్న కేవీఆర్ శ్రీనివాస్, జె.శ్రీనివాసాచార్యులు, వాచ్‌మన్ నాగరాజులను ఉద్యోగం నుంచి తొలగిస్తూ 2005 ఫిబ్రవరి 7న ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ వారు అదే ఏడాది హైకోర్టులో వ్యాజ్యం వేశారు. జీతభత్యాలు చెల్లించకపోవడంతో గతంలో న్యాయపోరాటం చేశామని దీంతో కక్షసాధింపుగా నోటీసు ఇవ్వకుండా తమను ఉద్యోగాల నుంచి తొలగించారన్నారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. ఉద్యోగాల నుంచి తొలగింపును తప్పుపడుతూ 2023 డిసెంబరు 14న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పును సవాలుచేస్తూ 2024లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు దాఖలుచేసిన అప్పీల్‌పై ఇటీవల ధర్మాసనం విచారణ జరిపింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరిస్తూ అప్పీల్‌ను కొట్టేసింది.

ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి

బాలికతో అసభ్యకర ప్రవర్తన.. ఆగ్రహించిన గ్రామస్థులు

బద్వేలు, పోరుమామిళ్ల, న్యూస్‌టుడే: వైఎస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల మండలం కొండుగారిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రధానోపాధ్యాయుడు వెంకట సుబ్బారెడ్డికి గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. పాఠశాలలో మొత్తం 25 మంది విద్యార్థులుండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. సోమవారం ఒక ఉపాధ్యాయుడు రాలేదు. విధుల్లో ఉన్న ప్రధానోపాధ్యాయుడు మద్యం మత్తులో మూడో తరగతి విద్యార్థినితో అసభ్యకరంగా వ్యవహరించారు. సదరు బాలిక ఏడుస్తూ వెళ్లి, జరిగిన ఘటనను తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పాఠశాల వద్దకు చేరుకుని ఆయన్ను నిలదీశారు. దీన్ని జీర్ణించుకోలేని ప్రధానోపాధ్యాయుడు వారిపై తిరగబడి.. మహిళపై దాడి చేశారు. అక్కడున్న గ్రామస్థులకు ఈ విషయం తెలిసి, వారు వచ్చి దేహశుద్ధి చేశారు. దీన్ని కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరలైంది. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

ధర ఎక్కువ చెప్పిన సంస్థకే పట్టం

- ముంబయి సంస్థకే ఉచిత పాఠ్యపుస్తకాల టెండరు
- రాష్ట్ర సంస్థ తక్కువ కోట్ చేసినా దక్కని పని
- మంత్రి లోకేశ్‌కు ప్రింటర్స్ అసోసియేషన్ లేఖ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలకు సంబంధించిన టెండర్లలో జీఎస్టీతో కలిపి అధిక ధరకు కోట్ చేసిన ముంబయి సంస్థకు ప్రింటింగ్ బాధ్యతలు అప్పగించారని మంత్రి నారా లోకేశ్‌కు ఏపీ రాష్ట్ర ఆఫ్‌సెట్ ప్రింటర్స్ అసోసియేషన్ లేఖ రాసింది. ఏపీకి చెందిన ఓం శ్రీసాయి భవాని ప్రింటర్స్ జీఎస్టీతో కలిపి ఒక్కో పేజీకి 6.993 పైసలుగా కోట్ చేయగా.. ముంబయికి చెందిన సాఫ్రాన్ స్పెషాలిటీ పేపర్స్ సంస్థ ఒక్కో పేజీకి జీఎస్టీతో కలిపి 7.08 పైసలకు కోట్ చేసింది. కానీ, బేసిక్ ధరను ప్రామాణికంగా తీసుకొని ఆ సంస్థకు టెండర్ అప్పగించారని పేర్కొంది. బేసిక్ ధర ఓం శ్రీసాయి భవాని 6.66 పైసలు కోట్ చేయగా.. ముంబయి సంస్థ 6 పైసలు కోట్ చేసిందని తెలిపింది. జీఎస్టీతో కలిపి పరిగణనలోకి తీసుకోకుండా కేవలం బేస్ రేటునే ఆధారం చేసుకుని ముంబయి సంస్థను ఎల్1గా పాఠశాల విద్యాశాఖ ప్రకటించిందని పేర్కొంది. ఈ విధానం స్థానిక ప్రింటర్లకు అన్యాయం చేయడమే కాకుండా టెండర్ ప్రక్రియలో పారదర్శకతపై సందేహాలను కలిగిస్తోందని వెల్లడించింది. రాష్ట్రంలోని ముద్రణ పరిశ్రమకు న్యాయం చేయాలని మంత్రిని కోరింది. అవసరమైతే ప్రస్తుత టెండర్‌ను రద్దు చేసి, తగినచర్యలు తీసుకోవాలని విన్నవించింది. 2014 నుంచి 2019 వరకు స్థానిక ప్రింటర్లకు అవకాశాలు కల్పించారని, గత వైకాపా ప్రభుత్వంలో ఈ టెండర్లను జాతీయ స్థాయికి మార్చారని తెలిపింది. దీంతో ఏపీలోని ముద్రణ యూనిట్లు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని పేర్కొంది. ఇతర రాష్ట్రాల్లో పుస్తకాల ముద్రణను ఆయా స్థానిక ప్రింటర్లకే అప్పగిస్తున్నారని తెలిపింది.

వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు అధిక బిల్లుల నుంచి ఊరట

- గతంలో చెల్లించిన అధిక మొత్తం భవిష్యత్‌లో సర్దుబాటు

ఈనాడు, అమరావతి: వాణిజ్య కనెక్షన్ల ఎల్‌టీ విద్యుత్ వినియోగదారులకు అధికంగా వస్తున్న బిల్లులపై రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కీలక నిర్ణయం తీసుకుంది. బిల్లుల పెరుగుదలకు కారణమైన కిలోవోల్ట్ యాంపియర్ రియాక్టివ్ అవర్ (కేవీఏఆర్‌హెచ్) ఫీచర్‌ను వెంటనే బ్లాక్ చేయాలని డిస్కంలను ఆదేశించింది. ఇప్పటికే వసూలు చేసిన అదనపు బిల్లుల మొత్తాన్ని సంబంధిత వినియోగదారులకు తర్వాత జారీ చేసే బిల్లుల్లో సర్దుబాటు చేయాలని సూచించింది. గతంలో వైకాపా ప్రభుత్వం పరిశ్రమలు, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లకు కేవీహెచ్ విధానంలో బిల్లులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ విధానంలో పవర్ ఫ్యాక్టర్ నిర్వహణ కోసం వినియోగదారులు సొంతంగా కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. వాటి వినియోగంపై వినియోగదారులకు అవగాహన కల్పించకపోవడంతో.. కిలో వాట్ (కేడబ్ల్యూ)తో పోలిస్తే.. కిలో వోల్ట్ యాంపియర్ (కేవీహెచ్) వినియోగం ఎక్కువగా నమోదయ్యేది. కేవీహెచ్ వినియోగం ఆధారంగానే డిస్కంలు బిల్లులు ఇచ్చేవి. దీంతో వినియోగదారులకు బిల్లుల మోత మోగేది. అధిక బిల్లుల నుంచి వారికి ఊరట కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ★ వైకాపా ప్రభుత్వం నిర్ణయం మేరకు పరిశ్రమలు, వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు 2019-20 ఆర్థిక సంవత్సరం కేవీహెచ్ విధానంలో బిల్లింగ్ చేయాలని కమిషన్ డిస్కంలకు సూచించింది. ఇందు కోసం స్మార్ట్ మీటర్లలో అధిక లీడింగ్ రియాక్టివ్ ఎనర్జీ (కేవీఏఆర్‌హెచ్) ఫీచర్‌ను అన్‌బ్లాక్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు డిస్కంలు అన్‌బ్లాక్ చేశాయి. ★ పవర్ ఫ్యాక్టర్ నిర్వహణకు వినియోగదారులు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి వచ్చింది. అయితే, వాటి నిర్వహణపై అవగాహన లేకపోవడంతో రాత్రివేళల్లో కొందరు స్విచ్ ఆపేవారు కాదు. కెపాసిటర్లు రియాక్టివ్ పవర్‌ను వినియోగించుకోవడంతో బిల్లులు పెరిగిపోయేవి. ★ అధిక బిల్లుల వ్యవహారంపై వినియోగదారులు.. డిస్కంల నుంచి అందిన వినతులను పరిగణనలోకి తీసుకుని కమిషన్ పరిశీలించగా, సాధారణ మీటర్లతో పోలిస్తే.. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాత బిల్లులు పెరగడానికి కెపాసిటర్లు రియాక్టివ్ పవర్‌ను వినియోగించుకోవడమే కారణమని గుర్తించింది. దీంతో కేవీఏఆర్‌హెచ్ ఫీచర్‌ను మళ్లీ బ్లాక్ చేయాలని కమిషన్ డిస్కంలకు ఉత్తర్వులు ఇచ్చింది.

ఉపాధి హామీ ఊపిరి తీసేందుకే జీరామ్‌జీ

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

నార్పల, బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం ఊపిరి తీయడానికి కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కుట్ర చేస్తోందని, అందులో భాగంగానే జీరామ్‌జీ పథకాన్ని తీసుకొచ్చిందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు. సోమవారం ఆమె అనంతపురం జిల్లా నార్పల మండలం బండ్లపల్లిలో ఉపాధి హామీ పరిరక్షణ యాత్రను ప్రారంభించారు. తర్వాత రచ్చబండలో గ్రామస్థులతో షర్మిల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 125 రోజుల పనిదినాలు అంటూనే రాష్ట్రంపై 40 శాతం భారం మోపుతోందని మండిపడ్డారు.



బండ్లపల్లి సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

ఉద్యోగుల ఐక్యతకు ఏపీ ఐకాస మహాసభ నిదర్శనం కావాలి




సమావేశంలో ఏపీ ఐకాస అమరావతి ఛైర్మన్ బొప్పరాజు, పలిశెట్టి, ఫణిపేర్రాజు, కనపర్తి, లక్ష్మి, విజయలక్ష్మి తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఈ నెల 5వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏపీ ఐకాస అమరావతి ఆవిర్భావ మహాసభ నిర్వహించనున్నట్టు ఐకాస ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇది ఉద్యోగుల ఐక్యతకు నిదర్శనం కావాలని పిలుపునిచ్చారు. ప్రతి మూడేళ్లకోసారి మహాసభలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని 28 జిల్లాలకు చెందిన అన్ని శాఖల ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి ఐక్యత చాటాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఏపీ రెవెన్యూ భవన్‌లో సోమవారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. సభలో 21 మందితో కూడిన నూతన కమిటీని ప్రకటిస్తామని చెప్పారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఉద్యోగులకు ప్రత్యేక క్యాజువల్ లీవ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, మహాసభను విజయవంతం చేయాలని కోరారు. మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లను ఆహ్వానించినట్టు తెలిపారు. 12వ పీఆర్సీ, ఐఆర్, పెండింగ్ డీఏలు, బకాయిలు తదితర సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం త్వరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఐకాస సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ వ్యతిరేక సభ కాదన్నారు. ఉద్యోగుల సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందని చెప్పారు. 5న ఉదయం 9 గంటలకు ర్యాలీతో మహాసభకు శ్రీకారం చుడతామన్నారు. మహిళా విభాగ ఛైర్‌పర్సన్ పారే లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

పింక్ దుస్తుల్లో హాజరు: ఏపీ ఐకాస మహిళా ఉద్యోగుల విభాగ సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి మాట్లాడుతూ.. మహాసభకు మహిళా ఉద్యోగులు పింక్ రంగు దుస్తులు ధరించి హాజరుకానున్నట్టు తెలిపారు. ఐకాస సహాధ్యక్షుడు ఫణిపేర్రాజు, కోశాధికారి కనపర్తి సంగీతరావు, ప్రచార కార్యదర్శి తిమ్మసర్తి నాగేశ్వరరావు, మహిళా విభాగ కోశాధికారిణి వి.ఎస్. సాయిలక్ష్మి, ఐకాస నాయకులు బి.లోవకుమార్, బత్తుల కిశోర్‌కుమార్, ఎస్.మల్లేశ్వరరావు, కోన ఆంజనేయకుమార్ (చంటి), వేల్పుల అర్లయ్య, ఆర్.శ్రీనివాసరావు, ఈదులమూడి మధుబాబు, గరికపాటి బ్రహ్మయ్య, మందపాటి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'బడ్జెట్‌లో సంక్షేమ పథకాల ఊసేదీ?'



ప్రసంగిస్తున్న రాఘవులు

రాఘవయ్యపార్క్ కూడలి(కృష్ణలంక), న్యూస్‌టుడే : కేంద్ర బడ్జెట్ మోసపూరితంగా ఉందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశాలు పురస్కరించుకుని విజయవాడ ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రజా వ్యతిరేక చట్టాల రద్దు చేయాలని కోరుతూ మార్చి 9 నుంచి 20వ తేదీ వరకూ దేశ వ్యాప్త ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్చి 24న 'చలో దిల్లీ' నిర్వహిస్తామన్నారు. బడ్జెట్‌లో నిధులకు కోతపెట్టడంతో పాటు సంక్షేమ పథకాలు విస్మరించారని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగా ముందుకు పోతున్నట్లు చెప్పిన గొప్పలు.. బడ్జెట్లో కనిపించడం లేదన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గత ఏడాది రూ.5వేల కోట్లకు పైగా కేటాయించారని, ప్రస్తుతం రూ.3,320కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. అమరావతికి గత బడ్జెట్ నుంచి నిధులు కేటాయిస్తే.. ఈసారి అప్పులు ఇస్తున్నట్లు చూపించి మోసపూరితంగా వ్యవహరించారని దుయ్యబట్టారు. ఉపాధి హామీ చట్టం అమలు కోసం రూ.95 వేల కోట్లు కేటాయించారని, అవి ఖర్చు చేయాలంటే రాష్ట్రాలు 40శాతం ఖర్చు భరించాల్సి ఉందన్నారు. రాష్ట్రాలు ఖర్చు చేయకపోతే ఆ నిధుల్లో కోతపెడతారని చెప్పారు. సీఎం చంద్రబాబు.. దూరదృష్టి కలిగిన బడ్జెట్ అనడం రాష్ట్ర ప్రజలను మోసగించడమేనన్నారు. కేంద్రంలో కీలక పాత్ర పోషిస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రభావంతో నిధులు రాబట్టాల్సిందిగా సూచించారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు సహజమైనప్పటికీ.. భౌతికదాడులు సరికాదన్నారు. వైకాపా నాయకుడు అంబటి రాంబాబు అసభ్యంగా మాట్లాడడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అదేవిధంగా ఆయన ఇంటిపై జరిగిన దాడి తీవ్రమైన విషయంగా పేర్కొన్నారు. రెండు పార్టీలు దాడుల సంస్కృతిని, అసభ్యంగా మాట్లాడడాన్ని విరమించుకోవాలని హితవుపలికారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం అధ్యక్షత వహించారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు యు.వాసుకి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుతో దేశ ఆర్థిక పరిపుష్టి



బెలూన్లు ఎగరవేసి సంరక్షణ క్షమతా మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, తివారి

విద్యాధరపురం, న్యూస్‌టుడే : ఇంధన పొదుపుతో దేశ పరిపుష్టి సాధ్యమవుతుందని హెచ్‌పీసీఎల్ జనరల్ మేనేజరు, చమురు పరిశ్రమ ఏపీ సమన్వయకర్త భాస్కర్ రెడ్డి అన్నారు. భారత ప్రభుత్వ పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇంధన పొదుపు ఆవశ్యకతపై తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'సంరక్షణ క్షమత మహోత్సవం-2026'ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపుపై వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. విద్యార్థులు, సంస్థ ప్రతినిధులతో సమన్వయకర్త ప్రతిజ్ఞ చేయించారు. బెలూన్లు ఎగరవేశారు. భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 15 రోజుల పాటు రాష్ట్రంలోని వినియోగదారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆటో, కారు ర్యాలీ, గృహిణులకు గ్యాస్ వినియోగంపై చిట్కాలు, పాఠశాల, కళాశాల విద్యార్థులకు పెట్రోలియం ఉత్పత్తులపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎల్పీజీ విజయవాడ టెరిటరీ మేనేజరు వేణుగోపాల్ మాట్లాడుతూ పర్యావరణ, ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచడానికి క్లీన్ అండ్ గ్రీన్ ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాలని సూచించారు. గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా డీజీఎం తివారి మాట్లాడుతూ వాహన సంఖ్య పెరుగుదల కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల వినియోగం భారీగా పెరుగుతుందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో కొంతమేర ఇంధన పొదుపు సాధ్యమవుతుందన్నారు. హెచ్‌పీసీఎల్ విజయవాడ రీజనల్ ఆఫీసు సేల్స్ మేనేజరు మురళీకృష్ణ, ఎల్‌పీజీ డీజీఎం పంకజ్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసులో సెంథిల్‌పై పీటీ వారెంట్

ఈనెల 12లోగా కోర్టులో హాజరుపరచాలని ఉత్తర్వులు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం వ్యవహారంలో సీసాలు సరఫరా చేసిన సెంథిల్ (ఏ22)కు ఎక్సైజ్ కోర్టు సోమవారం పీటీ వారెంట్ జారీ చేసింది. ములకలచెరువు కేసులో అక్కడి ఎక్సైజ్ పోలీసులు నిందితుడిని గత నెలలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి మదనపల్లి కారాగారంలో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం కేసులోనూ సెంథిల్ నిందితుడు. ఈనేపథ్యంలో అతడిని పీటీ వారెంట్‌పై విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి పీటీ వారెంట్ జారీ చేశారు. ఈనెల 12లోగా నిందితుడిని హాజరుపరచాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐదుగురు నిందితులకు బెయిల్: ఈ కేసులో ఇంకా రిమాండ్‌లో ఉన్న ఐదుగురికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. నిందితులు సయ్యద్ హాజీ (ఏ5), కట్టా రాజు (ఏ6), మిథున్ దాస్ (ఏ9), అంతదాస్ (ఏ10), షేక్ అల్లాబక్ష్ (ఏ16)లకు బెయిల్ ఇస్తూ సోమవారం సాయంత్రం విజయవాడలో ఎక్సైజ్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఒక్కొక్కటి రూ.20 వేలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని ఉత్తర్వుల్లో న్యాయాధికారి ఆదేశించారు.

ఐసీఏఐ విజయవాడ శాఖకు గుర్తింపు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ)కు చెందిన విజయవాడ శాఖకు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కడమే కాకుండా.. విద్యార్థి విభాగమైన సికాసా కూడా 'ఫస్ట్ బెస్ట్ అవార్డు' అందుకుందని విజయవాడ శాఖ ఛైర్మన్ కంచమరెడ్డి నారాయణ తెలిపారు. స్థానిక ఐసీఏఐ భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అన్ని ఐసీఏఐ శాఖల పనితీరును సమగ్రంగా పరిశీలించి ఏటా ఈ అవార్డులు ప్రదానం చేస్తారని తెలిపారు. సామాజిక సేవ, సీఏ విద్యార్థుల నైపుణ్యాల పెంపునకు ఇచ్చే శిక్షణ, సభ్యులకు అందించే వృత్తిపరమైన శిక్షణ ఆధారంగా ఈ గుర్తింపు లభిస్తుందని తెలిపారు. 55 ఏళ్ల చరిత్ర కలిగిన విజయవాడ శాఖకు, సికాసాకు కలిపి తొలిసారిగా ఒకేసారి అవార్డులు రావడం గర్వకారణమని తెలిపారు. ఆదివారం న్యూదిల్లీలో జరిగిన వరల్డ్ ఫోరమ్ ఆఫ్ అకౌంటెంట్స్ కార్యక్రమంలో అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. విజయవాడ శాఖ వైస్ ఛైర్మన్ ఉప్పులూరి జయంత్, కార్యదర్శి మనీష్ కుమార్ జైన్, కోశాధికారి వీరపవన్, సికాసా విజయవాడ శాఖ ఛైర్మన్ వినీలా తదితరులు పాల్గొన్నారు.



న్యూదిల్లీలో అవార్డు అందుకుంటున్న ఐసీఏఐ విజయవాడ శాఖ సభ్యులు

సౌత్ జోన్ ఆర్చరీ శిక్షకుల కార్యశాల ప్రారంభం




మాట్లాడుతున్న రజిత్ చమేలీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ, రాష్ట్ర ఆర్చరీ సంఘాల ఆధ్వర్యంలో 'ఓజీక్యూ' (ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్) సహకారంతో ఈ నెల 4వ తేదీ వరకు జరిగే సౌత్ జోన్ ఆర్చరీ శిక్షకుల కార్యశాలను సోమవారం రాష్ట్ర ఆర్చరీ సంఘం ఛైర్మన్ చెరుకూరి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బెవర వెంకట రమణ, ఉమ్మడి కృష్ణా జిల్లా ఆర్చరీ సంఘం కోశాధికారి గొట్టిపాటి ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. దక్షిణ భారత దేశంలోని రాష్ట్రాల నుంచి 44 మంది శిక్షకులు పాల్గొన్నారు. జాతీయ ఆర్చరీ సంఘం నుంచి ప్రొఫెసర్ రజిత్ చమేలీ, చంద్రకాంత్ ఇలాగ్, పి.రవిశంకర్ వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. మధ్యాహ్నం వరకు కార్యశాల, మధ్యాహ్నం నుంచి రాత్రి 7 గంటల వరకు చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో ప్రాక్టికల్ జరిగాయి.

పీజీ మెడికల్ ఇన్ సర్వీస్ కేటగిరీ సీట్లకు ఆప్షన్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: నీట్ పీజీ కటాఫ్ మార్కులు తగ్గించిన తర్వాత 2025-26 విద్యా సంవత్సరానికి పీజీ మెడికల్ డిగ్రీ/డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి గాను ఇన్ సర్వీస్ కేటగిరీ మూడో విడత కౌన్సెలింగ్‌కు ఆప్షన్లు ఇచ్చుకోవాలని విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం సూచించింది. అభ్యర్థులు ఈ నెల 3వ తేదీ ఉదయం 11 నుంచి 5వ తేదీ రాత్రి 11 గంటల్లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపింది. ఇప్పటికే 538 మంది అభ్యర్థులతో తుది ప్రాధాన్య క్రమాన్ని విశ్వవిద్యాలయం విడుదల చేసింది. వైకల్య విభాగంలో 25 మంది అర్హత కలిగి ఉన్నారని పేర్కొంది.

నైపుణ్యాల వెలికితీతకు మూడు నెలలకోసారి పోటీలు



క్రీడాకారులతో శాప్ ఛైర్మన్ రవినాయుడు, హరిబాబు, కృష్ణ, రవితేజ తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రతి మూడు నెలలకోసారి క్రీడాకారులకు పోటీలు నిర్వహించి, వారిలో నైపుణ్యాన్ని వెలికితీయాలని శాప్ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.భరణి సూచించారు. గత ఏడాది డిసెంబరు 8 నుంచి 13వ తేదీ వరకు దక్షిణాఫ్రికాలో జరిగిన మోడ్రన్ పెంటాథ్లాన్ ప్రపంచ కప్‌లో రాష్ట్రం నుంచి భారత జట్టుకు ఆడి పతకాలు సాధించిన అథ్లెట్లతో కలిసి రాష్ట్ర మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం అధ్యక్షుడు కోటపాటి హరిబాబు, సాంకేతిక సంచాలకుడు కె.కృష్ణ, శిక్షకులు జి.సాంబశివరావు, జి.రవితేజ సోమవారం శాప్ కార్యాలయంలో ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ భరణిలను కలిశారు. పతకాలు సాధించిన క్రీడాకారులను వారు అభినందించారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. పురుషుల అండర్-21 కేటగిరీలో డి.వెంకటేష్ బయాథ్లె టీమ్ విభాగంలో రజతం, మిక్స్‌డ్ రిలేలో కాంస్యం, వి.వెంకట నాగసాయి, ఎంఎస్ఎస్ జశ్విన్ నాయుడు అండర్-15 కేటగిరీలో బయాథ్లె టీమ్ విభాగంలో కాంస్యం సొంతం చేసుకున్నారు.

ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాల్సిందే



స్మార్ట్ మీటర్లు.. మాకు ఉరితాళ్లు అంటూ వినూత్న నిరసన

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : విద్యుత్తు మీటర్ రీడర్లకు సంస్థలోనే ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ సోమవారం వినూత్న రీతితో మీటర్ రీడర్లు నిరసన చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం 'చలో విజయవాడ' కార్యక్రమంలో భాగంగా ధర్నా చౌక్‌లో ధర్నా చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.బాలకాశి, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడారు. రాష్ట్రంలో 4వేల మందికిపైగా ఉన్న మీటర్ రీడర్లు పదేళ్లుగా అరకొర వేతనాలతో పని చేస్తున్నారని చెప్పారు. స్మార్ట్‌మీటర్లు రావడంతో రోడ్డునపడ్డారన్నారు. రాబోయే రోజుల్లో స్మార్ట్ మీటర్లు బిగించడం పూర్తయితే.. పూర్తిగా ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ.. మీటర్ రీడర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. నిరసనకారులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. రాత్రి వరకు ఆందోళనలు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు కొండబాబు, కె.ఆంజనేయులు, వెంకటసుబ్బయ్య, కె.బ్రహ్మానాథరెడ్డి, హజరత్‌వలీ, ఎల్.రామకృష్ణ, కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కృత్రిమ గుండెను తయారు చేస్తున్నాం



- వీపునకు తగిలించుకునే డయాలసిస్ పరికరాన్ని తెస్తున్నాం
- హైదరాబాద్‌లో రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్ తయారీ ప్లాంట్ నెలకొల్పాం
- మన రాకెట్లకు క్రయోజనిక్ ఇంజిన్ల భాగాలను అందించాం
- అంతరిక్షం నుంచి ఆరోగ్య రంగం వరకు దేశాన్ని సాంకేతికత ఎగుమతిదారుగా మార్చాలన్నదే లక్ష్యం
- మూడు దశాబ్దాల మా కృషిని దేశం గుర్తించడం ఆనందంగా ఉంది
- 'ఈనాడు-ఈటీవీ'తో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎన్ఎఫ్‌టీడీసీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్యన్

మల్లేపల్లి రమేశ్‌రెడ్డి
ఈనాడు, హైదరాబాద్

"ప్రసిద్ధ శాస్త్రవేత్త, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నా గురువు. ఆయనతో కలిసి రెండు దశాబ్దాలపాటు పనిచేసే అదృష్టం దక్కింది. మా ఎన్ఎఫ్‌టీడీసీకి 15 ఏళ్లు ఛైర్మన్‌గా వ్యవహరించిన కలాం... నాకు రెండు ముఖ్యమైన సలహాలు ఇచ్చారు. మొదటిది... నువ్వు చేస్తున్న పని/సంస్థ లేకపోతే సమాజానికి ఒక లోటు అనే స్థాయిలో శ్రమించాలి. రెండోది... ప్రభుత్వ నిధులపైనే ఆధారపడకూడదు. నీ సాంకేతికతను ఎవరైనా డబ్బులిచ్చి కొనేలా ఉండాలి. ఈ రెండు సలహాలే నాకు తారకమంత్రం" అంటూ ఎన్ఎఫ్‌టీడీసీ డైరెక్టర్ డాక్టర్ బాలసుబ్రమణ్యన్ వినమ్రంగా వెల్లడించారు. గురువు చేసిన ఉపదేశంతో నిశ్శబ్దంగా, నిర్విరామంగా పనిచేస్తూ... అంతర్జాతీయ ఫ్యూజన్ రియాక్టర్ మాడ్యుల్స్ నుంచి అధునాతన యుద్ధ విమానాల సాంకేతికత వరకు భారత్‌ను పవర్ హౌస్‌గా మార్చిన డాక్టర్ బాలతో 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖి నిర్వహించింది. ఆ వివరాలు...

"భారతదేశం విదేశాల సాంకేతికతను వాడుకోవడం కాకుండా సొంతంగా ఆవిష్కరణలు చేస్తూ సాంకేతిక ఎగుమతిదారుగా మారాలన్నది నా ఆశయం. సైన్స్ అంటే కొత్త జ్ఞానాన్ని సృష్టించడం. సాంకేతికత అంటే ఆ జ్ఞానాన్ని క్రోడీకరించి ఒక పరిష్కారాన్ని చూపడం. 1990లో మా సంస్థను ప్రారంభించినప్పుడే ఇదొక సాధారణ ప్రయోగశాలగా కాకుండా 'టెక్నాలజీ సెంటర్'గా ఎదగాలని సంకల్పించా. కలాం స్ఫూర్తితో ఆ దిశగా అంతర్జాతీయ స్థాయి సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దా" అని సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో పద్మశ్రీ పురస్కారం పొందిన హైదరాబాద్ కంచన్‌బాగ్‌లోని నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్(ఎన్ఎఫ్‌టీడీసీ) డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి బాలసుబ్రమణ్యన్ అన్నారు. ఈ దిశగానే ఆయన మూడు దశాబ్దాలుగా క్రమశిక్షణతో పరిశ్రమిస్తున్నారు. ఎన్నో రంగాల్లో మనదేశం స్వయం సమృద్ధిని సాధించే సాంకేతికతల రూపకల్పనలో కీలక భూమిక పోషించారు. పద్మశ్రీ అవార్డు వచ్చిన నేపథ్యంలో ఆయనను 'ఈనాడు-ఈటీవీ' పలకరించింది.

? ఇతర పరిశోధన సంస్థలకు, ఎన్ఎఫ్‌టీడీసీకి మధ్య ప్రధాన తేడా ఏమిటి?

సాధారణంగా విశ్వవిద్యాలయాలు, ప్రయోగశాలల్లో టెక్నాలజీపై పరిశోధనలు... అంటే ప్రయోగాలు మాత్రమే చేస్తారు. ఇక్కడ మేం ఒక ప్రయోగాన్ని పూర్తిస్థాయి ఉత్పత్తిగా మార్చి, దాన్ని మార్కెట్లోకి తీసుకెళ్లే దశ వరకు అభివృద్ధి చేస్తాం. అవసరాలు, ఆవిష్కరణల మధ్య సాంకేతికత అంతరాన్ని గుర్తించి.. దానిపైనే మిషన్ మోడల్‌లో పనిచేస్తాం. మన దేశానికి వ్యూహాత్మక అవసరాలు చాలావరకు తక్కువ సంఖ్యలోనే కావాలి. కానీ, అవి అత్యంత విలువైనవి, క్లిష్టమైనవి. సాధారణ పరిశోధనశాలలు ఈ పని చేయవు. లాభాలు ఉండవని పెద్ద పరిశ్రమలూ ఆసక్తి చూపవు. మేం సరిగ్గా ఈ అంతరాన్నే భర్తీ చేస్తాం.

? మీరు పనిచేస్తున్న రంగంలో సాధించిన విజయాలు...

మేం హై టెక్నాలజీ రంగంలో 30 ఏళ్లుగా పనిచేస్తున్నాం. విమానాలు, అంతరిక్ష నౌకలు, బయో మెడికల్ ఇంప్లాంట్స్, ఎనర్జీ డివైజెస్, ఫ్యూజన్ రియాక్టర్లలో మెటీరియల్స్ పాత్ర కీలకం. విదేశాలపై ఆధారపడకుండా మనదేశంలోనే వీటి తయారీపై దృష్టి పెట్టి విజయం సాధించాం. ఇస్రో చేపట్టిన చంద్రయాన్... చేపట్టనున్న గగన్‌యాన్, మానవ సహిత అంతరిక్ష యాత్రల కోసం అత్యంత కీలకమైన క్రయోజెనిక్ ఇంజిన్ల భాగాలను అభివృద్ధి చేసి అందించాం. మా సంస్థ కృషితో 6,000 డిగ్రీల వేడిని, విపరీతమైన చలిని తట్టుకోగల ప్రత్యేక లోహ మిశ్రమాల తయారీ ప్రక్రియలో భారత్ స్వయం సమృద్ధిని సాధించింది.

✦ విద్యుత్ వాహనాలు, మొబైల్ ఫోన్లు, రక్షణ పరికరాల్లో వాడే శక్తిమంతమైన 'రేర్ ఎర్త్ మ్యాగ్నెట్స్' తయారీలో చైనా గుత్తాధిపత్యాన్ని అడ్డుకుంటూ స్వదేశీ సాంకేతికతతో ఏటా 500 టన్నుల ఉత్పత్తి సామర్థ్యమున్న ప్లాంట్‌ను ప్రైవేటు సంస్థతో కలిసి హైదరాబాద్‌లోనే ఏర్పాటుచేశాం.

? వైద్య రంగంలో మీరు తీసుకొచ్చిన కృత్రిమ అవయవాల గురించి వివరిస్తారా?

అంతరిక్ష పరికరాల కోసం వాడే మెటీరియల్స్‌ను వైద్యరంగం వైపు మళ్లించాం. క్యాన్సర్‌తో ఎముకలు కోల్పోయే వారి కోసం టైటానియం, కోబాల్ట్, పాలిమర్లతో చేసిన ఇంప్లాంట్స్‌ను తయారు చేశాం. విదేశాల్లో రూ.15-20 లక్షలయ్యే చికిత్సను రూ.2 లక్షలకే అందుబాటులోకి తెచ్చాం. బాధితులు నాలుగు రోజుల్లోనే ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతారు.

✦ మోకీళ్ల మార్పిడి చికిత్సను సామాన్యుడికి అందుబాటులోకి తెస్తూ... 'అడ్వాన్స్‌డ్ టోటల్ నీ ప్రోస్థెసిస్'ని రూపొందించాం. క్లినికల్ ట్రయల్స్ విజయవంతంగా జరుగుతున్నాయి.

? కొత్తగా ఏయే ప్రాజెక్టులపై పరిశోధన చేస్తున్నారు?

✦ గుండె మార్పిడి కోసం వేచి చూస్తున్న రోగుల కోసం కృత్రిమ గుండె తయారీపై పని చేస్తున్నాం. ఇది స్టాండ్‌బైలా పనిచేస్తుంది. దాత దొరికే వరకు ప్రాణాలను కాపాడుతుంది.

✦ ప్రస్తుతం డయాలసిస్ అంటే రోగి ఆసుపత్రికి వెళ్లాల్సిందే. ఆరేడు గంటలు ఉండాల్సిందే. రోగి తన పనులు తాను చేసుకుంటూ వీపునకు ఒక చిన్న సంచి లాంటి పరికరం తగిలించుకుని రక్తాన్ని శుద్ధి చేసుకునే మోడల్‌పై పనిచేస్తున్నాం. ఇది కిడ్నీ వ్యాధిగ్రస్తుల జీవనశైలిని మార్చేస్తుంది.

✦ రక్తంలోని విషతుల్యాలను మాత్రమే వడకట్టే సాంకేతికతపై పనిచేస్తున్నాం. మందులు వేసుకుంటే ఇతర కణాలపై ప్రభావం చూపుతాయి. కానీ మేం అభివృద్ధి చేస్తున్న పద్ధతిలో నానో టెక్నాలజీ ద్వారా రక్తంలోని విషతుల్యాలను మాత్రమే తొలగించొచ్చు.

✦ లిథియం, టైటానియం, నికెల్, కోబాల్ట్, టంగ్‌స్టన్ వంటి క్రిటికల్ మెటీరియల్స్ కోసం ప్రత్యేక పైలట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

? విద్యుత్ వాహనాల(ఈవీ) రంగానికి సంబంధించి జరుగుతున్న పరిశోధనలు ఏమిటి? 100% ఈవీల వైపు మళ్లడంపై మీ అభిప్రాయం...

ఈవీ రంగంలో అత్యంత కీలకమైన లిథియంను మనం ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నాం. అయితే, వాడేసిన బ్యాటరీలు, సముద్రపు నీటి నుంచి లిథియంను వేరుచేసేందుకు మేం 'లిథియం ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్'ను నిర్మించాం. భవిష్యత్తు అవసరాల కోసం 'సాలిడ్ స్టేట్ లిథియం-సల్ఫర్ బ్యాటరీల'ను కూడా అభివృద్ధి చేస్తున్నాం.

✦ మనం 100% ఈవీలకు వెళ్లడం కంటే హైబ్రిడ్ వాహనాలపై దృష్టి పెట్టాలి. పెట్రోల్ కోసం గల్ఫ్ దేశాలపై ఎలా ఆధారపడుతున్నామో... పూర్తిగా ఈవీలైతే ముడి పదార్థాల కోసం చైనాపై ఆధారపడాల్సి వస్తుంది. కాబట్టి చిన్న బ్యాటరీలు, సమర్థమైన ఇంజిన్‌ను కలిపి వాడటమే మనకు శ్రేయస్కరం.

కలాం పిలుపుతో తిరిగొచ్చి... అద్భుతాల ఆవిష్కరణ

దేశంలో చిన్న వయసులోనే విశిష్ట శాస్త్రవేత్త హోదా అందుకున్న డాక్టర్ కృష్ణమూర్తి బాలసుబ్రమణ్యన్ స్వస్థలం తమిళనాడు. 1982లో ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి మెటలర్జికల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ చదివారు. కెనడాలో మాస్టర్స్, అక్కడే పీహెచ్‌డీ చేసి.. పరిశోధన, బోధన రంగంలో కొనసాగారు. అబ్దుల్ కలాం పిలుపుతో 1990లో భారత్ తిరిగి వచ్చాక ఎన్ఎఫ్‌టీడీసీ స్థాపనలో కీలక భూమిక పోషించి... దాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దారు. ప్రభుత్వమిచ్చే నిధులపై కాకుండా ఆర్థిక స్వయం ప్రతిపత్తి కల్గిన సంస్థగా తీర్చిదిద్దారు. 25 ఏళ్లుగా దానికి డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ఒక సంస్థకు ఇంతకాలం డైరెక్టర్‌గా ఉండటం చాలా అరుదు. జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో వంద వరకు పరిశోధనపత్రాలు ప్రచురితమయ్యాయి. ఏడు పేటెంట్లు పొందారు.

రోడ్డు ప్రమాదంలో తలలకు గాయాలై.. ముగ్గురు యువకుల దుర్మరణం

- హెల్మెట్ ధరించడంతో క్షేమంగా బయటపడ్డ మరొకరు
- ఎదురెదురుగా ఢీకొన్న రెండు ద్విచక్రవాహనాలు



సత్యకల్యాణ్, అక్షయ్ కుమార్



లక్ష్మీనారాయణ

ఈనాడు, రాజమహేంద్రవరం; న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం, చాగల్లు: రహదారి నిబంధనలు పాటించడంలో చూపే చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర నష్టం చేస్తున్నదనడానికి ఈ ప్రమాదమే ఒక ఉదాహరణ. రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో హెల్మెట్లు ధరించని ముగ్గురి తలలకు తీవ్రగాయాలై ఘటనాస్థలిలోనే ప్రాణాలు కోల్పోయారు. హెల్మెట్ ధరించిన యువకుడు స్వల్పగాయాలతో బయటపడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రోడ్డు రైలు వంతెనపై సోమవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొవ్వూరుకు చెందిన పోతుగుంట అక్షయ్ కుమార్(20), తగరపు సత్యకల్యాణ్(20), కొమిరి ఏడుకొండలు రాజమహేంద్రవరానికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. అదే సమయంలో రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ ప్రాంతానికి చెందిన చెందిన ఆనాపు లక్ష్మీనారాయణ(28) స్కూటీపై కొవ్వూరు వైపు వెళ్తున్నారు. మరో వాహనాన్ని అధిగమించే క్రమంలో ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొనడంతో అక్షయ్, సత్యకల్యాణ్, లక్ష్మీనారాయణ తలలపై బలమైన గాయాలు తగిలి ఘటనాస్థలంలోనే మృతి చెందారు. హెల్మెట్ ధరించి ఉన్న ఏడుకొండలు స్వల్పగాయాలతో బయటపడి కొవ్వూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అక్షయ్‌కుమార్, సత్యకల్యాణ్ చిన్నప్పటి నుంచి మంచి స్నేహితులని స్థానికులు తెలిపారు. ప్రమాదం కారణంగా రోడ్డు రైలు వంతెనపై దాదాపు గంటన్నర పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. కొవ్వూరు, రాజమహేంద్రవరం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాలను తరలించి, ట్రాఫిక్‌ను చక్కదిద్దారు.

రోడ్డు ప్రమాద బాధితులను కాపాడితే.. రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం

- రహ్-వీర్ పథకం కింద చెల్లింపు
- రవాణాశాఖ కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా

ఈనాడు, అమరావతి: రోడ్డు ప్రమాద బాధితులను తొలి గంటలో (గోల్డెన్ అవర్‌లో) ఆసుపత్రికి తరలించి, ప్రాణాపాయం నుంచి కాపాడిన వారికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించేలా కేంద్ర రవాణా, హైవేల మంత్రిత్వశాఖ (మోర్త్) రహ్-వీర్ పథకాన్ని అమలు చేస్తోందని రవాణా కమిషనర్ మనీష్‌కుమార్ సిన్హా తెలిపారు. దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు, వాటిలో ప్రాణాలు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతుండటంతో. . ఈ బాధితులను కాపాడేలా సామాన్య ప్రజలను ప్రోత్సహించేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. తీవ్రమైన రోడ్డు ప్రమాదంలో బాధితుడిని తక్షణం ఆసుపత్రికి తరలించి, వైద్యం అందేలాచేసి ప్రాణాలు కాపాడే వారికి రహ్-వీర్ పథకం వర్తిస్తుందని తెలిపారు. వారికి రూ.25 వేల చొప్పున ఆర్థికసాయంతోపాటు, ప్రశంసాపత్రం అందిస్తామని చెప్పారు. జాతీయస్థాయిలో కూడా ఏటా పది మంది రహ్-వీర్‌లను ఎంపిక చేసి, వారికి రూ.లక్ష చొప్పున ఆర్థికసాయం, సర్టిఫికేట్, ట్రోఫీ అందిస్తారని తెలిపారు. ప్రమాద బాధితులను ఆసుపత్రికి తరలించి, ప్రాణాలు కాపాడినప్పుడు పోలీసులు లేదా ఆసుపత్రి వైద్యులు ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ఇస్తారని, కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ప్రతినెలా సమావేశమై, ఆయా ప్రతిపాదనలను పరిశీలించి రహ్-వీర్ పథకానికి అర్హులను ఎంపికచేసి, రాష్ట్ర కమిటీకి పంపుతుందని, అక్కడ ఖరారు చేస్తారని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నేరుగా వారి ఖాతాలో ప్రోత్సాహక మొత్తాన్ని జమచేస్తామని వెల్లడించారు.

బహుళ అంతస్తుల నిర్మాణానికి 5 రోజుల్లో అనుమతులు!

- కమిషనర్ల నుంచి పట్టణ ప్రణాళిక డైరెక్టర్‌కు నేరుగా దరఖాస్తులు
- క్షేత్రస్థాయిలో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట

ఈనాడు, అమరావతి: బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు (హైరైజ్ బిల్డింగ్) అనుమతుల్లో జాప్యానికి ప్రభుత్వం చెక్ పెడుతోంది. 12 అంతస్తులు, అంతకంటే (టీడీఆర్ బాండ్లతో వేసే అంతస్తులతో సహా) ఎక్కువ ఉన్న భవన నిర్మాణాలకు దరఖాస్తులు చేసిన ఐదు రోజుల్లో అనుమతులిచ్చేలా చర్యలు చేపట్టింది. బహుళ అంతస్తుల భవనాలకు నిర్దేశించిన ప్రకారం ఐదు రోజుల్లో నిర్మాణ అనుమతులివ్వాలి. మూడు నెలలైనా అతీగతీ లేకుండా పోతోంది. వార్డు స్థాయిలో ప్లానింగ్ సెక్రటరీల నుంచి పట్టణ ప్రణాళిక అధికారుల వరకు డబ్బులివ్వందే దరఖాస్తులు ముందుకు కదలడం లేదు. లంచాలివ్వకపోతే ఏదో ఒక కొర్రీ పెడుతూ అనుమతుల్లో జాప్యం చేస్తున్నారు. దీంతో ప్రాజెక్టుల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కావడం లేదని కొన్ని సంస్థల ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

అనుమతులు ఇక ఇలా...

✦ బహుళ అంతస్తుల భవన నిర్మాణాలకు 'అభివృద్ధి అనుమతుల నిర్వహణ విధానం' (డీపీఎంఎస్) పోర్టల్‌లో లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ)ల ద్వారా దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలి

✦ సంబంధిత నగరపాలక సంస్థ, పట్టణాభివృద్ధి సంస్థల కమిషనర్లు, వైస్ ఛైర్మన్ల పరిశీలనకు దరఖాస్తులు నేరుగా వెళతాయి. దరఖాస్తులు వారు పరిశీలించాక రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక సెల్‌కి పంపుతారు.

✦ డైరెక్టర్ వీటిని పరిశీలించి ఐదు రోజుల్లో భవన నిర్మాణాలకు అనుమతులివ్వనున్నారు.

✦ ఈ విధానం ద్వారా హైరైజ్ భవన నిర్మాణ అనుమతుల్లో పట్టణ ప్రణాళిక విభాగం క్షేత్రస్థాయి ఉద్యోగులు, అధికారుల జోక్యాన్ని పూర్తిగా కట్టడి చేశారు.

పోర్టల్ నిర్వహణలోనూ లోపాలు సవరించాలి

డీపీఎంఎస్ పోర్టల్ నిర్వహణలోనూ లోపాల కారణంగా భవన నిర్మాణ అనుమతుల కోసం దరఖాస్తులు చేస్తున్న వారిలో అత్యధికులు అవస్థలు పడుతున్నారు. సాఫ్ట్‌వేర్, ఇతర సాంకేతిక సమస్యలతోపాటు అకారణ అభ్యంతరాలతో దరఖాస్తుదారులు.. పోర్టల్ నిర్వహిస్తున్న ప్రైవేట్ సంస్థ సిబ్బంది చుట్టూ పదేపదే తిరగాల్సి వస్తోంది. పత్రాలన్నీ సవ్యంగా ఉన్నా 'షార్ట్ ఫాల్' చూపించడం సర్వసాధారణమైంది. ఇందుకోసం దరఖాస్తుదారులపై మళ్లీ అదనపు భారం పడుతోంది. ఈ విషయాన్ని పురపాలకశాఖ మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా మార్పు లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇద్దరు పశువైద్యులకు సీఎం సింగ్ సమ్మాన్ అవార్డు

ఈనాడు, అమరావతి: పశువైద్యులకు జాతీయస్థాయిలో ఇచ్చే 'డాక్టర్ సీఎం సింగ్ సుశ్రుత గౌరవ్ రత్న సమ్మాన్' అవార్డుకు రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. ఒంగోలు వెటర్నరీ పాలీ క్లినిక్ ఉప సంచాలకుడు డాక్టర్ నల్లపాటి జగత్ శ్రీనివాస్,విశాఖలో సహాయ సంచాలకుడిగా పనిచేస్తున్న డాక్టర్ మాదిన ప్రసాదరావు ఈ అవార్డును దక్కించుకున్నారు. సోమవారం వారిరువురినీ విజయవాడలోని పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయంలో సత్కరించారు.



ఓర్పునకు, నిరీక్షణకు అదే తేడా

ఓర్పుగా ఉండడానికి, నిరీక్షణకు మధ్య చాలా తేడా ఉంది. ఓర్పు అంటే పనిచేస్తూనే ఫలితం కోసం ఎదురుచూడటం. వేచి చూడటం అంటే దేనికోసం యత్నించకుండా పరిస్థితి అదే మారిపోవాలని కోరుకోవడం. కొన్నిసార్లు తగిన సమయం కోసం ఎదురు చూడకుండా ఓపిగ్గా పని చేసుకుంటూ వెళితే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరు.

– శరణ్ శ్రీవత్స, ఆంత్రప్రెన్యూర్

రాష్ట్ర ఆశలకు ఆర్థిక సంఘం గండి

- రెవెన్యూ లోటు గ్రాంట్ మంజూరుకు నో
- కనీసం మూడేళ్లయినా భరించాలని కోరిన ఏపీ
- రాష్ట్రానికి కనీసం రూ.30 వేల కోట్ల నష్టం

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘానికి చెప్పిన లెక్కలు ఇవీ! (అంకెలన్నీ రూ.కోట్లలో) (ప్రభుత్వ అంచనాల ప్రకారం)

అంశం	2026–27	2027–28	2028–29	2029–30	2030–31
కేంద్ర పన్నుల్లో వాటా లేకుండా రెవెన్యూ లోటు	1,29,725	1,33,345	1,37,005	1,42,073	1,43,640
కేంద్ర పన్నుల్లో వాటా అంచనా	63,413	69,854	76,950	84,766	93,376
కేంద్ర ప్రాయోజిత పథకాల గ్రాంట్లు (అంచనా)	22,050	23,153	24,310	25,526	26,802
కేంద్ర పన్నుల్లో వాటాలు, ఇతర గ్రాంట్లు మినహాయించిన తర్వాత రాష్ట్రానికి ఉండే రెవెన్యూ లోటు (అంచనా)	44,262	40,338	35,745	31,782	23,462

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా ఇంకా కోలుకోలేదు. ఈ పరిస్థితుల్లో 16వ ఆర్థిక సంఘం రాష్ట్రానికి రెవెన్యూ లోటు గ్రాంటును మళ్లీ మంజూరు చేస్తుందని ప్రభుత్వం ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆ ఆర్థిక సంఘం ఛైర్మన్, సభ్యులు రాష్ట్రానికి వచ్చినప్పుడల్లా ఇక్కడి పరిస్థితులను స్పష్టంగా వివరించింది. హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల రాష్ట్ర రెవెన్యూ రాబడి ఏ స్థాయిలో పడిపోయిందో, పదేళ్ల తర్వాత కూడా పరిస్థితులు ఎంత దారుణంగా ఉన్నాయో విశ్లేషించి చెప్పింది. అయినా, 16వ ఆర్థిక సంఘం రెవెన్యూ లోటు గ్రాంట్ ఇచ్చేందుకు సిఫార్సు చేయలేదు. కనీసం తొలి మూడు ఆర్థిక సంవత్సరాలైనా రెవెన్యూ లోటు గ్రాంట్ మంజూరు చేయాలని ఏపీ విన్నవించినప్పటికీ, తోసిపుచ్చింది.

2014-15లో కాగ్ పేర్కొన్న రెవెన్యూ లోటు ప్రకారం, ఆ తర్వాత రెండు ఆర్థిక సంఘాల సిఫార్సుల మేరకు మొత్తం 11 ఏళ్ల పాటు కేంద్రం సుమారు రూ.67 వేల కోట్ల మేర రెవెన్యూ లోటు గ్రాంట్ కింద ఏపీకి ఇచ్చింది. సగటున ఏడాదికి రూ.6,000 కోట్ల చొప్పున లెక్కించినా.. ప్రస్తుత ఆర్థిక సంఘం కాలానికి ఐదేళ్లలో రూ.30 వేల కోట్ల వరకు రాష్ట్రం నష్టపోతోంది. రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రాలకు ఆ మొత్తాన్ని భర్తీ చేయాలని ఆర్థిక సంఘం సిఫార్సు చేయకపోవడం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైంది.

అంతంతమాత్రంగా సేవా రంగం

✦ విభజన తర్వాత రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి ఉంది. 2013-14లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర జీడీపీలో వ్యవసాయ రంగం వాటా 24%, పరిశ్రమల వాటా 25%, సేవారంగం వాటా 51%గా ఉండేది. విభజన తర్వాత 2014-15లో ఏపీలో వ్యవసాయ రంగం వాటా 31% కాగా, తెలంగాణలో 16%గా ఉంది. పరిశ్రమల వాటా ఏపీలో 25% ఉంటే, తెలంగాణలో 22%గా ఉంది. సేవా రంగం వాటా ఏపీలో 44% అయితే, తెలంగాణలో 61%గా ఉంది.

✦ 2023-24 నాటి పరిస్థితుల ప్రకారం ఏపీలో వ్యవసాయ రంగం వాటా 34శాతానికి పెరిగింది. తెలంగాణలో 15%గా ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24%కు వచ్చింది. తెలంగాణలో 18%గా ఉంది. అదే కీలకమైన సేవా రంగం వాటా ఏపీలో 42%కి తగ్గగా, తెలంగాణలో 67శాతానికి పెరిగింది. ఆదాయం ఇచ్చే పరిశ్రమలు, సేవారంగం ఏపీలో సరిగా స్థాపితం కాకపోవడంతో రెవెన్యూ రాబడి లేకుండా పోయింది. ఆదాయం సమకూరడం లేదు.

రాజధాని లేకపోవడం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్ రాజధానిగా ఉన్నందున ఇన్‌ఫ్రా, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు వంటివి అక్కడే ఉన్నాయి. వాటి ద్వారా తెలంగాణకు కేవలం హైదరాబాద్ నుంచే 75% సొంత రెవెన్యూ లభిస్తోంది.

అప్పుల భారం పెరిగి..

రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే వనరులు మృగ్యమయ్యాయి. విభజన తర్వాత అప్పులు ఎక్కువగా రావడంతో అసలు, వడ్డీలు కలిపి చెల్లింపుల భారం పెరిగింది. మరోవైపు జగన్ సర్కార్‌లో ఐదేళ్లపాటు ఆర్థిక వ్యవస్థ నిర్వహణ సరిగా లేకపోవడం రాష్ట్రం కోలుకోనంత దెబ్బతిందని ఎన్డీయే ప్రభుత్వం ఆర్థిక సంఘానికి విన్నవించింది.

విభజన తర్వాత రెవెన్యూ లోటు కొంత భర్తీ..

✦ 2014-15 ఆర్థిక సంవత్సరానికి కాగ్ లెక్కల ప్రకారం ఏపీలో రూ.16,078 కోట్ల రెవెన్యూ లోటు ఉంటుందని గుర్తించారు. ఇందులో కేంద్రం 2014-15లో రూ2,303 కోట్లు, 2015-16లో రూ.500 కోట్లు, 2016-17లో రూ.1,176.50 కోట్ల చొప్పున ఇచ్చింది. మూడేళ్లలో కలిపి మొత్తం రూ.3,979 కోట్లు సమకూర్చింది. 2023లో అప్పటి రెవెన్యూ లోటు రూ.10,460.87 కోట్ల మొత్తాన్ని వైకాపా సర్కారు సమయంలో తీసుకున్నారు.

✦ ఇదికాక 15వ ఆర్థిక సంఘం ఏపీకి రెవెన్యూ లోటు రూ.22,113 కోట్లుగా లెక్కించింది. 2015-16 నుంచి ఐదేళ్ల కాలంలో ఆ మొత్తం కేంద్రం సమకూర్చింది.

✦ 2020-21లో కొవిడ్ కారణంగా ఆర్థిక సంఘం తన నివేదిక ఇవ్వలేదు. ఆ ఒక్క ఏడాదికి కేంద్రం రూ.5,897 కోట్లు ఇచ్చింది. 2021-26 మధ్య రూ.30,497 కోట్ల రెవెన్యూ లోటును ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. వైకాపా ప్రభుత్వం తొలి మూడు ఆర్థిక సంవత్సరాల్లోనే ఆ మొత్తం తీసేసుకుంది.

ఆర్టీసీకి 2,500 విద్యుత్, సీఎన్‌జీ బస్సులు

- ఆర్టీసీ ఇన్‌ఛార్జి ఎండీ కృష్ణబాబు

ఈనాడు, అమరావతి: పీఎం ఈ-బస్ పథకం ద్వారా ఏపీఎస్ఆర్టీసీకి 1,050 విద్యుత్ బస్సులు రానున్నాయని, అదనంగా మరో 1,450 విద్యుత్, సీఎన్‌జీ బస్సులు ప్రవేశపెట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని.. మొత్తంగా 2,500 బస్సులు తీసుకుంటామని ఆర్టీసీ ఇన్‌ఛార్జి ఎండీ, రవాణా, ఆర్అండ్‌బీ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు తెలిపారు. ఆయన సోమవారం ఆర్టీసీ హౌస్‌లో ఎండీగా బాధ్యతలు చేపట్టారు. సంస్థ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులకు అందుతున్న సేవలపై ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రభుత్వం అభిప్రాయాలు తీసుకుంటోందని, సీఎం తరచూ వీటిపై సమీక్షిస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ బస్సులు, బస్టాండ్లలో వసతులపై 80%ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేస్తుండగా, మిగిలిన 20% మంది కూడా సంతృప్తి చెందేలా మరుగుదొడ్ల నిర్వహణ, తాగునీటి సౌకర్యం, ఇతర వసతులు పెంచుతామని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని తెలిపారు.

NISM National Institute of Securities Markets
A Capacity Building Initiative of SEBI

Learn Today.. Lead Tomorrow...
Academic programs offered:

Applications Open Now

Residential program
AICTE-approved 2-Year Full-time Program
Post Graduate Diploma in Management (Securities Markets) PGDM(SM)
1-Year Full-time Program
LL.M (Investment & Securities Laws)
Jointly offered by NISM and MNLU Mumbai
1-Year Full-time Program
Post Graduate Program in Investments & Securities Markets
1-Year Full-time Program
Post Graduate Certificate in Securities Markets
Jointly offered by NISM and ICICI Bank

Non-Residential program
1-Year Weekend Program | Online mode
Post Graduate Program in Financial Planning
Jointly offered by NISM and FPSB INDIA
15-Months, Weekend Program (Hybrid Mode)
Post Graduate Program in Securities Market (Portfolio Management/Investment Advisory/Research Analysis)
6-Months Duration | Online Live Classes
Certificate Program in Data Science (Basic)
8-Months Duration | Online Live Classes
Certificate Program in Data Science (Advance)
10-Months | Online Live Classes
Post Graduate Certificate in FinTech
Jointly offered by NISM and NSE Academy



Experiential Learning
Bloomberg Finance Lab | Data Science Lab | Trading Simulation Lab

For more details contact or visit:
+91-82680 02412
www.nism.ac.in/long-term-programs
NISM Campus: Plot No. IS 1 & IS 2, Patalganga Industrial Area, Mohopada, Rasayani, Dist. Raigad, Near Navi Mumbai, Maharashtra – 410222.

(c) eenadu

మాజీ మంత్రి జోగి రమేష్‌పై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించిన మాజీమంత్రి, వైకాపా నేత జోగి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు సోమవారం తెలిపారు. ఆదివారం సాయంత్రం తుమ్మలగుంటలోని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఇంట్లో జోగి రమేష్ మీడియాతో మాట్లాడుతూ కొంతమంది రాజకీయ నాయకుల గురించి చేసిన వ్యాఖ్యలు ప్రజాశాంతికి భంగం కలిగించాయి. కార్యకర్తలను రెచ్చగొట్టేలా ఉన్నాయని పెరుమాళ్లపల్లికి చెందిన ఈశ్వర్‌రెడ్డి ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. రాజకీయ పార్టీల మధ్య వివాదాలు సృష్టించి తిరుపతి నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ప్రపంచ వ్యాప్తంగా చెడ్డపేరు తీసుకురావచ్చని కుట్ర పన్నినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. జోగి రమేష్‌తోపాటు కుట్రదారులపైనా కేసులు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలని చూస్తున్నారు

మాజీ మంత్రి జోగి రమేష్



ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రశ్నించే గొంతుకను నొక్కేయాలన్న దురుద్దేశంతో తన ఇంటిపై దాడికి పాల్పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేశారని మాజీ మంత్రి, వైకాపా నేత జోగి రమేష్ ఆరోపించారు. సోమవారం ఇబ్రహీంపట్నంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్తీ మద్యం అంటూ ఒక తప్పుడు కేసులో నన్ను, నా తమ్ముడిని ఇరికించి 83 రోజులు జైల్లో ఉంచారని అన్నారు. జైలు నుంచి వచ్చిన అనంతరం వారికి మంచి బుద్ధిని ప్రసాదించమని దేవుడిని వేడుకోవడానికి వెళ్తే లోకేశ్ మైండ్ దెబ్బతింది అని మాట్లాడారు. దీంతో మంత్రి లోకేశ్ కనుసన్నల్లో ఎంపీ కేశినేని చిన్ని ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన ఫ్లెడ్ బ్యాచ్‌తో పెట్రోల్ బాంబులతో నా ఇంటిపై దాడి చేయించారని ఆరోపించారు.

అంబటి రాంబాబు బెయిల్ పిటిషన్ దాఖలు

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలకు పాల్పడిన వైకాపా నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తరఫున న్యాయవాదులు గుంటూరు ప్రత్యేక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సోమవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై పోలీసులకు నోటీసు ఇవ్వాలని ఆదేశిస్తూ న్యాయమూర్తి జి.ప్రవంతి విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. చంద్రబాబుపై దూషణ కేసులో అంబటికి న్యాయస్థానం రిమాండ్ విధించిన విషయం విదితమే. అంబటి రాంబాబును రాజమండ్రి కేంద్ర కారాగారానికి పోలీసులు తరలించారు.

నేర ప్రవృత్తికి కులాన్ని అడ్డుపెట్టుకుంటారా?

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

ఈనాడు, దిల్లీ: వైకాపా నాయకులు నేరాలకు పాల్పడి, వాటికి కులాన్ని అడ్డుపెట్టుకొని తప్పించుకోవాలని చూస్తున్నారని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. రాష్ట్రంలో కాపులపై దాడులు జరుగుతున్నాయని వారు చేస్తున్న ఆరోపణలు దయ్యాలు వేదాలు వల్లించడమేనని ధ్వజమెత్తారు. అధికారంలో ఉన్నపుడు కాపులు, బీసీలపై దమనకాండ సాగించిన నాయకులు ఇప్పుడు వారిపై సానుభూతి ఒలకబోసేలా మాట్లాడటం ప్రజలు అంగీకరించరని పేర్కొన్నారు. తెదేపా నేతలు బొండా ఉమా, బుద్ధా వెంకన్నలపై నడిబజారులో హత్యాయత్నం చేసి, వారి వాహనాలు ధ్వంసం చేసింది మరిచిపోయారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడ్డాక కాపు కార్పొరేషన్ పెట్టి, ఆ వర్గాలను ప్రోత్సహిస్తోంది చంద్రబాబేనని పేర్కొన్నారు. ముద్రగడ పద్మనాభరెడ్డిగా పేరుమార్చుకున్న వ్యక్తి కాపుల పేరుతో లేఖరాయడం హాస్యాస్పదంగా ఉందని ఎంపీ కలిశెట్టి విమర్శించారు.

పచ్చని రాష్ట్రంలో చిచ్చుకు వైకాపా కుట్ర



దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతున్న కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, పక్కన ఎంపీలు పురందేశ్వరి, సీఎం రమేశ్

- కూటమి శ్రేణులు వారి ట్రాప్‌లో పడొద్దు
- భాజపా ఎంపీల పిలుపు

కేంద్ర బడ్జెట్ వికసిత ఆంధ్రప్రదేశ్‌కు బాటలు వేస్తుందని కితాబు

ఈనాడు, దిల్లీ: సంక్షేమం, అభివృద్ధి, శాంతిభద్రతల పరంగా సాఫీగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్‌లో అలజడులు సృష్టించి, ప్రశాంత వాతావరణాన్ని చెడగొట్టాలన్న ఉద్దేశంతోనే వైకాపా నాయకులు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని భాజపా ఎంపీలు ఆరోపించారు. వారు వేస్తున్న ట్రాప్‌లో చిక్కుకోకుండా అప్రమత్తంగా ఉండాలని కూటమి పార్టీల శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒనగూరే ప్రయోజనాలను వివరించడానికి సోమవారం కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయనతో పాటు ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, సీఎం రమేశ్, సత్యనారాయణ మాట్లాడారు. ఏపీకి సముచిత ప్రాధాన్యమిచ్చిన ఈ బడ్జెట్.. రాష్ట్రం, దేశ ప్రగతికి బాటలు వేస్తుందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. 'రానున్న ఐదేళ్లలో విశాఖపట్నం అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.5 వేల కోట్లు వస్తాయి. పోలవరం, అమరావతి నిర్మాణాలు వేగంగా సాగడంతో పాటు హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై హైస్పీడ్ రైల్ కారిడార్లతో ఏపీకి పూర్తిస్థాయిలో మేలు కలుగుతుంద'ని వివరించారు. పురందేశ్వరి మాట్లాడుతూ ఈ రెండు హైస్పీడ్ కారిడార్లకు తోడు ఏపీ ప్రభుత్వం చొరవ తీసుకుంటే విశాఖపట్నం-హైదరాబాద్ మధ్య మరో హైస్పీడ్ రైల్ కారిడార్ వీలవుతుందని పేర్కొన్నారు. బడ్జెట్‌లోని చాలా అంశాలు వికసిత్ ఆంధ్రప్రదేశ్‌కు దోహదం చేసేలా ఉన్నాయన్నారు.

జగన్ ఆదేశాలతోనే వైకాపా నేతల వ్యాఖ్యలు

వైకాపా నాయకుల వ్యాఖ్యలపై ఎంపీ పురందేశ్వరి మండిపడ్డారు. 'అంబటి రాంబాబు వాడిన భాషను సమాజం స్వాగతించదు. మహిళలను అగౌరవపరిచారు. ఆయన దూషించింది చంద్రబాబును మాత్రమే కాదు, రాష్ట్ర ముఖ్యమంత్రిని కూడా' అని ఖండించారు. 'కూటమి ప్రభుత్వం ప్రధాని మోదీ మద్దతుతో ఏపీని అభివృద్ధి, సంక్షేమం, శాంతిభద్రతల పరంగా ముందుకు తీసుకెళ్తున్న క్రమంలో రాష్ట్రంలో అలజడి సృష్టించాలన్న కుట్రతో వైకాపా నాయకులు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు నిర్మాణాత్మకంగా వెళ్తుంటే, జగన్ విధ్వంసం సృష్టిస్తున్నారు. పచ్చని రాష్ట్రంలో ఏదోవిధంగా చిచ్చు పెట్టాలని ప్రజలను రెచ్చగొడుతున్నారు. వైకాపా ఐదేళ్ల పాలనలో జరిగిన అల్లర్లు, విధ్వంసం వల్లే వారిని ప్రజలు శిక్షించారు. ఇప్పుడు అలాంటి పనులే చేయాలని ఎత్తుగడ వేస్తున్నారు. కూటమి నాయకులెవరూ వారి ట్రాప్‌లో పడొద్ద'ని సీఎం రమేశ్ విజ్ఞప్తి చేశారు. రాంబాబు వ్యవహారం కొనసాగుతుండగానే జోగి రమేష్ అలా మాట్లాడారంటే, జగన్ ఆదేశాలే కారణమని ఆరోపించారు. ఐదేళ్లూ దోచుకోవడం, దాచుకోవడమే లక్ష్యంగా పనిచేసిన వైకాపా నాయకులకు కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడే అర్హత లేదని రమేశ్ దుయ్యబట్టారు.

ఓ వైపు చట్టాన్ని ఉల్లంఘిస్తూ.. మరోవైపు భద్రత కోరడమా?

- జోగి రమేష్ కుమారుడి పిటిషన్‌పై హైకోర్టులో హోంశాఖ వాదన
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోండి
- ఎన్టీఆర్ పోలీస్ కమిషనర్‌కు న్యాయమూర్తి ఆదేశం

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై వైకాపా నేత, మాజీ మంత్రి జోగి రమేష్ అసభ్య వ్యాఖ్యలు చేశారని, నోరు అదుపులో పెట్టుకోకుండా రెచ్చగొట్టేలా మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తున్నారని హోంశాఖ ప్రభుత్వ న్యాయవాది (జీపీ) అడుసుమిల్లి జయంతి సోమవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. 'ఓ వైపు ఇష్టారీతి వ్యవహార శైలితో చట్టాన్ని ఉల్లంఘిస్తూ, మరోవైపు కోర్టుకొచ్చి భద్రత కల్పించాలని పిటిషన్లు వేస్తున్నారు. ఇలాంటి వ్యక్తి కోర్టు నుంచి ఉత్తర్వులు పొందేందుకు అనర్హుడు. అనుచిత, అసభ్యకర, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా జోగి రమేష్‌ను నిలువరించండ'ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని రమేష్ ఇంటి వద్ద ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని, 15 మంది పోలీసులతో పికెట్ ఏర్పాటు చేశామని చెప్పారు. అతని ఇంటిపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు.. అక్కడ అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ కమిషనర్‌ను ఆదేశిస్తూ వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

బెయిల్ పిటిషన్ వేసుకోండి: న్యాయమూర్తి

తమ ఇంటిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, ఇంటి వద్ద పోలీసు భద్రత కల్పించాలని కోరుతూ జోగి రమేష్ తనయుడు రోహిత్‌కుమార్ లంచ్‌మోషన్లో అత్యవసరంగా దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రామలక్ష్మణరెడ్డి వాదిస్తూ, 'అధికార పార్టీ కార్యకర్తలు జోగి రమేష్ ఇంటిపై రాళ్లు, పెట్రోల్ బాంబులు విసిరారు. ఆ సమయంలో పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయి. వరుసగా ఇది రెండో ఘటన' అని పేర్కొన్నారు. రమేష్‌పై నమోదైన కేసులో పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోకుండా రక్షణ కల్పించాలని కోరారు. న్యాయమూర్తి స్పందిస్తూ అరెస్ట్‌పై ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచించారు. జీపీ చెప్పిన వివరాలను పరిగణనలోకి తీసుకొని వ్యాజ్యాన్ని పరిష్కరించారు.

కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్ధి పొందడమే జగన్ సిద్ధాంతం

మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజం



ఈనాడు, అమరావతి: కులాల మధ్య చిచ్చు పెట్టడం, బూతులు తిట్టించడం, అనైతిక వ్యాఖ్యలు చేయించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందడమే వైకాపా అధినేత జగన్ సిద్ధాంతమని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. విద్వేషాలు, విధ్వంసంతో రాజకీయాలు చేయడం వైకాపా డీఎన్ఏలోనే ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'వైకాపా నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్‌లు తప్పు చేసి కులం కార్డు వాడటం సిగ్గుచేటు. చుక్క పాలు లేకుండా 60 లక్షల కేజీల కల్తీ నెయ్యిని శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి వినియోగించారు. ఈ నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని సిట్ తన నివేదికలో పేర్కొంది. ఈ నివేదికను తారుమారు చేసి వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ పాపంలో భాగస్వామిగా ఉన్న తితిదే మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి విద్వేషాలు రెచ్చగొట్టేలా తిరుపతిలో ఫ్లెక్సీలు పెట్టి అల్లర్లు సృష్టించేలా వ్యవహరిస్తున్నారు' అని సత్యప్రసాద్ మండిపడ్డారు. 'వైకాపా వాళ్ల బూతు రాజకీయాల్ని ప్రతి వేదికపై నిలదీద్దాం. వారి కుట్రలను ప్రజలకు తెలియజేద్దాం. హింసకు పాల్పడటం మన సంస్కృతి కాదు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు' అని తెదేపా శ్రేణుల్ని అనగాని కోరారు.

జోగి సోదరుల బెయిళ్లు రద్దు చేయండి

- ఆయన సిట్ అధికారులను హెచ్చరించారు
- బెయిల్ షరతులను ఉల్లంఘించారు
- పిటిషన్ వేసిన ఎక్సైజ్, సిట్ అధికారులు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో బెయిల్ షరతులు ఉల్లంఘించిన జోగి సోదరుల బెయిళ్లు రద్దు చేయాలని కోరుతూ ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ మంగళవారం విజయవాడలోని 8వ ఏడీజే కోర్టులో విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఈ కేసులో నిందితులుగా ఉన్న మాజీ మంత్రి జోగి రమేష్, రాముకు ఇటీవల విజయవాడ ఎక్సైజ్ కోర్టు, అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె కోర్టు బెయిళ్లు మంజూరు చేయడంతో వారు విడుదలయ్యారు. గత నెల విజయవాడ కారాగారం నుంచి విడుదలైన తర్వాత మీడియాతో మాట్లాడుతూ... పోలీసులు, నకిలీ మద్యం కేసు విచారిస్తున్న సిట్ అధికారులకు బెదిరింపు స్వరంతో హెచ్చరికలు జారీ చేశారు.

జైలు నుంచి బయటకు వస్తూనే..

'చంద్రబాబు, లోకేశ్‌కు తొత్తులుగా మారిన కొందరు పోలీసులకు చెబుతున్నా. చంద్రబాబు శాశ్వతం కాదు. మహా అయితే రెండున్నరేళ్లు ఉంటాడు. తర్వాత పోతాడు. మీరు శాశ్వతంగా ఉద్యోగాల్లో ఉండేవారు. మీరెందుకు తొత్తులుగా మారతారు. ఎందుకు అక్రమ కేసులు పెడతారు? సిట్ అధికారులకు కూడా చెబుతున్నా. మీకు భార్యాబిడ్డలు లేరా? పైన దేవుడు లేడా? చంద్రబాబు చెబితే చేస్తారా? మీకు ప్రజా కోర్టులో శిక్ష పడుతుంది' అని జోగి రమేష్ బెయిలు మంజూరైన తర్వాత కారాగారం నుంచి బయటకొచ్చిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ సిట్ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు.

జిల్లా కోర్టు నుంచి విజయవాడకు బదిలీ

బెయిల్ మంజూరు చేసిన సందర్భంగా న్యాయాధికారి విధించిన షరతులను జోగి సోదరులు ఉల్లంఘించారని ఎక్సైజ్, సిట్ అధికారులు మచిలీపట్నంలోని జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ నిమిత్తం అది విజయవాడలోని 8వ అదనపు జిల్లా కోర్టుకు బదిలీ అయింది. జోగి సోదరులకు దిగువ కోర్టు ఇచ్చిన బెయిళ్లు చెల్లవని పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రొహిబిషన్ చట్టం ప్రకారం నిందితులకు బెయిళ్లను సెషన్స్ కోర్టు మాత్రమే ఇచ్చే అధికారం ఉందని అందులో ప్రస్తావించారు.

ఆ వ్యాఖ్యలపై అంబటి పశ్చాత్తాపం

- ఎప్పుడూ ఇదే పార్టీ అధికారంలో ఉండదని గ్రహించాలి
- రాంబాబు అల్లుడు ఉపేష్ వ్యాఖ్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఉపేష్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం (నగరపాలక సంస్థ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన వ్యాఖ్యల విషయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు బాధపడుతున్నారని ఆయన అల్లుడు ఉపేష్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని కేంద్ర కారాగారంలో ఉన్న అంబటి రాంబాబుతో సోమవారం మధ్యాహ్నం అల్లుడు ములాఖత్ అయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెదేపా శ్రేణులే ముందుగా రెచ్చగొట్టాయని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఆయన మాటలు జారారన్నారు. అంబటికి సినిమా చూపిస్తామంటూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించడం తగదన్నారు. ముఖ్యమంత్రిపై అసభ్యంగా మాట్లాడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, అంతేకాని ఇలాంటి దాడులను ప్రోత్సహించకూడదన్నారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త, అనుచరులు కలిసి తమ ఇంటిపై దాడి చేశారన్నారు. ఇవన్నీ సీసీ టీవీలో నమోదయ్యాయని, వాటి ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. కేంద్ర మంత్రికి, ఎమ్మెల్యే మాధవికి కుటుంబసభ్యులు ఉన్నారని, ఎల్లప్పుడూ ఇదే పార్టీ అధికారంలో ఉండదనే విషయం గ్రహించాలన్నారు. ఇదే సంఘటన భవిష్యత్తులో పునరావృతమవుతుందని హెచ్చరించారు.

తప్పు చేసిన వారికి కులాన్ని ఆపాదిస్తారా?

- వైకాపా గుర్తింపు రద్దుకు ఈసీకి లేఖ రాస్తా
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



విశాఖపట్నం (మద్దిలపాలెం), న్యూస్‌టుడే: 'అప్పట్లో చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి క్షమాపణలు చెప్పారు. ఆయన వారసులమని చెప్పుకొనే వైకాపా నాయకులకు ఆ లక్షణాలేవీ లేవు. తప్పుచేసిన వారిని శిక్షిస్తే కులాన్ని ఆపాదించడం బాధాకరమ'ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. సోమవారం విశాఖ ఎంవీపీకాలనీలోని తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైకాపా గుర్తింపును రద్దు చేయాలని ఎన్నికల సంఘానికి లేఖ రాస్తానని చెప్పారు. 'భావితరాలు ఆందోళన చెందేలా వైకాపా నాయకుల ప్రవర్తన ఉంది. బూతుల సంస్కృతి ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉంది. ముఖ్యమంత్రి చంద్రబాబును వైకాపా నాయకులు ఇష్టానుసారంగా దూషించడం క్షమించరానిది. సమాజం తలదించుకునేలా వైకాపా నాయకులు వ్యవహరిస్తున్నార'ని మండిపడ్డారు. జగన్ సతీమణి భారతిపై సోషల్ మీడియాలో అనుచిత పోస్టు చేసిన వారిని తెదేపా నుంచి సస్పెండ్ చేసినట్లు గుర్తుచేశారు. వైకాపా అధినేత జగన్, నాయకులు అంబటి రాంబాబు, కొడాలి నాని, పేర్ని నాని, జోగి రమేష్, రోజాల అసభ్య వ్యాఖ్యల వీడియోలను గంటా ప్రదర్శించారు.

భవిష్యత్తులో రిటర్న్ గిఫ్ట్ తప్పదు

- వైకాపా నేత సజ్జల రామకృష్ణారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పక్కన జోగి రమేష్, దేవినేని అవినాష్ తదితరులు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అధికారం ఉందని నేడు దాడులు చేస్తున్న వారికి భవిష్యత్తులో తమ పార్టీ అధికారంలోకి వచ్చాక రిటర్న్ గిఫ్ట్‌లు తప్పవని వైకాపా రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను ఇబ్రహీంపట్నంలోని అతని నివాసంలో సజ్జల సోమవారం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ వారు చేస్తున్న ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారు. కల్తీ జరిగిందా, లేదా అన్నది కేంద్ర సంస్థల ఆధ్వర్యంలో నిర్ధారించాలన్న ఉద్దేశంతో ఈ విషయాన్ని నేషనల్ మీడియా దృష్టికి తీసుకెళ్లనున్నామ'ని చెప్పారు. రాష్ట్రంలో నియంతృత్వ పాలనను ప్రజలకు తెలియజేస్తామన్నారు. 'తెదేపా శ్రేణుల దాడుల పట్ల పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై దాడులు జరుగుతున్న సంగతి పోలీసులకు తెలిసినా పట్టించుకోలేదు. ప్రభుత్వ పెద్దలు తమకు కావాల్సిన వారి సాయంతో వ్యవస్థలను నడుపుతున్నారు. వారి తప్పులను ప్రశ్నిస్తుంటే ఇలా దాడులకు పాల్పడుతున్నార'ని సజ్జల ఆరోపించారు. ఆయన వెంట వైకాపా నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, విశ్వరూప్, కారుమూరి నాగేశ్వరరావు, వేణుగోపాలకృష్ణ, మేరుగ నాగార్జున, గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర, జిల్లా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

లేఖ రాయడానికి మనసెలా వచ్చింది?

ముద్రగడకు తెదేపా నేత బుద్ధా వెంకన్న ప్రశ్న

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఇటీవలి రాజకీయ పరిణామాలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు వైకాపా నేత ముద్రగడ పద్మనాభరెడ్డి రాసిన లేఖలపై తెదేపా నేత, మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న స్పందించారు. వాటికి కౌంటరుగా ముద్రగడకు బహిరంగ లేఖ రాసి సోమవారం విడుదల చేశారు. "వైకాపా పాలనలో చంద్రబాబు కుటుంబ సభ్యులను అసెంబ్లీ లోపల, వెలుపల దూషించినప్పుడు.. నాటి సీఎం జగన్‌కు మీరు లేఖ ఎందుకు రాయలేదు..? ఇటీవల చంద్రబాబుపై అంబటి రాంబాబు మురికి మాటలతో రెచ్చిపోతే.. తెదేపా కార్యకర్తలు తీవ్రంగా స్పందించారన్న విషయాన్ని విస్మరించి, ఇప్పుడు లేఖ రాయడానికి మీకు మనసు ఎలా వచ్చింది? ఇకనైనా లేఖల్లో అసూయ రాతలు కాకుండా వాస్తవాలు వెల్లడించండి" అని హితవు పలికారు.

రేపు అంబటి ఇంటికి జగన్

ఈనాడు, అమరావతి: వైకాపా అధినేత జగన్ ఆ పార్టీ నేతలు అంబటి రాంబాబు, జోగి రమేశ్ ఇళ్లకు వెళ్లనున్నట్లు ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం గుంటూరులోని అంబటి రాంబాబు ఇంటికి, శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని జోగి రమేశ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను జగన్ పరామర్శిస్తారని చెప్పారు.

ఇంటికి నిప్పు పెట్టించుకొని.. జోగి రమేష్ సానుభూతి డ్రామాలు

- కాంగ్రెస్ నుంచి పుట్టిన నకిలీ పార్టీ వైకాపా
- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ధ్వజం



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

ఈనాడు, దిల్లీ: దేశంలోనే వైకాపా ఓ నేరపూరిత పార్టీ అని, అందులోని నాయకులంతా నకిలీలు, నేరగాళ్లని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ధ్వజమెత్తారు. అది పేరు చివరన కాంగ్రెస్ అని తగిలించుకొని కాంగ్రెస్ నుంచి పుట్టిన నకిలీ పార్టీ అని తూర్పారబట్టారు. పూర్తిగా నేరచరిత్ర ఉన్న ఆ పార్టీ నాయకులు తమ తప్పులను ఇతరులపై వేయడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. సోమవారం ఏపీభవన్‌లో విలేకర్లతో శివనాథ్ మాట్లాడారు. 'జోగి రమేష్ తన ఇంటిపై దాడికి లోకేశ్, నేనే కారణమని చేసిన ఆరోపణలను ఖండిస్తున్నా. రమేష్, అంబటి రాంబాబులను పట్టించుకొనే స్థితిలో లోకేశ్ లేరు. రమేష్ అసభ్య వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా చేయడానికి వెళ్లిన తెదేపా నాయకులను రెచ్చగొట్టింది వైకాపా వారే. మహిళా కార్యకర్తలపై రాళ్లు విసిరింది వారే. జగన్ డైరెక్షన్‌లో సానుభూతి కోసం జోగి రమేష్ తన ఇంటికి తానే నిప్పు పెట్టించుకున్నారు. కల్తీమద్యం కేసులో నిందితుడైన ఆ వ్యక్తి.. సానుభూతి కోసం దీన్ని ఆయుధంగా మలుచుకుంటున్నార'ని మండిపడ్డారు. వంగవీటి మోహనరంగాపై సానుభూతి కనబరుస్తున్నట్లు నటిస్తున్న వైకాపా నాయకులు.. ఆయన్ను కాపు సామాజికవర్గానికి పరిమితం చేయాలనుకోవడం సరికాదని శివనాథ్ హితవు పలికారు. 'రంగా కాపు నాయకుడు మాత్రమే కాదు, బడుగు బలహీనవర్గాల నాయకుడు. ఆయన్ను ఎదగకుండా అడ్డుకున్నది వైఎస్ రాజశేఖరరెడ్డే. రంగా హత్య కేసులో ప్రధాన ముద్దాయిలుగా ఉన్నవారంతా ఇప్పుడు వైకాపాలోనే తిరుగుతున్నార'ని పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉన్న విజయవాడలో అలజడులు సృష్టించాలనుకుంటే కుదరదని హెచ్చరించారు. వైకాపా నాయకుల అసభ్య భాషను వాళ్ల ఇళ్లలోని మహిళలూ అసహ్యించుకుంటున్నారని విమర్శించారు. కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేక జగన్ తన పార్టీ నాయకులతో బూతులు మాట్లాడించే కొత్త డ్రామా మొదలుపెట్టారని ఎంపీ మండిపడ్డారు.

జగన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలి

తప్పుడు కేసులో చంద్రబాబును 53 రోజులు అన్యాయంగా జైల్లో ఉంచారు: వర్ల రామయ్య



ఈనాడు, అమరావతి: వైకాపా అధికారంలో ఉన్న సమయంలో చంద్రబాబుపై తప్పుడు కేసు బనాయించి ఆయన్ను అన్యాయంగా 53 రోజులు జైల్లో ఉంచారని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ధ్వజమెత్తారు. చంద్రబాబు కుటుంబానికి, తెదేపా నాయకులు, కార్యకర్తలకు వైకాపా అధినేత జగన్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ కక్ష సాధింపు రాజకీయాల్లో భాగంగానే అప్పట్లో ఇదంతా జరిగిందని దుయ్యబట్టారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం వర్ల రామయ్య విలేకరులతో మాట్లాడారు. జైల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించకుండా చంద్రబాబును వేధించారని, చివరకు కోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి తెచ్చారని మండిపడ్డారు.

అంబటి మురికి వ్యాఖ్యలపై ప్రజల తిరుగుబాటు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



ఈనాడు, అమరావతి: భరిస్తున్నాం కదా.. అని విపరీత ధోరణితో ఇష్టానుసారం మాట్లాడితే సహించబోమని చాటి చెప్పేందుకే ప్రజలు వైకాపా నేత అంబటి రాంబాబు మురికి వ్యాఖ్యలపై తిరగబడ్డారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. ఏడాదిన్నరగా సీఎం చంద్రబాబుపై వైకాపా నాయకులు చేస్తున్న మురికి వ్యాఖ్యలను భరిస్తూ ప్రజలు లోలోన రగిలిపోతున్నారని తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ఆమె సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'తిరుమల లడ్డూ కల్తీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే వైకాపా నాయకులు దిగజారుడు భాష ఎంచుకున్నారు. అంబటి లాంటి వారిని బూతులు తిట్టడానికి వదిలారు. హిందూమతంపై కోపం ఉంది కాబట్టే జగన్ తిరుమల లడ్డూలో రసాయనాలు వాడించి, కల్తీ చేయించారు. చేసిన తప్పు బయట పడేసరికి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారు. లడ్డూ కల్తీ వ్యవహారంపై మాట్లాడేందుకు జగన్ అసెంబ్లీలో చర్చకు రావాలి' అని సవాలు విసిరారు.

రంగాను చంపితే తప్పేంటన్న వ్యక్తిని.. పదవితో సత్కరించింది జగన్ కాదా?

మంత్రి నిమ్మల రామానాయుడు



ఈనాడు, అమరావతి: వంగవీటి రంగాను రౌడీ అని దూషించి, ఆయన్ను చంపితే తప్పేంటని గతంలో అనుచిత వ్యాఖ్యలు చేసిన వైకాపా నేత గౌతమ్‌రెడ్డికి ఫైబర్‌నెట్ ఛైర్మన్ పదవి ఇచ్చి సత్కరించిన చరిత్ర జగన్‌రెడ్డిదని రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. రంగ హత్య కేసు నిందితులు నేడు వైకాపాలో ఉండి నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. పేరు చివర 'రెడ్డి'ని చేర్చుకున్న ముద్రగడ పద్మనాభం.. కాపుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. జగన్ మెప్పు కోసం ఆయన తన స్థాయిని తగ్గించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో రామానాయుడు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2014-19 మధ్య అప్పటి తెదేపా ప్రభుత్వం కాపులకు ఇచ్చిన రిజర్వేషన్లను అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ రద్దు చేశారని గుర్తుచేశారు. 'చంద్రబాబుపై అంబటి రాంబాబు మురికి మాటలు మాట్లాడితే.. ఇది తప్పు అని జగన్ ఎందుకు చెప్పలేదు. వైకాపా హయాంలో సామాజిక మాధ్యమాల్లో చిన్న పోస్టు పెడితేనే జైలుకు పంపిన జగన్.. నేడు ఇంత దారుణంగా మాట్లాడిన వ్యక్తిపై పార్టీ పరంగా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? తిరుమల ప్రసాదంలో కల్తీ నెయ్యి కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరల్చడానికి రాంబాబును జగన్ పావులా వాడుకుంటున్నార'ని నిమ్మల విమర్శించారు.

వైకాపా ఫిర్యాదుతో తెదేపా నేతలపై కేసులు

గుంటూరు (పట్టాభిపురం), న్యూస్‌టుడే: మాజీ మంత్రి, వైకాపా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ఇంటిపై దాడికి పాల్పడ్డారన్న ఫిర్యాదు మేరకు తెదేపా కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్ (బుజ్జి)తో పాటు ఆ పార్టీ నేతలు కొందరిపై గుంటూరులోని పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. కార్పొరేటర్ శ్రీరాంప్రసాద్, పలువురు తెదేపా నాయకులు గుంటూరులోని అంబటి ఇంటిపై రాళ్లు రువ్వి అద్దాలు, ఏసీలు ధ్వంసం చేశారని, కారుకు నిప్పు పెట్టారని, ఇంట్లోకి చొచ్చుకొచ్చి దౌర్జన్యం చేశారని వైకాపా లీగల్‌సెల్ నాయకులు రోళ్ల మాధవి, భగవాన్‌లు ఫిర్యాదు ఇచ్చారని సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉత్తమమైన కొన్ని సంగతులు



- నూనెలు.. ఆలివ్ నూనె, అవిసె నూనె
- పండ్లు.. కివీలు, పుల్లటి చెర్రీలు (టార్ట్ చెర్రీలు)
- పిండిపదార్థాలు.. స్టీల్‌కట్ ఓట్స్
- కొవ్వులు.. బాదం, గుమ్మడి గింజలు నుంచి అందేవి..
- శాకాలు.. ఆకుకూరలు, చిలగడదుంపలు
- స్నాక్స్... అరటిపండు+నట్ బటర్, చామంతి పూల పొడితో చేసే బిస్కట్లు
- తేనీరు.. చామంతి పూల టీ, లెమన్ బామ్ టీ
- మూలికలు.. లావెండర్, రాఖీ పుష్పం (పాసిన్‌ఫ్లవర్)

– క్రిస్టీ లియంగ్, ఫిజీషియన్

(c) eenadu

వసుంధర

vasundhara@eenadu.in

ఆమె సృజన విలువ... రూ.4లక్షల కోట్లు!



మెలానీ

హోమ్‌వర్క్ నుంచి ప్రాజెక్టు వరకూ... రెజ్యూమె నుంచి ప్రజెంటేషన్ వరకూ గ్రీటింగ్ కార్డు నుంచి పెళ్లి కార్డు వరకూ... అన్నింటికీ ఒకటే సమాధానం 'కాన్వా'. మెలానీ పెర్కిన్స్ ఆలోచనల్లో పుట్టిన కాన్వా... డిజైనింగ్ రూపు రేఖల్నే మార్చేస్తోంది! 38 ఏళ్ల మెలానీ కథ చదివి మర్చిపోయేది కాదు... కలల్ని నెరవేర్చుకునేలా 100 శాతం ప్రేరణనిచ్చేది!

మెలానీ పుట్టి పెరిగింది పెర్త్‌లో. తల్లి ఆస్ట్రేలియన్, తండ్రి మలేషియన్. కళలంటే ఇష్టం. యూనివర్సిటీ ఆఫ్ పెర్త్ నుంచి ఆర్ట్స్, కామర్స్‌లో డిగ్రీ చేస్తూనే... జూనియర్లకు డిజైన్ ప్రోగ్రామ్స్‌ని నేర్పేవారు. అక్కడ మైక్రోసాఫ్ట్, అడోబ్ డిజైనింగ్ టూల్స్ నేర్చుకోవడాన్ని విద్యార్థులు కష్టంగా భావించేవారు. దాంతో డిజైనింగ్‌ని సరళంగా మార్చాలనుకున్నారు మెలానీ. ఆ దిశగా క్లాస్‌మేట్, ప్రియుడు క్లిఫ్ ఆబ్రెక్ట్‌తో కలిసి అడుగులు వేశారు.

ఇయర్ బుక్స్‌తో...

'మొత్తం డిజైనింగ్ వ్యవస్థను ఒక పేజీలోకి తెచ్చి ప్రపంచానికి అందించాలనుకున్నాం' అంటారు మెలానీ. ముందుగా 'ఫ్యూజన్ బుక్స్' పేరుతో స్కూల్ ఇయర్ బుక్ డిజైన్స్ అందించారు. వెబ్‌సైట్‌లో నమూనా పేజీ డిజైన్లని ఎంచుకునే అవకాశాన్ని స్కూల్స్‌కు ఇచ్చారు. ఆపై స్కూళ్లకు ఆ పుస్తకాలను ప్రింట్ చేసిచ్చేవారు. మంచి ఆదరణ వచ్చింది. ఇప్పటికీ ఆ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. లోగో, బ్రోచర్, స్లైడ్‌లు... అన్నింటికీ 'వన్ స్టాప్ షాప్ డిజైన్ సైట్'గా కాన్వాని రూపొందించాలనుకున్నారు.

100 తిరస్కారాలు...

2012లో అమెరికా వెళ్లి పెట్టుబడులకు ప్రయత్నించారు మెలానీ. వ్యవస్థాపకులు ప్రేమికులు కావడం, టెక్ నేపథ్యం లేకపోవడం... కారణాలుగా చూపి ఎవరూ ఇష్టపడలేదు. 'వందకు పైగా తిరస్కరణలు. తిరస్కరణ ఎదురైన ప్రతిసారీ మా పిచింగ్‌ను బలోపేతం చేశాం' అంటారు మెలానీ. హవాయిలో ఏటా కొందరు వెంచర్ క్యాపిటలిస్టులూ, వ్యవస్థాపకులూ సమావేశమవుతారు. అక్కడికి వెళ్లాలనుకున్నారు మెలానీ, క్లిఫ్. వాళ్లకు కైట్ సర్ఫింగ్ హాబీ. అందులో వీళ్లూ శిక్షణ తీసుకున్నారు. ఛార్జీలకీ, హోటల్‌కూ బ్యాంకు బ్యాలెన్స్‌లో సగాన్ని ఖర్చుచేశారు. అక్కడ వీసీ రిక్ బేకర్‌ని కలిసి మెప్పించారు. ఆయన పెట్టిన రూ.10కోట్లకు ఆస్ట్రేలియా ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చింది. 2013లో సిడ్నీ కేంద్రంగా కాన్వా మొదలైంది.

ఒక మహిళ స్థాపించి, నాయకత్వం వహించిన అత్యంత విలువైన కంపెనీగా కాన్వాను చెబుతున్నారు.

సీఈఓగా ఆమె...

గూగుల్ మ్యాప్స్ సహ-వ్యవస్థాపకులు లార్స్ రాస్ముస్సెన్ మెంటారింగ్‌కి అంగీకరించారు. ఆయన సాయంతో టెక్ కో-ఫౌండర్ కామెరాన్ ఆడమ్స్‌ను నియమించుకున్నారు. ఒకరే నేతృత్వం వహించాలని పెట్టుబడిదార్లు సూచించడంతో... మెలానీ పేరు సూచించారు క్లిఫ్. రెండేళ్లపాటు ఏ ఉత్పత్తీ తీసుకురాకుండా బలమైన పునాది వేసుకున్నారు. పన్నెండో తరగతి వరకూ విద్యారంగానికి సంబంధించిన సేవలు ఉచితం. మిగతా వారికి 'ప్రీమియమ్' మోడల్‌లో... కొన్ని ఉచితంగానే ఇస్తూ, అప్‌గ్రేడ్ అయ్యే ఆప్షన్లు తెచ్చారు. రెజ్యూమెలు, ప్లకార్డులు, లోగోలు చేయడమే కాదు, ప్రొఫెషనల్స్ కూడా వినియోగించడం ప్రారంభించారు. వినియోగదారుల్లో 60 శాతం మహిళలే.

దిగ్గజాలకు పోటీగా...

2018లో యూనికార్న్ స్థాయికి చేరింది కాన్వా. పేజీ లే అవుట్, ఫొటో ఎడిటింగ్ విభాగంలోని 'అఫినిటీ'ని 2024లో కొనుగోలు చేసి... ఉచితంగా సేవలు అందిస్తూ అడోబ్‌కు గట్టి పోటీ ఇస్తోంది. రూ.20లక్షల కోట్ల గ్లోబల్ క్రియేటివ్ సాఫ్ట్‌వేర్ మార్కెట్‌లో ప్రస్తుతం కాన్వాది 12 శాతం. కంపెనీ విలువ రూ.4లక్షల కోట్లు. 'నచ్చిన భాషలో, నచ్చిన పరికరం మీద కావాల్సిన అంశాన్ని డిజైన్ చేసుకునేలా చేయడమే మా లక్ష్యం' అంటారు మెలానీ.

సక్సెస్ మంత్ర...

ఇతరుల్ని అనుసరించకుండా మీ కంపెనీ సహజంగా ఏం చేయగలుగుతుందని భావిస్తారో అది చేయండి. ప్రపంచంలోనే అత్యుత్తమ కంపెనీల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా లక్ష్యం పెట్టుకోండి. నెట్‌వర్క్ పెంచుకోకపోతే మన ఆలోచనలు, అడుగులు ఉన్నచోటే ఆగిపోతాయి.

- అనుభవంతో కొన్ని ఆరోగ్యకరమైన అలవాట్లను నేర్చుకున్నా. వారాంతాల్లోనూ పనిచేస్తే, కొన్నాళ్లకు అడవిలో ఉన్నా, చెట్లను గమనించలేని పరిస్థితి ఎదురవుతుంది. పని చేస్తే పూర్తిగా అందులోనే లీనమైపోతా. ఒకసారి పని ముగించుకుంటే అటువైపు మరి ఆలోచించను. నా ఫోన్లో మెయిల్, స్లాక్(మీటింగ్ యాప్) ఉండవు.



ఈ ఒంటరితనమూ కష్టమే!

కాలు బయట పెట్టాల్సిన పనిలేదు, పిల్లలను చూసుకోవచ్చు... ఇలా ఎన్నో కారణాలతో చాలామంది ఇంటి నుంచి పనిచేయడాన్నే ఎంచుకుంటున్నారు. తొలిరోజుల్లో అంతా బాగానే ఉంది. కానీ తరవాతే తిప్పలు మొదలు. ముఖ్యంగా ఒంటరితనం వాళ్లపై ప్రభావం చూపుతోంది. కావాలంటే చూడండి... ఆఫీసులో కాస్త అలసటగా అనిపించిందనుకోండి. సహోద్యోగితో టీ, కాఫీలకు పక్కకి వెళ్లొచ్చు. బాస్ కోప్పడితే స్నేహితురాలితో బాధను పంచుకోవచ్చు. ఇక, సినిమా, లంచ్, షాపింగ్ ప్లాన్స్ అంటూ ఎన్నుండేవి? ఇవన్నీ మనసుని మరల్చేవే! అదే ఇంటి నుంచి పనైతే? వీడియో మీట్ లేకపోతే సరిగా సిద్ధమవుతామా అన్నదీ ప్రశ్నే. పేరుకి సహోద్యోగుల పేర్లు తెలిసినా పని గురించి తప్ప మనసు విప్పి మాట్లాడే అవకాశమే తగ్గిపోతోంది. దీంతో ఉద్యోగంలో ఒంటరితనం పెరిగిపోతోంది. దీనికితోడు పెరిగే పనిభారం అదనం. బృందంతో కలిసి పనిచేయడం, ఆలోచనలు పంచుకోవడం వంటివన్నీ మాయమై సృజనాత్మకతా, పనిమీద ఆసక్తి వంటివి తగ్గిపోతున్నాయి. ఇది కెరియర్‌కే కాదు... మనసుకీ మంచిది కాదు. కాబట్టే, దీనిమీదా దృష్టి పెట్టమంటున్నారు నిపుణులు.

మీటింగ్ అనగానే ఆన్‌లైన్ అనేయకండి. నేరుగా వెళ్లి కలవడానికే మొగ్గు చూపండి. ఈమధ్య హైబ్రిడ్ వర్క్‌కి ఓటేస్తున్నాయి సంస్థలు. అది లేకపోయినా వారానికోసారి, లేదా అప్పుడప్పుడైనా ఆఫీసుకి వెళ్లేలా ప్లాన్ చేసుకోండి. టీమ్ యాక్టివిటీలు, లంచ్‌లు ప్లాన్ చేయమని టీమ్ లీడర్లని కోరండి. ఆలోచనలను పైవాళ్లతోనైనా పంచుకుంటూ ఉండండి. అప్పుడే ఈ ఒంటరితనం నుంచి బయట పడగలుగుతారు. కేవలం జీతాలే అన్నిసార్లూ ముఖ్యం కాదు... పనిచేసే చోట నలుగురు స్నేహితులు, పనిని పంచుకునే బృందం, ఆలోచనల్ని చర్చించే వేదిక వంటివీ ముఖ్యమే. అవి లేకపోవడం వల్లే 'పనిలో ఒంటరితనం' పెరుగుతోంది. దాన్ని గమనించుకోవాలి. అలాగే అడ్డుకట్ట వేయాలి. అదీ మీ చేతిలోనే ఉంది. దూరం చేసుకోండి మరి!



ఆదివాసీ మహిళల పొదుపు మంత్రం

పొదుపు, అప్పులు సకాలంలో తీర్చడంలో బాగా చదువుకున్న వాళ్లూ ఇబ్బంది పడుతుంటారు. అలాంటివాళ్లకి ఈ మహిళల్ని చూపించాలి. పొదుపుతో కుటుంబ ఆర్థిక అవసరాలను తీర్చుకోవడమే కాదు... ఎంతోమందికి ఆదర్శంగానూ నిలుస్తున్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం తుమ్మగూడ... మారుమూల ప్రాంతంలో ఉండే ఓ గూడెం. అక్కడివాళ్లంతా గోండు తెగకు చెందిన ఆదివాసీలే. అందరిదీ ఒకేమాట. ఒకే బాటగా సాగుతారు. 2024లో ఊళ్లో వినాయక లడ్డూ వేలం వేయగా రూ.20వేలు వచ్చాయి. ఆ మొత్తాన్నీ ఊరి పెద్దలు మహిళా సంఘాలకి ఇచ్చారు. 110 కుటుంబాలున్న ఆ ప్రాంతంలో 14 మహిళా సంఘాలున్నాయి. 'నాగోబా' మహిళా సంఘం ఆ డబ్బుల నిర్వహణ బాధ్యత తీసుకుంది. ప్రతి నెల 24న సమావేశం నిర్వహిస్తారు. అవసరమైన మహిళలకి రూ.50 నెలవారీ వడ్డీ చొప్పున రూ.వెయ్యి అప్పుగా ఇస్తారు. మరుసటి నెల సమావేశం నాటికి వడ్డీతో సహా తీర్చాలనేది నియమం. ఇప్పటివరకూ దీన్ని ఎవరూ మీరలేదు. అంతేకాదు, పాత బకాయి ఉండగా కొత్త అప్పు ఇవ్వరు. అలా రూ.20వేలతో మొదలైన వాళ్ల పొదుపు ప్రయాణం రూ. 1.2 లక్షలకి చేరింది. ఇలా పోగేసుకుంటూ ఆర్థిక అవసరాలు తీర్చుకోవటమే కాదు, ఉపాధిగానూ మలుచుకుంటున్నారు. అక్రమాలకు తావులేకుండా బ్యాంకు తరహా వ్యవస్థని ఏర్పాటు చేసుకున్నారు. లెక్కలన్నీ రాసి పెట్టుకుంటున్నారు. 'ఒకప్పుడు అవసరానికి అప్పు లభిస్తుందో లేదో అని భయముండేది. ఈ విధానంతో ఆ బెంగ తీరింది. అలాగని ఆడంబరాలకు తీసుకోము. తీసుకున్నవాళ్లం పక్కాగా తీర్చేస్తాం కూడా. మహిళలందరి సమ్మతితోనే ప్రతినెలా బట్వాడా జరుగుతుంది. మా నిర్ణయాల్లో మగవాళ్ల జోక్యమూ ఉండదు. అందరం బాగుండాలి. పొరపాట్లకు తావివ్వకుండా జీవితాన్ని సాగించాలి అన్న సూత్రాన్ని పాటిస్తాం' అంటారీ మహిళలు.

– ఎం.మణికేశ్వర్, ఈటీవీ, ఆదిలాబాద్

లెక్కల తిప్పలు పోతాయిలా..!



మా పిల్లలకు అన్ని సబ్జెక్టుల్లోనూ మంచి మార్కులు వస్తాయి, లెక్కల్లో తప్పించి... అంటూ చాలామంది తల్లిదండ్రులు చెబుతారు. మిగిలిన వాటిలా చదివితే వచ్చే సబ్జెక్టు కాదు గణితం. ప్రయోగం, అనుభవంద్వారా నేర్చుకోవడం దీన్లో ప్రధానం. ఆటలతో, దినచర్యలో భాగంగా నేర్చుకున్నప్పుడు లెక్కల్ని సులభంగా అర్థం చేసుకుంటారు.

బొమ్మల్ని లెక్కించడం ద్వారా పిల్లలకు అంకెలు నేర్పవచ్చు. తమ దగ్గర ఎన్ని బొమ్మలు ఉన్నాయో చెప్పమంటూ ప్రోత్సహించాలి. పిల్లలచేత బిల్డింగ్ బ్లాక్స్ నిర్మించమని... ఎవరి బిల్డింగ్‌లో ఎన్ని బ్లాకులున్నాయి? ఇద్దరి మధ్య తేడా ఎంత? ఇలాంటివి చెప్పమనాలి.

- అంకెల్ని నేలపైన రాసి జంపింగ్, స్కిప్పింగ్ వంటి ఆటల ద్వారానూ నేర్చుకోవచ్చు.
- సంగీతం, లయబద్ధంగా నేర్చుకోవడంద్వారా లెక్కల్లో చురుగ్గా ఉంటారు. పద్ధతిలో చప్పట్లు కొట్టడం, వేర్వేరు సంగీత పరికరాలపైన సాధన ఇందుకు సాయపడతాయి.
- స్నాక్స్‌గా పెట్టే పండ్లు, బిస్కెట్లతో వివిధ రకాల ఆకారాలూ, భిన్నాలను నేర్పించవచ్చు.
- ట్రెజర్ హంట్ లాంటి గేమ్‌లు ఆడుతూ కార్డుల పైన రాసిన అంకెల్నే ట్రెజర్‌గా పెట్టాలి. రెండు, మూడు, అయిదు వీటి గుణిజాల్ని కనిపెట్టమనాలి.
- కథల్లో కూడా అంకెలు వచ్చేట్టు చూడండి. వ్యక్తులు, అందులోని వస్తువులకు సంబంధించి అంకెల్ని, కొలతల్ని ప్రధానంగా చేసి చూపండి.
- కిడ్డీ బ్యాంకులోని కాయిన్లు లెక్కపెట్టమనొచ్చు. అంతేకాదు, ప్రయాణంలో ఉన్నప్పుడు మైలురాళ్లు, బస్సు నంబర్లు... ఇలాంటివి గుర్తించి చెప్పమనాలి.



వాకింగ్ యోగా చేద్దామా!



చక్కటి ఆరోగ్యం కోసం కొంతమంది యోగా చేస్తే, మరికొందరు నడకని ఎంచుకుంటారు. ఇంకొందరు... రెండింటినీ విడివిడిగా చేస్తుంటారు. అయితే, నడవడం విసుగ్గా అనిపించినా, యోగా సెషన్‌కి సమయం కేటాయించలేకపోయినా... ఏం పరవాలేదు. రెండింటినీ కలిపి వాకింగ్ యోగా ప్రాక్టీస్ చేసేయండి అంటున్నారు నిపుణులు. దీంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. అదెలాగంటారా? ఆసనాలు, స్ట్రెచ్‌లు కలిపి చేయడమే! ఉదాహరణకు నడుస్తూనే... సైడ్ స్ట్రెచ్ తీసుకోవడం, షోల్డర్ రోల్స్, యాంకిల్ రొటేషన్స్ చేయడం, దీర్ఘశ్వాస తీసుకోవడం వంటివన్నీ ఈ తరహానే. నెమ్మదిగా ఈ వాకింగ్ యోగా పోశ్చర్‌ని సరిదిద్దడంతో పాటు ఫ్లెక్సిబిలిటీనీ, బ్యాలెన్స్‌నూ మెరుగుపరుస్తుంది. రక్తప్రసరణ లోపాలను సరిదిద్దుతుంది. ఒత్తిడి కూడా అదుపులో ఉంటుంది. లో- ఇంపాక్ట్ మూమెంట్స్ కావాల్సిన వారు, వృద్ధులు, జాయింట్ సమస్యలు ఉన్నవారు... తీవ్రమైన వర్కవుట్లు లేకుండానే శ్వాస సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు.

ఆహ్వానం

వసుంధర పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు, నిపుణులకు ప్రశ్నలు... ఇలా మాతో ఏది పంచుకోవాలన్నా 9154091911కు వాట్సాప్ ద్వారా పంపవచ్చు.

రత్నాల హారాలకు జుంకా పెండెంట్‌లు!

నగా నట్రా









నగలంటే ఇష్టపడని అమ్మాయిలు అరుదుగా ఉంటారేమో కదా! కానీ, ఈ మధ్య పసిడి పరుగులు పెడుతూ వారిని కలవరపెడుతోంది. అలాగని శుభకార్యాలకూ, జీవితంలో ముఖ్యమైన సందర్భాలకూ కొనుక్కోకుండా ఉండలేం. పెద్ద ఎత్తున పెట్టుబడీ పెట్టలేం. ఇలాంటివారికోసమే తయారీదారులు పచ్చలు, ముత్యాలు, పగడాలు... మరెన్నో రకాల సహజాతి రత్నాలు, స్టోన్స్‌తో హారాలను రూపొందిస్తున్నారు. ఈ ప్రత్యామ్నాయం అందాన్నీ, హుందాతనాన్నీ ఇవ్వడమే కాదు, మోడర్న్ టచ్‌నీ అద్దుకోవడం వల్ల ఈ తరాన్నీ మెప్పిస్తోంది. వరుసల్లో మెరిసిపోతూ కనిపించే వీటికి జుంకాలను పోలి ఉండే పెండెంట్ కొత్తదనాన్ని తెచ్చిపెడుతున్నాయి. పోల్కీలు, వజ్రాలు, ముత్యాలు, పచ్చలు, కుందన్లు అద్దుకుని ఆకర్షణీయంగా అలరిస్తున్నాయి. పట్టు కట్టినా, ఫ్యూజన్ డ్రెస్ వేసినా... అదరగొట్టేస్తున్నాయీ బీడ్స్ హారాలు. వీటినోసారి మీరూ చూసేయండి.







నాన్న రాస్తానంటే... వాళ్లు ఒప్పుకోవడం లేదు!

పెళ్లయిన మూడేళ్లకే నా భర్త దూరం కావడంతో... పిల్లలతో కలిసి పుట్టింట్లోనే ఉంటున్నా. నాన్న నా భవిష్యత్తు గురించి బెంగపడి... తన ఇంట్లో వాటా రాస్తానంటున్నారు. అందుకు అన్నావదినలు ఒప్పుకోవడం లేదు. ఇందులో ఏదైనా ఇబ్బంది ఉంటుందా? – ఓ సోదరి

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

ఆస్తి మీ నాన్న పేరుమీద ఉందా? రాసినా రాయకపోయినా ఆయన తదనంతరం పిల్లలందరికీ సమాన వాటా వస్తుంది. హిందూ వారసత్వ చట్టం-1985లోని సవరణ చట్టం ప్రకారం అబ్బాయిలతో సమానంగా ఆడపిల్లలకూ ఆస్తిలో సమాన హక్కులు ఉన్నాయి. మీ తాతగారి పేరున ఆస్తి ఉంటే దానిలో మీ బాబాయ్‌లు, అత్తయ్యలు అందరూ వారసులు అవుతారు. భాగాలూ పంచుకున్నాకే మీ నాన్న మీకు ఇవ్వగలరు. అయితే, మీ తండ్రి తన పేరు మీద ఉన్న ఆస్తిని నచ్చినవారికి ఇవ్వొచ్చు. కొడుకులు ఒప్పుకోరనుకుంటే అందరికీ సమానంగా రాయమనండి.. అప్పుడు తాత ఆస్తి అని కోర్టుకి వెళ్లినా... భాగాలు పంచిన ఆస్తిలో అందరికీ సమానమే కాబట్టి కేసు నిలవదు. మీకు భద్రత కూడా ఉంటుంది.



సంగీతమే వాళ్ల వారసత్వం

సంగీతమే ఆ గ్రామానికి ప్రాణం. పాటలే అక్కడి ప్రజలకు జీవనాధారం. అక్కడ ఉండేది కేవలం 55 కుటుంబాలే కానీ, వాళ్లు పాడిన పాటలు మాత్రం వేలల్లో ఉంటాయి. ప్రతి ఇల్లూ సంగీత పాఠశాలే. ఎందుకంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ అందరి గొంతు పాటలతోనే నిండి ఉంటుంది. ముఖ్యంగా ఆ ఊళ్లో ఆడవాళ్లు... కూతుళ్లకీ, మనవరాళ్లకీ వేల సంవత్సరాల నుంచి సంగీతాన్ని వారసత్వ ఆస్తిగా ఇస్తున్నారు. ఈ సంప్రదాయం అక్కడ అనాదిగా వస్తోందట. అంతేకాదు, అక్కడ పిల్లలు రాయడం రాకముందే సంగీతాన్ని నేర్చుకుంటారు. అందుకే ఆ ఊరిని 'పాట్టు గ్రామం'(పాటల గ్రామం) అని పిలుచుకుంటారు అక్కడి వారంతా. దాని అసలు పేరు 'వల్ముట్టి'. ఇది కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో ఉంది. ఇక్కడ వారంతా పానార్ తెగకు చెందినవారు. ఒకప్పుడు వీళ్లంతా ఊరూరా తిరుగుతూ పాటల రూపంలో కథలు చెప్పేవారట. అప్పుడు వాళ్లకది జీవనాధారమే అయినప్పటికీ క్రమేపీ నిత్యజీవితంలో భాగం అయిపోయింది. కాలం మారినా సంప్రదాయాన్ని వదల్లేదు అక్కడి వాళ్లు. ఫలితం... అక్కడినుంచి చాలామంది సంగీత కళాకారులు పుట్టుకొచ్చారు. పురుషులు సంగీత వాద్యాలు తయారుచేస్తే, స్త్రీలు పాటలు పాడుతుంటారు. రోజూ ఉదయం దేవుణ్ణి మేల్కొలపడంతో మొదలవుతుంది ఆ ఊళ్లో తొలిరాగం. సాయంత్రం దీపాలు పెట్టే వరకూ పాటలు వినిపిస్తాయి. ఈమధ్యలో వాళ్లకి ఆనందం... బాధ... ఇలా ఏది వచ్చినా వాళ్లకి గుర్తొచ్చేది పాటేనట. అక్కడ ఏ మహిళను కదిపినా 'పాటే మా గౌరవం. మా పిల్లల జీవితాలకు వెలుగు బాటలు ఈ పాటలు' అంటారు. అలాగని వీటికోసం ప్రత్యేకంగా సంగీత తరగతులు నిర్వహించరు. పండుగలు, గ్రామ వేడుకలు, సంబరాలు, దేవాలయాల్లో ఈ ప్రత్యేక గీతాలు పాడుతుంటే విని నేర్చుకుంటారట అక్కడివారంతా. 'ఇక్కడ అందరూ సంగీతకళాకారులే. మా పూర్వీకులు ఆలయ ఉత్సవాలకు పాటలు పాడుతూ జీవనోపాధి పొందేవారు. వారి అడుగుజాడల్లోనే మేమూ నడుస్తున్నాం' అంటారు 72ఏళ్ల జానపద గాయని తథమ్మ. తను పాడిన పాటలకు కేరళ జానపద అకాడమీ అవార్డునీ అందుకున్నారీమె. కాలంతోపాటే వారసత్వానికి ఆధునికతను జత చేసుకుంటున్నారు ఈతరం అమ్మాయిలు. సంగీతంలో పీజీ పూర్తి చేసి పల్లెల్లో పిల్లలకు సంగీతం నేర్పిస్తున్నారు. ప్రస్తుతం అక్కడి అమ్మాయిలు తమ భవిష్యత్ లక్ష్యం సంగీత ఉపాధ్యాయురాళ్లుగా స్థిరపడటమే అని చెబుతున్నారు. ఇందుకు ప్రభుత్వ సహకారం కావాలని కోరుతున్నారు. తాజాగా కేరళ ప్రభుత్వం తొలి పాటల గ్రామంగా గుర్తింపునీ ఇచ్చింది.

కొలాజన్ డ్రింకులివి...



ఇరవై దాటగానే చర్మంలో కొలాజన్ తగ్గడం మొదలవుతుందట. అందుకే జాగ్రత్తలు తప్పనిసరి అంటుంటారు నిపుణులు. అలాగని క్రీములపైనే ఆధారపడకూడదు. లోపల్నుంచీ పోషణ కావాలి. అందుకే చాలామంది దగ్గరి దారిగా కొలాజన్ జెల్లీలు, ట్యాబెట్లు వగైరా తీసుకుంటారు. బదులుగా వీటిని తీసుకోండి.

- కొలాజన్ సింథసిస్‌లో విటమిన్ సిది ప్రధాన పాత్ర. ఇది తగ్గితే శరీరం అమైనో యాసిడ్లను కొలాజన్‌గా మార్చడంలో ఇబ్బంది పడుతుంది. అందుకే తగిన మొత్తంలో అందేలా చూసుకోవడం తప్పనిసరి. ఉదయాన్నే నిమ్మ రసం కలిపిన నీళ్లు తాగండి. ఇంకా నారింజ, బెర్రీ, టొమాటో వంటివీ ఎక్కువ తీసుకోవాలి.
- దానిమ్మ రసం తాగండి. దీనిలోని యాంటీ ఆక్సిడెంట్లు కొలాజన్ ఉత్పత్తికే సాయపడతాయి. క్యారెట్, నారింజ కలిపి స్మూతీలా చేసుకొనీ తాగొచ్చు. బీటా కెరోటిన్‌తోపాటు విటమిన్ సి అంది చర్మానికి మేలు చేస్తాయి.
- ఉడకబెట్టిన బీట్‌రూట్‌లో అరటిపండు, గ్రీక్ యోగర్ట్, కొన్ని అవిసెలు కలిపి తీసుకోండి. కావాల్సిన ప్రొటీన్, ఒమేగా-3 వంటివీ అందుతాయి. నారింజ, స్ట్రాబెర్రీ, పైనాపిల్‌లు కలిపి రసం తీయండి. ఆపై చియా విత్తనాలనూ, తేనెనీ చేర్చి తీసుకోండి. ఇవీ కొలాజన్ ఉత్పత్తికి సాయపడేవే! పైగా శరీరాన్ని హైడ్రేట్ చేసి, ఎలక్ట్రోలైట్లనీ అందిస్తాయి.

(c) eenadu

ఛాంపియన్స్



మెరుపుల కప్పు.. వచ్చేస్తోంది

టీ20 ప్రపంచకప్ మరో 4 రోజుల్లో

ఈనాడు క్రీడావిభాగం

కప్పులందు ప్రపంచకప్ వేరు.. అందులోనూ పొట్టి ఫార్మాట్లో ప్రపంచకప్ అంటే క్రికెట్ అభిమానుల్లో అమితాసక్తి ఉంటుంది. రోహిత్ సేన బ్రిడ్జ్‌టౌన్‌లో నమ్మశక్యం కాని విజయంతో ప్రపంచ కప్‌ను ఒడిసి పట్టిన క్షణాలు ఇంకా కళ్ల ముందు కదలాడుతుండగానే.. ఇంకో కప్పు వచ్చేసింది. ఈసారి ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వబోయేది భారతే కావడం విశేషం. కొన్ని మ్యాచ్‌లు శ్రీలంకలోనూ జరగబోతున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న టీమ్‌ఇండియా.. అదిరే ఫామ్‌తో టోర్నీలో అడుగుపెడుతోంది. 2024 టీ20 ప్రపంచకప్ గెలిచాక ఈ ఫార్మాట్లో భారత జట్టు ఒక్క సిరీస్ కూడా ఓడిపోకపోవడం గమనార్హం. దీంతో సూర్యకుమార్‌సేనపై భారీ అంచనాలే ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ లాంటి జట్లూ బలంగా కనిపిస్తున్నాయి. కిందటిసారి లాగే ఈసారి కూడా అత్యధికంగా 20 జట్లతో పొట్టి ప్రపంచకప్ జరగబోతోంది. తొలిసారిగా బంగ్లాదేశ్ ఈ టోర్నీలో బరిలోకి దిగట్లేదు. భారత్, పాకిస్థాన్ మ్యాచ్ జరగట్లేదన్న సంగతి తెలిసిందే. అయినా సరే టోర్నీపై ఆసక్తి ఏమీ తక్కువగా లేదు. ఈ నెల 7న మొదలై, మార్చి 8న ఫైనల్‌తో ముగిసే టోర్నీలో మెరుపులకు లోటు లేనట్లే.

ఫార్మాట్ ఇలా..

ప్రపంచకప్‌లో బరిలోకి దిగుతున్న 20 జట్లను అయిదు చొప్పున నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్‌లో ప్రతి జట్టూ మిగతా నాలుగు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-8కు అర్హత సాధిస్తాయి. అందులో నాలుగు జట్ల చొప్పున రెండు గ్రూప్‌లు ఉంటాయి. ప్రతి జట్టూ మిగతా మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. రెండు గ్రూప్‌ల్లో టాప్-2 జట్లు సెమీస్‌లో చోటు దక్కించుకుంటాయి.

ఏ జట్టు ఏ గ్రూప్‌లో?

గ్రూప్-ఎ: భారత్, పాకిస్థాన్, అమెరికా, నెదర్లాండ్స్, నమీబియా
గ్రూప్-బి: ఆస్ట్రేలియా, శ్రీలంక, ఐర్లాండ్, జింబాబ్వే, ఒమన్
గ్రూప్-సి: ఇంగ్లాండ్, వెస్టిండీస్, నేపాల్, ఇటలీ, స్కాట్లాండ్
గ్రూప్-డి: న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, కెనడా, యూఏఈ

3 ప్రపంచకప్‌ను అత్యధికంగా రెండుసార్లు గెలిచిన జట్లు. భారత్ 2007, 2024లో విజేతగా నిలవగా.. విండీస్ 2012, 2016లో ఛాంపియన్ అయింది. ఇంగ్లాండ్ 2010, 2022లో టైటిల్ సాధించింది.

9 ఇప్పటిదాకా జరిగిన టీ20 ప్రపంచకప్‌లు.

20 ఈసారి ప్రపంచకప్ బరిలో ఉన్న జట్లు.

55 టోర్నీలో మొత్తం మ్యాచ్‌లు.

1292 టీ20 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లి పరుగులు. అతనే టాప్‌స్కోరర్.

● భారత్‌లో టీ20 ప్రపంచకప్ జరగబోతుండడం ఇది రెండోసారి. తొలిసారి 2016లో ఇక్కడ టోర్నీ నిర్వహించారు. 2021లో యూఏఈలో జరిగిన టీ20 ప్రపంచకప్ ఆతిథ్యం కూడా బీసీసీఐదే. కొవిడ్ కారణంగా టోర్నీ అప్పుడు అక్కడ జరిగింది.

ఐసీసీకి రూ.2200 కోట్ల నష్టం?

International Cricket Council

దిల్లీ

ఐసీసీ ఈవెంట్లో భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ ద్వారా దాదాపు రూ.2200 కోట్ల ఆదాయం వస్తుందని ఓ అంచనా. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను పాకిస్థాన్ బహిష్కరించడంతో ఐసీసీకి భారీ నష్టం వాటిల్లనుంది. ఈ నెల 15న భారత్‌తో ఆడాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తున్నట్లు పాకిస్థాన్ ఆదివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. పాక్ ఆడకపోతే పీసీబీ ఆదాయంపైనా తీవ్ర ప్రభావం పడుతుంది. ఐసీసీకి కూడా నష్టం తప్పదు. ప్రసారదారు జియోస్టార్ ఇప్పటికే ఐసీసీతో బేరాలకు ప్రయత్నిస్తోంది. భారత్, పాక్ మ్యాచ్ జరగకపోతే ప్రసారదారు రూ.200-250 కోట్ల నష్టపోతుందని అంచనా. వ్యాపార ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం జియోస్టార్ కోల్పోనుంది. భారత్, పాక్ మ్యాచ్ సందర్భంగా 10 సెకన్ల స్లాట్ ధర రూ.40 లక్షల వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై ఐసీసీ భారీ జరిమానా విధించే అవకాశముంది. ఆ బోర్డుపై కఠిన చర్యలు ఉంటాయని ఇప్పటికే హెచ్చరించింది కూడా. పాక్ నిర్ణయం ఆటకు మంచిది కాదని ఐసీసీ పేర్కొంది. పీసీబీ వార్షిక ఆదాయం సుమారు రూ.300 కోట్లు. 2027 వరకు భారత్, పాకిస్థాన్ మ్యాచ్‌లను హైబ్రిడ్ విధానంలో నిర్వహించాలని ఐసీసీ, పీసీబీ, బీసీసీఐ అంగీకరించిన నేపథ్యంలో తన చర్యలను సమర్థించుకోవడం పాక్‌కు కష్టమే. ఒకవేళ నాకౌట్లో భారత్‌తో తలపడాల్సివస్తే ఆ జట్టు ఏం చేస్తుందన్నది ఇప్పుడు ఎదురవుతున్న ప్రశ్న. అప్పుడు కూడా ప్రభుత్వం చెప్పినట్లు నడుచుకుంటామని ఓ పీసీబీ అధికారి చెప్పాడు. పాకిస్థాన్ ఈ నెల 7న నెదర్లాండ్స్ పోరుతో ప్రపంచకప్ పోరాటాన్ని ప్రారంభించనుంది.



గావస్కర్

పాక్‌పై చర్యలు తీసుకోవాలి

టీ20 ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించిన పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ అన్నాడు. "ప్రపంచవ్యాప్తంగా స్పందనలు చూశాక వచ్చే నాలుగైదు రోజుల్లో పాక్ తన నిర్ణయాన్ని మార్చుకునే అవకాశముంది. ఇందులో కొత్తేమీ లేదు. పాకిస్థాన్ క్రికెటర్లు రిటైరై.. నాలుగైదు రోజుల తర్వాత 'మా అభిమానులు ఇంకా ఆడమని అంటున్నారు' అంటూ తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం మనకు తెలుసు. ఇది మరోసారి జరగొచ్చు. రిటైర్మెంట్ నుంచి తిరిగి రావడం పాకిస్థాన్ ఆటగాళ్లకు అలవాటే. అలాంటిదే ఫిబ్రవరి 15 లోపు జరగొచ్చు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడంపై పాక్ సరైన కారణాలు చూపకపోతే పాకిస్థాన్‌పై చర్యలు తీసుకోవాలి" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు. భవిష్యత్తులో ఏ జట్టూ ఇలా చేయకుండా ఉండేలా చర్యలుండాలని సన్నీ అభిప్రాయపడ్డాడు.

రాత్రి.7.30 నుంచి

ఆర్సీబీని ఢీకొట్టేదెవరో!

నేడే దిల్లీ-గుజరాత్ ఎలిమినేటర్



గార్డ్‌నర్



జెమీమా

వడోదర: డబ్ల్యూపీఎల్-4లో ఆసక్తికర సమరానికి వేళైంది. మంగళవారం జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో దిల్లీ క్యాపిటల్స్ అమీతుమీ తేల్చుకోనుంది. తొలి మూడు సీజన్లలో ఫైనల్‌కు దూసుకెళ్లిన దిల్లీ.. మరోసారి టైటిల్ సమరానికి అర్హత సాధించాలనే పట్టుదలతో ఉంది. జెమీమా సారథ్యంలోని దిల్లీ పయనం లీగ్ దశలో ఒడుదొడుకులతో సాగింది. ఎనిమిది మ్యాచ్‌ల్లో నాలుగు గెలిచి.. నాలుగు ఓడింది. మరోవైపు గుజరాత్ 5 మ్యాచ్‌లు నెగ్గి.. మూడింట్లో ఓడి రెండో స్థానంతో ముందంజ వేసింది. ఈ సీజన్లో వెలుగులోకి వచ్చిన పేసర్ నందని శర్మపై మరోసారి దిల్లీ ఆశలు పెట్టుకుంది. కీలక సమయాల్లో వికెట్లు తీయడమే కాక.. డెత్ ఓవర్లలో బ్యాటర్లకు కళ్లెం వేసి నందని ఆకట్టుకుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ శ్రీచరణి రాణించడం కూడా దిల్లీకి కీలకం. నందని, శ్రీచరణి ఈ సీజన్లో చెరో 14 వికెట్లు పడగొట్టారు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ మరిజేన్ కాప్ ఆ జట్టుకు ప్రధాన బలం. ముంబయితో గత మ్యాచ్‌లో ఆమె బంతితో ప్రత్యర్థిని దెబ్బ కొట్టింది. జెమీమా, లారా వోల్వార్ట్, లిజెలీ లీ, షెఫాలి వర్మలతో దిల్లీ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఈ సీజన్లో లారా వోల్వార్ట్, లిజెలీ, షెఫాలి 200పైన పరుగులు చేశారు. చివరి లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్‌ను ఓడించడం దిల్లీ ఆత్మవిశ్వాసాన్ని ఎంతో పెంచేదే. అయితే ఆష్లీ గార్డ్‌నర్ నాయకత్వంలోని గుజరాత్‌ను తక్కువ అంచనా వేస్తే దిల్లీకి చేదు అనుభవం తప్పదు. ఆష్లీతో పాటు సోఫీ డివైన్, బెత్ మూనీ, జార్జియా వేర్‌హామ్‌ల రూపంలో ప్రపంచ స్థాయి స్టార్ల బలం ఆ జట్టుకు ఉంది. ముఖ్యంగా సోఫీ డివైన్ బంతి, బ్యాట్‌తో అదరగొడుతోంది. ఆమె ఇప్పటిదాకా 237 పరుగులు చేసి.. 17 వికెట్లు పడగొట్టింది. ఎలిమినేటర్‌లోనూ ఆమె రాణిస్తే గుజరాత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో పేసర్ రేణుక సింగ్ సత్తా చాటడం ఆ జట్టుకు ముఖ్యం. ఎలిమినేటర్‌లో గెలిచే జట్టు.. గురువారం ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఢీకొంటుంది.

భారత క్రీడారంగంలో ఏఐ విప్లవం

దిల్లీ: భారత క్రీడారంగంలో సాంకేతిక విప్లవం రానుంది. క్రీడాకారుల శిక్షణ, ఆహార నియమాలు, గాయాల అంచనా నుంచి వయసు నిర్ధరణ వరకు అన్ని అంశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) కీలకపాత్ర పోషించనుంది. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ సెంటర్ ఫర్ స్పోర్ట్స్ సైన్స్ అండ్ రీసర్చ్ (ఎన్‌సీఎస్ఎస్ఆర్)లో దేశంలోనే తొలిసారిగా అథ్లెట్ మేనేజ్‌మెంట్ అండ్ స్పోర్ట్స్ సైన్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఐఐటీ బాంబే భాగస్వామ్యంతో నాస్కామ్ డీప్‌టెక్ స్టార్టప్ 'డార్విన్' దీన్ని అభివృద్ధి చేసింది. ప్రస్తుతానికి ఈ వ్యవస్థ అగ్రశ్రేణి క్రీడాకారులకు సేవలందిస్తున్నప్పటికీ.. భవిష్యత్తులో జూనియర్ స్థాయికి విస్తరించనున్నారు. ఫలితంగా 'క్యాచ్ దెమ్ యంగ్' లక్ష్యం సాకారమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. క్రీడాకారుల దైనందిన జీవితంలోని అతిచిన్న వివరాలను కూడా కోచ్‌లు, క్రీడా నిపుణులు పర్యవేక్షించొచ్చు. ఒక అథ్లెట్ ఉదయం ఎన్ని బాదం పప్పులు తిన్నారు.. ఎంత నిమ్మరసం తాగారు అన్న వివరాల్ని కూడా నమోదు చేయొచ్చు. గాయాలను గుర్తించడమే కాకుండా.. ముందుగానే అంచనా వేయొచ్చు. భారత క్రీడారంగంలో ప్రధాన సమస్యగా ఉన్న వయసు మోసాలకు అడ్డుకట్ట వేయడానికి ఈ ఏఐ వ్యవస్థ దోహదపడుతుంది.




తిలక్ వర్మ

తిలక్ వర్మ సిద్ధం

ముంబయి: టీ20 ప్రపంచకప్ ముంగిట టీమ్‌ఇండియాకు శుభవార్త. కీలక ఆటగాడు తిలక్‌వర్మ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించాడు. శస్త్ర చికిత్స కారణంగా న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు దూరమైన ఈ ఎడమ చేతివాటం బ్యాటర్ భారత్-ఎ జట్టు తరపున బరిలో దిగి సత్తా చాటాడు. సోమవారం అమెరికాతో టీ20 ప్రపంచకప్ వార్మప్ మ్యాచ్‌లో తిలక్ (38; 24 బంతుల్లో 3×4, 2×6) రాణించాడు. అతడు ఎలాంటి ఇబ్బందిలేకుండా బ్యాటింగ్, ఫీల్డింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో అమెరికాపై భారత్-ఎ 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట భారత్ జట్టు 20 ఓవర్లలో 3 వికెట్లకు 238 పరుగులు చేసింది. ఎన్ జగదీశన్ (104; 55 బంతుల్లో 11×4, 5×6) మెరుపు సెంచరీ చేశాడు. ఆయుష్ బదోని (60 నాటౌట్; 26 బంతుల్లో 6×4, 4×6) చెలరేగాడు. ప్రియాంశ్ ఆర్య (28) రాణించాడు. మ్యాచ్‌లో అమెరికా బౌలర్లు తేలిపోయినప్పటికీ బ్యాటర్లు మెరిశారు. 239 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన అమెరికా.. 19.4 ఓవర్లలో 200కు ఆలౌటైంది. ఆండ్రీస్ గౌస్ (44), సంజయ్ కృష్ణమూర్తి (41), శుభమ్ రంజన్ (28), హర్మీత్ సింగ్ (25) పోరాడారు. రవి బిష్ణోయ్ మూడు వికెట్లు పడగొట్టగా.. నమన్ ధీర్, ఖలీల్ అహ్మద్ రెండేసి వికెట్లు తీశారు. భారత్ ఈ నెల 7న ప్రపంచకప్ తొలి పోరులో అమెరికాతోనే తలపడనుంది.

సిరీస్ ఇంగ్లాండ్ సొంతం



టామ్ బాంటన్

పల్లెకెలె: శ్రీలంకపై వన్డే సిరీస్ గెలిచిన ఇంగ్లాండ్.. టీ20 సిరీస్‌నూ సొంతం చేసుకుంది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఫలితం తేలిన రెండో టీ20లో ఆరు వికెట్ల తేడాతో గెలిచిన ఇంగ్లిష్ జట్టు మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. 190 పరుగుల ఛేదనలో ఇంగ్లాండ్ 7.2 ఓవర్లలో 57/2 వద్ద ఉండగా వర్షం రావడంతో.. లక్ష్యాన్ని 17 ఓవర్లలో 168కి సవరించారు. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' టామ్ బాంటన్ (54; 33 బంతుల్లో 4×4, 3×6), హ్యారీ బ్రూక్ (36; 12 బంతుల్లో 2×4, 4×6) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడడంతో ఇంగ్లాండ్ మరో రెండు బంతులు ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది. జోస్ బట్లర్ (39) రాణించాడు. పతిరన రెండు వికెట్లు తీశాడు. మొదట శ్రీలంక 5 వికెట్లకు 189 పరుగులు సాధించింది. ఓపెనర్లు పతుమ్ నిశాంక (34), కమిల్ మిషారా (36) పవర్‌ప్లేలో చెలరేగారు. కుశాల్ మెండిస్ (32; 17 బంతుల్లో 4×4, 1×6), పవన్ రత్నాయకే (40; 22 బంతుల్లో 5×4, 1×6) మధ్య ఓవర్లలో మెరిశారు. విల్ జాక్స్ (1/24), అదిల్ రషీద్ (1/25) మెరుగ్గా బౌలింగ్ చేశారు. జోఫ్రా ఆర్చర్ రెండు వికెట్లు తీసినప్పటికీ ఎక్కువ పరుగులిచ్చుకున్నాడు.

హెచ్‌సీఏ అధ్యక్షుడిగా అమర్‌నాథ్

● జగన్మోహన్‌రావుపై వేటు వేసిన అంబుడ్స్‌మన్



అమర్‌నాథ్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఫోర్జరీ పత్రాలతో ఎన్నికల్లో పోటీ చేసి.. నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణల నేపథ్యంలో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుపై అంబుడ్స్‌మన్ జస్టిస్ సురేశ్‌కుమార్ కైత్ వేటు వేశారు. ఆయనను తక్షణమే పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన అమర్‌నాథ్‌ను నూతన అధ్యక్షుడిగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బ్లాక్‌మెయిల్ చేశాడన్న ఆరోపణలు.. సీఐడీ అరెస్టు నేపథ్యంలో జగన్మోహన్‌రావును ఇంతకుముందే హెచ్‌సీఏ సస్పెండ్ చేసింది. దీంతో ఉపాధ్యక్షుడు దల్జీత్‌సింగ్ తాత్కాలిక అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంబుడ్స్‌మన్ తాజా తీర్పుతో అమర్‌నాథ్ పూర్తిస్థాయి అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. సోమవారం ఉప్పల్ స్టేడియంలో నూతన అధ్యక్షుడిగా అమర్‌నాథ్ బాధ్యతలు కూడా స్వీకరించారు. 2023 అక్టోబరు 20న జరిగిన హెచ్‌సీఏ ఎన్నికల్లో 63 ఓట్లు సాధించిన జగన్మోహన్‌రావు అధ్యక్షుడిగా ఎన్నికవగా.. అమర్‌నాథ్ (62 ఓట్లు)కు త్రుటిలో పదవి చేజారింది. అయితే జగన్మోహన్‌రావు 'శ్రీచక్ర క్రికెట్ క్లబ్' ప్రతినిధిగా తప్పుడు పత్రాలు సమర్పించి అక్రమంగా పోటీ చేశారంటూ అంబుడ్స్‌మన్‌ను అమర్‌నాథ్ ఆశ్రయించారు. గౌలిపుర క్రికెట్ క్లబ్‌ను శ్రీచక్ర క్లబ్‌గా మార్చడం చెల్లదని అప్పటి అంబుడ్స్‌మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తీర్పునిచ్చిన విషయాన్ని అమర్‌నాథ్ ప్రధానంగా ప్రస్తావించారు. మరోవైపు సన్‌రైజర్స్ వ్యవహారంలో విచారణ చేపట్టిన సీఐడీ.. శ్రీచక్ర క్లబ్ కోశాధికారిగా జగన్మోహన్‌రావు నకిలీ పత్రాలు సృష్టించి ఎన్నికల్లో పోటీ చేసినట్లు నిర్ధరించింది. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెండర్లు లేకుండానే క్యాటరింగ్ కాంట్రాక్టులు కట్టబెట్టాడని.. ప్లంబింగ్, ఏసీలు, దుస్తుల కొనుగోళ్లలో కోట్లాది రూపాయల నిధులు పక్కదారి పట్టించాడని జగన్మోహన్‌రావుపై ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే 2025 జులై 9న సీఐడీ అధికారులు అతడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. అమర్‌నాథ్ పిటిషన్‌ను విచారించిన అంబుడ్స్‌మన్ జస్టిస్ సురేశ్ కుమార్ కైత్.. జగన్మోహన్‌రావు ప్రవర్తన హెచ్‌సీఏ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉందని అభిప్రాయపడ్డారు. హైకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ.. జగన్మోహన్‌రావును హెచ్‌సీఏ కార్యాలయంలోకి, స్టేడియాల్లోకి ప్రవేశించకుండా ఆంక్షలు విధించిన విషయాన్ని అంబుడ్స్‌మన్ గుర్తుచేశారు. తప్పుడు పత్రాల ద్వారా పదవిని పొందడం వంటి తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్న వ్యక్తికి అధ్యక్షుడిగా కొనసాగే అర్హత లేదని స్పష్టంచేశారు. హెచ్‌సీఏ ప్రయోజనాల దృష్ట్యా అధ్యక్ష పదవిని ఎక్కువ కాలం ఖాళీగా ఉంచలేమని పేర్కొన్నారు. ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటు తేడాతో రెండో స్థానంలో నిలిచిన అమర్‌నాథ్‌ను అధ్యక్షుడిగా ప్రకటిస్తున్నట్లు తీర్పు వెలువరించారు. మిగిలిన పదవీకాలానికి అమర్‌నాథ్ అధ్యక్షుడిగా కొనసాగుతాడని తెలిపారు.



తన్వి శర్మ

భారత షట్లర్లకు పరీక్ష

ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ నేటి నుంచే

కింగ్‌డావో (చైనా): ఆసియా టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ కఠిన సవాల్‌కు సిద్ధమైంది. మంగళవారం ప్రారంభం కానున్న ఈ టోర్నీలో భారత మహిళల జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలో దిగుతోంది. అయితే స్టార్ షట్లర్ పి.వి.సింధు గాయం కారణంగా టోర్నీ నుంచి వైదొలగడంతో భారత్‌కు అతి పెద్ద ప్రతికూలత. సింగిల్స్‌లో తన్వి శర్మ, ఉన్నతి హుడా, మాళవిక బాన్సోద్, రష్మిక శ్రీ.. డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్, ట్రీసా జాలీ, ప్రియ.కె, శ్రుతి మిశ్రా, తనీషా క్రాస్టోలు భారత్ తరపున పోరాడనున్నారు. బుధవారం గ్రూపు-వై పోరులో మయన్మార్‌తో భారత్ తలపడనుంది. 2016, 2020లో కాంస్య పతకాలు సాధించిన భారత పురుషుల జట్టుకు లక్ష్యసేన్ సారథ్యం వహించనున్నాడు. కిదాంబి శ్రీకాంత్, హెచ్.ఎస్.ప్రణయ్, ఆయుష్ శెట్టి, తరుణ్ మన్నెపల్లి.. డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, సాయి ప్రతీక్, పృథ్వీ కృష్ణమూర్తి, హరిహరన్ ఆధ్వర్యంలో భారత్ తన అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. గ్రూపు-సి పోరులో సింగపూర్‌తో భారత్ పోటీపడనుంది.

అనాహత్‌కు టైటిల్



అనాహత్

దిల్లీ: భారత యువ స్క్వాష్ సంచలనం అనాహత్ సింగ్.. కెరీర్లో అతి పెద్ద టైటిల్‌ను చేజిక్కించుకుంది. ఆమె వాషింగ్టన్ ఫైర్ ఓపెన్ స్క్వాష్ ఈవెంట్లో విజేతగా నిలిచింది. ఫైనల్లో అనాహత్ 12-10, 11-5, 11-7తో ప్రపంచ పదో ర్యాంకు క్రీడాకారిణి జార్జినా కెన్నడీ (ఇంగ్లాండ్)ను ఓడించడం విశేషం. ఇంతకుముందు జార్జినాతో ఆడిన మ్యాచ్‌లో ఓటమి పాలైన అనాహత్.. ఈసారి ఆరంభం నుంచి నిలకడగా ఆడి విజయం సాధించింది. క్వార్టర్స్‌లో 17వ ర్యాంకర్‌ను ఓడించిన ఆమె.. సెమీస్‌లో 23వ ర్యాంకు క్రీడాకారిణిపై పైచేయి సాధించింది. దిల్లీకి చెందిన అనాహత్ వయసు 15 ఏళ్లే. ఈలోపే ఆమె పీఎస్ఏ టూర్‌లో ఆడిన 26 టోర్నీల్లో 15 టైటిళ్లు సాధించింది. ఈ ప్రదర్శనతో పీఎస్ఏ ర్యాంకింగ్స్‌లో ఒకేసారి 12 స్థానాలు మెరుగై.. టాప్-20లోకి దూసుకెళ్లింది. ప్రస్తుతం అనాహత్ ర్యాంకు 19. "చాలా ఆనందంగా ఉంది. ర్యాంకింగ్ మెరుగుపరుచుకోవాలంటే ఈ ఈవెంట్లలో ఉత్తమ ప్రదర్శన చేయాలని తెలుసు. బాగా సాధన చేశాను. నాలోని ఉత్తమ ఆటను బయటికి తీశాను. ఇలా ఆడగలుగుతున్నందుకు సంతృప్తిగా అనిపిస్తోంది" అని అనాహత్ తెలిపింది. ఏడాదిగా సంచలన విజయాలతో దూసుకెళ్తున్న అనాహత్.. గత ఏడాది డిసెంబరులో భారత జట్టు స్క్వాష్ ప్రపంచకప్ గెలవడంలోనూ కీలక పాత్ర పోషించింది. దిల్లీకి చెందిన అనాహత్.. మాజీ ఆటగాడు సౌరభ్ ఘోషల్ శిక్షణలో రాటుదేలింది.

కంగారూ పచ్చబొట్టుతో..



అల్కరాస్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలిచి కెరీర్ స్లామ్ సాధించిన స్పెయిన్ స్టార్ కార్లోస్ అల్కరాస్ ఈ విజయాన్ని ఎప్పటికీ గుర్తుండిపోయేలా తన శరీరంపై కంగారూ పచ్చబొట్టు వేయించుకోబోతున్నాడు. సెర్బియా దిగ్గజ ఆటగాడు నొవాక్ జకోవిచ్‌ను ఫైనల్లో ఓడించిన 22 ఏళ్ల అల్కరాస్.. కెరీర్‌లో తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ గెలిచాడు. "ఆస్ట్రేలియన్ ఓపెన్ సాధించినందుకు గుర్తుగా నా శరీరంపై కంగారూ పచ్చబొట్టు రాబోతోంది. కాలి పిక్కపై టాటూ వేయించుకుంటున్నా. అయితే అది ఎడమ వైపా లేదా కుడివైపా అనేది ఇంకా నిర్ణయించుకోలేదు. రాడ్‌లేవర్ ఎరీనాలో టైటిల్ నెగ్గానంటే ఇంకా నమ్మలేకపోతున్నా. జకోవిచ్‌తో ఫైనల్లో ఛాంపియన్‌షిప్ పాయింట్ కోసం ఆడేటప్పుడు ఒకింత ఒత్తిడికి గురయ్యా" అని అల్కరాస్ తెలిపాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ గెలవడం ద్వారా కెరీర్ స్లామ్ పూర్తి చేసిన అల్కరాస్ (22 ఏళ్ల 272 రోజులు) ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. అతడు డాన్ బాడ్జ్ (అమెరికా, 22 ఏళ్ల 363 రోజులు)ను అధిగమించాడు. పురుషుల సింగిల్స్‌లో డాన్ బాడ్జ్, ఫ్రెడ్ పెర్రీ, రాయ్ ఎమర్సన్, రాడ్ లేవర్, ఆండ్రి అగస్సీ, రోజర్ ఫెదరర్, రఫెల్ నాదల్, నొవాక్ జకోవిచ్ తర్వాత కెరీర్ గ్రాండ్‌స్లామ్ సాధించిన తొమ్మిదో ప్లేయర్ అల్కరాస్.

భారత్‌లో మళ్లీ ఫార్ములావన్!



దిల్లీ: భారత్‌లో మళ్లీ ఫార్ములావన్ కార్లు రయ్‌రయ్‌మంటూ దూసుకెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశంలో ఈ ఆటను పునరుద్ధరించడానికి ప్రభుత్వం ఆసక్తిని ప్రదర్శిస్తోంది. జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో 2011లో గ్రేటర్ నోయిడాలోని బుద్ధా సర్క్యూట్‌లో తొలిసారి ఎఫ్-1 రేసు జరిగింది. చివరగా 2013లో రేసు నిర్వహించారు. పన్నుల విషయంలో వివాదం, ఇతర సమస్యలతో భారత్‌కు ఫార్ములావన్ దూరమైంది. ఫార్ములావన్ పునరుద్ధరణ కోసం కేంద్ర క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఇప్పటికే బుద్ధా సర్క్యూట్‌ను పరిశీలించారని.. ప్రస్తుతం ఈ రేసింగ్ ట్రాక్ నిర్వహణను చూస్తున్న యమున ఎక్స్‌ప్రెస్‌వే ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులతో మాట్లాడారని తెలిసింది. ఈ ట్రాక్‌ను సొంతం చేసుకోవాలని అదానీ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అదే జరిగితే భారత్‌లో మళ్లీ ఎఫ్-1 ట్రాక్ సందడిగా మారే అవకాశాలున్నాయి. "ఎఫ్-1 రేసును నిర్వహించడం ఖర్చుతో కూడిన వ్యవహారం. ఆ సమస్య త్వరలో తీరుతుందని ఆశిస్తున్నాం. ఎఫ్-1 రేసును పునరుద్ధరించేలా చేస్తామని క్రీడల మంత్రి నిర్వాహకులకు భరోసా ఇచ్చారు" అని భారత ఫార్ములావన్ వర్గాలు తెలిపాయి. ఎఫ్-1 రేసు నిర్వహించాలంటే ఏడాదికి రూ.200 కోట్ల నుంచి 500 కోట్ల వరకు వ్యయం అవుతుంది.

(c) eenadu

అధునాతన చికిత్సల పుణ్యమాని ఇప్పుడు ఎంతోమంది క్యాన్సర్ నుంచి బయటపడుతున్న మాట నిజమే అయినా దీన్ని నివారించుకోవటంలోనే ఉంది అసలు విజ్ఞత. క్యాన్సర్లను తగ్గించుకోవటానికి సమర్థమైన, చవకైన, సుస్థిరమైన వ్యూహం ఇదేనన్నా అతిశయోక్తి కాదు. అందువల్ల జబ్బు వచ్చాక చికిత్స తీసుకోవటం కన్నా నివారించుకోవటం మీద దృష్టి సారించేలా చూడటం ప్రధానం. ప్రజలతో పాటు ప్రభుత్వాలు, సంస్థలూ కలిసి కట్టుగా పనిచేస్తేనే ఇది సాధ్యమవుతుంది.

నివారణే ప్రధానం

ఆశ్చర్యంగా అనిపించినా సుమారు 40-50% క్యాన్సర్లు నివారించుకోదగ్గవే. జీవనశైలిని మార్చుకోవటం, టీకాలు తీసుకోవటం, తొలిదశలో గుర్తించటం, పర్యావరణ పరిరక్షణ ఇందులో కీలక పాత్ర పోషిస్తాయి. మనదేశంలో చాలామందిలో ముదిరిన తర్వాతే క్యాన్సర్ బయటపడుతుండటం, మారుమూల ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అంతగా అందుబాటులో లేకపోవటం వంటి పరిస్థితుల నేపథ్యంలో నివారణ చర్యలతో ఎంతోమంది ప్రాణాలను కాపాడుకోవచ్చు. క్యాన్సర్‌తో బాధపడకుండా చూసుకోవచ్చు. వైద్య ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చు. కాబట్టి నివారించుకోదగిన ప్రధానమైన క్యాన్సర్ ముప్పు కారకాల గురించి తెలుసుకొని ఉండటం మంచిది.

పొగాకు వాడకం - ముఖ్యమైన కారణం

పొగాకు ఏ రూపంలోనైనా హానికరమే. సిగరెట్లు, చుట్టలు, బీడీలు కాల్చినా.. గుట్కా, జర్దా, ఖైనీ నమిలినా క్యాన్సర్ ముప్పు కొని తెచ్చుకున్నట్టే. మనదేశంలో మూడింట ఒకవంతు క్యాన్సర్లకు పొగాకే కారణం. నోరు, గొంతు, నాలుక, ఊపిరితిత్తులు, అన్నవాహిక, మూత్రాశయ క్యాన్సర్లకూ పొగాకు వాడకానికీ బలమైన సంబంధం ఉంది.

- ✦ పొగ తాగొద్దు, పొగాకు నమలొద్దు. అలవాటుంటే వెంటనే మానెయ్యాలి.
- ✦ పొగాకు వాడకాన్ని నిషేధించే చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి.
- ✦ బడులు, సమాజంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.
- ✦ పొగ మానెయ్యటానికి కౌన్సెలింగ్, తోడ్పాటు ఇవ్వాలి.

ఆరోగ్యకర ఆహారం, వ్యాయామం కీలకం

క్యాన్సర్ నివారణకు తోడ్పడే జీవనశైలి మార్పుల్లో అతి ముఖ్యమైనవి ఇవే. మాంసం, చక్కెర, ఉప్పు ఎక్కువగా తినటం.. పండ్లు, కూరగాయలు తక్కువగా తినటం వల్ల పెద్ద పేగు, రొమ్ము, జీర్ణాశయ క్యాన్సర్లు తలెత్తే అవకాశముంది. వ్యాయామం, శారీరక శ్రమ తగ్గినా క్యాన్సర్ల ముప్పు పెరుగుతుంది.

- ✦ పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలు, పప్పులతో కూడిన సమతులాహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయల్లో క్యాన్సర్ నిరోధకాలు ఎక్కువగా ఉంటాయి. మాంసాహారులు మాంసం తగ్గించుకోవాలి.
- ✦ బాగా శుద్ధిచేసి తయారుచేసిన ఆహార పదార్థాలు, తీపి పానీయాలు, కొవ్వు పదార్థాలు పరిమితం చేసుకోవాలి.
- ✦ వీలైనంత వరకూ ఉడికించిన పదార్థాలు తినాలి. వేపుళ్లు తగ్గించుకోవాలి.
- ✦ రోజూ కనీసం అరగంట వ్యాయామం చేయాలి.
- ✦ శరీర బరువు అదుపులో ఉంచుకోవాలి.

మద్యం - పెద్ద శత్రువు

మద్యం క్యాన్సర్ కారకం. ఇది కాలేయం, రొమ్ము, నోరు, గొంతు, అన్నవాహిక క్యాన్సర్లకు దారితీస్తుంది.

- ✦ మద్యం జోలికి వెళ్లొద్దు. అలవాటుంటే పరిమితం చేసుకోవాలి.
- ✦ మద్యంతో ముంచుకొచ్చే ముప్పుల మీద ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలి.

టీకాలు - ఒక అభయం

మనదేశంలో కొన్నిరకాల ఇన్‌ఫెక్షన్లు క్యాన్సర్లు తలెత్తటంలో పెద్ద పాత్ర పోషిస్తున్నాయి. హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ)తో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్.. హెపటైటిస్ బి, సితో కాలేయ క్యాన్సర్.. హెలికోబ్యాక్టర్ పైలోరీతో జీర్ణాశయ క్యాన్సర్లు వస్తున్నాయి. అదృష్టం కొద్దీ హెచ్‌పీవీ, హెపటైటిస్ బి నివారణకు టీకాలు అందుబాటులో ఉన్నాయి.

- ✦ యుక్తవయసు అమ్మాయిలందరికీ హెచ్‌పీవీ టీకా ఇప్పించాలి. వీలైతే అబ్బాయిలకూ ఇప్పించటం మంచిది.
- ✦ సార్వత్రిక హెపటైటిస్ బి టీకా కార్యక్రమాన్ని అమలు చేయాలి.
- ✦ సూదులు ఇవ్వటం, తీసుకోవటం, రక్త పరీక్షల విషయంలో సురక్షిత విధానాలు పాటించాలి.
- ✦ దీర్ఘకాల ఇన్‌ఫెక్షన్లకు ముందుగానే చికిత్స తీసుకోవాలి.

పర్యావరణ, వృత్తిపర అంశాలు

గాలి కాలుష్యం, పురుగు మందుల ప్రభావం, పారిశ్రామిక రసాయనాలు, పనిచేసే చోట సురక్షితంగా లేకపోవటం వంటివీ క్యాన్సర్ ముప్పు పెరిగేలా చేస్తాయి. ముఖ్యంగా ఊపిరితిత్తి, చర్మ క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఎక్కువ.

- ✦ కాలుష్యాన్ని కట్టడి చేయటానికి కఠినమైన చర్యలు తీసుకోవాలి.
- ✦ పరిశ్రమలు, ఆఫీసుల్లో భద్రత నియమాలు పాటించాలి.
- ✦ అవసరమైన చోట మాస్కుల వంటివి ధరించే ఏర్పాట్లు చేయాలి.
- ✦ పర్యావరణ ప్రమాదాల మీద ప్రజలకు అవగాహన కల్పించాలి.

ముందస్తు పరీక్షలు, తొలిదశలో గుర్తించటం

క్యాన్సర్ నివారణ చర్యలు ముప్పును తగ్గిస్తే.. తొలిదశలో గుర్తించటం ప్రాణాలను కాపాడుతుంది. ఎందుకంటే తొలిదశలోనే పట్టుకొని, తగు చికిత్స చేస్తే ఎన్నో క్యాన్సర్లను నయం చేయొచ్చు. ఇందుకు ముందస్తు పరీక్షలు (స్క్రీనింగ్) బాగా ఉపయోగపడతాయి.

- ✦ వీఐఏ (విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ అసిటిక్ యాసిడ్), పాప్ స్మియర్, హెచ్‌పీవీ పరీక్షలు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందే గుర్తించటానికి తోడ్పడతాయి.
- ✦ రొమ్ముల స్వీయపరీక్ష, డాక్టర్‌తో పరీక్షించుకోవటం, మామోగ్రామ్ ద్వారా రొమ్ముక్యాన్సర్‌ను పట్టుకోవచ్చు.
- ✦ తరచూ నోటిని పరీక్షించుకోవటం ద్వారా ముఖ్యంగా పొగాకు అలవాటు గలవారిలో నోటి క్యాన్సర్ ఆనవాళ్లను గుర్తించొచ్చు.
- ✦ పెద్దపేగు క్యాన్సర్ ముప్పు ఎక్కువగా గలవారికి కొలనోస్కోపీ పరీక్షతో ముందే కనుక్కోవచ్చు.

అవగాహన ఆయుధంగా

అవగాహన లేమి, అపోహలు, చిన్నచూపు, భయం మూలంగా క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోంది. అందువల్ల క్యాన్సర్ హెచ్చరిక సంకేతాలను గుర్తించటం, అపోహలను తొలగించటం, సమయానికి డాక్టర్‌ను సంప్రదించటం, చిన్నప్పటి నుంచి ఆరోగ్యకరమైన జీవనశైలి పాటించటం మీద విస్తృతంగా ప్రచారం చేయటం, అవగాహన కల్పించటం ముఖ్యం. పాఠశాలలు, కార్యాలయాలు, మీడియా, సామాజిక కార్యకర్తలు అంతా ఇందుకు కృషి చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.




డా॥ పి.విజయ్ ఆనంద్ రెడ్డి, డైరెక్టర్,
అపోలో క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్

మనదేశంలో క్యాన్సర్ పెద్ద సమస్యగా మారింది. ఏటా 15 లక్షలకు పైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. రోజురోజుకీ జనాభా, వృద్ధుల సంఖ్య, పట్టణీకరణ, జీవనశైలి మార్పులు పెరుగుతున్న తరుణంలో ఇవి మరింత భారంగా పరిణమించటం ఖాయంగా కనిపిస్తోంది. క్యాన్సర్ మరణాలూ ఎక్కువయ్యే ప్రమాదముంది. మరి దీన్ని ఓడించే మార్గమే లేదా? క్యాన్సర్‌పై అవగాహన పెంచుకుంటే ఇది సాధ్యమే. నివారణ మార్గాలతో రాకుండా చూసుకోవచ్చు. హెచ్చరిక సంకేతాలతో ముందే గుర్తించొచ్చు. ఇప్పుడు అత్యాధునిక చికిత్సలూ భరోసా కల్పిస్తున్నాయి. క్యాన్సర్‌ను ఎదుర్కోవటానికి మానసికంగా దృఢంగా ఉండటమూ ముఖ్యమే. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా వీటిన్నింటిపై సమగ్ర కథనం మీకోసం.

రేపు వరల్డ్ క్యాన్సర్ డే

క్యాన్సర్‌ను ఓడిద్దాం!



క్యాన్సర్ చికిత్స అనగానే శస్త్రచికిత్స, కీమో, రేడియేషన్ పద్ధతులే గుర్తుకొస్తాయి. ఇప్పుడు వీటికి తోడుగా అత్యాధునిక చికిత్సలూ మన అమ్ముల పొదిలో చేరుతున్నాయి.


అమ్ములపొదిలో అత్యాధునిక అస్త్రాలు

ఇమ్యునో, టార్గెటెడ్, ప్రిసిషన్, టీకా చికిత్సల వంటివి క్యాన్సర్లను ఓడించటానికి గొప్ప అస్త్రాలుగా ఉపయోగపడుతున్నాయి. కాస్త ఖర్చు ఎక్కువే అయినప్పటికీ ముదిరిన, తిరగబెట్టే క్యాన్సర్లను సమర్థంగా నిలువరిస్తున్నాయి. సంప్రదాయ చికిత్సలతో ఫలితం కనిపించని క్యాన్సర్లను మట్టి కరిపిస్తున్నాయి.

ఇమ్యూనోథెరపీ భరోసా

మన రోగనిరోధక వ్యవస్థనే క్యాన్సర్‌తో పోరాడేలా తీర్చిదిద్దితే? ఇమ్యునోథెరపీ ఇలాగే పనిచేస్తుంది. క్యాన్సర్ కణాలను గుర్తించేలా రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడేలా చేయటం దీని ప్రత్యేకత. ఇందులో కార్ టి-సెల్, చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్, బైస్పెసిఫిక్ టి-సెల్ ఎంగేజర్ థెరపీలు బాగా ప్రాచుర్యం పొందుతున్నాయి.

కార్ టి-సెల్ థెరపీ



కార్ టి సెల్స్ ఇలా క్యాన్సర్ కణాలకు అంటుకుపోయి, వాటిని చంపేస్తాయి.

● **కార్ టీ–సెల్ థెరపీ:** క్యాన్సర్ కణాలు రోగనిరోధక వ్యవస్థ కంట పడకుండా తప్పించుకోవటానికి ప్రత్యేక స్థితిని (ఇమ్యునోపెరెసిస్) సృష్టించుకుంటాయి. దీన్నుంచి తెల్ల రక్తకణాలను బయటపడేయాలంటే తిరిగి వాటిని క్యాన్సర్ కణాలను గుర్తించేలా తీర్చిదిద్దాలి. కార్ టి-సెల్ చికిత్స ఇదే చేస్తుంది. ఇందులో ముందుగా క్యాన్సర్ బాధితుల రక్తాన్ని సంగ్రహించి, దానిలోంచి టి కణాలను వేరు చేస్తారు. వీటిల్లో కొన్నింటిని ఎంచుకొని చిమెరిక్ యాంటీజెన్ రిసెప్టర్ (కార్)ను ఉత్పత్తి చేసే జన్యువును జొప్పిస్తారు. తర్వాత ఆయా క్యాన్సర్ కణాల గ్రాహకాలతో కూడిన ప్రత్యేక ద్రావణంలో పెట్టి, క్యాన్సర్ కణాలను గుర్తించేలా తర్ఫీదు ఇస్తారు. దీంతో టి కణాలు జన్యుపరంగా మారిపోయి, ఆ జ్ఞాపకాన్ని తమ జన్యువులో నిక్షిప్తం చేసుకుంటాయి. ఇమ్యునో పెరెసిస్‌ను అధిగమించే శక్తిని పొంది, క్యాన్సర్ కణాలను గుర్తించే శక్తిని సంతరించుకుంటాయి. వీటిని పెద్దఎత్తున వృద్ధి చేసి, సెలైన్ ద్రావణంలో కలిపి బాధితులు శరీరంలోకి ప్రవేశపెడతారు. అప్పుడవి క్యాన్సర్ కణాలను గుర్తించి, మింగేయటం ఆరంభిస్తాయి. ఈ గుణం వీటికి జీవితాంతం ఇలాగే ఉంటుంది. అందువల్ల ఇవి మనగలిగినంత కాలం ఆ రకం క్యాన్సర్ మళ్లీ రాదు. బాధితుల సొంత తెల్ల రక్తకణాల నుంచి సేకరించినవే కావటం వల్ల శరీరం తిరస్కరించే అవకాశమేదీ ఉండదు. మనదగ్గర దేశీయంగా రూపొందించిన తొలి కార్-టి చికిత్స నెక్స్‌కార్19 సమర్థంగా పనిచేస్తోంది. సైటోకైన్ల ఉప్పెన వంటి దుష్ప్రభావాలు లేకుండా సురక్షితంగా పనిచేసేలా దీన్ని వృద్ధి చేశారు. ల్యుకేమియా, లింఫోమాల చికిత్సలకు దీన్ని వాడుతున్నారు. దేశీయంగా రూపొంది, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన రెండో తరం కార్ టి-కణ చికిత్స కార్టెమీ కూడా అందుబాటులో ఉంది. తిరగబెట్టిన క్యాన్సర్లకు, హాడ్జ్‌కిన్స్ లింఫోమాలకు ఇది అద్భుతంగా పనిచేస్తుంది.

● **చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్:** రోగనిరోధక వ్యవస్థ అతిగా ప్రతిస్పందించకుండా చూడటంలో చెక్‌పాయింట్ ప్రొటీన్లు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి అంటుకుపోతే టి కణాలు క్యాన్సర్ కణితుల మీద దాడి చేయవు. ఇక్కడే ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్ రకం మందులు ఆదుకుంటున్నాయి. టోరిపాలిమాబ్, సింటిలిమాబ్, కామ్రెలిజుమాబ్, టిస్లెలిజుమాబ్ వంటి చెక్‌పాయింట్ ఇన్‌హిబిటార్స్ అందుబాటులో ఉన్నాయి. టి కణాలకు చెక్‌పాయిట్ ప్రొటీన్లను అంటుకోకుండా నిలువరించటం వీటి ప్రత్యేకత. దీంతో టి కణాలు క్యాన్సర్ కణాల మీద దాడి చేసి, వాటిని నిర్మూలిస్తాయి. కీమోథెరపీతో కలిపి వీటిని ఇస్తే చాలా రకాల క్యాన్సర్లలో మంచి ఫలితం కనిపిస్తోంది.

● **బైస్పెసిఫిక్ టీ–సెల్ ఎంగేజర్స్ (బైట్స్):** ఇవి ప్రత్యేకంగా తీర్చిదిద్దిన యాంటీబాడీలు. ఇవి ఒకే సమయంలో అటు క్యాన్సర్ కణితుల మీదుండే ట్యూమర్ స్పెసిఫిక్ యాంటీజెన్‌లకూ టి కణాల మీదుండే సీడీ3 గ్రాహకాలకూ అంటుకుపోతాయి. ఇలా రోగనిరోధక కణాలను కణితితో నేరుగా అనుసంధానం చేస్తాయి. అప్పుడు టి కణాలు ఉత్తేజితమై సైటోకైన్లను ఉత్పత్తి చేసి, చుట్టుపక్కల క్యాన్సర్ కణాలను చంపేస్తాయి. రక్తక్యాన్సర్లు, మైలోమాలకు బైట్స్ ఎంతగానో ఉపయోగపడతాయి.

టార్గెటెడ్ థెరపీ, ప్రిసిషన్ ఔషధాల అండ

● **యాంటీబాడీ–డ్రగ్ కాంజ్యుగేట్స్ (ఏడీసీస్):** ఇవి రసాయన బంధం ద్వారా మోనోక్లోనల్ యాంటీబాడీలు, కీమోథెరపీలను అనుసంధానం చేసే ఔషధాలు. వీటిని ఒకరకంగా 'జీవ క్షిపణులు' అనుకోవచ్చు. క్యాన్సర్ కణాల మీదుండే ప్రొటీన్లకు అంటుకుపోతాయి. కణాల వృద్ధిని ఆపే మందులను నేరుగా లోపలికి చేరవేస్తాయి. దీంతో ఆరోగ్యకర కణాలను ఎలాంటి హాని కలగకుండా, కేవలం క్యాన్సర్ కణాలు మాత్రమే నశిస్తాయి. సంప్రదాయ చికిత్సలకు స్పందించని క్యాన్సర్లకు ఇవి సమర్థంగా పనిచేస్తాయి. రకరకాల రొమ్ము, ఊపిరితిత్తి, రక్త క్యాన్సర్లను వీటితో చికిత్స చేయొచ్చు. ట్రాస్టుజుమాబ్ డెరుక్స్‌టెకన్, ట్రాస్టుజుమాబ్ ఎంటన్‌సైన్, బ్రెంటుగ్జిమాబ్ వెడోటిన్ వంటి ఏడీసీలు మనదగ్గర అందుబాటులో ఉన్నాయి.

● **బైస్పెసిఫిక్ యాంటీబాడీలు:** ఇవి ఒకే సమయంలో రెండు వేర్వేరు యాంటీజెన్లకు అంటుకుపోయే యాంటీబాడీలు. దీంతో రోగనిరోధక వ్యవస్థ మరింత త్వరగా, వేగంగా ప్రతిస్పందించి క్యాన్సర్ కణాల మీద దాడిచేస్తుంది. అమివాంటమాబ్ వంటి బైస్పెసిఫిక్ యాంటీబాడీలను మనదగ్గర వాడుతున్నారు.

● **మాలిక్యులర్లీ టార్గెటెడ్ మందులు:** కణితి వృద్ధి చెందటానికి, మనుగడ సాగించటానికి, ఇతర భాగాలకు విస్తరించటానికి తోడ్పడే ప్రొటీన్లు, జన్యు మార్పుల వంటి వాటిని అడ్డుకోవటం వీటి ప్రత్యేకత. సంప్రదాయ కీమోథెరపీల మాదిరిగా కాకుండా క్యాన్సర్ కణాలను కచ్చితంగా గుర్తిస్తాయి. అందువల్ల దుష్ప్రభావాలూ తక్కువే.

● **యాంజియోజెనెసిస్ ఇన్‌హిబిటార్స్:** ఇవి కణితుల్లో కొత్త రక్తనాళాలు ఏర్పడకుండా అడ్డుకుంటాయి. ఇలా ఆక్సిజన్, పోషకాలు అందకుండా నిలువరించటం ద్వారా క్యాన్సర్ కణాలు చనిపోయేలా చేస్తాయి.

నియోయాంటీజెన్ టీకాల ఆశ

ఇవి కొత్తతరం పర్సనలైజ్డ్ క్యాన్సర్ చికిత్సగా పురుడు పోసుకుంటున్నాయి. క్యాన్సర్‌ను నివారించే టీకాల వంటివి కావు. అప్పటికే తలెత్తిన కణితుల మీద ప్రభావం చూపుతాయి. క్యాన్సర్ కణాల్లో కణితి సంబంధ మార్పులు/యాంటీజెన్లు ఉంటాయి. వీటికి ప్రతిస్పందించేలా ఈ టీకాలు రోగనిరోధక వ్యవస్థకు శిక్షణ ఇస్తాయి. అప్పుడది క్యాన్సర్ కణాలను గుర్తించి, నిర్మూలిస్తుంది.



డా॥ డి.రఘునాథరావు, ప్రొఫెసర్, మెడికల్ ఆంకాలజీ
ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ
రెడ్ హిల్స్, హైదరాబాద్

క్యాన్సర్ తీవ్ర సమస్యే అయినా చాలావరకూ నెమ్మదిగానే మొదలవుతుంది. స్వల్ప మార్పులతో హెచ్చరిస్తూనే ఉంటుంది. తలెత్తిన చోటును బట్టి రకరకాల లక్షణాల రూపంలో తొంగి చూస్తుంటుంది. నిజానికి ప్రతి లక్షణమూ క్యాన్సర్‌కు సంబంధించింది కాకపోవచ్చు. అన్ని క్యాన్సర్లలోనూ స్పష్టమైన లక్షణాలు బయటపడకపోవచ్చు. కానీ శరీరంలో తలెత్తే మార్పుల మీద ఓ కన్నేసి ఉంచటం మంచిది. ఆదిలోనే గుర్తిస్తే చికిత్స తేలికవుతుంది.

హెచ్చరికో హెచ్చరిక!

- అసాధారణంగా బరువు తగ్గటం. ఆహార, వ్యాయామ నియమాలేవీ పాటించక పోయినా 4-5 కిలోలు.. అదీ తక్కువ సమయంలో తగ్గటం. హఠాత్తుగా ఆకలి తగ్గుతున్నా సందేహించాల్సిందే.
- శరీరంలో ఎక్కడైనా ఉన్నట్టుండి గడ్డలు తలెత్తటం. సాధారణంగా క్యాన్సర్ గడ్డలతో నొప్పి పుట్టదు. కానీ సైజు పెరుగుతున్నకొద్దీ చుట్టుపక్కల భాగాలను నొక్కటం వల్ల నొప్పి కలగొచ్చు.
- కొత్తగా మలబద్ధకం, విరేచనాలు వేధించటం. మలంలో, మూత్రంలో రక్తం పడటం.
- తరచూ మూత్రం రావటం, మూత్రాన్ని ఆపలేకపోవటం లేదా సరిగా రాకపోవటం, విసర్జన సమయంలో నొప్పి కలగటం.
- మలద్వారం లేదా జననాంగం నుంచి అసాధారణ రక్తస్రావం.
- సంభోగ సమయంలో రక్త స్రావం, నెలసరి నిలిచిన తర్వాత రుతుస్రావం.
- చర్మం, గోళ్ల లోపలి నుంచి రక్తస్రావం కావటం.
- మూడు వారాల కన్నా ఎక్కువగా గొంతు మారటం, మూడు వారాలు దాటినా దగ్గు తగ్గకపోవటం, దగ్గినప్పుడు రక్తం పడటం.
- నోట్లో నాలుక, బుగ్గలు, అంగిలి వంటి చోట్ల ఎంతకీ మానని పుండ్లు.
- విడవకుండా ఛాతీమంట లేదా అజీర్ణం. కడుపుబ్బరం, తినటం మొదలెట్టగానే కడుపు నిండినట్టుండటం.
- పుట్టుమచ్చల సైజు పెరగటం, దురద పెట్టటం, రంగు ముదరటం. మచ్చల నుంచి రసి, రక్తం రావటం.
- రొమ్ము చర్మం అసాధారణంగా మందం కావటం, సొట్ట పడటం, రొమ్ములో గడ్డలు, గడ్డల సైజు పెరగటం. నెలసరి నిలిచిన మహిళల్లో చనుమొనల నుంచి రక్తం రావటం.
- తీవ్రమైన నిస్సత్తువ, నీరసం. మగవారిలో రక్తహీనత.
- గొంతు వద్ద.. ముఖ్యంగా మగవారిలో థైరాయిడ్ గ్రంథి అసాధారణంగా ఉబ్బటం.
- ముద్ద మింగటంలో, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది.
- ఎముకల్లో తొలుస్తున్నట్టుగా నొప్పి. ఒంట్లో ఎక్కడైనా అసాధారణంగా నొప్పి వస్తూ పోతూ ఉండటం.
- చికిత్స తీసుకుంటున్నా చంకలు, గజ్జలు, మెడ వద్ద బిళ్లలు కట్టటం (లింఫ్ గ్రంథుల ఉబ్బు).
- రాత్రిపూట మరీ ఎక్కువగా చెమట పట్టటం.



డా॥ సింహాద్రి చంద్రశేఖర రావు
సర్జికల్ ఆంకాలజిస్టు, సౌమ్య హాస్పిటల్, కార్ఖానా, సికింద్రాబాద్

క్యాన్సర్ పేరు వింటేనే భయపడతాం. ఇక తమకే వచ్చిందని తెలిస్తే? ఉన్నట్టుండి జీవితం తల కిందులైనట్టు అనిపిస్తుంది. తీవ్ర భావోద్వేగానికి లోనవుతారు. చాలామంది తమకు జబ్బు వచ్చిందంటే అంగీకరించరు కూడా. 'నాకెందుకు వచ్చింది? నేనేం పాపం చేశాను?' అని చింతిస్తుంటారు. మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందో, ఖర్చులను ఎలా తట్టుకోవాలో, చికిత్సలు ఎక్కడికి దారితీస్తాయోనని బాధపడు తుంటారు. ఇవన్నీ మనసు మీద గణనీయమైన ప్రభావమే చూపుతాయి. ఆందోళన, కుంగుబాటు వంటి మానసిక సమస్యలకు దారితీస్తుంటాయి. క్యాన్సర్ చికిత్సల్లో వీటిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

మనసుకూ చికిత్స

సమస్యలు రకరకాలు

ఆందోళన: క్యాన్సర్ హఠాత్తుగా బయటపడటమో.. రోజురోజుకీ శారీరక, మానసిక బలం తగ్గటమో.. కారణమేదైనా చాలామంది ఆందోళనకు గురవుతుంటారు. ఆత్మ విశ్వాసం సన్నగిల్లుతుంది. శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ వంటి చికిత్సలు శారీరకంగా అసౌకర్యం కలిగిస్తుండొచ్చు. వీటితో దుష్ప్రభావాలూ ఉండొచ్చు. నొప్పి, అవయవాల ఆకారం మారటం కూడా ఆందోళనను పెంచుతాయి. చికిత్సల ఫలితాలు ఎలా ఉంటాయోననేది మరో కారణం. క్యాన్సర్ దశ, రకం, చికిత్స సామర్థ్యం, శరీరం మందులకు స్పందించే తీరు వంటి వాటిని బట్టి చికిత్సల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. భవిష్యత్తు ఎలా ఉంటుందో, క్యాన్సర్ తిరగబెడుతుందేమో, కుటుంబ సభ్యులతో సంబంధాలు ఎలా ఉంటాయో, నలుగురికి తెలిస్తే ఏమనుకుంటారోననేవీ ఆందోళన కలగజేస్తుంటాయి.

కుంగుబాటు: క్యాన్సర్ బాధితుల్లో కుంగుబాటూ ఎక్కువే. జబ్బు నిర్ధారణ, చికిత్స ప్రక్రియలతో పాటు రోజువారీ పనులు అస్తవ్యస్తం కావటం, ఆర్థిక పరిస్థితులు, సంబంధాలు దెబ్బతినటం వంటివి దీనికి దారితీస్తుంటాయి. ఫలితంగా అదేపనిగా నిరాశ, దిగులు, ఒకప్పుడు ఆనందం కలిగించిన పనుల మీద ఆసక్తి లేకపోవటం, ఆకలి లేదా బరువు తగ్గటం, నిద్ర అస్తవ్యస్తం కావటం, నిస్సత్తువ, ఏకాగ్రత కుదరకపోవటం, మరణానికి సంబంధించిన ఆలోచనలు రావటం వంటివి వేధిస్తుంటాయి.

పీటీఎస్‌డీ: క్యాన్సర్‌ను ఎదుర్కోవటం, చికిత్సలు తీసుకోవటం కొందరికి కష్టంగా అనిపించొచ్చు. ఇది గాయాల వంటి వాటికి గురైన అనంతరం తలెత్తే ఒత్తిడి (పీటీఎస్‌డీ) సమస్యగా మారొచ్చు. జబ్బు నిర్ధారణ దగ్గరి నుంచి ఇంజెక్షన్లు తీసుకోవటం, ఎక్కువ రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి రావటం, తిరగబెడుతుందనే భయం వంటివి దీనికి కారణమవుతుంటాయి. కొందరికి పీటీఎస్‌డీ పీడకలల రూపంలోనూ వేధించొచ్చు.

దన్ను, ధైర్యం అవసరం

మానసిక ఒత్తిడి, సమస్యలతో రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో క్యాన్సర్ మరింత తీవ్రం కావొచ్చు, చికిత్సలు సమర్థంగా పనిచేయకపోవచ్చు. కాబట్టి మానసికంగా దృఢంగా ఉండటం, తగు జాగ్రత్తలు తీసుకోవటం చాలా ముఖ్యం.

భావాలను వెలిబుచ్చటం: కొందరు బాధలో కోపం, చిరాకు ప్రదర్శిస్తుండొచ్చు. నిజానికివి మనసులోని భావాలను బయటకు వెలిబుచ్చే ప్రయత్నాలే. ఇలాంటివారు త్వరగా బాధ నుంచి బయటపడే అవకాశముంది కూడా. కాబట్టి స్నేహితులు, కుటుంబ సభ్యులు, క్యాన్సర్ నుంచి బయటపడ్డవారు, సపోర్టు గ్రూపులతో మాట్లాడాలి. ఎవరితోనూ చెప్పుకోవద్దని భావిస్తే కాగితం మీద భావాలను రాసుకున్నా మనసు తేలిక పడుతుంది.

నిందించుకోవద్దు: నాకే ఎందుకొచ్చింది? నేనేం పాపం చేశాను? అని నిందించుకోవటం మానెయ్యాలి. క్యాన్సర్ ఎవరికి, ఎందుకొస్తుందో చెప్పటం సాధ్యం కాదు. అందరి శరీరాలూ ఒకేలా ఉండవు. క్యాన్సర్ ఎవరికైనా రావొచ్చనే సంగతిని తెలుసుకోవాలి.


అవగాహన కలిగుండటం: ఇది చాలా ప్రధానం. సమస్య ఏంటి? ఎలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయి? వీటి ఫలితం ఎలా ఉంటుంది? దుష్ప్రభావాలేవైనా ఉంటాయా? అనేవి తెలియటం అవసరం. అయితే కొందరు కుటుంబ సభ్యులు సమస్యను బాధితులకు తెలపకుండా దాచుతుంటారు. చెబితే భయపడతారేమోనని భావిస్తుంటారు. ఇలా చేస్తే మానసికంగా సిద్ధంగా ఉండరని గుర్తించాలి. అన్ని విషయాలను ముందే తెలియజేస్తే నిబ్బరంగా ఉండటానికి వీలుంటుంది. చాలామందికి డాక్టర్‌తో ఎలా మాట్లాడాలి? ఏయే విషయాలు తెలుసుకోవాలి? అనేవీ తెలియవు. ఇంటికి వెళ్లాక అదెలా? ఇదెలా? అని ఆలోచిస్తుంటారు. మథన పడుతుంటారు. అందువల్ల ఆయా విషయాలను ఇంట్లోనే కాగితం మీద రాసుకొని, డాక్టర్ దగ్గరికి వెళ్లినప్పుడు ఒక్కొక్కటిగా అడిగి, సందేహాలను నివృత్తి చేసుకోవాలి. హఠాత్తుగా ఏదైనా ఇబ్బంది తలెత్తితే ఎవరిని సంప్రదించాలి? అందుబాబులో ఎవరుంటారు? ఆసుపత్రి హెల్ప్‌లైన్ నంబరు ఉందా? ఇలాంటి విషయాలు తెలిస్తే సగం ధైర్యం వస్తుంది.

మానసిక నిపుణుల సాయం: ఆందోళన, కుంగుబాటు, ఒత్తిడి వంటివి ఇబ్బంది పెడుతుంటే మానసిక నిపుణుల సాయం తప్పకుండా తీసుకోవాలి. నిజానికి క్యాన్సర్ ఆసుపత్రుల్లో ప్రస్తుతం మానసిక నిపుణులూ ఉంటున్నారు. వీరి కౌన్సెలింగ్ బాగా ఉపయోగపడుతుంది. ఇందులో జబ్బును అంగీకరించేలా చేయటం దగ్గరి నుంచి ప్రస్తుత పరిస్థితుల్లో ఎలా మెలగాలో, ఎలా ఆలోచించేలా నేర్పిస్తారు. దీంతో మానసిక ప్రశాంతత చేకూరుతుంది. అవసరమైతే మందులూ ఇస్తారు.

విశ్రాంతి మార్గం: అదేపనిగా క్యాన్సర్ గురించి ఆలోచించటం కన్నా మనసును దాన్నుంచి మళ్లించే ప్రయత్నం చేయాలి. సంగీతం వినటం, ఆరుబయట నడవటం, ఇష్టమైన హాబీలు, ధ్యానం వంటివి ఇందుకు బాగా ఉపయోగపడతాయి. వీలైనంతవరకూ చురుకుగా ఉండటానికి ప్రయత్నించాలి.




డా॥ శ్రీలక్ష్మి పింగళి, ప్రొఫెసర్ ఆఫ్ సైకియాట్రీ
ప్రభుత్వ వైద్య కళాశాల, సంగారెడ్డి



(c) eenadu

కేరళ సూక్ష్మ వ్యూహం

జాతీయ, రాష్ట్ర పక్షులు, జంతువులను చూశాం. కేరళ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసి.. బ్యాసిలస్ సబ్టిలస్ అనే బ్యాక్టీరియంను 'రాష్ట్ర సూక్ష్మజీవి'గా ప్రకటించింది. మంచి సూక్ష్మజీవులపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి ఈ చర్యను చేపట్టింది. దేశంలో ఇలాంటి నిర్ణయం తీసుకున్న తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందింది. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణలో సూక్ష్మజీవుల పాత్రపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి, వాటి ఫలితాలను సమాజహితానికి అందుబాటులోకి తీసుకురావడానికి 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మైక్రోబయోమ్'ను కూడా ప్రారంభించింది.



సూక్ష్మజీవులు అనగానే ఎక్కువమందికి వ్యాధికారక బ్యాక్టీరియా, వైరస్‌లే గుర్తొస్తుంటాయి. కానీ కంటికి కనిపించకపోయినా మానవులకు, ప్రకృతికి ఇతోధికంగా సేవలు అందించే 'మంచి బ్యాక్టీరియా' కూడా ఉంటాయి. నిజానికి పర్యావరణంలో హానికారక బ్యాక్టీరియా 1 శాతం లోపే. మిగతా 99 శాతం.. ప్రయోజనకరమైనవో, తటస్థమైనవో కావడం గమనార్హం. భారత్‌కు ఇప్పటికే ల్యాక్టోబ్యాసిలస్ బల్గేరికస్‌ను జాతీయ సూక్ష్మజీవిగా ప్రకటించింది. ఒక రాష్ట్రం కూడా ఆ బాటలో పయనించడం ఇదే మొదటిసారి.

ఏమిటీ బ్యాసిలస్ సబ్టిలస్?

కేరళ ప్రభుత్వం ఎంచుకున్న బ్యాసిలస్ సబ్టిలస్ సూక్ష్మజీవి.. నేలలో, మానవ పేగుల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది కడ్డీ ఆకృతిలో ఉండే గ్రామ్ పాజిటివ్ రకం బ్యాక్టీరియం. ప్రకృతి, ఆరోగ్యంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది.

- ఈ సూక్ష్మజీవి తీవ్ర వేడి, అతినీలలోహిత రేడియోధార్మికత, అత్యంత ప్రతికూలంగా ఉండే రోదసి వాతావరణాన్ని తట్టుకోగలదు. ఏకంగా ఆరేళ్లపాటు అంతరిక్షంలో మనుగడ సాగించడం ద్వారా ఒక రికార్డు సృష్టించింది. అమెరికా ఉపగ్రహంపై ఇది అన్నేళ్లపాటు జీవించింది.
- మొక్కలకూ ఇది ప్రోబయాటిక్‌గా ఉపయోగపడుతుంది. శిలీంద్రాలు, బ్యాక్టీరియా నుంచి రక్షణ కల్పిస్తుంది. వృద్ధిని పెంపొందిస్తుంది. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.
- మానవులు, జంతువుల ప్రోబయాటిక్స్‌కు ఇది సురక్షితమైందని వెల్లడైంది.
- రైబోఫ్లావిన్ వంటి విటమిన్లు, యాంటీబయాటిక్స్ వంటివాటి ఉత్పత్తికి దీన్ని ఉపయోగిస్తుంటారు.
- బయోటెక్నాలజీలో దీన్ని విరివిగా వాడుతుంటారు. పులియబెట్టిన (ఫెర్మెంటెడ్) ఆహారపదార్థాల్లో ఉంటుంది. అమైలేజ్‌లు, ప్రొటియాజెస్ వంటి 60 శాతం వాణిజ్య ఎంజైమ్‌ల ఉత్పత్తిలో దీని ప్రమేయం ఉంటుంది.
- కొన్నిరకాల బ్యాసిలస్ సబ్టిలస్‌ను సెల్ఫ్-హీలింగ్ కాంక్రీటులో ఉపయోగిస్తారు. అక్కడ అవి క్యాల్షియం కార్బొనేట్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా పగుళ్లను నింపుతాయి.

ప్రయోజనకర సూక్ష్మజీవులు

సూక్ష్మజీవులతో ఫెర్మెంటేషన్ టెక్నాలజీ మార్కెట్ విలువ భారత్‌లో రూ.40వేల కోట్ల మేర ఉండొచ్చని అంచనా. 2030 నాటికి అది రూ.72వేల కోట్లకు పెరగొచ్చని హొరైజన్ గ్రాండ్ వ్యూ రీసెర్చ్ పేర్కొంది. యాంటీబయాటిక్స్, టీకాలు, ఎంజైమ్‌లు, ఔషధాల్లో వాడే ఏపీఐల ఉత్పత్తికి ఉపయోగించే బ్యాక్టీరియా ఫెర్మెంటేషన్ దీనికి అదనం. బయోఫర్టిలైజర్లు, బయోపెస్టిసైడ్ల ఉత్పత్తికి కూడా బ్యాక్టీరియాను వాడుతుంటారు. ఈ పరిశ్రమలో ప్రధానంగా ల్యాక్టోబ్యాసిలస్, బైఫిడోబ్యాక్టీరియం, బ్యాసిలస్ రకాలపై ఆధారపడుతుంటారు.

చికిత్సల్లో..

సూక్ష్మజీవుల ఆధారిత చికిత్సలు కూడా వేగంగా వృద్ధి చెందుతున్నాయి. ఇందులో ఒక వ్యక్తి పేగుల్లోని బ్యాక్టీరియాను విశ్లేషించి, వాటి ఆధారంగా చికిత్సలను అందిస్తున్నారు. ఈ చికిత్సల్లో.. ప్రయోజనకర బ్యాక్టీరియాను ప్రోది చేసి, హానికరమైనవాటిని తగ్గిస్తున్నారు. మానవ శరీరంలో 100 లక్షల కోట్ల బ్యాక్టీరియా ఉంటాయి. అందులో 85 శాతం ప్రయోజనకరమైనవే.

- ఈనాడు ప్రత్యేక విభాగం

రోగి గొంతులో నుంచి సజీవంగా జలగ తొలగింపు

హిమాచల్‌ప్రదేశ్ రాజధాని శిమ్లాలోని ఇందిరా గాంధీ వైద్య కళాశాల ఆసుపత్రిలో అరుదైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. 55 ఏళ్ల వ్యక్తి గొంతులో ఇరుక్కున్న బతికున్న జలగను వైద్యులు విజయవంతంగా తొలగించారు. సిర్మౌర్ జిల్లాలోని కంగోర్ ధర్యాల్ గ్రామానికి చెందిన సురేశ్ దత్ గొంతులో 15 రోజుల క్రితం జలగ ఇరుక్కుపోయింది. దీంతో ఆయనను ఆసుపత్రికి తరలించారు. బ్రాంకోస్కోపీ చేయగా సురేశ్ శ్వాసనాళం దగ్గర గొంతులో జలగ ఇరుక్కుపోయినట్లు తేలింది. దీంతో వాక్యూమ్ పరికరాన్ని ఉపయోగించి రోగి గొంతు నుంచి బతికున్న జలగను విజయవంతంగా తొలగించారు. - ఈటీవీ భారత్






ఎక్కువ సమయం కూర్చుంటే అనర్థమే

లేకుండా గంటల సమయంకొద్దీ కూర్చుంటే అనేక అనర్థాలు తలెత్తుతాయి. వాటిలో కొన్ని.. గుండె సంబంధ వ్యాధులు వస్తాయి. నడుము దిగువభాగంలో నొప్పి ఎదురవుతుంది. మధుమేహం వచ్చే అవకాశం ఉంది. మెడ, భుజాల నొప్పులు తలెత్తుతాయి. ఒక్కోసారి మరణానికి దారితీస్తుంది.

- డాన్ గో, హెల్త్ పెర్ఫార్మెన్స్ కోచ్

నరవణె పుస్తకంపై వాగ్వాదం

- లోక్‌సభలో చైనా దురాక్రమణ రగడ




లోక్‌సభలో మాట్లాడుతున్న రాజ్‌నాథ్, అమిత్ షా

దిల్లీ: భారత్-చైనా మధ్య 2020లో జరిగిన ఘర్షణ అంశం సోమవారం లోక్‌సభను స్తంభింపజేసింది. చైనా దురాక్రమణపై భారత సైన్యం మాజీ అధిపతి ఎం.ఎం.నరవణె రాసిన అప్రకటిత పుస్తకంలోని అంశాలను విపక్షనేత రాహుల్‌గాంధీ ప్రస్తావించడంపై అధికారపక్షం భగ్గుమంది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో భాజపా ఎంపీలు ఆక్షేపణ తెలిపారు. సభను రాహుల్ తప్పుదోవ పట్టిస్తున్నారని విరుచుకుపడ్డారు. రాహుల్ మాట్లాడేందుకు స్పీకర్ ఓంబిర్లా అనుమతించలేదు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సమయంలో వాగ్వాదం, గందరగోళం తలెత్తింది. ఈ తీర్మానంపై మాట్లాడే ముందు భాజపా సభ్యుడు తేజస్వీ సూర్య.. కాంగ్రెస్ పార్టీ జాతీయవాదంపై చేసిన ఆరోపణలకు స్పందిస్తూ రాహుల్ చెప్పారు. 2020లో లద్దాఖ్ ఘర్షణపై నరవణె రాసిన పుస్తకానికి సంబంధించి ఒక మ్యాగజీన్ ప్రచురించిన కథనాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. చైనా సైన్యం భారత సరిహద్దుల్లోకి చొరబడిందని ఆరోపించారు. ఇవి తాను చెప్పే మాటలు కాదని, స్వయంగా నరవణె ఓ పుస్తకంలో రాశారని రాహుల్ చెప్పారు. ఈ పుస్తకం ప్రచురణను కేంద్రం అడ్డుకుంటోందన్నారు.

ప్రచురితమైందా.. స్పష్టతనివ్వండి

రాహుల్ చెబుతున్న పుస్తకమే ఇంకా ప్రచురితం కాలేదని, దానిపై ఎలా మాట్లాడుతారని రాజ్‌నాథ్‌తో పాటు కేంద్రమంత్రి అమిత్ షా అభ్యంతరం వ్యక్తంచేశారు. పుస్తకం ప్రచురితమైందో లేదో ముందుగా స్పష్టతనివ్వాలన్నారు. సభా కార్యకలాపాలతో సంబంధంలేని అంశాలపై పుస్తకాలు, పత్రికా వార్తలను ప్రస్తావించడానికి వీల్లేదని స్పీకర్ అభ్యంతరం వ్యక్తంచేశారు. తాను లేవనెత్తుతున్నది ప్రామాణిక విషయమేనని రాహుల్ సమర్థించుకున్నారు. దానికి స్పీకర్ అనుమతించలేదు. వాగ్వాదాలతో సభ మంగళవారానికి వాయిదాపడింది. ధన్యవాద తీర్మానంపై తానేం మాట్లాడాలో కూడా చెప్పాలని స్పీకర్‌ను రాహుల్ ఒకదశలో అడిగినప్పుడు తాను ఆయనకు సలహాదారుడిని కానని ఓంబిర్లా బదులిచ్చారు.

బట్టబయలు అవుతుందనే మాట్లాడనివ్వలేదు: రాహుల్



సభ వాయిదా పడిన తర్వాత రాహుల్ విలేకరులతో మాట్లాడారు. దేశ భద్రతకు సంబంధించిన అంశాన్ని సభలో లేవనెత్తేందుకు ప్రభుత్వం అనుమతించడం లేదని ఆరోపించారు. నరవణె పుస్తకం ప్రచురితమైతే.. మన సైన్యాన్ని ప్రభుత్వ నేతలు ఎలా నిరాశపరిచారనే విషయాలను ప్రజలు తెలుసుకుంటారని చెప్పారు. డోక్లాం అంశంలో మోదీ, రాజ్‌నాథ్ సింగ్‌లతో నరవణె ఏం మాట్లాడారో రెండు మూడు వాక్యాలు చెప్పాలనుకున్నానని, అంతా బట్టబయలు అవుతుందనే భయంతోనే తనను మాట్లాడనీయకుండా చేస్తున్నారని మండిపడ్డారు.

'కృత్రిమ కాళ్ల'ను టేబుల్‌పై పెట్టి.. ప్రతిపక్షాలను నిలదీసిన భాజపా ఎంపీ

ఇంటర్నెట్ డెస్క్: ఏదైనా విషయంలో కేంద్రాన్ని గుడ్డిగా వ్యతిరేకించొద్దని భాజపా ఎంపీ సి.సదానందన్ మాస్టర్ ప్రతిపక్షాలకు విజ్ఞప్తి చేశారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. సోమవారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో ఆయన తొలిసారి ప్రసంగం చేశారు. ఈ క్రమంలో తన కృత్రిమ కాళ్లను తీసి టేబు



ల్‌పై పెట్టి విపక్షాలను నిలదీయడం చర్చనీయాంశమైంది. "ఇప్పుడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నవారే.. 31 ఏళ్ల క్రితం కేరళలో నాపై దాడి చేశారు. ఇంటికి నేను తిరిగి వెళ్తున్నప్పుడు వెనుక నుంచి పట్టుకుని రోడ్డుమీదే నా కాళ్లను నరికేశారు" అని సదానందన్ గుర్తుచేసుకున్నారు. సభలో ఆయన కృత్రిమ కాళ్లను ప్రదర్శించడాన్ని సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ తప్పుపట్టారు. ఇది నిబంధనల ఉల్లంఘనేనని 'పాయింట్ ఆఫ్ ఆర్డర్' లేవనెత్తారు. సదానందన్ బదులిస్తూ.. "ప్రజాస్వామ్యం అంటే ఏంటో దేశానికి, ప్రజలకు చూపించాలనుకుంటున్నాను. మీరు ఎప్పుడూ ప్రజాస్వామ్యం, సహనం, మానవత్వం గురించి మాట్లాడుతుంటారు. కానీ, మీ నిబద్ధత రాజకీయ హింసపై ఆధారపడి ఉంది" అని వ్యాఖ్యానించారు. అనంతరం కృత్రిమ కాళ్లను టేబుల్‌పై నుంచి తొలగించారు.

చీరపై కాదు.. బడ్జెట్‌పై దృష్టిపెట్టండి

- పురుష మంత్రులైతే దుస్తుల గురించి అడిగేవారా?
- నిర్మలా సీతారామన్ అసహనం



ఇంటర్నెట్ డెస్క్: ఏటా పార్లమెంటులో బడ్జెట్ ప్రవేశపెట్టే వేళ తాను ధరించే చీరల గురించి విస్తృత చర్చ జరుగుతుండటంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అసహనం వ్యక్తం చేశారు. తన చీరనూ పద్దులో ఒక అంశంగా మార్చేస్తున్నారంటూ పెదవి విరిచారు. చీరపై కాకుండా.. బడ్జెట్‌లోని అంశాలపై దృష్టిపెట్టాలని ప్రజలకు హితవు పలికారు. అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. బడ్జెట్ రోజు ధరించబోయే చీర గురించి ఎదురయ్యే ప్రశ్నలు తనకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. "ఎందుకిలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బడ్జెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారినీ ఇలాగే దుస్తుల గురించి అడిగేవారా?" అని దిల్లీలో సోమవారం నిర్వహించిన 'బడ్జెట్-2026 యూత్ డైలాగ్' కార్యక్రమంలో ప్రశ్నించారు. నిర్మల ఆదివారం కాంచీపురం చీర ధరించి లోక్‌సభలో కేంద్ర పద్దును ప్రవేశపెట్టారు. త్వరలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో ఆమె ఆ చీరను ఎంచుకోవడంపై పెద్దఎత్తున చర్చ జరిగింది.

బడ్జెట్‌పై నిర్మల స్పందిస్తూ దేశ భద్రత విషయంలో ప్రభుత్వం ఎంతమాత్రమూ రాజీ పడబోదని స్పష్టం చేశారు. పదేళ్లుగా రక్షణ రంగంలో పెట్టిన పెట్టుబడుల ఫలితమే 'ఆపరేషన్ సిందూర్' విజయమని వ్యాఖ్యానించారు.

శతాబ్దానికి ఒకసారి వచ్చే సంక్షోభమది

కొవిడ్-19 విజృంభణ కాలాన్ని శతాబ్దానికి ఒక్కసారి వచ్చే సంక్షోభంగా నిర్మల అభివర్ణించారు. వ్యాక్సిన్ కొనుగోలు అవసరం ఉన్నప్పటికీ, ప్రజలపై ఒక్క రూపాయి కూడా అదనపు పన్ను భారం మోపొద్దని ప్రధాని మోదీ అప్పట్లో స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. కరోనా సమయంలో అత్యవసరాల కోసం ప్రభుత్వం భారీగా రుణాలు తీసుకోవాల్సి వచ్చిందని ఆమె అంగీకరించారు. ప్రజలపై భారం పడకూడదనే ఉద్దేశంతో ఆర్థిక వ్యవస్థ కోలుకున్న తర్వాత రుణభారాన్ని తగ్గించడంపై దృష్టి పెట్టినట్లు చెప్పారు.

ఉపగ్రహాల రక్షణకు ప్రత్యేక సాధనాలు

దిల్లీ: రోదసిలోని శకలాల బారి నుంచి ఉపగ్రహాల రక్షణకు అవసరమైన వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి భారత్‌కు చెందిన దిగంతరా ఇండస్ట్రీస్.. సింగపూర్ రక్షణ, శాస్త్ర, సాంకేతిక సంస్థ (డీఎస్‌టీఏ)తో చేతులు కలిపింది. ఇందులో భాగంగా తాము అభివృద్ధి చేసే వ్యవస్థలను సింగపూర్ స్వతంత్రంగా నియంత్రించుకునే వెసులుబాటును అందిస్తామని దిగంతరా సీఈవో అనిరుధ్ శర్మ తెలిపారు. ఆ దేశ ఉపగ్రహాల వద్దకు అంతరిక్ష వ్యర్థాలు దగ్గరగా వస్తుంటే తమ వ్యవస్థ అప్రమత్తం చేస్తుందన్నారు. ఈ ఒప్పందం కింద దిగంతరాకు చెందిన సెన్సర్ డేటాను కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఎనలిటిక్స్‌తో అనుసంధానం చేస్తారు.

దివ్యాంగుడి కలకు 'భుజం' కలిపిన పోలీసు అధికారి



దివ్యాంగుడి కలను నెరవేర్చి ఆదర్శంగా నిలిచారో పోలీసు అధికారి. రాజస్థాన్‌లోని కుచామన్ జిల్లా డీడ్వానా పోలీసు స్టేషన్ ఇందుకు వేదికైంది. మార్వాడ్ బలియా గ్రామానికి చెందిన 30 ఏళ్ల నదీమ్ దివ్యాంగుడు. ఆయనకు కాళ్లు, చేతులు లేవు. అయినా చదువుకుని గౌరవంగా బతుకున్నారు. ఇటీవల ఆయనను డీడ్వానా పోలీస్ స్టేషన్ అధికారి రాజేంద్ర సింగ్ కమాండో కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌ను సందర్శించాలనే తన కోరికను నదీమ్ వెల్లడించారు. దీంతో ఆయనను స్టేషన్‌కు రావాలని రాజేంద్ర సింగ్ ఆహ్వానించారు. ఇటీవల నదీమ్ స్టేషన్‌కు వచ్చారు. దీంతో ఆయనను తన భుజాలపై ఎక్కించుకున్న రాజేంద్ర సింగ్.. స్టేషన్ మొత్తాన్ని చూపించారు. అక్కడ జరిగే కార్యకలాపాల గురించి వివరించారు.

గోమూత్రంతో ఇంకు



గోవుల మూత్రం నుంచి పర్యావరణహిత సిరా (ఇంకు)ను తయారు చేశారు దిల్లీ విశ్వవిద్యాలయ పరిశోధకులు. వర్సిటీకి చెందిన రాంజాస్ కళాశాలలోని కెమిస్ట్రీ విభాగం పరిశోధకులు శుచి వర్మ నేతృత్వంలో దీనిని తయారు చేశారు. ఈ ఆవిష్కరణకు వారు 'గౌరంగ్' అనే పేరు పెట్టారు. గోవుల మూత్రం నుంచి వారు నీలి వర్ణ పదార్థాన్ని సేకరించారు. ఇది ద్రవ, ఘన రూపంలో వచ్చింది. దీనికి స్వల్పంగా ఉప్పును కలిపి ఇంకును తయారు చేశారు.

ఈటీవీ భారత్

యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

వీధి మొత్తం విద్యుత్తు సరఫరా బంద్



గడువులోగా బిల్లులు చెల్లించకపోతే ఇళ్లకు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపేస్తారు. ఇది ప్రతిచోటా జరిగేదే. కానీ మధ్యప్రదేశ్‌లో వీధి మొత్తానికీ విద్యుత్తు సరఫరాను నిలిపేశారు. జబల్‌పుర్‌లో కథోడా గ్రామంలో ప్రభాత్ నగర్ అనే కాలనీ ఉంది. ఇక్కడ 300కి పైగా ఇళ్లున్నాయి. 2015లో విద్యుత్తుశాఖ రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికీ విద్యుత్తు కనెక్షన్ ఇచ్చింది. కానీ ఇక్కడివారు 2015 నుంచి విద్యుత్తు బిల్లులను చెల్లించడం లేదు. ప్రతి ఇంటికీ రూ.వేల నుంచి రూ.లక్షల వరకూ బకాయిలు పేరుకుపోయాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్తు సరఫరా నిలిపేశారు.

దిల్లీకి చేరిన బెంగాల్ 'సర్' పోరాటం

- సీఈసీతో భేటీ నుంచి మమతా బెనర్జీ వాకౌట్



ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న మమతా బెనర్జీ

దిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)ను వ్యతిరేకిస్తూ తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చేస్తోన్న పోరాటం దిల్లీకి చేరింది. సర్ సమస్యలపై మాట్లాడేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) అపాయింట్‌మెంట్ తీసుకుని దిల్లీ వచ్చిన బెంగాల్ సీఎం, టీఎంసీ అగ్రనేత మమతా బెనర్జీ ఈసీతో, దిల్లీ పోలీసులతో ఘర్షణకు దిగారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌తో సోమవారం సాయంత్రం భేటీ అయిన మమత ఆ సమావేశం నుంచి అర్ధాంతరంగా వాకౌట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జ్ఞానేశ్‌కుమార్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అహంకారపూరితంగా వ్యవహరించారని, తమ ప్రతినిధులను అవమానించారని ఆరోపించారు. సర్ కసరత్తుతో పలువురు ప్రాణాలు కోల్పోయినా ఈసీ పట్టించుకోవడంలేదని ఆక్షేపించారు. భాజపా దళారిగా ఎన్నికల సంఘం పనిచేస్తోందని ధ్వజమెత్తారు. ఇక ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామన్నారు. మమతా బెనర్జీ ఆరోపణలను సీఈసీ తోసిపుచ్చారు. టీఎంసీ ప్రతినిధులకు సమాధానం చెబుతుండగానే మమత ఆగ్రహంతో భేటీ నుంచి వెళ్లిపోయారని తెలిపారు.

అంతకుముందు దిల్లీలోని బంగ భవన్ వద్ద భారీ స్థాయిలో పోలీసుల మోహరింపుపై మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక దశలో వారితో ఘర్షణకూ దిగారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 'సర్' బాధితులు దిల్లీలోని బెంగాల్ ప్రభుత్వ భవనాల్లో బస చేశారు. చాణిక్యపురిలోని బంగ భవన్ ప్రాంగణంలో మోహరించిన దిల్లీ పోలీసులతో మమత వాగ్వాదానికి దిగారు.

ఖమేనీ చెప్పింది నిజమో కాదో 2 రోజుల్లో తెలిసిపోతుంది: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా తమపై దాడికి పాల్పడితే.. అది పశ్చిమాసియాలో ప్రాంతీయ యుద్ధానికి దారితీస్తుందంటూ ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ ఆదివారం చేసిన హెచ్చరికపై అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఖమేనీ చెప్పింది నిజమో, కాదో రెండు రోజుల్లో తెలిసిపోతుందని పేర్కొన్నారు. ఫ్లోరిడాలోని తన నివాసం నుంచి మీడియాతో ట్రంప్ ఈ మేరకు మాట్లాడారు. 'ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన నౌకలు ఇరాన్‌కు చాలా దగ్గరగా ఉన్నాయి. రెండు రోజుల్లో ఆ దేశంతో ఒప్పందం కుదరొచ్చని అనుకుంటున్నా. ఒకవేళ కుదరకపోతే.. ఖమేనీ చెప్పింది నిజమో కాదో తెలుస్తుంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. అణు చర్చల విషయంలో అమెరికాపై తాము నమ్మకం కోల్పోయామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ అన్నారు. అయినప్పటికీ ఆ దేశంతో న్యాయమైన ఒప్పందం కోసం తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

ఈయూ రాయబారులకు ఇరాన్ సమన్లు

తమ దేశంలోని ఐరోపా యూనియన్ (ఈయూ) రాయబారులందరికీ ఇరాన్ సోమవారం సమన్లు జారీ చేసింది. తమ పారామిలిటరీ దళమైన రివల్యూషనరీ గార్డ్స్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చేందుకు ఈయూ గత వారం అంగీకరించడంపై నిరసన వ్యక్తం చేసింది.

ఆ ఘోరాలకు బాధ్యులు తల్లిదండ్రులే

మైనర్ల డ్రంకెన్ డ్రైవింగ్ ప్రమాదాలపై సుప్రీంకోర్టు

దిల్లీ: యుక్తవయసు పిల్లలకు కార్లు ఇవ్వడంతో పాటు విచ్చలవిడి వినోదాలకు డబ్బు అందజేస్తున్న తల్లిదండ్రులే డ్రంకెన్ డ్రైవింగ్ ప్రమాదాలకు ప్రధాన బాధ్యులని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. మహారాష్ట్రలోని పుణెలో ఇద్దరి మృతికి కారణమైన పోర్షే కారు ప్రమాదం (2024) ఘటనలో ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. పిల్లలను నియంత్రించలేని స్థితిలో తల్లిదండ్రులు ఉన్నారని పేర్కొంది. వ్యవస్థల దుర్వినియోగం విషయాన్ని అలా ఉంచితే...పిల్లలు అడిగిందే తడవుగా కారు తాళాలు ఇవ్వడం సమర్థనీయంకాదంది. కారు ప్రమాదం నేరాన్ని తారుమారు చేసే వ్యవహారంలో పది మంది అరెస్ట య్యారు. వీరిలో 18 నెలలుగా జైలులో ఉన్న ముగ్గురు... అమర్ సతీశ్ గైక్వాడ్ (మధ్యవర్తి), ఆదిత్య అవినాశ్ సూద్, ఆశీష్ సతీశ్ మిత్తల్(బాలుడి తల్లిదండ్రులు)కు ధర్మాసనం సోమవారం బెయిల్ మంజూరు చేసింది.

తెరుచుకున్న రఫా బార్డర్ క్రాసింగ్

కైరో: ఇజ్రాయెల్-హమాస్ కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. గాజాలోని రఫా బార్డర్ క్రాసింగ్‌ను సోమవారం తెరిచారు. ఈ క్రాసింగ్ ద్వారా గాజా నుంచి ఈజిప్టులోకి ప్రవేశించొచ్చు. ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకంటూ 2024 మేలో దాన్ని ఇజ్రాయెల్ బలగాలు మూసివేశాయి. 2025 తొలినాళ్లలో స్వల్పకాలం పాటు తెరిచి.. గాజా నుంచి పాలస్తీనీయులు వైద్యం కోసం ఈజిప్టులోకి వెళ్లేందుకు అనుమతించాయి. కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా సోమవారం ఆ క్రాసింగ్‌ను మళ్లీ తెరిచారు.

దలైలామాకు గ్రామీ అవార్డు

- మెడిటేషన్స్‌పై ప్రసంగ ఆల్బమ్‌కు దక్కిన గౌరవం
- మండిపడిన చైనా



లాస్ ఏంజెలెస్: ప్రముఖ బౌద్ధ గురువు దలైలామాకు గ్రామీ అవార్డు దక్కింది. 'మెడిటేషన్స్: ద రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిస్ హోలీనెస్ ద దలైలామా' పేరుతో ఆయన చేసిన ప్రసంగ ఆల్బమ్‌కు ఈ గౌరవం దక్కింది. 90 ఏళ్ల టిబెట్ ఆధ్యాత్మిక గురువు అయిన దలైలామాకు గోల్డెన్ గ్రామోఫోన్ దక్కడం ఇదే తొలిసారి. ఆదివారం రాత్రి లాస్ ఏంజెలెస్‌లోని క్రిప్టోడాట్‌కామ్ ఎరీనాలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 90 కేటగిరీలో అవార్డులను ప్రకటించారు. దలైలామాకు అవార్డు దక్కడంతో హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలతోపాటు ఇతర ప్రాంతాల్లో ఆయన అభిమానులు సంబరాలు చేసుకున్నారు. దలైలామా తరఫున గాయకుడు రఫూస్ వెయిన్‌రైట్ అవార్డును స్వీకరించారు. 'ఆడియో బుక్స్, నరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్' కేటగిరీలో ఈ అవార్డు దక్కింది. గాయకులు మ్యాగీ రోజర్స్, ఆండ్రా డేతో కలిసి దలైలామా ఈ ఆల్బమ్ రూపకల్పనలో పాలుపంచుకున్నారు. కబీర్ సెహగల్ నిర్మించిన ఈ ఆల్బమ్‌లో సరోద్ విద్వాంసుడు అంజాద్ అలీ ఖాన్, ఆయన కుమారులు అమాన్ అలీ బంగాష్, అయాన్ అలీ బంగాష్, అమెరికా శాక్సాఫోన్ విద్వాంసుడు టెడ్ నాష్, గాయకుడు, గేయ రచయిత డెబీ నోవా తదితరులు కనిపించారు.



దలైలామా తరఫున అవార్డు స్వీకరించిన గాయకుడు వెయిన్‌రైట్

■ అవార్డును తాను వ్యక్తిగత ఘనతగా భావించడం లేదని, దానిని కృతజ్ఞతతో, మానవత్వంతో స్వీకరిస్తున్నానని, అంతర్జాతీయంగా నిర్వహిస్తున్న బాధ్యతలకు వచ్చిన గుర్తింపుగా భావిస్తున్నామని దలైలామా తెలిపారు.

■ దలైలామాకు గ్రామీ అవార్డు ఇవ్వడాన్ని చైనా తప్పుబట్టింది. తమ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయనకు అవార్డు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేసింది. మతం పేరుతో ఆయన విభజన కార్యకలాపాలకు పాల్పడుతున్నారని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ వ్యాఖ్యానించారు. 'ఆయనో రాజకీయ శరణార్థి. మతం పేరుతో చైనాకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు' అని పేర్కొన్నారు.

షేక్ హసీనాకు 10 ఏళ్ల జైలుశిక్ష

ప్లాట్ల కేటాయింపు కేసుల్లో కోర్టు తీర్పు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా(79)కు ఢాకా స్పెషల్ జడ్జస్ కోర్టు 10 ఏళ్ల జైలు శిక్ష విధించింది. రెండు వేర్వేరు అవినీతి కేసులకు సంబంధించి ఈ తీర్పునిచ్చింది. ఒక్కో కేసుకూ 5 ఏళ్ల చొప్పున శిక్ష అనుభవించాలని స్పష్టం చేసింది. పుర్బాచోల్‌లోని రాజుక్ న్యూ టౌన్ ప్రాజెక్టు కింద ప్లాట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయన్న అభియోగాలతో హసీనాకు, ఆమె మేనల్లుడు రద్వాన్ ముజీబ్ సిద్ధిక్, మేనకోడళ్లు తులిప్ రిజ్వానా సిద్ధిక్, అజ్మినా సిద్ధిక్ సహా మరికొంతమందికి కోర్టు జైలు శిక్ష విధించింది. బ్రిటన్‌లో ప్రస్తుతం లేబర్ పార్టీ ఎంపీగా ఉన్న తులిప్ సిద్ధిక్‌కి కోర్టు 4 ఏళ్ల జైలు శిక్ష విధించగా.. రద్వాన్, అజ్మినాలకు ఏడేళ్ల చొప్పున కఠిన కారాగార శిక్ష విధించింది. వీరందరికీ లక్ష టాకాల చొప్పున జరిమానా కూడా విధించింది. దాన్ని చెల్లించకపోతే మరో 6 నెలల జైలు శిక్ష అనుభవించాలని తీర్పునిచ్చింది.

ఎయిరిండియా డ్రీమ్‌లైనర్‌కు తప్పిన ప్రమాదం

- ఇంధన స్విచ్‌లో లోపాన్ని గుర్తించిన పైలట్
- బెంగళూరులో నిలిపివేత



దిల్లీ: ఎయిరిండియా బోయింగ్ 787-8 విమానం ఇంధన నియంత్రణ వ్యవస్థలో లోపం ఉందని పైలట్ గుర్తించడంతో అది బెంగళూరులో దిగిన వెంటనే క్షుణ్నంగా తనిఖీలు చేపట్టారు. ఈ విమానం 200 మందికి పైగా ప్రయాణికులతో లండన్‌లోని హీత్రూ నుంచి సోమవారం ఉదయం బెంగళూరుకు చేరుకుంది. విమానం ఎడమవైపు ఇంజిన్ 'రన్' నుంచి 'కటాఫ్'కు మారిపోయిందని, దానిని లాక్ చేయడం వీలు కావడం లేదని పైలట్ సమాచారం ఇచ్చారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా విమానాన్ని నిలిపివేసి, ఆ లోపాన్ని అత్యవసరంగా సరిచేయాల్సిందిగా తయారీదారుల్ని కోరామని ఎయిరిండియా తెలిపింది. ఈ విషయాన్ని పౌరవిమానయాన శాఖకు, డీజీసీయేకు తెలియజేశామని వెల్లడించింది. అన్ని బోయింగ్ 787 విమానాల ఇంధన నియంత్రణ స్విచ్‌లను తనిఖీ చేశామని, అవి బాగానే ఉన్నాయని తెలిపింది. గత ఏడాది జూన్ 12న అహ్మదాబాద్‌లో ఇదే సంస్థకు చెందిన ఇదే రకం విమానం.. టేకాఫ్ సమయంలో ఇంధన సరఫరా ఆగిపోయి కూలిపోవడంతో 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. తాజా ఘటనలోనూ విమానం బయల్దేరినచోటే సమస్య తలెత్తినట్లు భారత పైలట్ల సమాఖ్య (ఎఫ్ఐపీ) చెబుతోంది. దానివల్ల విమానం గాలిలో ఉంటుండగా ఇంజిన్ ఆగిపోయే ప్రమాదం సంభవించవచ్చని తెలిపింది.

EENADU Vol: 52, Issue: 174 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

(c) eenadu

ఈనాడు సినిమా

డీ 55లోకి సాయిపల్లవికి స్వాగతం


సాయి పల్లవి

'రౌడీ బేబీ..' అంటూ 'మారి 2' చిత్రంలో కలిసి నటించి హిట్ జోడీ అనిపించుకున్నారు హీరో ధనుష్, సాయిపల్లవి. ఇప్పుడీ కలయికను మరోసారి తెరపై చూడాలనుకుంటున్న అభిమానులకు తీపి కబురు వినిపించింది చిత్రబృందం. ధనుష్ ప్రధాన పాత్రలో 'డీ 55' (వర్కింగ్ టైటిల్) అనే సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ఓ కథానాయికగా శ్రీలీల నటిస్తున్నట్లు ఇటీవలే వెల్లడించింది చిత్రబృందం. తాజాగా ఈ చిత్రంలో మరో నాయికగా సాయిపల్లవిని ఎంపిక చేశారు. సోమవారం ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ఫొటోల్ని పంచుకున్నాయి చిత్రవర్గాలు. "ఆమె సౌందర్యానికి, బలానికి ప్రతీక. అందరి అభిమాన తార సాయిపల్లవికి 'డీ 55' ప్రాజెక్ట్‌లోకి స్వాగతం" అనే వ్యాఖ్యల్ని జోడించింది. సాయి అభయంకర్ సంగీతమందిస్తున్నారు.

గోల్‌మాల్‌లో విలన్‌గా అక్షయ్?




గతేడాది 'స్కైఫోర్స్', 'కేసరి: ఛాప్టర్ 2', 'జాలీ ఎల్ఎల్‌బీ 3'తో పాటు పలు చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించాడు బాలీవుడ్ అగ్ర హీరో అక్షయ్ కుమార్. ఆయన తదుపరి సైఫ్ అలీఖాన్‌తో కలిసి 'హైవాన్' చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఆయన ప్రతినాయక ఛాయలున్న పాత్రలో కనిపించనున్నట్లు ఎప్పట్నుంచో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్రబృందం నుంచి స్పష్టత రానప్పటికీ.. తాజాగా మరో హిందీ చిత్రంలో అక్షయ్ విలన్‌గా నటించనున్నట్లు తెలుస్తోంది. "గోల్‌మాల్' కామెడీ ఫ్రాంఛైజీలో భాగంగా 'గోల్‌మాల్ 5' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని అజయ్ దేవగణ్ ప్రధాన పాత్రలో రోహిత్ శెట్టి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ ప్రతినాయక పాత్ర పోషించనున్నారు. ఇందులో ఆయన పాత్ర కథని నడిపించే తీరు ఆకర్షణగా నిలుస్తాయి. మునుపటి చిత్రాలలోని కామెడీతో పోల్చితే ఇది భిన్నంగా ఉంటుంది. ఈ సినిమా చిత్రీకరణని త్వరలోనే ప్రారంభించనున్నారు"అని సన్నిహిత వర్గాల సమాచారం. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అక్షయ్ 'భూత్‌బంగ్లా', 'వెల్‌కమ్ టు ది జంగిల్' చిత్రాలతో త్వరలోనే థియేటర్లలో సందడి చేయనున్నారు.

ఓ టీ టీ లో ఈ వారం

కొత్త వారం.. కొత్త కథల కోసం సిద్ధమా? అయితే ఓటీటీలు కూడా విభిన్న కంటెంట్‌తో రెడీ అంటున్నాయి. ఇదంతా ఈ వారాంతం అలరించే కథల గురించే. ఎప్పటిలాగే ఈ వారం కూడా వైవిధ్యమైన సిరీస్‌లు, సినిమాలతో సినీప్రియుల్ని నాన్‌స్టాప్‌గా ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాయి ఓటీటీలు.

సైక్ సిద్ధార్థ(చిత్రం)	బుధవారం	ఆహా
రిలేషన్‌షిప్ గోల్స్(చిత్రం)	బుధవారం	అమెజాన్ ప్రైమ్ వీడియో
ది లింకన్ లాయర్ 4(సిరీస్)	గురువారం	నెట్‌ఫ్లిక్స్
జాజ్ సిటీ(సిరీస్)	శుక్రవారం	సోనీలివ్
సాల్వడార్ (సిరీస్)	శుక్రవారం	నెట్‌ఫ్లిక్స్
నీలకంఠ (చిత్రం)	శుక్రవారం	సన్‌నెక్స్ట్

రాజాసాబ్ వచ్చేస్తున్నాడు



"మన టైమ్ స్టార్ అయ్యింది" అంటూ గత నెల థియేటర్లలో 'రాజాసాబ్' చిత్రంతో సందడి చేశారు అగ్రహీరో ప్రభాస్. ఆయన ప్రధాన పాత్రలో మారుతి దర్శకత్వం వహించిన చిత్రమిది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ కథానాయికలు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. హారర్, కామెడీ, రొమాన్స్.. లాంటి అన్ని రకాల భావోద్వేగాలతో రూపొంది ప్రేక్షకుల ముందుకొచ్చిందీ చిత్రం. ఇప్పుడిది శుక్రవారం నుంచి జియోహాట్‌స్టార్ వేదికగా మీ ఇళ్లలో సందడి చేయడానికి సిద్ధమైంది.

మూడు ముళ్ల కోసం తిప్పలు



ఓ వైపు కాబోయే భార్య.. మరోవైపు ప్రియురాలు.. ఇలా ఇద్దరి మధ్య నలిగిపోయిన ఓ యువకుడి కథే 'నారీ నారీ నడుమ మురారి' సినిమా. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. సంక్రాంతి సందర్భంగా థియేటర్లలోకి వచ్చిన ఈ సినిమా సినీప్రియుల్ని నవ్వుల్లో ముంచెత్తింది. ఇందులో ఇద్దరు భామల మధ్య నలిగిపోయే ప్రేమికుడిగా శర్వా కనిపించిన తీరుకు అభిమానులు ఫిదా అయ్యారు. ఈ రొమాంటిక్ కామెడీ సినిమా బుధవారం నుంచి అమెజాన్ ప్రైమ్ వీడియోలో అలరించనుంది. మరి శర్వానంద్ మూడు ముళ్ల కోసం పడిన తిప్పలేమిటో మీరూ చూసేయ్యండి.

ఇక కథలో ముందుకెళ్లడమే!


ఎన్టీఆర్

జోరుగా సీక్వెల్ చిత్రాల సన్నాహాలు

కథకు శుభం కార్డు వేసి ప్రేక్షకుల్ని తృప్తిగా ఇంటికి పంపే కన్నా.. ఓ ఆసక్తికరమైన మలుపుతో ముగింపును ముడివేసి మళ్లీ థియేటర్లలో కలుద్దామంటూ ఆహ్వానించేందుకే ఈతరం దర్శకులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కొనసాగింపు కథలకు బాక్సాఫీస్ బరిలో సినీప్రియులు కాసుల వర్షం కురిపిస్తుండటంతో ఇటీవల కాలంలో సీక్వెల్ చిత్రాల జోరు అంతకంతకూ రెట్టింపవుతోంది. ఇప్పుడిలా 'కథలో ముందుకెళ్దామా' అంటూ ప్రేక్షకుల్ని ఊరిస్తూ.. తమ హిట్ సినిమాలకు కొనసాగింపుల్ని సిద్ధం చేస్తున్న కథానాయకులు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు.


వెంకటేశ్

అగ్ర కథానాయకుడు వెంకటేశ్ 'దృశ్యం'తో పంచిచ్చిన థ్రిల్‌ను 'దృశ్యం 2'తోనూ మరోసారి పునరావృతం చేశారు. ఇప్పుడదే మ్యాజిక్‌ను 'దృశ్యం 3'తోనూ కొనసాగించాలని ఉవ్విళ్లూరుతున్నారు. మలయాళంలో విజయవంతమైన 'దృశ్యం' సిరీస్ ఫ్రాంఛైజీలో భాగంగా జీతూ జోసెఫ్ తీసుకొస్తున్న మూడో చిత్రమిది. ఇప్పటికే 'దృశ్యం 3' మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. హిందీ వెర్షన్ చిత్రీకరణ దశలో ఉంది. ఇక తెలుగు వెర్షన్‌ను జూన్ - జులై నాటికి సెట్స్‌పైకి తీసుకెళ్లాలన్న లక్ష్యంతో ఉన్నారు నిర్మాత సురేశ్‌బాబు. 'దృశ్యం 2' కథ ఎక్కడైతే ముగిసిందో.. అక్కడి నుంచే ఈ మూడో భాగం కథ కొనసాగనుంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే హిందీ 'దృశ్యం 3'తో పాటే తెలుగు వెర్షన్ కూడా ఈ ఏడాది అక్టోబరులోనే ప్రేక్షకుల్ని పలకరించనుంది. ప్రస్తుతం కథానాయకుడు ప్రభాస్ ఏ చిత్రం చేసినా.. దానికి కొనసాగింపు ఉందంటూ ఊరించడమన్నది పరిపాటిగా మారిపోయింది. ఇప్పుడాయన నుంచి 'సలార్', 'కల్కి 2898ఏడీ' చిత్రాల రెండో భాగం కోసం సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలోనే ఇప్పుడాయన తొలుత 'కల్కి 2' కోసం రంగంలోకి దిగేందుకు సిద్ధమవుతున్నారు. దర్శకుడు నాగ్ అశ్విన్ గత కొన్ని నెలలుగా ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనుల్లోనే తీరిక లేకుండా గడుపుతున్నారు. ఈనెలలోనే దీని చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రభాస్ తన చేతిలో ఉన్న 'ఫౌజీ', 'స్పిరిట్'లతో పాటే ఈ సినిమాని సమాంతరంగా పూర్తి చేయనున్నట్లు తెలిసింది. ఇక 'సలార్ 2'.. ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ సినిమా పూర్తి కాగానే సెట్స్‌పైకి వెళ్లే అవకాశముంది.

● 'దేవర' సినిమాతో సోలో హీరోగా తొలి పాన్ ఇండియా విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు కథానాయకుడు ఎన్టీఆర్. ఇప్పుడు దీనికి కొనసాగింపుగా 'దేవర 2'ని పట్టాలెక్కించే సన్నాహాలు మొదలైపోయాయి. ఇప్పటికే దర్శకుడు కొరటాల శివ స్క్రిప్ట్ పనుల్ని వేగవంతం చేసినట్లు తెలిసింది. మరోవైపు ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన సుధాకర్ మిక్కిలినేని దీన్ని మే నుంచి ప్రారంభించనున్నట్లు స్పష్టత ఇచ్చేశారు. తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాని ముగించిన వెంటనే ఈ సీక్వెల్ కోసమే రంగంలోకి దిగనున్నారు.


రిషబ్ శెట్టి


తేజ సజ్జా

'జాంబిరెడ్డి', 'హను-మాన్', 'మిరాయ్' చిత్రాలతో వరుస విజయాలందుకుని జోరు మీదున్నారు తేజ సజ్జా. ఇప్పుడీ హిట్ చిత్రాలన్నింటికీ ఒకేసారి సీక్వెల్స్ సిద్ధమవుతున్నాయి. తేజ ప్రస్తుతం 'జాంబిరెడ్డి 2'ని పట్టాలెక్కించి.. ఆ వెంటనే 'మిరాయ్ 2'ని సెట్స్‌పైకి తీసుకెళ్లే ప్రయత్నాల్లో ఉన్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించనున్న ఈ రెండు చిత్రాలు సమాంతరంగా చిత్రీకరణ చేసుకోనున్నాయి. ఇక మరోవైపు 'హను-మాన్'కి కొనసాగింపుగా 'జై హనుమాన్'ను ప్రారంభించేందుకు దర్శకుడు ప్రశాంత్ వర్మ సన్నాహాల్లో ఉన్నారు. రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాలోనూ తేజ భాగమవనున్నట్లు తెలిసింది. మరి ఈ మూడింటిలో ఈ ఏడాది తెరపైకి వచ్చేది ఏదన్నది ఆసక్తికరంగా మారింది.


హీరో విష్వక్ సేన్.. దర్శకుడు తరుణ్ భాస్కర్ కలయిక నుంచి వచ్చిన విజయవంతమైన చిత్రం 'ఈ నగరానికి ఏమైంది?'. దీనికి యువతరం నుంచి మంచి ఆదరణ లభించిన సంగతి తెలిసిందే. ఇప్పుడీ సినిమాకి కొనసాగింపుగా 'ఈఎన్ఈ రిపీట్' పేరుతో ఓ చిత్రం సిద్ధమవుతోంది. ఇది తొలి భాగాన్ని మించిన వినోదంతో.. భారీ స్కేల్, సెటప్‌తో

వీళ్లూ వస్తున్నారు..

అందర్నీ అలరించేలా ఉంటుందని తరుణ్ ఇటీవలే వెల్లడించారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాదే తెరపైకి రానుంది. సితార సంస్థ నుంచి వచ్చిన 'మ్యాడ్' ఎంత హిట్టయ్యిందో.. 'మ్యాడ్ 2' అంతకు మించిన విజయాన్ని అందుకుంది. దీంతో ఇప్పుడీ ఫ్రాంఛైజీ నుంచి 'మ్యాడ్ జూనియర్స్' పేరుతో మరో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నారు నిర్మాత నాగవంశీ. టైటిల్‌కి తగ్గట్లే ఈసారి దీంట్లో హర్ష్ రోషన్, జైకృష్ణ లాంటి నవతరం నటులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారని.. ప్రస్తుతం ఇది చిత్రీకరణ దశలోనే ఉందని.. ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రానుందని తెలుస్తోంది. 'పొలిమేర', 'పొలిమేర 2' సినిమాలతో ప్రేక్షకుల్ని భయపెట్టారు నటుడు సత్యం రాజేశ్. ఇప్పుడీ ఫ్రాంఛైజీలో భాగంగా 'పొలిమేర 3' పట్టాలెక్కనుంది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించుకోనున్న ఈ సినిమాని ఈసారి పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇవే కాదు.. 'పుష్ప 3', 'కార్తికేయ 3', 'టిల్లు క్యూబ్' లాంటివన్నీ పక్కాగా పట్టాలెక్కాల్సిన సినిమాలే. ఇవన్నీ చిత్రీకరణ ప్రారంభించుకోవడానికి ఇంకా చాలా సమయమే ఉన్నా.. వీటిపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి.


విష్వక్ సేన్

తెలుగులోకి ధురంధర్ సంగీత దర్శకుడు


శాశ్వత్ సచ్‌దేవ్

కథానాయకుడు రామ్‌చరణ్ సమర్పణలో నిఖిల్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'ది ఇండియా హౌస్'. రామ్ వంశీ కృష్ణ తెరకెక్కిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్, విక్రమ్ రెడ్డి నిర్మిస్తున్నారు. సయీ మంజ్రేకర్ కథానాయిక. అనుపమ్ ఖేర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం బాలీవుడ్ సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్‌ను రంగంలోకి దింపింది చిత్ర బృందం. ఆయన ఇటీవలే 'ధురంధర్' సినిమాతో అలరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన నిఖిల్ సినిమాతో తెలుగులోకి వస్తున్నారు. ఈ విషయాన్ని చిత్ర బృందం సోమవారం అధికారికంగా ప్రకటించింది. ఇది 1905 నాటి రాజకీయ నేపథ్య చిత్రం. విప్లవం, ప్రేమ, త్యాగం లాంటి బలమైన భావోద్వేగాలతో నిండి ఉంటుంది. ఈ సినిమాకి ప్రొడక్షన్ డిజైనర్: విశాల్ అబానీ, ఛాయాగ్రహణం: కె.కె. సెంథిల్ కుమార్.

ప్రేక్షకుల భావోద్వేగం


రఘు కుంచె, బెల్లం రామకృష్ణా రెడ్డి, అభినవ్ శౌర్య, అనుశ్రీ,

అభినవ్ శౌర్య, నరసింహ, అనుశ్రీ, రఘు కుంచె ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రం 'దేవగుడి'. బెల్లం రామకృష్ణా రెడ్డి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఇది ప్రస్తుతం థియేటర్లలో సందడి చేస్తున్న నేపథ్యంలో ఇటీవల హైదరాబాద్‌లో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత రామకృష్ణా రెడ్డి మాట్లాడుతూ.. "మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. కొందరు ప్రేక్షకులు సినిమా చూసి భావోద్వేగానికి గురవుతున్నారు. ఎలాంటి సాగదీత లేకుండా బిగి సడలని స్క్రీన్‌ప్లేతో కథ థ్రిల్‌ని పంచిందంటున్నారు" అన్నారు. "మంచి కంటెంట్ ఉంటే చిన్న చిత్రాల్ని కూడా ఆదరిస్తామని తెలుగు ప్రేక్షకులు మా చిత్ర విజయంతో మరోసారి నిరూపించారు. నటుడిగా నాకెంతో తృప్తినిచ్చిన చిత్రమిది. దీంట్లో నేను పోషించిన వీరారెడ్డి పాత్ర నాకెంతో ప్రత్యేకం" అన్నారు నటుడు రఘు కుంచె.

హీరోయిన్లు రాకపోవడంతో మాకు నష్టం


పళని, వెంకటేశ్, రంజన

"కథా బలముంటే చిన్న చిత్రాన్ని కూడా విజయవంతం చేస్తామని ప్రేక్షకులు 'వన్ బై ఫోర్' సినిమాతో మరోసారి నిరూపించార"న్నారు దర్శకుడు బాహుబలి పళని. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో వెంకటేశ్ పెద్దపాలెం, అపర్ణ మల్లిక్, హీనా సోని ప్రధాన పాత్రల్లో నటించారు. రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో సోమవారం హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్‌ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు పళని మాట్లాడుతూ.. "ఇది మంచి క్రైమ్ యాక్షన్ సినిమా. ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కుతోంది" అన్నారు. "బ్లాక్ మెయిలింగ్ వల్ల ఓ మహిళ ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొందన్నది ఈ చిత్రంలో చూపించాం. మా సినిమా ప్రచార కార్యక్రమాలకు కథానాయికలు హాజరవ్వకుండా మా సినిమాకి నష్టాన్ని కలిగించార"న్నారు నిర్మాత రంజన రాజేశ్.

20ఏళ్లు గుర్తుండాలని...!


మానస, సంతోశ్

'కపుల్ ఫ్రెండ్లీ' తన కెరీర్‌లోనే గుర్తుండిపోయే చిత్రమవుతుందని హీరో సంతోశ్ శోభన్ అన్నారు. ఎంతో నిజాయతీగా రూపొందించిన ప్రేమకథా చిత్రమిదని.. ఇందులోని శివ, మిత్ర పాత్రలు అందర్నీ నవ్వించడంతో పాటు కదిలించి, ఏడిపిస్తాయని తెలిపారు. ఆయన.. మానస వారణాసి జంటగా నటించిన ఈ చిత్రాన్ని అశ్విన్ చంద్రశేఖర్ తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో పి. అజయ్ కుమార్ రాజు నిర్మించారు. ఇది ఈ నెల 14న తెలుగు, తమిళంలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా హీరో సంతోశ్ శోభన్ మాట్లాడుతూ.. "నేను కావాలనే చిన్న గ్యాప్ తీసుకున్నా. ఈసారి నేను చూపించబోయే కథ ఇరవై ఏళ్ల పాటు గుర్తుండిపోవాలనుకుని ఈ సినిమా చేశా. దీంట్లో నేను శివగా కనిపిస్తా. నా పాత్ర మూడు భిన్నమైన లుక్స్‌లో కనిపిస్తుంది. మిత్ర పాత్రను మానస పోషించింది. మా రెండు పాత్రలు చెన్నైలో కలిసి చేసిన ప్రయాణం ఏ తీరం చేరిందన్నది ఆసక్తికరం" అన్నారు.

వింటర్ మొదలైంది

రామ్, ఆదిత్య సూరజ్ సింగ్, కుసుమ చందక, శశికళ, శ్రీజిత్ ఘోష్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'వింటర్'. సురేశ్ లంకలపల్లి తెరకెక్కిస్తున్న ఈ సినిమాని రియాజ్ అహ్మద్, టీ శ్రీనివాస్‌రావు నిర్మిస్తున్నారు. రిజ్వాన్ అలీ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ సినిమా ఇటీవలే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైంది. "కశ్మీర్‌లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి.


కుసుమ, రామ్

దలైలామాకి కమల్ హాసన్ అభినందనలు

సంగీత ప్రపంచంలోనే గ్రామీ అవార్డుల వేడుకను ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుంటారు. ఇందులో భాగంగానే 68వ గ్రామీ అవార్డుల వేడుకలు అమెరికాలో ఘనంగా జరిగాయి. ఎంతో మంది సంగీత ప్రియుల మధ్య సందడిగా జరిగిన ఈ అవార్డుల ఉత్సవంలో టిబెట్ బౌద్ధమత గురువు దలైలామాకు ప్రత్యేక గౌరవం లభించింది. బెస్ట్ ఆడియో బుక్, నెరేషన్ అండ్ స్టోరీ టెల్లింగ్ రికార్డింగ్ విభాగంలో ఆయనను గ్రామీ అవార్డు వరించింది. 'మెడిటేషన్- ది రిఫ్లెక్షన్స్ ఆఫ్ హిజ్ హోలీనెస్ ది దలైలామా' అనే ఆల్బమ్‌కు గాను దలైలామాకు ఈ పురస్కారం దక్కింది. 90ఏళ్ల వయసులో తొలి గ్రామీ అవార్డు అందుకుని అందరి దృష్టినీ ఆకర్షించిన దలైలామాకు అగ్రహీరో కమల్‌హాసన్ అభినందనలు తెలిపారు. "ప్రపంచలోని మేధో నాయకులలో ఒకరు.. గౌరవనీయమైన కళాకారులతో చేరడం చూసి గర్వపడుతున్నా. ఆయన పదాలు ప్రపంచ సంగీతానికి మరింత అర్థాన్ని జోడిస్తాయ"ని ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు కమల్ హాసన్. ఈ ఏడాది భారత దేశం నుంచి ప్రముఖ సితార్ వాయిద్య కళాకారిణి అనౌష్క శంకర్, సిద్ధాంత్ భాటియా, చారుసూరి పలు విభాగాల్లో నామినేషన్లు దక్కించుకున్నప్పటికీ గ్రామీ పురస్కారాన్ని సొంతం చేసుకోలేకపోయారు. అనౌష్క శంకర్ 'డే బ్రేక్', 'చాప్టర్ 3: వి రిటర్న్ టు లైట్' అనే ఆల్బమ్స్‌కి గానూ రెండు నామినేషన్లు అందుకున్నారు.

అది నా వ్యక్తిగత విషయం


మృణాల్ ఠాకూర్

త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతుందంటూ నటి మృణాల్ ఠాకూర్ వరుసగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ వార్తలను మృణాల్ ఖండించింది. సిద్ధాంత్ చతుర్వేది ఆమె జంటగా నటించిన చిత్రం 'దో దివానే సెహర్ మే'. ఈ సినిమా ఈ నెల 20న విడుదలకానున్న సందర్భంగా ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో దీనిపై స్పందించింది మృణాల్. ప్రేమికుల రోజున మీ వివాహమంటూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తలపై మీ స్పందనేంటి.. అనే ప్రశ్నకు "నన్ను ఎవరూ పిలవలేదు ఆ పెళ్లికి. నేను ఈ రూమర్స్ అన్నీ చూస్తూ చాలా నవ్వుకుంటున్నాను. ఇలాంటివి సృష్టిస్తున్న వాళ్లందరికీ థ్యాంక్స్. మీరంతా నా కోసం ఫ్రీ పీఆర్ చేస్తున్నారు. దీనిపై నేను చెప్పాలనుకుంటున్నదేంటంటే.. మీరు అనుకుంటున్నట్లు అది నిజం కాదు. కావాలంటే ఫిబ్రవరి 14న మీరే చూస్తారు. నేను పెళ్లి చేసుకుంటే ఆ వార్తని శ్రీ గణేశుడితో పాటు అభిమానులతోనూ తప్పకుండా పంచుకుంటాన"ని మృణాల్ చెప్పుకొచ్చింది. ఇప్పుడు మీ జీవితంలో ప్రేమ ఉందా? అనే ప్రశ్నను మృణాల్ 'అది వ్యక్తిగత ప్రశ్న' అంటూ చిరునవ్వుతో దాటవేసింది. గతంలోను మృణాల్ ఓ ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించింది. తనది దూకుడు స్వభావమని, నటించడం అతనికి ఇష్టంలేదని చెప్పడంతో బ్రేకప్ చెప్పినట్టు తెలిపింది. అతను పెరిగిన కుటుంబ వాతావరణం వల్ల తన మనస్తత్వం అలా ఉందని అతని తప్పేం లేదని.. భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారని విడిపోయామని పంచుకుంది. ఈ నిర్ణయం పట్ల తను ఏ మాత్రం బాధపడలేదని వెల్లడించింది.

(c) eenadu



మహిళలకు 40గ్రా. ..పురుషులకు 20గ్రా.

విదేశాల నుంచి పసిడి ఆభరణాలు తెచ్చుకునేందుకు గరిష్ఠ పరిమితి ఇది



అమల్లోకి వచ్చిన బ్యాగేజీ నిబంధనలు-2026

ఈనాడు - హైదరాబాద్

విదేశాల నుంచి విమానం లేదా సముద్ర మార్గాల్లో మనదేశానికి వచ్చే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మహిళా ప్రయాణికులు 40 గ్రాముల వరకు, పురుషులు 20 గ్రాముల వరకు బంగారు ఆభరణాలను సుంకం లేకుండా తీసుకురావచ్చని తెలిపింది. అయితే వీరు ఏడాదికి పైగా విదేశాల్లో నివసిస్తూ, తిరిగి వస్తున్న వారు లేదా భారత సంతతి పర్యాటకులైనా కావచ్చు. గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఈ ఆభరణాలు కచ్చితంగా వ్యక్తిగత వినియోగం కోసమే తీసుకురావాలి. బిస్కెట్లు, కడ్డీల రూపంలో ఉండే పసిడికి ఈ మినహాయింపు లభించదు. ఇప్పటివరకు మహిళలు రూ.లక్ష, పురుషులు రూ.50 వేల విలువైన ఆభరణాలే ఇలా తెచ్చుకోవచ్చు.

✦ 2016 నాటి పాత నిబంధనల స్థానంలో, రూపొందించిన 'బ్యాగేజీ నిబంధనలు 2026' ఈనెల 2 నుంచి అమల్లోకి వచ్చినట్లు కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు (సీబీఐసీ) సోమవారం తెలిపింది. ఈ ప్రకారం..

✦ విదేశాల నుంచి తిరిగి వచ్చే భారతీయ నివాసితులు, విదేశాల్లో స్థిరపడిన భారత సంతతి పర్యాటకులు లేదా పర్యాటక వీసా కాకుండా ఇతర వీసాలపై వచ్చే విదేశీయులు, తమ వెంట తీసుకొచ్చే రూ.75,000 విలువైన వస్తువులపై కస్టమ్స్ సుంకం (డ్యూటీ) మినహాయింపు ఉంటుంది. గతంలో ఈ పరిమితి రూ.50,000 మాత్రమే. ఇకపై వీరు వ్యక్తిగత వినియోగం కోసం రూ.75,000 విలువైన వస్తువులను కస్టమ్స్ సుంకం చెల్లించకుండానే ఇక్కడకు తీసుకురావొచ్చు. రెండేళ్ల లోపు వయసున్న పిల్లలకు ఈ మినహాయింపు వర్తించదు.

విదేశీయులకు ప్రత్యేక పరిమితి: విమానం లేదా నౌకలపై వచ్చే విదేశీ పర్యాటకులు రూ.25,000 విలువైన కొత్త వస్తువులనే సుంకం లేకుండా తీసుకురాగలరు. భూమార్గం (రోడ్డు లేదా రైలు) ద్వారా వచ్చే ప్రయాణికులకు వారి వ్యక్తిగత అవసరాలకు వాడే పాత వస్తువులపైనే మినహాయింపు ఉంటుంది.

ఎలక్ట్రానిక్ వస్తువులు: 18 ఏళ్ల, అంతకంటే ఎక్కువ వయసున్న ప్రయాణికులు (విమాన సిబ్బంది కాకుండా) అదనంగా ఒక కొత్త ల్యాప్‌టాప్ లేదా నోట్ ప్యాడ్‌ను సుంకం లేకుండా తమ లగేజీలో తీసుకురావచ్చు. ప్రయాణంలో వ్యక్తిగత అవసరాల కోసం తెచ్చుకునే పాత వస్తువులపై (దుస్తులు, ఇతర పరికరాలు) ఎలాంటి సుంకం ఉండదు.

బదిలీ కుదరదు..

సుంకం మినహాయింపు పరిమితి పూర్తిగా వ్యక్తిగతం. కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు ఉంటే, వారికి విడివిడిగానే ఈ పరిమితులు వర్తిస్తాయి. ఒక ప్రయాణికుడికి ఉన్న పరిమితిని మరొకరితో పంచుకునేందుకు, కలపడానికి కుదరదు. 2 లీటర్ల మద్యం, 100 సిగరెట్లు, 125 గ్రాముల పొగాకు ఉత్పత్తుల వరకు సుంకం వర్తించదు. తుపాకులు, ఆభరణాలు కాని బంగారం లేదా వెండి, టీవీ వంటి వస్తువులకు సాధారణ సుంకం మినహాయింపు వర్తించదు. విమాన లేదా నౌకా సిబ్బంది తమ విధుల్లో భాగంగా వస్తుంటే.. వారు రూ.2,500 విలువైన చాక్లెట్లు, సౌందర్య సాధనాలను సుంకం లేకుండా తేగలరు. విదేశీ కరెన్సీని దేశంలోకి తేవడం, బయటకు తీసుకెళ్లడం 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్- 2015' నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని సీబీఐసీ పేర్కొంది.

శాశ్వతంగా తిరిగి వస్తుంటే..

ఉద్యోగ రీత్యా లేదా ఇతర కారణాల వల్ల విదేశాల్లో ఉండి, ఇప్పుడు శాశ్వతంగా భారత్‌కు తిరిగి వచ్చే వారికి, నివాస కాలం ఆధారంగా గృహోపకరణాలపై ప్రత్యేక మినహాయింపులు లభిస్తాయి.

✦ విదేశాల్లో 3-12 నెలలు నివాసం ఉన్న వారికి రూ.1,50,000 విలువైన గృహోపకరణాలు

✦ గత రెండేళ్లలో ఏడాదిపాటు విదేశాల్లో ఉన్న వారు రూ.3 లక్షల విలువైన వస్తువులను తీసుకురావొచ్చు.

✦ కనీసం రెండేళ్లు విదేశాల్లో ఉండి, తిరిగి వచ్చేవారు గరిష్ఠంగా రూ.7.50 లక్షల విలువైన వస్తువులను సుంకం లేకుండా తెచ్చుకోవచ్చు.

దిగివస్తున్న బంగారం, వెండి ధరలు

బంగారం, వెండి ధరల్లో దిద్దుబాటు కొనసాగుతోంది. ఔన్సు (31.10 గ్రా) బంగారం ధర సోమవారం రాత్రి 11.55 గంటల సమయానికి 263 డాలర్లు తగ్గి 4629 డాలర్ల వద్ద ఉంది. ఒకదశలో బంగారం ధర 4413 డాలర్లకు దిగి వచ్చినా, మళ్లీ కాస్త కోలుకుంది. ఔన్సు వెండి ధర 8 డాలర్లు నష్టపోయి 76 డాలర్ల వద్ద ఉంది. హైదరాబాద్ బులియన్ విపణిలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,50,000, కిలో వెండి ధర రూ.2,48,490 (పన్నులతో కలిపి) వద్ద స్థిరపడింది. కమొడిటీల ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లో 10 గ్రాముల బంగారం ఫిబ్రవరి కాంట్రాక్టు ధర రూ.1,41,900, కిలో వెండి మార్చి కాంట్రాక్టు ధర రూ.2,32,500 వద్ద స్థిరపడింది.

హ్యుండాయ్ మోటార్ లాభం రూ.1234 కోట్లు



హ్యుండాయ్ మోటార్ ఇండియా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) డిసెంబరు త్రైమాసికంలో రూ.1,234.4 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.1,160.74 కోట్లతో పోలిస్తే ఇది 6.35% అధికం. జీఎస్‌టీ 2.0 సంస్కరణలు, పండగ గిరాకీ నేపథ్యంలో విక్రయాలు పెరగడం కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. కార్యకలాపాల ఏకీకృత ఆదాయం 16,647.99 కోట్ల నుంచి రూ.17,973.49 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలు రూ.15,329.73 కోట్ల నుంచి రూ.16,551.11 కోట్లకు చేరాయి. త్రైమాసిక ప్రాతిపదికన దేశీయ విక్రయాల పరిమాణం 5% పెరిగింది. ఎబిటా మార్జిన్ 12.5% నుంచి 12.8 శాతానికి చేరింది. 'అక్టోబరు-డిసెంబరులో కంపెనీ పని తీరు బలంగా నమోదైంది. నాణ్యతతో కూడిన వృద్ధి ప్రణాళికను అమలు చేయడంతో పాటు, పరిమాణంలో ఆరోగ్యకర వృద్ధి కొనసాగింది. ఆదాయం, లాభదాయకత పెరిగాయి. వ్యయ నియంత్రణ చర్యలూ పాటించాం. గత నెలలో బలమైన విక్రయాలు నమోదు చేయడంతో 2026 మొత్తం మాకు బాగా కలిసొస్తుందని ఆశిస్తున్నామ'ని హ్యుండాయ్ మోటార్ ఎండీ, సీఈఓ తరుణ్ గార్గ్ వెల్లడించారు.

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లాభం రూ.46 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: విద్యుత్ బస్సులు, ట్రక్కుల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్, డిసెంబరు త్రైమాసికంలో రూ.667.10 కోట్ల ఆదాయంపై రూ.46.39 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.5.65గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.517.58 కోట్లు, నికర లాభం రూ.46.32 కోట్లుగా ఉన్నాయి. 2025-26 ఏప్రిల్-డిసెంబరు కాలానికి మొత్తం ఆదాయం రూ.1,680.60 కోట్లు, నికర లాభం రూ.121.97 కోట్లుగా ఉన్నాయి. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1,360.76 కోట్లు, నికర లాభం రూ.117.88 కోట్లుగా నమోదయ్యాయి.

ఒరాకిల్‌లో 30,000 ఉద్యోగ కోతలు!

ఒరాకిల్ తన ఏఐ డేటా కేంద్రాలకు నిధులను అందించేందుకు, వ్యయాలు తగ్గించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఏఐ డేటా కేంద్రాల విస్తరణ కోసం పెట్టుబడులు సమకూర్చేందుకు అమెరికా బ్యాంకులు వెనకడుగు వేస్తున్నందున, కొన్ని కార్యకలాపాలను విక్రయించాలనీ ఒరాకిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ఒరాకిల్ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు.

45–50 బి. డాలర్ల సమీకరణ!: క్లౌడ్ ఇన్‌ఫ్రా పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకునేందుకు ఈ ఏడాదిలో 45-50 బి. డాలర్ల (దాదాపు రూ.4-4.55 లక్షల కోట్లు) సమీకరించాలని ఒరాకిల్ భావిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. డెట్, ఈక్విటీ విక్రయాల ద్వారా ఈ నిధుల సమీకరణ జరగొచ్చని తెలిపింది. ఏఎమ్‌డీ, మెటా, ఎన్‌విడియా, ఓపెన్‌ఏఐ, టిక్‌టాక్, ఎక్స్‌ఏఐ వంటి దిగ్గజం క్లయింట్ల నుంచి పెరుగుతున్న గిరాకీ కారణంగా ,అదనపు సామర్థ్య పెట్టుబడి ప్రణాళికల్లోకి ఉన్నట్లు కంపెనీ సైతం నిర్ధరించింది. ఈ నేపథ్యంలో, కంపెనీ షేరు 3% వరకు నష్టంతో ట్రేడ్ అవుతోంది.



3న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	485
వరంగల్	487
విజయవాడ	500
తూ/ప గోదావరి	470
విశాఖపట్నం	490
చిత్తూరు	573

2026-27లో ఎల్ఐసీ ఎఫ్‌పీఓ



లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ), వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో మలి విడత పబ్లిక్ ఆఫర్ (ఎఫ్‌పీఓ)కు వచ్చేందుకు సన్నాహాలు చేసుకుంటోందని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం.నాగరాజు సోమవారం వెల్లడించారు. ప్రస్తుతం ఎల్ఐసీలో ప్రభుత్వానికి 96.5% వాటా ఉంది. 2022 మేలో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా ఈ సంస్థలో 3.5% వాటాను ప్రభుత్వం విక్రయించింది. ఎల్ఐసీలో ప్రభుత్వ వాటా విక్రయంపై పెట్టుబడులు, ప్రజా ఆస్తుల నిర్వహణ విభాగాన్ని (దీపమ్) కోరినట్లు నాగరాజు వెల్లడించారు. మార్కెట్ పరిస్థితులు బాగుంటే, అన్ని అనుమతులు వస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఎఫ్‌పీఓ ఉంటుందని పేర్కొన్నారు. 2027 మార్చి నాటికి 10% పబ్లిక్ వాటా నిబంధనను చేరుకునేందుకు, ఎల్ఐసీలో మరో 6.5% వాటాను ప్రభుత్వం విక్రయించాల్సి ఉంది.

పీఎఫ్‌సీ, ఆర్ఈసీ విలీనం: ప్రభుత్వరంగ విద్యుత్ రుణ సంస్థ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), దాని అనుబంధ ఆర్ఈసీ (రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్) సంస్థల విలీనం చేయాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. దేశంలో విద్యుదుత్పత్తి, పంపిణీ, సరఫరా ప్రాజెక్టులకు రుణాలిచ్చేందుకు ఈ సంస్థలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. విలీన నిర్ణయం జరుగుతుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

పీఎస్‌బీల్లో ఎఫ్‌డీఐ పరిమితి 49%: ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల(ఎఫ్‌డీఐ) పరిమితిని ప్రస్తుత 20% నుంచి 49 శాతానికి పెంచాలని ఆర్థిక శాఖ ఆలోచిస్తోందని నాగరాజు తెలిపారు. 'ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల్లో ఎఫ్‌డీఐ పరిమితి వరుసగా 20%, 74 శాతంగా ఉంది. ఐడీబీఐ బ్యాంక్ వ్యూహాత్మక వాటా విక్రయంపై మాట్లాడుతూ ఈ నెల లేదా వచ్చే నెలలో ఆర్థిక బిడ్లకు ఆహ్వానం పలుకుతామన్నారు.

రూపాయికి టారిఫ్ కష్టాలు తీరతాయా?

అమెరికాతో భారత్ వాణిజ్య ఒప్పంద నేపథ్యం

ఎట్టకేలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి మనదేశానికి ఒక శుభవార్త వచ్చింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. భారత ఉత్పత్తులపై ప్రతీకార సుంకం 25%, రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు మరో 25% సుంకాన్ని విధిస్తున్న ఆయన.. తాజాగా ప్రతీకార సుంకాన్ని 18 శాతానికి తగ్గించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపేసి, అమెరికా నుంచి తీసుకోవడానికి ఒప్పుకుందని ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కారణంగా విధించిన 25% సుంకాలను తొలగిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వల్లే విదేశీ మదుపర్లు మన మార్కెట్లలో భారీగా అమ్మకాలు జరుపుతున్నారు. ఫలితంగా డాలర్‌కు గిరాకీ పెరిగి, రూపాయి విలువ క్షీణిస్తూ వచ్చింది. తాజా పరిణామాలతో మన మార్కెట్లు, రూపాయి కోలుకుంటాయనే ఆశిస్తున్నారు.



భారత వస్తువులపై అమెరికా 50% టారిఫ్ పరిణామాలు ఇలా

2025 ఏప్రిల్ 2 : 'లిబరేషన్ డే' టారిఫ్ చర్యల్లో భాగంగా పలు దేశాల ఉత్పత్తులపై టారిఫ్‌లను ప్రకటించిన ట్రంప్.. భారత్‌పై 26% ప్రతీకార టారిఫ్ విధిస్తున్నట్లు వెల్లడి

ఏప్రిల్ 10: టారిఫ్ అమలును 90 రోజుల పాటు తాత్కాలికంగా ట్రంప్ ఆపారు. అయితే అమెరికాలోకి వెళ్లే అన్ని దిగుమతులపై 10% సుంకాన్ని కొనసాగించారు.

జులై 31: అన్ని భారత వస్తువులపై 25% టారిఫ్‌ను ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోలును కొనసాగిస్తే పెనాల్టీ విధిస్తానన్నారు.

ఆగస్టు 7: రష్యా చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తోందంటూ, టారిఫ్‌ను 50 శాతానికి పెంచారు. అమెరికా వాణిజ్య భాగస్వాములలో, అత్యంత అధిక టారిఫ్ మనపైనే పడింది.

2025 ఏప్రిల్ నుంచి డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత ఇలా..

ఏప్రిల్	85.5
జూన్	86
ఆగస్టు	87
సెప్టెంబరు	88
నవంబరు	89
డిసెంబరు	90
2026 జనవరి	91–92
ఫిబ్రవరి2	91.49

ఐపీఓకు మత్రి రిటెయిల్

ఈనాడు, హైదరాబాద్: దుస్తులు, ఆభరణాల విక్రయ సంస్థ మత్రి రిటెయిల్, తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా నిధుల సమీకరణకు సెబీ వద్ద ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. రూ.522 కోట్ల విలువైన తాజా షేర్ల జారీతో పాటు, ప్రమోటర్ మత్రి వెంకట్ రెడ్డికి చెందిన 2.7 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద విక్రయించాలన్నది సంస్థ ప్రతిపాదన. 1999లో జీన్స్ కార్నర్‌తో మొదలై, ప్రస్తుతం ది చెన్నై షాపింగ్ మాల్, జేసీ మాల్, జె.సి. బ్రదర్స్, ది చెన్నై షాపింగ్ మాల్ జువెలర్స్ వంటి బ్రాండ్లతో తెలంగాణ, ఏపీ సహా నాలుగు రాష్ట్రాల్లో 34 స్టోర్లను ఈ సంస్థ నిర్వహిస్తోంది. 2025 ఏప్రిల్- సెప్టెంబరులో ఈ సంస్థ రూ.1,301.42 కోట్ల ఆదాయంపై రూ.83.52 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

స్మార్ట్‌ఫోన్ల విక్రయాల విలువలో యాపిల్‌కు 28% వాటా



దేశీయంగా గతేడాది విక్రయమైన స్మార్ట్‌ఫోన్ల మొత్తం విలువలో 28% వాటా అమెరికాకు చెందిన ఐఫోన్ల సంస్థ యాపిల్‌కు దక్కింది. 2024లో ఈ వాటా 23 శాతమే. అమ్ముడైన ఐఫోన్ల సంఖ్యా పరంగా చూసుకుంటే, ఏడాది వ్యవధిలో పెద్ద మార్పేమీ లేదు. అయితే ఖరీదైన ఐఫోన్ల విక్రయాలు పెరగడమే, విలువలో యాపిల్ వాటా అధికమవ్వడానికి కారణం. 'ఖరీదైన హైఎండ్ స్మార్ట్‌ఫోన్ల కొనుగోలుపై భారత్‌లో పెరుగుతున్న ఆసక్తికి దర్పణమే ఈ గణాంకాలు అని' మార్కెట్ పరిశోధనా సంస్థ కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ పేర్కొంది. ఐఫోన్ 16 శ్రేణి విక్రయాలు పెరగడం యాపిల్‌కు కలిసొచ్చింది. ఈ నివేదిక ప్రకారం..

✦ 2025లో మనదేశంలో స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు సంఖ్యా పరంగా 1%, విలువ 8% పెరిగాయి.

✦ రిటెయిల్ విక్రయ శాలల్లో 40% రుణంపైనే అమ్ముడవుతున్నాయి. రూ.30,000 అంతకంటే విలువైన ఫోన్లలో మూడింట రెండొంతులు రుణంపైనే కొనుగోలు చేస్తున్నారు. అధిక విలువ కలిగిన మోడళ్లు కొనేందుకు రుణాలూ కారణమవుతున్నాయి. రూ.30,000 కంటే అధిక విలువ కలిగిన స్మార్ట్‌ఫోన్ల విక్రయాలు 11% పెరిగాయి. మొత్తం స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో వీటివాటా 22%. ✦ ఫోల్డబుల్ మోడళ్లలో శామ్‌సంగ్‌దే అగ్రస్థానం. సంఖ్యాపరంగా 88% ఈ కంపెనీవే.

స్వల్పంగా పుంజుకున్న 'తయారీ'



దిల్లీ: ఈ ఏడాది జనవరిలో దేశీయ తయారీ రంగ కార్యకలాపాలు స్వల్పంగా పుంజుకున్నాయి. కొత్త ఆర్డర్ల రాక ఇందుకు ఉపకరించిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. అయితే వ్యాపార విశ్వాసం మూడున్నరేళ్ల కనిష్ఠానికి పడిందని పేర్కొంది. హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) జనవరిలో 55.4 పాయింట్లకు పెరిగింది. 2025 డిసెంబరులో ఇది రెండేళ్ల కనిష్ఠమైన 55 పాయింట్ల వద్ద ఉంది. పీఎంఐ పరిభాషలో 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగానూ పరిగణిస్తారు. జనవరిలో తయారీ రంగ పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉన్నందున.. వృద్ధి ఉన్నప్పటికీ, డిసెంబరుతో పోలిస్తే ఆ వృద్ధి స్వల్పంగానే పెరగడం గమనార్హం. 'భారత తయారీ రంగ సంస్థలు జనవరిలో పుంజుకున్నాయి. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఉద్యోగకల్పన పెరగడం ఇందుకు దోహదం చేసింది. అయితే ముడి సరకు వ్యయాలూ స్వల్పంగా పెరిగాయ'ని హెచ్ఎస్‌బీసీలో ముఖ్య భారత ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. గిరాకీ సానుకూలతలు, కొత్త వ్యాపారాల్లో వృద్ధి, సాంకేతిక పెట్టుబడులు లాంటివి ఉత్పత్తికి అండగా నిలిచాయని పేర్కొన్నారు. తయారీ కంపెనీలు నియామకాలను కొనసాగించినప్పటికీ, ఉద్యోగకల్పనలో వృద్ధి ఓ మోస్తరుగానే ఉందని నివేదిక తెలిపింది.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
మహీంద్రా లైఫ్‌స్పేస్	109	(22.47)	469	186
క్యాంపస్ యాక్టివ్‌వేర్	64	46	589	515
యూపీఎల్	490	853	12,361	11,077
ఆఫీస్ స్పేస్	22	15	411	331
ఏథర్ ఎనర్జీ	(85)	(198)	996	650
థర్మాక్స్	210	90	2697	2560
నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్	139	115	692	531

ప్రభుత్వ రంగ సంస్థల్లో మరిన్ని వాటా విక్రయాలు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వరంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో మరిన్ని పెట్టుబడుల ఉపసంహరణలుంటాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బడ్జెట్ అనంతర విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయాలను స్థిరంగా ఉంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రుణ-జీడీపీ నిష్పత్తి ప్రస్తుతం 56% కాగా, 2030-31 కల్లా 50 శాతానికి చేర్చాలన్నది లక్ష్యమన్నారు. 'పన్ను పరిధిని మరింత విస్తృతం చేయడం ద్వారా ప్రత్యక్ష పన్ను ఆదాయాలు పెంచాలని అనుకుంటున్నాం. మా ప్రాధాన్యత పెట్టుబడుల ఉపసంహరణకే ఉంటుంద'ని మంత్రి స్పష్టం చేశారు.

✦ ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం త్వరలోనే పూర్తవుతుందని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం, ఎల్ఐసీ కలిసి ఇందులో 60.72% వాటా విక్రయించాలనుకుంటున్నాయి.

'గోల్డ్ రష్' అందుకే: వినియోగానికి మద్దతు ఇచ్చేందుకు, పెట్టుబడులను ఆయుధంగా మలచడంపై కేంద్ర బడ్జెట్ దృష్టి సారించినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం వృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ద్రవ్య లోటు లక్ష్యమే చెబుతోందన్నారు. ఏటా ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నట్లు తెలిపారు. మదుపర్లకు ఏ కరెన్సీపైనా నమ్మకం లేకపోవడం వల్లే, ఇటీవలి కాలంలో బంగారం - వెండి వైపు పరుగులు తీశారని అభిప్రాయపడ్డారు. స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు సామాన్యులను దూరంగా ఉంచడం కోసమే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) ట్రేడ్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) పెంచినట్లు స్పష్టం చేశారు.

✦ దివాలా స్మృతి(సవరణ)- బిల్లు 2025ను మార్చి 9న ప్రారంభమయ్యే బడ్జెట్ సెషన్లలో ప్రవేశపెడతామని తెలిపారు. ఇప్పటికే పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సమర్పించిందన్నారు. ఈ సవరణల వల్ల దివాలా ప్రక్రియ సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు.

కనీస నిల్వలు లేని ఖాతాలపై మూడేళ్లలో రూ.8,000 కోట్లు వసూలు

- ఆధార్-పాన్ లింక్ జాప్యానికి ఫీజురూపంలో రూ.2,335 కోట్లు
- రిటర్న్‌ల దాఖలులో ఆలస్యానికి రూ.7,664 కోట్లు వసూలు



ఈనాడు, దిల్లీ: బ్యాంకు ఖాతాల్లో కనీస నగదు నిల్వలు లేని ఖాతాదారుల నుంచి దేశంలోని 11 ప్రభుత్వరంగ బ్యాంకులు గత మూడేళ్లలో రూ.8,092 కోట్ల ఛార్జీ వసూలు చేసినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్‌చౌధరి తెలిపారు. ఖాతాదారులకు ఎస్ఎంఎస్‌లు పంపినందుకు, రుసుముల కింద రూ.3,387 కోట్లు వసూలు చేసినట్లు లోక్‌సభకు తెలిపారు. కనీస నిల్వలు లేని ఖాతాల నుంచి 2022-23లో రూ.2,407.82 కోట్లు, 2023-24లో రూ.2,909.1 కోట్లు, 2024-25లో రూ.2,775.91 కోట్లు వసూలుచేసినట్లు తెలిపారు. ఎస్ఎంఎస్ సౌకర్యం కోసం అదే సంవత్సరాల్లో వరుసగా రూ.1,193.19 కోట్లు, రూ.976.98 కోట్లు, రూ.1,217.6 కోట్ల ఛార్జీలను బ్యాంకులు వసూలు చేసినట్లు వెల్లడించారు.

✦ పాన్-ఆధార్‌కార్డుల లింక్‌లో జాప్యం చేసిన ప్రజల నుంచి ఫీజు/రుసుముల రూపంలో 2022-23 నుంచి 2024-25 మధ్య రూ.2,335.75 కోట్లు వసూలుచేసినట్లు చెప్పారు. ఆలస్యంగా రిటర్న్‌లు దాఖలుచేసిన వారి వద్ద 2021-22 నుంచి 2024-25 మధ్య రుసుముల రూపంలో రూ.7,664.94 కోట్లు వసూలుచేసినట్లు తెలిపారు. మంత్రి చెప్పినదాని ప్రకారం, పైన పేర్కొన్న 4 అంశాల్లో బ్యాంకులు, ప్రభుత్వం కలిపి ప్రజల నుంచి రూ.21,481.29 కోట్లు వసూలుచేశాయి.

జనవరిలో వాహన విక్రయాలు పెరిగాయ్

వాహన తయారీ దిగ్గజ సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా, హ్యుండాయ్ సంస్థలు కొత్త ఏడాదిలోనూ విక్రయజోరు కనబరచాయి. మారుతీ సుజుకీ దేశీయంగా డీలర్లకు సరఫరా చేసిన ప్రయాణికుల వాహనాలు 1,74,529కు చేరాయి. 2025 జనవరిలో ఇవి 1,73,599 మాత్రమే. రోజూ 9,000-10,000 వాహనాలకు బుకింగ్‌లు వస్తున్నాయని, ఇటీవల తీసుకొచ్చిన ఎస్‌యూవీ విక్టోరిస్ విక్రయాలు 5 నెలల్లోనే 50,000 మార్కును అధిగమించాయని మారుతీ సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి (మార్కెటింగ్, సేల్స్) పార్థో బెనర్జీ తెలిపారు. ✦ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ దేశీయ విక్రయాలు 48,076 నుంచి 46% వృద్ధితో 70,222కు చేరాయి. మహీంద్రా దేశయ విపణిలో డెలివరీ చేసిన వాహనాల సంఖ్య 50,659 నుంచి 25% వృద్ధితో 63,510కు చేరింది. హ్యుండాయ్ మోటార్ ఇండియా టోకు విక్రయాలు 54,003 నుంచి 9% పెరిగి 59,107కు చేరాయి. టయోటా కిర్లోస్కర్ దేశీయ విక్రయాలు 26,178 నుంచి 17% పెరిగి 30,630కు చేరాయి. కియా ఇండియా విక్రయాలు 10% పెరిగి 27,603కు చేరాయి. రెనో ఇండియా వాహన సరఫరాలు 2,780 నుంచి 34% పెరిగి 3,715కు చేరాయి.

✦హీరో మోటోకార్ప్ తన డీలర్లకు సరఫరా చేసిన వాహనాలు 4,12,378 నుంచి 26% వృద్ధితో 5,20,208కు చేరాయి.

బడ్జెట్ నష్టాల నుంచి భారీ లాభాల్లోకి



- 44 పైసలు లాభపడిన రూపాయి
- రూ.4.42 లక్షల కోట్లు పెరిగిన సంపద విలువ

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.1832.46 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.2446.33 కోట్లు

సెన్సెక్స్ ▲944 81666 | నిఫ్టీ ▲263 25088

బడ్జెట్ రోజు నాటి భారీ నష్టాల నుంచి మన స్టాక్ మార్కెట్ తేరుకుని, లాభాల్లో ముగిసింది. చమురు-గ్యాస్, బ్యాంకింగ్, వాహన రంగంలోని దిగ్గజ కంపెనీల షేర్లకు, తక్కువ స్థాయిల వద్ద కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు నేపథ్యం. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడమూ సానుకూల ప్రభావాన్ని చూపింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 44 పైసలు పెరిగి 91.49 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు 4.73% తగ్గి 66.04 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.4.42 లక్షల కోట్లు పెరిగి రూ.455.03 లక్షల కోట్ల (4.97 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

నష్టాల్లో మొదలై..: బీఎస్ఈ సెన్సెక్స్ 80,555.68 పాయింట్ల వద్ద నష్టాల్లో (క్రితం ముగింపు 80,722.94) ఆరంభమైనా, వెంటనే లాభాల్లోకి వచ్చింది. మధ్యలో మళ్లీ నష్టాల్లోకి చేరినా.. మళ్లీ పుంజుకుని ఒక దశలో 81,732.25 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని చేరింది. చివరకు 943.52 పాయింట్ల లాభంతో 81,666.46 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 262.95 పాయింట్లు పెరిగి 25,088.40 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,679.40 వద్ద కనిష్ఠాన్ని, 25,108.10 వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది.

5 మినహా...: సెన్సెక్స్ 30 కంపెనీల షేర్లలో 5 మినహా మిగతావి రాణించాయి. పవర్‌గ్రిడ్ 7.61%, అదానీ పోర్ట్స్ 4.76%, బీఈఎల్ 3.33%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 3.28%, మహీంద్రా అండ్ మహీంద్రా 2.97%, ఎల్అండ్‌టీ 2.86%, ఇండిగో 2.13% పెరిగాయి. ఇన్ఫోసిస్ 1.85%, యాక్సిస్ బ్యాంక్ 1.53%, టైటన్ 0.88%, టీసీఎస్ 0.5%, ట్రెంట్ 0.33% నష్టపోయాయి.

కోలుకున్న స్టాక్‌బ్రోకింగ్ సంస్థల షేర్లు

ఎస్‌టీటీ పెంపు నేపథ్యంలో, ఆదివారం నష్టపోయిన స్టాక్‌బ్రోకింగ్ సంస్థల షేర్లల్లో చాలా వరకు సోమవారం కోలుకున్నాయి. ఏంజెల్ వన్ 3.89%, మోనార్క్ నెట్‌వర్త్ కేపిటల్ 3.34%, జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 2.72%, ఆనంద్ రాఠీ షేర్ అండ్ స్టాక్ బ్రోకర్స్ 1.79%, 5పైసా కేపిటల్ 1.05%, దోలత్ ఆల్గోటెక్ 0.39% పెరిగాయి. గ్రో షేర్లు మాత్రం 2.29% నష్టపోయాయి.

జనవరిలో ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.36,000 కోట్లు

అంతర్జాతీయ అనిశ్చితుల ప్రభావంతో, ఈ ఏడాది జనవరిలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐలు) మన ఈక్విటీ మార్కెట్ల నుంచి సుమారు రూ.36,000 కోట్ల (3.97 బిలియన్ డాలర్ల) పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. 2025 మొత్తంమీద ఎఫ్‌పీఐలు రూ.1.66 లక్షల కోట్ల అమ్మకాలు జరిపారు. అదే రీతిలో కొత్త ఏడాదిలోనూ అమ్మకాలు కొనసాగించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణత, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం, దేశీయంగా షేర్ల విలువలు అధికంగా ఉన్నాయనే భావనతో వారు అమ్మకాలను కొనసాగిస్తున్నారని విశ్లేషకులు పేర్కొంటున్నారు. 2026-27 బడ్జెట్లో డెరివేటివ్‌లపై సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ)ను పెంచిన నేపథ్యంలో, భవిష్యత్తులో ఎఫ్‌పీఐల పెట్టుబడుల రాక ఎలా ఉంటుందో గమనించాల్సిందే.

ఎన్ఎస్ఈ సీఈఓతో మంత్రి గోయల్ సమావేశం



2026–27 వార్షిక బడ్జెట్‌తో కలగనున్న విస్తృత ప్రయోజనాలను ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్, మ్యూచువల్ ఫండ్స్, ఆస్తుల నిర్వహణ పరిశ్రమ ఫండ్ మేనేజర్లు, మదుపర్లకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ వివరించారు. ఇందుకోసం ఆయన ఎన్ఎస్ఈలో సమావేశం నిర్వహించారు. 'బడ్జెట్ నిర్ణయాలు అందించే వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సభికులు ఉత్సుకత కనబరచారు. కొత్త ఆలోచనలు, సూచనలు పంచుకున్నారు' అని గోయల్ తెలిపారు.

(c) eenadu

ఎస్‌బీఐ సర్కిల్‌లో సత్తా చూపుతారా!



బ్యాంకు ఉద్యోగాల గురించి మాట్లాడుకున్నప్పుడు వెంటనే స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) గుర్తుకు వస్తుంది. అధిక వేతనం, పలు ప్రోత్సాహకాల కారణంగా ఎస్‌బీఐ ఉద్యోగాలకు ఎంతో క్రేజ్ ఏర్పడింది. ఇటీవలే ఈ సంస్థ సర్కిల్ బేస్డ్ ఆఫీసర్స్ (సీబీఓ) పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 2050 ఖాళీలు ఉన్నాయి. పరీక్ష, ఇంటర్వ్యూలతో నియామకాలుంటాయి.

బ్యాంకుల్లో ఆఫీసర్ హోదాలో కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

బ్యాంకు కార్యకలాపాల్లో అనుభవం ఉన్నవారిని నియమిస్తే ఎలాంటి కాలయాపన, శిక్షణ అవసరం లేకుండా సమర్థంగా విధులు నిర్వర్తించగలరు. ఆ లక్ష్యంతోనే సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ నియామకాలను చేపడుతున్నారు. ప్రభుత్వ బ్యాంకుల్లో అవకాశం రానందున ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్నవారికి, అలాగే గ్రామీణ బ్యాంకుల్లో సేవలందిస్తోన్న వారికి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో స్కేల్-1 ఆఫీసర్‌గా ఉద్యోగం పొందే అవకాశం ఈ నోటిఫికేషన్‌తో లభిస్తుంది. వీటికి ఎంపికైనవారికి పదోన్నతులు ప్రొబేషనరీ ఆఫీసర్లుగా నియమితులైనవారికి ఉన్నట్లుగానే ఉంటాయి. ఈ పోస్టులపై ఆసక్తి ఉన్నవారు ఏదైనా ఒక సర్కిల్‌లోని ఖాళీలకే దరఖాస్తు చేసుకోవాలి. ఇలా అవకాశం వచ్చినవారు ఆ సర్కిల్‌లోనే విధులు నిర్వహిస్తారు. స్కేల్-4 ఆఫీసర్ స్థాయికి చేరుకునే వరకు లేదా 12 ఏళ్ల అనుభవం (వీటిలో ఆలస్యమైనదాన్ని పరిగణనలోకి తీసుకుంటారు) వరకు అదే సర్కిల్‌లో సేవలు అందించాలి. ప్రొబేషన్ వ్యవధి 6 నెలలు. ఈ వ్యవధిలో సంతృప్తికరంగా విధులు నిర్వర్తించిన వారిని స్కేల్-1 ఆఫీసర్‌గా ఎంపిక చేస్తారు. వీరికి రూ.48,480 మూల వేతనం, అదనంగా రెండు ఇంక్రిమెంట్లు చెల్లిస్తారు. అన్నీ కలిపి సుమారు రూ.85 వేలకుపైగా నెల జీతం అందుకోవచ్చు.

పరీక్ష ఇలా

ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 120 ప్రశ్నలు. పరీక్ష వ్యవధి 2 గంటలు. సెక్షన్ల వారీ సమయ నిబంధన ఉంది. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 30 ప్రశ్నలకు అర గంట, బ్యాంకింగ్ నాలెడ్జ్ 40 ప్రశ్నలకు 40 నిమిషాలు, జనరల్ అవేర్‌నెస్/ ఎకానమీ 30 ప్రశ్నలకు 30 నిమిషాలు, కంప్యూటర్ ఆప్టిట్యూడ్ 20 ప్రశ్నలకు 20 నిమిషాలు కేటాయించారు. రుణాత్మక మార్కులు లేవు. అలాగే సెక్షన్ల వారీ కనీస మార్కుల నిబంధన లేదు.

డిస్క్రిప్టివ్: వ్యవధి అర గంట. లెటర్ రైటింగ్, ఎస్సేల ద్వారా ఆంగ్లంలో ప్రతిభ తెలుసుకుంటారు. ఈ విభాగానికి 50 మార్కులు. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్‌లో విజయవంతమైతే ఇంటర్వ్యూకి పిలుస్తారు.

ఇంటర్వ్యూ: ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ ప్రకారం సర్కిళ్లు, అందులోని కేటగిరీల వారీ ఉన్న ఖాళీలకు మూడు రెట్ల మందిని ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ విభాగానికి 50 మార్కులు. ఇందులో బ్యాంకు నిర్దేశించిన అర్హత మార్కులు పొందాలి.

తుది నియామకాలు: ఆన్‌లైన్ టెస్టు (ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్), ఇంటర్వ్యూ మార్కులతో ఉంటాయి. పరీక్ష (170) మార్కులను 75కి, ఇంటర్వ్యూ 50 మార్కులను 25కి కుదించి, వచ్చిన మార్కులను కలిపి, మెరిట్, రిజర్వేషన్, సర్కిల్ ప్రకారం పోస్టులు కేటాయిస్తారు.

సన్నద్ధత

◆ ఈ పరీక్ష అనుభవం ఉన్నవారికి ఉద్దేశించింది. అందువల్ల ప్రశ్నలు కఠినంగానే ఉంటాయని భావించవచ్చు. కాబట్టి పరీక్షలోని అంశాలను అధిక ప్రాధాన్యంతో చదవాలి.

◆ బ్యాంకింగ్ నాలెడ్జ్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉన్నందున బ్యాంకు వ్యవహారాలు, కార్యకలాపాలపై పూర్తి స్థాయిలో అవగాహన ఉండాలి. ఈ విభాగంలో ఎక్కువ మార్కులు పొందినవారు విజేతలు కావడానికి అవకాశం ఉంది.

◆ ఇటీవల నిర్వహించిన ఎస్‌బీఐ, ఐబీపీఎస్ మెయిన్స్ ప్రశ్నపత్రాలు, సర్కిల్ బేస్డ్ ఆఫీసర్ గత ప్రశ్నపత్రాలు బాగా సాధన చేయాలి.

◆ వీలైనన్ని మాక్ టెస్టులు రాసి, ఫలితాలు సమీక్షించుకోవాలి.

◆ ఆన్‌లైన్ ఆబ్జెక్టివ్ పరీక్ష పూర్తికాగానే డిస్క్రిప్టివ్ కూడా ఆన్‌లైన్‌లోనే ఉంటుంది. ఇప్పటి నుంచే రాత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. విషయంతో పాటు, వ్యక్తీకరించిన విధానానికీ మార్కులు ఉంటాయి.

◆ ఎస్‌బీఐలో రెండేళ్ల అనుభవం ఉన్న అధికారికి ఎలాంటి నైపుణ్యాలు ఉంటాయో వాటినే పరీక్షలో ప్రశ్నల రూపంలో అడుగుతారు. ఇప్పటికే సర్కిల్ బేస్డ్ అధికారులుగా సేవలు అందిస్తోన్న సీనియర్ అధికారుల మార్గదర్శనం మేలు చేస్తుంది.

వివరాలు

పోస్టు: సర్కిల్ బేస్డ్ ఆఫీసర్లు

ఖాళీలు: 2050. (ఏపీ- అమరావతి 97, తెలంగాణ- హైదరాబాద్ 80)

అర్హత: ఏదైనా గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి, 31.12.2025 నాటికి షెడ్యూల్డ్ కమర్షియల్ లేదా గ్రామీణ (రీజనల్ రూరల్) బ్యాంకుల్లో ఆఫీసర్ స్థాయిలో రెండేళ్లు పనిచేసి ఉండాలి. దరఖాస్తు చేసుకున్న సర్కిల్‌కు చెందిన స్థానిక భాషలో రాయడం, మాట్లాడటం, చదవడం, అర్థం చేసుకోవడం రావాలి. ఇందుకోసం అర్హత పరీక్ష నిర్వహిస్తారు. పది లేదా ఇంటర్మీడియట్‌లో ఆ స్థానిక భాషను ఒక సబ్జెక్టుగా చదివితే పరీక్ష మినహాయిస్తారు.

వయసు: 31.12.2025 నాటికి కనిష్ఠంగా 21 గరిష్ఠంగా 30 ఏళ్లకు మించరాదు. అంటే జనవరి 1, 1996 - డిసెంబరు 31, 2004 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులైతే కేటగిరీ ప్రకారం 10-15 ఏళ్ల గరిష్ఠ వయసులో సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.750. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఫీజు లేదు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 18.02.2026

పరీక్ష: మార్చిలో నిర్వహిస్తారు. తేదీల వివరాలు తర్వాత ప్రకటిస్తారు.

వెబ్‌సైట్: https://sbi.bank.in/web/careers/current-openings

సీ-డాక్‌లో 805 ఖాళీలు

సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సీ-డాక్), వివిధ కేంద్రాల్లో ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

◗ ప్రాజెక్ట్ ఇంజినీర్, టెక్నీషియన్: 805

అర్హత: పోస్టు ప్రకారం ఈ/బీటెక్, ఎంఈ/ ఎంటెక్, పీజీ, పీహెచ్‌డీలతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.

వయసు: 56 ఏళ్లు మించరాదు. **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూలతో. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 20.02.2026

వెబ్‌సైట్: https://careers.cdac.in/

స్పోర్ట్స్ కోచ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జమ్మూ (ఐఐటీజె) ఒప్పంద ప్రాతిపదికన స్పోర్ట్స్ కోచ్ (అథ్లెటిక్స్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

అర్హత: డిప్లొమా/ డిగ్రీ (అథ్లెటిక్స్ డిప్లొమా, ఫిజికల్ ఎడ్యుకేషన్)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం. **వేతన శ్రేణి:** నెలకు రూ.30,000.- రూ.40,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.02.2026

ఎంపిక: ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.iitjammu.ac.in/post/advtnIITJMURCRPn100334An160njrf

జూనియర్ రిసెర్చ్ ఫెలో

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జమ్మూ (ఐఐటీజె) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ రిసెర్చ్ ఫెలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: 60 శాతం మార్కులతో ఎమ్మెస్సీ (ఎలక్ట్రోకెమిస్ట్రీ స్పెషలైజేషన్ కెమికల్ సైన్సెస్) ఉత్తీర్ణతతో పాటు నెట్ లేదా గేట్ స్కోరు, ఉద్యోగానుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.31,000

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 13.02.2026 **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.iitjammu.ac.in/post/advtnIITJMURCRPn100334An160njrf

ఎయిమ్స్ బిలాస్‌పుర్‌లో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, బిలాస్‌పుర్ తాత్కాలిక ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

◗ సీనియర్ రెసిడెంట్ - 52 పోస్టులు. **విభాగాలు:** జనరల్ మెడిసిన్, అనస్థీషియా, ట్రామా అండ్ ఎమర్జెన్సీ, మైక్రోబయాలజీ, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, కార్డియాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ/ ఎంఎస్/ డీఎన్‌బీ ఉండాలి.

వయసు: 45 ఏళ్లు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు సడలింపు ఉంటుంది. **మూల వేతనం:** నెలకు రూ.67,700. **ఎంపిక:** ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీ:** 04.02.2026 **వేదిక:** రిక్రూట్‌మెంట్ సెల్, 3వ అంతస్తు, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), బిలాస్‌పుర్, కొఠిపురా, హిమాచల్‌ప్రదేశ్ - 174037.

వెబ్‌సైట్: https://www.aiimsbilaspur.edu.in/recruitment

టీచింగ్ అసిస్టెంట్

డాక్టర్ ఎన్టీఆర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బాపట్ల ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ అసిస్టెంట్ భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

◗ టీచింగ్ అసిస్టెంట్: 01 **అర్హత:** సంబంధిత విభాగంలో బీఏ, ఎంఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వేతనం: నెలకు రూ.27,000. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

ఇంటర్వ్యూ తేదీ: 17.02.2026

వెబ్‌సైట్: https://angrau.ac.in/ANGRU/Recruitment_Notification_2021.aspx

సాయ్‌లో పర్ఫార్మెన్స్ అనలిస్టులు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) రెగ్యులర్ ప్రాతిపదికన 48 పర్ఫార్మెన్స్ అనలిస్ట్ పోస్టులను భర్తీ చేయనుంది. బ్యాచిలర్ డిగ్రీ/ మాస్టర్స్ డిగ్రీతో పాటు స్పోర్ట్స్ సైన్స్‌లో ఏడాది అనుభవం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ ఆధారిత పరీక్షతో నియామకాలు ఉంటాయి.



మొత్తం ఉద్యోగాల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 29, ఓబీసీకి 11, ఎస్సీకి 4, ఎస్టీకి 1, ఈడబ్ల్యూఎస్‌కు 3 కేటాయించారు.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)తో అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సీబీటీ 100 మార్కులకు మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. వ్యవధి రెండు గంటలు.

◗ సెక్షన్-ఏ1లో బేసిక్ స్పోర్ట్స్ నాలెడ్జ్ ప్రశ్నలు 32 ఉంటాయి. ఏ2లో జనరల్ స్పోర్ట్స్ అవేర్‌నెస్ ప్రశ్నలు 8 ఇస్తారు. మొత్తం 40 మార్కులు.

◗ సెక్షన్-బీలో ప్రత్యేక విభాగానికి సంబంధించిన 40 ప్రశ్నలు ఉంటాయి. ◗ సెక్షన్-సీలో స్పోర్ట్స్ రిలేటెడ్ కేస్ స్టడీస్‌కు సంబంధించిన 20 ప్రశ్నలు ఇస్తారు. ఇవి ఆబ్జెక్టివ్, పాసేజ్/ అనలిటికల్ బేస్డ్ విధానంలో ఉంటాయి.

◗ సీబీటీలో సాధించిన మార్కులతోనే తుది ఎంపిక చేస్తారు.

◗ ఏ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారో ప్రకటనలో వివరంగా తెలిపారు. వాటిని అధ్యయనం చేస్తే ఎక్కువ మార్కులు పొందవచ్చు.

వివరాలు

అర్హత: ఆంత్రోపోమెట్రీ/ బయోమెకానిక్స్/ న్యూట్రిషన్/ ఫిజియోథెరపీ/ సైకాలజీ/ ఫిజియాలజీ/ స్ట్రెంత్ అండ్ కండిషనింగ్ విభాగాల్లో డిగ్రీ, పీజీతో పాటు స్పోర్ట్స్ సైన్స్‌లో ఏడాది అనుభవం ఉండాలి.

వయసు: 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: యూఆర్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ.2000. ఎస్సీ/ ఎస్టీ/ మాజీ సైనికోద్యోగులు/ మహిళలకు రూ.1500.

వేతన శ్రేణి: నెలకు రూ.35,400-1,12,400. మూల వేతనానికి అదనంగా డీఏ, హెచ్ఆర్ఏ, టీఏ, సెలవులు, వైద్య సదుపాయాలు కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వర్తిస్తాయి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 09.03.2026

వెబ్‌సైట్: https://sportsauthorityofindia.nic.in/sai_new/

బీఎస్ఎన్ఎల్‌లో సేవలందిస్తారా?



భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 120 సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ పోస్టులను భర్తీ చేయనుంది. బీఈ/బీటెక్/సీఏ/సీఎంఏ, ఉద్యోగానుభవంతో దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)తో నియామకాలు ఉంటాయి.

మొత్తం ఉద్యోగాల్లో.. సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (టెలికం)-95, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఫైనాన్స్)-25 ఉన్నాయి.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 200 మార్కులకు ఉంటుంది. వ్యవధి 180 నిమిషాలు. రెండు దశల్లో జరుగుతుంది. పార్ట్-1 (కామన్)లోని ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో 40 ప్రశ్నలకు, 40 మార్కులు. క్వాంటిటేటివ్ ఎబిలిటీ, డేటా సఫిషియన్సీ రీజనింగ్ (ఉదా: అనలిటికల్, లాజికల్, క్రిటికల్ రీజనింగ్), వెర్బల్ ఎబిలిటీ, రీడింగ్ కాంప్రహెన్షన్, అనలిటిక్స్ నుంచి ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్–2 (టెక్నికల్): 160 ప్రశ్నలు ఉంటాయి. బేసిక్ టెలి కమ్యూనికేషన్స్ కాన్సెప్ట్స్-15, వైర్‌లెస్ టెలి కమ్యూనికేషన్స్ టెక్నాలజీస్-15, వైర్‌లైన్ టెలి కమ్యూనికేషన్స్ టెక్నాలజీస్-15, టెలికం ట్రాన్స్‌మిషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్-15, ఐపీ/డేటా నెట్‌వర్క్స్-15, ఎమర్జింగ్ టెక్నాలజీస్-15, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్-10 ప్రశ్నలు ఇస్తారు.

పార్ట్–2 – ఫైనాన్స్: అడ్వాన్స్‌డ్ అకౌంటింగ్-15 ప్రశ్నలు, ట్యాక్సేషన్ రూల్స్-15, కాస్ట్ అకౌంటింగ్-15, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్-15, కార్పొరేట్ అండ్ అదర్ లా-15, ఆడిట్ అండ్ అస్యూరెన్స్-15, అకౌంటింగ్ రిసీవబుల్ మేనేజ్‌మెంట్-10 ప్రశ్నలు ఇస్తారు.

● ప్రశ్నకు ఒకమార్కు. ప్రతి తప్పు సమాధానానికీ పావు మార్కు తగ్గిస్తారు. పార్ట్-1, పార్ట్-2ల్లో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 45 శాతం కనీసార్హత మార్కులు పొందాలి. ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల అనంతరం కేటగిరీల వారీగా తుది ఎంపిక చేస్తారు.

సన్నద్ధత: పార్ట్-1 ఆప్టిట్యూడ్ టెస్ట్ కోసం వివిధ పోటీ పరీక్షల పాత ప్రశ్న పత్రాలను సాధన చేయొచ్చు.

● పార్ట్-2 సిలబస్‌ను ప్రకటనలో వివరంగా తెలిపారు. ఆ అంశాలను అధ్యయనం చేసి.. పునశ్చరణ చేసుకుంటే ఎక్కువ మార్కులు పొందే అవకాశం ఉంటుంది.

● తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శించాలి.

ముఖ్యాంశాలు

అర్హత: సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (టెలికాం): 60 శాతంతో ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రికల్/ ఇన్‌స్ట్రుమెంటేషన్ బ్రాంచ్‌తో బీఈ/బీటెక్.

సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఫైనాన్స్): చార్టర్డ్ అకౌంటెంట్ (సీఏ)/ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ (సీఎంఏ).

వయసు: 30 సంవత్సరాలు ఉండాలి. ఓబీసీ-ఎన్‌సీఎల్‌కు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీకి ఐదేళ్లు, దివ్యాంగులకు పది నుంచి పదిహేనేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.2,500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1,250.

వేతన శ్రేణి: నెలకు రూ.24,900 - 50,500.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.03.2026

పరీక్ష తేదీ: 29.03.2026

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 27 కేంద్రాల్లో, తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడల్లో పరీక్షను నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: www.bsnl.co.in

ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్‌తో ఎలాంటి అవకాశాలు?

బీఎస్సీ ఎంపీసీఎస్ చదువుతున్నాను. ఎంబీఏలో ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్ ఎంచుకుంటే ఎలాంటి అవకాశాలు ఉంటాయి? ఈ కోర్సు ఎక్కడ చదివితే ప్రయోజనం. **- మేఘన**

ప్రస్తుతం మీరు బీఎస్సీ ఎంపీసీఎస్ (మ్యాథ్స్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్) చదువుతున్నారు. కాబట్టి భవిష్యత్తులో ఎంబీఏ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులో చేరితే చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఈ ఎంబీఏ ప్రోగ్రాం పరిశ్రమల్లో ఉత్పత్తి నిర్వహణ, సప్లయ్ చెయిన్ సిస్టమ్స్, లాజిస్టిక్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ లాంటి అంశాలపై లోతైన అవగాహన కల్పిస్తుంది. ఎంపీసీఎస్ నేపథ్యం ఉన్న విద్యార్థులు డిగ్రీ చదివే క్రమంలో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యా పరిష్కార నైపుణ్యం, డేటా విశ్లేషణ లాంటి సామర్థ్యాలు పొంది ఉంటారు. ఇవన్నీ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ రంగానికి అత్యంత అవసరమైన నైపుణ్యాలు కావడంతో, ఈ స్పెషలైజేషన్ మీకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.



◗ ఎంబీఏ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసిన తర్వాత మాన్యుఫ్యాక్చరింగ్, ఐటీ, ఈకామర్స్, బ్యాంకులు, ఇన్స్యూరెన్స్, ఫార్మాస్యూటికల్, లాజిస్టిక్స్ అండ్ సప్లయ్ చెయిన్, ఎఫ్ఎంసీజీ సంస్థల్లో ఉద్యోగావకాశాలు ఉంటాయి. వీటిలో ఆపరేషన్స్ మేనేజర్, సప్లయ్ చెయిన్ మేనేజర్, ప్రాజెక్ట్ మేనేజర్, ప్రాసెస్ అనలిస్ట్, క్వాలిటీ మేనేజర్, లాజిస్టిక్స్ కోఆర్డినేటర్ లాంటి ఉద్యోగాలు చేయవచ్చు. ఈ హోదాలు సంస్థలో కీలక బాధ్యతలతో ముడిపడి ఉండటంతో, కెరియర్ ఎదుగుదల కూడా వేగంగా ఉంటుంది. ప్రారంభ దశలో కొంత తక్కువ వేతనాలు ఉన్నప్పటికీ అనుభవం పెరిగే కొద్దీ పెద్ద మొత్తంలోనే అందుతాయి.

◗ ఎంబీఏ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ కోర్సును ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)లు, ఐఐటీలు, ఎన్ఐటీలు, సెంట్రల్ యూనివర్సిటీలు, వివిధ బిజినెస్ స్కూళ్లు అందిస్తున్నాయి. ఈ సంస్థలు పరిశ్రమలతో అనుసంధానమై ఉంటాయి. ఇక్కడి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ల ద్వారా దేశీయంగా, అంతర్జాతీయంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

◗ ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి క్యాట్, ఎక్స్ఏటీ, సీమ్యాట్, ఎన్‌మ్యాట్, స్నాప్, మ్యాట్ లాంటి పరీక్షల్లో ఎందులోనైనా మేటి స్కోరు పొందాలి. ఇప్పటి నుంచే మీరు మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రెటేషన్, ఇంగ్లిష్ వెర్బల్ ఎబిలిటీ లాంటి అంశాలపై సన్నద్ధత ప్రారంభిస్తే మంచిది. అదనంగా ఎంఎస్ ఎక్సెల్, బేసిక్ కంప్యూటర్ ప్రోగ్రామింగ్, ఎస్‌క్యూఎల్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ టూల్స్‌పై నైపుణ్యాలు పెంపొందించుకుంటే మీ ప్రొఫైల్ మరింత బలపడుతుంది.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

కెరియర్, ఉన్నతవిద్యలకు సంబంధించి మీకు ఏ సందేహాలున్నా వాటిని మాకు పంపండి. నిపుణులు సమాధానాలు ఇస్తారు. చదువు

మా చిరునామా: **చదువు,** ఈనాడు కార్యాలయం, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రామోజీ ఫిల్మ్ సిటీ – 501 512
edc@eenadu.in

వర్క్ ఫ్రమ్ హోమ్

ఆడియో ట్రాన్‌స్క్రిప్షన్

సంస్థ: ఇండికా ఏఐ ప్రై.లి.
నైపుణ్యాలు: మలయాళం, తెలుగు మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.3,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/h5M5a

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఇండిపెండెంట్ కన్సల్టెంట్
నైపుణ్యాలు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, లీడ్ జనరేషన్, ఎంఎస్-పవర్‌పాయింట్, నెగోషియేషన్, నెట్‌వర్కింగ్, పబ్లిక్ రిలేషన్స్, రిసెర్చ్ అండ్ అనలిటిక్స్ **స్టైపెండ్:** రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
☛ https://tinyurl.com/3x5sprkn

డిజిటల్ కామర్స్

సంస్థ: ఇన్‌లీగ్ సోర్సింగ్ ఇండియా ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, కేన్వా, క్రియేటివ్ థింకింగ్, క్రియేటివ్ రైటింగ్, డిజైన్ థింకింగ్, గ్రాఫిక్ డిజైన్
స్టైపెండ్: రూ.7,000-16,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/mu9dszck

ఇంటర్న్‌షిప్స్



సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్

సంస్థ: ఎడ్యుఫీట్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఆటోక్యాడ్, ఇంగ్లిష్ రాయడం, మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్, ఎంఎస్-ఎక్సెల్, ఆన్‌లైన్ టీచింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, రిపోర్ట్ రైటింగ్, సబ్జెక్ట్ మేటర్ ఎక్స్‌పర్ట్
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 26
☛ https://tinyurl.com/2s4yb7jh

రిక్రూట్‌మెంట్ కన్సల్టెంట్

సంస్థ: ఈజెడ్ టెక్నాలజీస్
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, రిక్రూట్‌మెంట్ **స్టైపెండ్:** రూ.7,000-15,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/3vn6vsth

హ్యూమన్ రిసోర్సెస్

సంస్థ: స్టాల్‌వార్ట్ పీపుల్ కంపెనీ
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్
స్టైపెండ్: రూ.2,000-2,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/77hhahsn

ఏఐ ఏజెంట్ డెవలప్‌మెంట్

సంస్థ: ఒనెగ్ సొల్యూషన్ ప్రై.లి.
నైపుణ్యాలు: ఫాస్ట్‌ఏపీఐ, లాంగ్‌చెయిన్, ఎల్ఎల్ఎంటపీస్, పోస్ట్‌గ్రేఎస్‌క్యూఎల్, పైతాన్ **స్టైపెండ్:** రూ.7,500-10,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/4m3w9dk3

మార్కెటింగ్–బ్రాండింగ్

సంస్థ: అట్లాస్ హెచ్ఆర్‌టీ
నైపుణ్యం: బ్రాండింగ్
స్టైపెండ్: రూ.10,000-30,000
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 27
☛ https://tinyurl.com/yvmjuj32


ఏఐ కంటెంట్ రైటింగ్

సంస్థ: ఇన్‌అమిగోస్ ఫౌండేషన్
నైపుణ్యం: ఇంగ్లిష్ రాయడం
స్టైపెండ్: రూ.4,500-6,500
దరఖాస్తు గడువు: ఫిబ్రవరి 28
☛ https://shorturl.at/OYlFc

(c) eenadu

దరఖాస్తు చేశారా?
☛ 48 సెంట్రల్ వర్సిటీల్లో డిగ్రీ ప్రవేశాలు (సీయూఈటీ యూజీ-2026)
చివరి తేదీ: 04.02.2026
☛ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో 84 ఉద్యోగాలు
ఫిబ్రవరి 5, 6, 7 తేదీల్లో ఇంటర్వ్యూలు

కరెంట్ అఫైర్స్



◆ 'ది వన్: క్రికెట్, మై లైఫ్ అండ్ మోర్' పేరిట ఏ భారత మాజీ క్రికెటర్ తన ఆత్మకథను ఆవిష్కరించారు? (హార్పర్ కాలిన్స్ ఇండియా సంస్థ ఈ పుస్తకాన్ని ప్రచురించింది.)
జ: శిఖర్ ధావన్

◆ 2025, డిసెంబరులో యునెస్కో అధికారికంగా ఏ దేశ వంటకాలను అవ్యక్త సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చింది? జ: ఇటలీ (దిల్లీలో జరిగిన యునెస్కో సాంస్కృతిక సమావేశంలో యునెస్కో ఈ ప్రకటన చేసింది. దీంతో ఇటలీ తన మొత్తం జాతీయ వంటకాలకు యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచంలోనే మొదటి దేశంగా అవతరించింది.)

మాదిరి ప్రశ్నలు

◆ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రిసెర్చ్ నూతన డైరెక్టర్ జనరల్‌గా 2026, జనవరి 5 నుంచి ఎవరు బాధ్యతలు స్వీకరించారు?
జ: సురేష్ గోయల్

◆ వరల్డ్ స్క్వాష్ ఫెడరేషన్ స్క్వాష్ ప్రపంచ కప్-2025ను ఏ దేశం గెలుచుకుంది? (ఈ దేశం స్క్వాష్ ప్రపంచ కప్‌ను గెలుచుకోవడం ఇదే తొలిసారి. చెన్నైలో జరిగిన ఫైనల్లో ఈ జట్టు 3-0తో హాంకాంగ్‌ను ఓడించి విజేతగా నిలిచింది.) జ: భారత్


మరింత సమాచారం

◆ అంతర్జాతీయ వలసదారుల దినోత్సవాన్ని ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
జ: డిసెంబరు 18



పదో తరగతి
సాంఘిక శాస్త్రం

అటవీ, వన్యప్రాణుల వనరులు



ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

4 మార్కులు

1. జీవవైవిధ్యం అంటే ఏమిటి? మానవ జీవితాలకు జీవ వైవిధ్యం ఎందుకు ముఖ్యమైంది?

జ: 1) పర్యావరణ సమతుల్యతను కాపాడుతుంది- ఆహార గొలుసులు, సహజచక్రాలు, పర్యావరణ వ్యవస్థకు మద్దతు ఇస్తుంది.

2) మానవ ఆరోగ్యాన్ని కాపాడుతుంది-ఔషధాలు, స్వచ్ఛమైన గాలి, నీటిని అందిస్తుంది.

3) పర్యావరణ వ్యవస్థలను నిలబెడుతుంది- నేల పునరుత్పాదకత, పరాగసంపర్కం, వాతావరణ నియంత్రణలో సహాయపడుతుంది. 4) ఉత్పాదకతను పెంచుతుంది- వ్యవసాయ దిగుబడి, ఆహార భద్రతను పెంచుతుంది.

5) జన్యు వైవిధ్యాన్ని సంరక్షిస్తుంది- స్థితిస్థాపక పంటలు, ఔషధాలను అభివృద్ధి చేయడంలో సహాయపడుతుంది.

6) జీవనోపాధికి మద్దతు ఇస్తుంది- ఫిషింగ్, అటవీ పర్యాటకం లాంటి పరిశ్రమలకు వనరులను అందిస్తుంది.

2. మానవ కార్యకలాపాలు వృక్షజాలం, జంతుజాలం క్షీణతను ఎలా ప్రభావితం చేశాయి? వివరించండి.

జ: మానవ కార్యకలాపాలు వృక్ష, జంతువుల వేగవంతమైన క్షీణతకు దారితీశాయి. సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరుస్తాయి, జీవవైవిధ్యాన్ని తగ్గిస్తాయి.

కొన్ని ప్రధాన కారణాలు

1) అటవీ నిర్మూలన- వ్యవసాయం, పట్టణీకరణ, పరిశ్రమల కోసం అడవులను నిర్మూలించడం.

2) పోడు వ్యవసాయం- స్లాష్ అండ్ బర్న్ ఫార్మింగ్ నేలను క్షీణింపజేస్తుంది, అడవులను నాశనం చేస్తుంది.

3) భారీ స్థాయి అభివృద్ధి - ఆనకట్టలు, హైవేలు లాంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నివాస నష్టానికి దారితీస్తాయి.

4) మైనింగ్ కార్యకలాపాలు-ఖనిజాలను వెలికితీయడం పర్యావరణ వ్యవస్థలను దెబ్బతీస్తుంది, భూమి, నీటిని కలుషితం చేస్తుంది.

5) అటవీ వనరుల అధిక దోపిడీ - కలప, ఔషధాల కోసం అడవులను నరికివేయడం. 6) వన్యజీవులను వేటాడటం.

ఒక్క మార్కు

1. జీవవైవిధ్యం అంటే ఏమిటి?

జ: భూమిపై ఉన్న వివిధ రకాల జీవరూపాలైన మొక్కలు, జంతువులు ఒక ప్రాంతంలో ఉండటాన్నే జీవవైవిధ్యంగా నిర్వచించవచ్చు.

2. భారతీయ వన్యప్రాణి సంరక్షణా చట్టం ఎప్పుడు అమలు చేశారు?

జ: భారతీయ వన్యప్రాణి సంరక్షణా చట్టాన్ని 1972లో అమలు చేశారు.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత: కేఎస్‌వీ కృష్ణారెడ్డి

పేదలకు ప్రత్యేక పరపతి!

భారత ఆర్థిక వ్యవస్థలో మైక్రోఫైనాన్స్ పాత్ర

జనరల్ స్టడీస్ - ఇండియన్ ఎకానమీ

భారత్‌లో సామాజిక, ఆర్థిక పురోగతికి దోహదపడుతున్న అంశాల్లో మైక్రోఫైనాన్స్ ఒకటి. సంప్రదాయ బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న కుటుంబాలు, తక్కువ ఆదాయ వర్గాలకు బ్యాంకులతోపాటు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థల ద్వారా పూచీకత్తు లేకుండా అందే చిన్నతరహా రుణాలు మహిళా సాధికారత, స్వయంఉపాధి కల్పనలో అద్భుత విజయాలను సాధ్యం చేశాయి. పేదరిక నిర్మూలన, చిన్న వ్యాపారాల వృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. దేశంలో మైక్రోఫైనాన్స్ అవసరం, పురోగతి, పరిణామక్రమం గురించి పోటీపరీక్షలకు హాజరయ్యేవారికి అవగాహన ఉండాలి. బ్యాంకింగ్ వ్యవస్థకు అనుబంధంగా, రిజర్వ్ బ్యాంకు పర్యవేక్షణలో పనిచేస్తున్న మైక్రోఫైనాన్స్ సంస్థల వ్యాపార పరిమాణం రూ.లక్షల కోట్లకు చేరిన తీరును, ఆ వ్యవస్థపై ఉన్న అనుకూల ప్రతికూల వాదనలనూ అర్థం చేసుకోవాలి.

మైక్రోఫైనాన్స్ (సూక్ష్మవిత్తం) అంటే "సమాజంలోని అన్నివర్గాల వారికి, ప్రత్యేకించి బలహీన వర్గాలు, అల్పాదాయ సమూహాలకు పొదుపు, డిపాజిట్లు, రుణాలు, ఇతర ఆర్థిక సేవలను చట్ట నియంత్రణలోని ప్రధాన ఆర్థిక సంస్థల ద్వారా పారదర్శకంగా, సరసమైన ధరల్లో అందేలా చూసే ప్రక్రియ". సరళంగా చెప్పాలంటే పేద ప్రజలకు పొదుపు, రుణం, బీమా, నగదు బదిలీ సేవలు అందించడాన్నే మైక్రోఫైనాన్స్‌గా వ్యవహరిస్తారు. బంగ్లాదేశ్‌కు చెందిన ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత మహమ్మద్ యూనస్‌ను మైక్రో క్రెడిట్, మైక్రోఫైనాన్స్ సంస్థల పితామహుడిగా పేర్కొంటారు. ఈయన 1983లో బంగ్లా గ్రామీణ బ్యాంకును స్థాపించి ఆ దేశంలో పేదరిక నిర్మూలనకు గణనీయ కృషి చేశారు.



భారతదేశంలో మైక్రో ఫైనాన్స్

భారత ఆర్థికాభివృద్ధిలో మైక్రోఫైనాన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోంది. ప్రస్తుతం దేశంలో స్వయం ఉపాధి మహిళా సంఘం (ఎస్ఈడబ్ల్యూఏ), సాధన్ నెట్‌వర్క్ ఆఫ్ మైక్రోఫైనాన్స్ సంస్థలతో సహా తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక సేవలను అందించే మైక్రోఫైనాన్స్ సంస్థలు ఎన్నో ఉన్నాయి.

మైక్రో ఫైనాన్స్ లక్ష్యం

✦ తక్కువ ఆదాయ వర్గాలకు ముఖ్యంగా మహిళలకు బ్యాంకింగ్ సేవలు అందించడం ద్వారా పేదరిక నిర్మూలన, ఆర్థిక సాధికారతకు తోడ్పడటం. ✦ చిన్న వ్యాపారాల ఏర్పాటుకు మూలధనాన్ని అందిస్తూ స్వయం ఉపాధిని, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం. ✦ గత 30 ఏళ్లుగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పేదరిక నిర్మూలనకు విజయవంతమైన పరిష్కారంగా మైక్రోఫైనాన్స్ కార్యక్రమం ఆమోదం పొందింది.

Sa-Dhan
Fostering Inclusive Impact Finance

భారతదేశంలో సూక్ష్మ ఆర్థిక రంగం, పరిణామ క్రమం

1974	అసంఘటిత రంగంలోని మహిళలకు ఆర్థిక సేవలను అందించడానికి శ్రీ మహిళా సేవా సహకార బ్యాంకు స్థాపన.
1984	పేదరిక నిర్మూలనకు ఒక సాధనంగా బ్యాంకులతో స్వయం సహాయక బృందాలను (ఎస్‌హెచ్‌జీ) అనుసంధానించాలని నాబార్డు ప్రతిపాదించింది.
1992	నాబార్డు ద్వారా పైలట్ ప్రాజెక్టుగా ఎస్‌హెచ్‌జీ - బ్యాంకు లింకేజీ ప్రోగ్రాం మొదలైంది.
2004	రిజర్వ్ బ్యాంకు మైక్రోఫైనాన్స్‌ను ప్రాధాన్య రంగంలో చేర్చింది.
2007	ప్రైవేటు ఈక్విటీ సంస్థలు మార్కెట్‌లోకి ప్రవేశించాయి. ఈ పరిణామం మైక్రోఫైనాన్స్ సంస్థ (ఎంఎఫ్ఐలు)ల్లో వేగవంతమైన వృద్ధికి దారితీసింది.
2009	బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) - ఎంఎఫ్ఐలు సభ్యులుగా మైక్రోఫైనాన్స్ నెట్‌వర్క్ ఏర్పడింది.
2012	మాలెగాం కమిటీ సిఫార్సుల ఆధారంగా ఆర్బీఐ మైక్రోఫైనాన్స్‌లో కొత్త నిబంధనలను తీసుకొచ్చింది.
2014	అతిపెద్ద సూక్ష్మ రుణదాత అయిన బంధన్ బ్యాంకుకు ఆర్బీఐ సార్వత్రిక బ్యాంకింగ్ లైసెన్స్ జారీ చేసింది.
2015	చిన్న వ్యాపారులకు ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం ముద్రా బ్యాంకును స్థాపించింది.
2022	సూక్ష్మరుణాల నిర్వచనాన్ని ఆర్బీఐ సరళీకరించింది. ఎన్‌బీఎఫ్‌సీ - ఎంఎఫ్ఐలు ఇచ్చే రుణాలపై ఉన్న పరిమాణాత్మక పరిమితులను తొలగించారు. ప్రస్తుతం రూ.3 లక్షల వరకు వార్షిక కుటుంబ ఆదాయం ఉన్న కుటుంబాలకు ఇచ్చిన పూచీకత్తు లేని రుణాలన్నింటినీ సూక్ష్మఆర్థిక రుణాలుగానే పరిగణిస్తారు. 

మైక్రోఫైనాన్స్ - నాబార్డు, ఆర్బీఐ కృషి

గ్రామీణ జనాభాలో ముఖ్యంగా మైక్రోఫైనాన్స్ రుణ గ్రహీతల్లో ఆర్థిక అక్షరాస్యత, రుణ సదుపాయాలపై అవగాహన కల్పించేందుకు నాబార్డు, ఆర్బీఐ కృషి చేస్తున్నాయి. గ్రామీణ బ్యాంకు శాఖలు, ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత శిబిరాలు నిర్వహించి ప్రభుత్వ సామాజిక భద్రతా పథకాలు, డిజిటల్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం నాబార్డు ఆర్థిక సహాయం అందిస్తోంది.



మైక్రో ఫైనాన్స్- పనితీరు

ప్రస్తుతం భారతదేశంలో వాణిజ్య బ్యాంకులు, ఆర్ఆర్‌బీ, సహకార బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఎంఎఫ్ఐలు మైక్రోఫైనాన్స్ సమకూర్చడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. 2024, మార్చి నాటికి దేశవ్యాప్తంగా 168 ఎంఎఫ్ఐలు ఉన్నాయి. రూ.4.83 లక్షల కోట్ల వ్యాపార పరిమాణంతో 3 కోట్ల మందికి పైగా సేవలందిస్తున్నాయి.

మైక్రోఫైనాన్స్ అనుకూల వాదనలు

ఆర్థిక ప్రోత్సాహం: బ్యాంకింగ్ సేవలను మారుమూల, బ్యాంకులు లేని ప్రాంతాలకు విస్తరిస్తుంది. అధికారిక ఆర్థిక సంస్థలు, పేదల మధ్య అంతరాన్ని తగ్గిస్తుంది.

మహిళా సాధికారత: మైక్రోఫైనాన్స్ కార్యక్రమాలు ఆర్థిక సేవలు అందని మహిళలను లక్ష్యంగా చేసుకుంటాయి. వారికి రుణం, శిక్షణ అందించి సాధికారత కల్పిస్తాయి.



పేదరిక నిర్మూలన: సూక్ష్మ ఆర్థిక సహాయం ఆదాయాలను పెంచడం, ఉద్యోగాలు సృష్టించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.


చిన్న వ్యవస్థాపకతకు మద్దతు: పూచీకత్తు లేని చిన్న వ్యాపారవేత్తలు, చేతివృత్తుల వారికి రుణాలు అందిస్తుంది. స్వయం ఉపాధి, ఆదాయాన్ని పెంచుతుంది.

సామాజిక అభివృద్ధి: గ్రామీణ కుటుంబాల్లో ఆర్థిక స్థిరత్వాన్ని ప్రోత్సహిస్తుంది. స్వయం సహాయక బృందాల వృద్ధిని సులభతరం చేస్తుంది.

వ్యతిరేక వాదనలు:

అధిక వడ్డీ రేట్లు: తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులకు రుణాలు ఇవ్వడం వల్ల కలిగే నష్టాన్ని భర్తీ చేయడానికి మైక్రోఫైనాన్స్ సంస్థలు తరచూ అధిక వడ్డీ రేట్లు వసూలు చేస్తాయి.

అధిక అప్పులు: సూక్ష్మరుణ సంస్థల నుంచి రుణాలు తీసుకుంటూ రుణగ్రహీతలు అప్పుల ఊబిలో చిక్కుకునే ప్రమాదం ఉంది.



రచయిత: వమరవల్లి రమణయ్య

పదార్థం - స్థితులు

వేడి నీటి కంటే నీటి ఆవిరి ప్రమాదకరం!



విశ్వంలో ఉండే ప్రతీది పదార్థమే. అది కణాలతో నిర్మితమై ద్రవ్యరాశిని కలిగి, స్థలాన్ని ఆక్రమిస్తుంది. గాలి, నీరు, ఆహారం, మొక్కలు, జంతువులు, రాళ్లు, గ్రహాలు, నక్షత్రాలు, మేఘం, నీటి బిందువు, ఇసుక రేణువు చివరకు ధూళి కూడా పదార్థమే. ఈ పదార్థాలు కనిపించే విధానం, కణాల అమరిక, ఆకారం, పరిమాణం తదితర లక్షణాల ఆధారంగా వాటిని స్థితులుగా విభజిస్తారు. ఇవి ఘన, ద్రవ, వాయు, ప్లాస్మా, బోస్, ఐన్‌స్టీన్ కండెన్సేట్ మొదలైన స్థితుల్లో ఉంటాయి. ఉష్ణోగ్రత, పీడనాలు మారితే పదార్థాల స్థితుల్లో తేడా వస్తుంది. ఈ విధంగా వివిధ పదార్థాలు, వాటితో నిర్మితమయ్యే వస్తువుల స్వభావం, వాటి సురక్షిత వినియోగం, రసాయన లక్షణాలు, భౌతిక మార్పులను అర్థం చేసుకునే పరిజ్ఞానం పోటీ పరీక్షార్థులకు ఉండాలి. నిత్యం అందరూ ఉపయోగించే, పరిశీలించే ఘన, ద్రవ, వాయు పదార్థాల వాహకత్వం, దహనశీలత లాంటి ధర్మాలు, వాటిని సమర్థంగా వినియోగించుకునే తీరును తెలుసుకోవాలి.

1. గది ఉష్ణోగ్రత వద్ద ద్రవస్థితిలో ఉండే అలోహం?
   1) మెర్క్యూరీ 2) సీజియం 3) బ్రోమిన్ 4) అయోడిన్

2. నీటిలో చక్కెర కలిపినప్పుడు ద్రావణం ఘనపరిమాణం?



   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది 3) మారదు 4) తగ్గి పెరుగుతుంది

3. ఏ స్థితిలో పదార్థంలో స్వేచ్ఛా అయాన్లు ఉంటాయి?
   1) ఘన 2) ద్రవ 3) వాయు 4) ప్లాస్మా

4. నిశ్చితం-(ఎ): శరీరంపై వేడినీటి కంటే నీటిఆవిరి ఎక్కువ గాయం కలగజేస్తుంది.
   కారణం-(ఆర్): బాష్పీభవన గుప్తోష్ణం రూపంలో నీటిఆవిరి కణాలు అధిక శక్తిని గ్రహించడం వల్ల వాటి శక్తి ఎక్కువగా ఉంటుంది.
   1) ఎ, ఆర్ సత్యం; ఆర్, ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సత్యం; ఆర్, ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ అసత్యం, ఆర్ సత్యం.
   4) ఎ సత్యం, ఆర్ అసత్యం.

5. మంచు నీటిపై తేలుతుంది. దీనికి సరైన కారణం?



   1) మంచు బరువైంది.
   2) మంచు సాంద్రత నీటి కంటే ఎక్కువ.
   3) మంచులో కణాల మధ్య ఖాళీలు ఎక్కువ.
   4) మంచులో కణాల మధ్య ఖాళీలు తక్కువ.

6. కింది వాటిని జతపరచండి.

ఎ) మంచు - నీరు	1) బాష్పీభవనం
బి) ఆవిరి - నీరు	2) సాంద్రీకరణం
సి) నాప్తలీన్ - ఆవిరి	3) ద్రవీభవనం
డి) నీరు - ఆవిరి	4) ఉత్పతనం

   1) ఎ-3 బి-1 సి-2 డి-4 2) ఎ-3 బి-2 సి-4 డి-1
   3) ఎ-2 బి-3 సి-4 డి-1 4) ఎ-2 బి-4 సి-1 డి-3

7. ఘన పదార్థాలు సాధారణంగా?
   వాక్యం-ఎ: నిర్దిష్టమైన ఆకృతి ఉండదు.
   వాక్యం-బి: నియమిత ఘనపరిమాణం ఉంటుంది.
   వాక్యం-సి: అణువుల గతిజశక్తి ఎక్కువ.
   1) ఎ సరికాదు 2) ఎ, బి, సి సరైనవి
   3) బి సరైంది 4) బి, సి సరైనవి

8. ఘన, ద్రవ, వాయు పదార్థాల్లోని అణువుల మధ్య ఆకర్షణ బలాలను ఆరోహణ క్రమంలో అమర్చండి.
   1) ఘన < ద్రవ < వాయు 2) వాయు < ద్రవ < ఘన
   3) ఘన < వాయు < ద్రవ 4) ద్రవ < వాయు < ఘన

9. కింది వాటిలో సరైంది?
   1) $0^{\circ}C$ వద్ద నీటి కణాల శక్తి, అదే ఉష్ణోగ్రత వద్ద ఉన్న మంచు కణాల శక్తికి సమానం.
   2) $0^{\circ}C$ వద్ద నీటి కణాల శక్తి, అదే ఉష్ణోగ్రత వద్ద ఉన్న మంచు కణాల శక్తి కంటే తక్కువ.
   3) $0^{\circ}C$ వద్ద నీటి కణాల శక్తి, అదే ఉష్ణోగ్రత వద్ద ఉన్న మంచు కణాల శక్తి కంటే ఎక్కువ.
   4) $1000^{\circ}C$ వద్ద నీటి కణాల శక్తి, అదే ఉష్ణోగ్రత వద్ద ఉన్న నీటిఆవిరి కణాల శక్తి కంటే ఎక్కువ.

10. పొడి మంచు అంటే..
   1) ఘనస్థితిలో ఉండే SO_2
   2) ఘనస్థితిలో ఉండే CO
   3) ఘనస్థితిలో ఉండే CO_2
   4) ఘనస్థితిలో ఉండే N_2

11. ఉష్ణోగ్రత తగ్గితే వాయువు ద్రవంగా మారుతుంది. దీనికి కారణం?
   1) కణాల వేగం తగ్గుతుంది.
   2) కణాల సంఖ్య తగ్గుతుంది.
   3) కణాల పరిమాణం తగ్గుతుంది.
   4) కణాల వేగం పెరుగుతుంది.

12. ఒక పదార్థం ఆకారం మార్చుకుంటుంది. పరిమాణం మారదు, స్వల్పంగా సంకోచిస్తుంది. ఆ పదార్థం స్థితి?
   1) ఘన 2) ద్రవ 3) వాయు 4) ప్లాస్మా

13. కింది వాటిలో ఉపరితల దృగ్విషయం?
   1) ఇగరడం (ఇగురుట) 2) కరగడం
   3) ద్రవీభవనం 4) మరగడం

14. గాలి వేగం రేటు పెరిగితే, ఇగిరే రేటు?
   1) తగ్గుతుంది 2) పెరుగుతుంది
   3) మారదు 4) తగ్గి, పెరుగుతుంది

15. వాయువుల్లో వ్యాపన రేటు అధికంగా ఉండటానికి కారణం?
   1) అల్ప వేగం - అధిక ఖాళీ ప్రదేశం
   2) అధిక వేగం - తక్కువ ఖాళీ ప్రదేశం
   3) అల్ప వేగం - తక్కువ ఖాళీ ప్రదేశం
   4) అధిక వేగం - అధిక ఖాళీ ప్రదేశం

16. కింది వాటిలో 'ఇగురుట'ను ప్రభావితం చేయని అంశం?
   1) ద్రవ పరిమాణం 2) ఉపరితల వైశాల్యం
   3) ఆర్ద్రత 4) గాలి వేగం

17. ద్రవాలు ఒక పాత్ర నుంచి, మరొక పాత్రలోకి సులభంగా ప్రవహిస్తాయి. వీటిని ఏమంటారు?
   1) దృఢ వస్తువులు 2) ప్రవాహులు
   3) తేలియాడే వస్తువులు 4) మునిగే వస్తువులు

18. నిశ్చితం-(ఎ): సైకిల్ టైరులో గాలి నింపితే అది గట్టిగా మారుతుంది.
   కారణం-(ఆర్): వాయువులు వ్యాకోచిస్తాయి.



   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్, ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్ ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.

జనరల్ స్టడీస్ - రసాయన శాస్త్రం

19. అగర్‌బత్తి పొగ, అత్తరు బాష్పం గాలిలో కలవడాన్ని ఏమంటారు?
   1) వ్యాపనం 2) సంపీడ్యత
   3) ఇగురుట 4) నిస్సరణం

20. కింది వాటిలో సరైన వాక్యం కానిది?
   1) ఘనాలకు నిర్దిష్ట ఆకారం ఉంటుంది.
   2) ద్రవాలు స్వల్పంగా సంకోచించగలవు.
   3) వాయువులకు నిర్దిష్ట పరిమాణం ఉంటుంది.
   4) వాయువులు వేగంగా వ్యాప్తి చెందుతాయి.

21. నిశ్చితం-(ఎ): రబ్బరు సిరంజ్‌ను నొక్కితే లోపలి గాలి బయటకు వస్తుంది.
   కారణం-(ఆర్): వాయువులు అధికంగా సంకోచిస్తాయి.



   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్, ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్.. ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.

22. కింది వాటిని జతపరచండి.

ఎ) ఇగురుట	1) ఉపరితలం వద్ద మాత్రమే జరుగుతుంది.
బి) మరగడం	2) కణాల వేగం తగ్గడం
సి) ఘనీభవనం	3) నిర్దిష్ట ఉష్ణోగ్రత వద్ద జరుగుతుంది

   1) ఎ-2, బి-1, సి-3 2) ఎ-1, బి-2, సి-3
   3) ఎ-1, బి-3, సి-2 4) ఎ-2, బి-3, సి-1

23. నీటిని $1^{\circ}C$ నుంచి $0^{\circ}C$కి చల్లారిస్తే దాని పరిమాణం..
   1) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
   2) పెరుగుతుంది 3) తగ్గుతుంది
   4) మొదట తగ్గి, తర్వాత పెరుగుతుంది

24. కింది వాటిలో ఇగరడం వేగం ఎక్కువగా ఉండే పరిస్థితి ఏది?
   1) తక్కువ ఉష్ణోగ్రత, అధిక ఆర్ద్రత
   2) అధిక ఉష్ణోగ్రత, తక్కువ ఆర్ద్రత
   3) తక్కువ ఉపరితల వైశాల్యం
   4) నిశ్చల గాలి

25. ఏదైనా ద్రవం దాని మరిగే స్థానం కంటే దిగువన ఏ ఉష్ణోగ్రత వద్దనైనా బాష్పంగా మారడాన్ని ఏమంటారు?
   1) ఇగరడం 2) మరగడం
   3) కరగడం 4) ఆవిరి కావడం

26. కింది వాటిలో సరికానిది?
   1) ఘన, ద్రవ, వాయు పదార్థాలన్నీ ద్రవాల్లో వ్యాపనం చెందుతాయి.
   2) వాయు పదార్థాల వ్యాపన రేటు ద్రవాలు, ఘనాల వ్యాపనం రేటు కంటే ఎక్కువ.
   3) శ్వాసక్రియలో ఆక్సిజన్ ఊపిరితిత్తుల నుంచి రక్తంలోకి వ్యాపనం చెందుతుంది.
   4) శ్వాసక్రియలో కార్బన్‌డైఆక్సైడ్ ఊపిరితిత్తుల నుంచి రక్తంలోకి వ్యాపనం చెందుతుంది.

27. అమ్మోనియా, హైడ్రోక్లోరిక్ ఆమ్లంలో అధికంగా వ్యాపనం చెందేది?
   1) అమ్మోనియా 2) హైడ్రోక్లోరిక్ ఆమ్లం
   3) రెండూ ఒకే వేగంతో వ్యాపనం చెందుతాయి
   4) ఏదీకాదు

28. వాక్యం-(ఎ): ఉష్ణోగ్రత, పీడనాల్లో మార్పు వల్ల పదార్థం స్థితి మారుతుంది.
   వాక్యం-(బి): స్థితి మార్పిడి వల్ల అణువుల్లోని పరమాణువుల నిష్పత్తి మారుతుంది.
   1) ఎ, బి సత్యం 2) ఎ సత్యం, బి అసత్యం
   3) ఎ అసత్యం బి సత్యం 4) ఎ, బి అసత్యం

29. నిశ్చితం-(ఎ): అన్ని ఘనపదార్థాల సాంద్రత నీటి కంటే ఎక్కువ.
   కారణం-(ఆర్): ఘనాల్లో కణాలు దగ్గరగా ఉంటాయి.
   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్, ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్ ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరికాదు, ఆర్ సరైంది.
   4) ఎ సరైంది, ఆర్ సరికాదు.

30. గ్యాస్ సిలిండర్‌లో అధిక పరిమాణంలో గ్యాస్ నిల్వ చేయడం సాధ్యమవుతుంది. ఎందుకంటే..



   1) గ్యాస్ ద్రవంగా మారుతుంది
   2) గ్యాస్ ఘనంగా మారుతుంది
   3) వాయువులు అధికంగా సంకోచిస్తాయి.
   4) వాయువులకు నిర్దిష్ట పరిమాణం ఉండదు.

31. కిందివాటిలో ఏ పదార్థాలు, అణువులకు మధ్య ఆకర్షణ తక్కువగా, గతిజ శక్తి ఎక్కువగా ఉంటుంది?
   1) ఘన 2) ద్రవ 3) వాయు 4) ప్లాస్మా

32. నిశ్చితం-(ఎ): ద్రవ పదార్థాలకు నిర్దిష్ట ఆకృతి ఉండదు.
   కారణం-(ఆర్): ద్రవాల్లో అణువులకు నియమిత చలన పరిధి ఉండటం.
   1) ఎ, ఆర్ సరైనవి; ఆర్ ఎ కు సరైన వివరణ.
   2) ఎ, ఆర్ సరైనవి; ఆర్ ఎ కు సరైన వివరణ కాదు.
   3) ఎ సరైంది, ఆర్ సరికాదు.
   4) ఎ సరికాదు, ఆర్ సరైంది.

33. కింది వాటిలో సరికానిది?
   1) వాయువుల్లోని అణువులకు గతిజ శక్తి తక్కువ.
   2) ద్రవాలకు నిర్దిష్టమైన ఆకృతి, నియమిత పరిమాణం ఉంటుంది.
   3) వాయువులకు నిర్దిష్టమైన ఆకృతి ఉండదు.
   4) వాయువుల్లోని అణువుల మధ్య ఆకర్షణ తక్కువగా ఉంటుంది.

34. ఒక బీకరులో మంచు ముక్కలను తీసుకుని థర్మామీటర్ ఉంచి నీరుగా మారేవరకు వేడి చేయండి. ఈ స్థితిలో రీడింగ్..
   1) నిరంతరం పెరుగుతుంది
   2) నిరంతరం తగ్గుతుంది
   3) పెరిగి స్థిరంగా ఉంటుంది
   4) మొదట పెరిగి, తరువాత తగ్గుతుంది

సమాధానాలు

1-3; 2-3; 3-4; 4-1; 5-3; 6-2; 7-3; 8-2; 9-3; 10-3; 11-1; 12-2; 13-1; 14-2; 15-4; 16-1; 17-2; 18-2; 19-1; 20-3; 21-1; 22-3; 23-4; 24-2; 25-1; 26-4; 27-1; 28-2; 29-3; 30-3; 31-3; 32-1; 33-1; 34-4.

(c) eenadu

జార్జి బూలే అభివృద్ధి పరిచిన ఆధునికశాస్త్ర విభాగమే ఈ డిజిటల్ ఎలక్ట్రానిక్స్. ఇందులో నిరంతర సంకేతాల కంటే వివిక్త (Discrete), ద్విస్థాయి (Binary) సంకేతాలకు ప్రాధాన్యత ఉంటుంది. ఇది 0, 1 అంకెలను ఆధారంగా చేసుకుని సమాచారాన్ని ప్రాసెస్ చేసే వ్యవస్థలపై దృష్టిసారించే ఇంజినీరింగ్ విభాగం. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, మైక్రో కంట్రోలర్లు లాంటి పరికరాల్లో సమాచారాన్ని నిర్వహించడానికి లాజిక్ గేట్లు, ట్రాన్సిస్టర్లు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్లను ఉపయోగిస్తారు. ఇవి ఆధునిక కంప్యూటింగ్‌కు పునాదిగా పని చేస్తాయి.

ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ (IC)

ట్రాన్సిస్టర్లు, డయోడ్లు లాంటి క్రియాశీలక పరికరాలను, నిరోధాలు, కెపాసిటర్లు లాంటి నిష్క్రియాత్మక పరికరాలను ఒకే అర్ధవాహక చిప్‌పై మిళితం చేసిన ఒక చిన్న ఎలక్ట్రానిక్ పరికరాన్ని ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ (IC) అంటారు.

❖ ఇది ఆధునిక ఎలక్ట్రానిక్ వ్యవస్థల బిల్డింగ్ బ్లాక్‌గా పనిచేస్తుంది.

రకాలు

నివేశ సంకేతాల ఆధారంగా ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

అనలాగ్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు: వీటిని నిరంతరం మారే అనలాగ్ సిగ్నల్స్‌ను (ఉదా: ధ్వని, కాంతి) ప్రాసెస్ చేయడానికి రూపొందించారు.

ఉదా: ఆపరేషనల్ ఆంప్లిఫైయర్, వోల్టేజ్ రెగ్యులేటర్‌లు, రేడియో ఫ్రీక్వెన్సీ ఆంప్లిఫైయర్

డిజిటల్ ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు: ఇవి లాజిక్ గేట్లు, మైక్రో ప్రాసెసర్‌లు, మైక్రో కంట్రోలర్‌లు, మెమొరీ చిప్స్ లాంటి డిజిటల్ సిగ్నల్ (సున్నా, ఒకటి)లను ప్రాసెస్ చేస్తాయి.

● ఇవి కంప్యూటర్, డిజిటల్ పరికరాల్లో ఉపయోగపడతాయి.

IC - లాజిక్ గేట్లు

ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌లు అనేక లాజిక్ గేట్లను కలిగి ఉంటాయి. ఏకీకరణ (Integration) ఆధారంగా వీటిని ప్రధానంగా అయిదు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

చిన్న స్థాయి ఏకీకరణ (Small scale Integration - SSI): 10 లేదా అంతకంటే తక్కువ లాజిక్ గేట్లు ఉంటాయి.

మధ్యస్థ స్థాయి ఏకీకరణ (Medium scale Integration - MSI): 10 కంటే ఎక్కువ లాజిక్ గేట్లు ఉంటాయి.

పెద్ద ఎత్తున ఏకీకరణ (Large scale Integration - LSI): 1000 కంటే తక్కువ లాజిక్ గేట్లు ఉంటాయి.

చాలా పెద్ద ఎత్తున ఏకీకరణ (Very Large scale Integration - VLSI): లాజిక్ గేట్లు 1000 కంటే ఎక్కువ ఉంటాయి.

అల్ట్రా లార్జ్ స్కేల్ ఇంటిగ్రేషన్ (ULSI): 10000 కంటే ఎక్కువ లాజిక్ గేట్లు ఉపయోగిస్తారు.

డిజిటల్ ఎలక్ట్రానిక్స్‌కు ప్రాణం.. బూలియన్ బీజగణితం!

డిజిటల్ ఎలక్ట్రానిక్స్

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం — ఫిజిక్స్

ప్రధాన భావనలు

ద్విసంఖ్యామానం:

సాధారణంగా ఉపయోగించే దశాంశమానానికి (0 - 9) భిన్నంగా జార్జి బూలే అభివృద్ధి చేసిన పద్ధతిలో కేవలం 0, 1 అంకెలు మాత్రమే ఉంటాయి. వీటిని బిట్స్ అంటారు.

✦ ద్విసంఖ్యామానంలోని కూడికలు బూలియన్ బీజగణిత భావనలకు భిన్నంగా ఉంటాయి.

✦ ద్విసంఖ్యామానంలో $1 + 1 = 10$ (ఒకటి సున్నా అని చదవాలి). కానీ బూలియన్ బీజగణితంలో $1 + 1 = 1, 0 + 0 = 0, 1 + 0 = 1$

✦ దశాంశమానం (సాధారణంగా వాడే సంఖ్యలు)లోని ఒక సంఖ్యను ద్విసంఖ్యామానంలోకి మార్చాలంటే ఆ సంఖ్యను 2తో భాగిస్తూ, వచ్చిన శేషాలను ప్రత్యేకంగా రాయాలి. ఇలా భాగఫలం 0 వచ్చే వరకు కొనసాగించి, శేషాలను కింది నుంచి పైకి వరుసగా రాస్తే ఆ సంఖ్య ద్విసంఖ్యామానంలోకి మారుతుంది.

ఉదా:
```
2 |25
  2 |12 – 1
    2 |6 – 0
      2 |3 – 0
        2 |1 – 1
            0 – 1
```
$\therefore 25_{(10)} = 11001_{(2)}$

☛ ఇలా ద్విసంఖ్యామానంలో బిట్స్ రూపంలో రాసేటప్పుడు మొదటి దాన్ని అత్యంత ప్రాధాన్యత కలిగిన బిట్ (MSB) అని, చివరి దాన్ని అత్యల్ప ప్రాధాన్యత కలిగిన బిట్ (LSB) అని అంటారు.

☛ ద్విసంఖ్యామానంలో ఉన్న సంఖ్యను తిరిగి దశాంశమానంలో పొందాలంటే ప్రతి బిట్‌ను 2^nతో గుణించాలి.

ఉదా: $11001_{(2)}$ను దశాంశమానంలోకి మార్చాలంటే,

$11001_{(2)} =$

$(2^4 \times 1) + (2^3 \times 1) + (2^2 \times 0) + (2^1 \times 0) + (2^0 \times 1)$

$= 16 + 8 + 0 + 0 + 1$

$\therefore 11001_{(2)} = 25_{(10)}$

☛ బూలియన్ బీజగణితం గణితం మాదిరిగానే కనిపిస్తున్నప్పటికీ ఈ ద్విసంఖ్యామానం డిజిటల్ ఎలక్ట్రానిక్స్‌కు ప్రాణం లాంటిదని చెప్పవచ్చు. తార్కిక వలయాల్లో 0, 1లు ఆఫ్, ఆన్ అనే స్థితులను తెలియజేస్తాయి.

☛ 0 అనే స్థితి ఆఫ్ లేదా తక్కువ లేదా తప్పు లేదా లేదు అని, 1 అనే స్థితి ఆన్ లేదా ఎక్కువ లేదా ఒప్పు లేదా ఉంది అని తెలియజేస్తుంది.

బూలియన్ బీజగణితం - ప్రధాన ప్రక్రియలు

బూలియన్ బీజగణితంలో ప్రధానంగా మూడు ప్రక్రియలు ఉంటాయి. అవి:

☛ OR = + సంకేతంతో తెలియజేస్తారు. ఇది సంకలనాన్ని సూచిస్తుంది.


☛ AND = × లేదా • సంకేతంతో తెలుపుతారు. ఇది గుణకారాన్ని సూచిస్తుంది.

☛ NOT = ఒక చరరాశిని నివారించడాన్ని తెలియజేస్తుంది.


OR సంకలనం:

బూలియన్ బీజగణితంలో + సంకేతం OR సంకలనాన్ని సూచిస్తుంది.

➤ Y = A + B అంటే Y అనేది A లేదా Bకి సమానం.



OR గేట్




OR సంకేతం


➤ OR సంకలనంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ నివేశాలు (Inputs) అధికంగా ఉంటే నిర్గమం (Output) కూడా అధికంగా ఉంటుంది.

AND గేట్:

ఇందులో రెండు లేదా అంతకంటే ఎక్కువ ఇన్‌పుట్స్ ఉంటే ఒకేఒక ఔట్‌పుట్ (నిర్గమం) ఉంటుంది.



AND గేట్



AND సంకేతం


➤ అన్ని నివేశాలు అధికం అయితే నిర్గమం కూడా అధికం.

NOT గేట్:

ఇందులో ఒకేఒక నివేశం, ఒకేఒక నిర్గమం ఉంటాయి.

➤ ఇందులో నివేశం అధికంగా ఉంటే నిర్గమం తక్కువగా, నివేశం తక్కువ అయితే నిర్గమం అధికంగా ఉంటుంది.

➤ వాస్తవ ప్రపంచంలో ఉపయోగించే కాలిక్యులేటర్లు, డిజిటల్ గడియారాలు, కంప్యూటర్లు, సెల్‌ఫోన్లలో పైన తెలిపిన మూడు ప్రాథమిక గేట్ల కలయికలను గమనించవచ్చు.





➤ అదేవిధంగా NOR గేట్, NAND గేట్ లాంటి వాటిని వీటి కలయికతో తయారు చేయవచ్చు.

మాదిరి ప్రశ్నలు


1. OR గేట్‌కు ఉదాహరణ
1) ఇన్వర్టర్ 2) యూనివర్సల్ గేట్
3) స్విచ్‌ల సమాంతర సంధానం 4) పైవేవీ కావు

2. కింది వాటిలో దేనిలో AND గేట్ విధానం కనిపిస్తుంది?
1) శ్రేణిలో కలిపిన స్విచ్‌లు
2) సమాంతర సంధానంలోని స్విచ్‌లు
3) యూనివర్సల్ గేట్ 4) ఇన్వర్టర్

3. $101010_{(2)}$ అంటే దశాంశమానంలో ఎంత?
1) 32 2) 42 3) 64 4) 0

4. 65ను ద్విసంఖ్యామానంలో ఎలా రాస్తారు?
1) $1000001_{(2)}$ 2) $1010101_{(2)}$
3) $1000010_{(2)}$ 4) పైవేవీ కావు

సమాధానాలు: 1-3, 2-1, 3-2, 4-1.



రచయిత
వట్టిపల్లి కృష్ణ కిశోర్
విషయ నిపుణులు

Word of the Day

910

Tactless

Telugu meaning: సభ్యత లేని, అపరిపక్వ

English meaning: The word tactless (ట్యాక్ట్‌లెస్) is an adjective that describes a person who speaks or behaves without sensitivity, politeness, or consideration for others' feelings.

Synonyms: Rude, Insensitive; ***Antonyms:*** Polite, Diplomatic

Usage: **1.** His tactless remark about her failure embarrassed her in front of the entire class.

2. Being tactless during an interview can create a negative impression and reduce your chances of selection.

Current Affairs



Sunetra Pawar, took the oath of office as deputy chief minister of Maharashtra on 31 January 2026. She became the first woman to hold this position in the history of the state. She succeeds her husband Ajit Pawar who died in a plane crash on January 28. The swearing-in ceremony, held at Lok Bhavan, was administered by the Governor and attended by Chief Minister Devendra Fadnavis of the BJP and Deputy Chief Minister Eknath Shinde of the Shiv Sena.



Air Marshal Inderpal Singh Walia took charge as the new Air Officer Commanding-in-Chief (AOC-in-C) of the Indian Air Force's Eastern Air Command on 1 February 2026. An alumnus of the National Defence Academy, Walia was commissioned into the fighter stream of the IAF on June 11, 1988. He is qualified to fly multiple frontline fighter aircraft, including the MiG-21, MiG-23, MiG-27, Jaguar, and Su-30 MKI, and has logged over 3,200 hours of accident-free flying during his distinguished career spanning more than three decades.



The Patna Bird Sanctuary in Etah, Uttar Pradesh, and Chhari-Dhand in Kutch, Gujarat, have been officially designated as Ramsar wetlands, bringing India's total number of recognized wetlands to 98. This development reinforces India's commitment to protecting wetlands and biodiversity under global frameworks. Ramsar sites are recognized for their international ecological importance, serving as critical habitats for waterfowl and vital biodiversity hotspots.

For more Current Affairs: Scan QR code

అన్నా మణి

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈమె భారతదేశానికి చెందిన ప్రముఖ భౌతిక, వాతావరణ శాస్త్రవేత్త. వాతావరణ రంగంపై అనేక పరిశోధనలు చేశారు. ముఖ్యంగా సౌర వికిరణం, ఓజోన్, పవన శక్తి లాంటివి ఇందులో ఉన్నాయి. వాతావరణ పరికరాలు (Meteorological Instrumentation) అభివృద్ధి చేశారు. వర్షాలు, తుపానుల ముందస్తు అంచనాకు ఇవి ఎంతగానో తోడ్పాటు అందించాయి. ఈ కారణాలతోనే ఆమెను 'వెదర్ విమెన్ ఆఫ్ ఇండియా'/ 'మదర్ ఆఫ్ ఇండియన్ వెదర్ ఫోర్‌కాస్ట్'గా పిలుస్తారు. భారత వాతావరణ శాఖ అభివృద్ధికీ ఈమె ఎంతగానో కృషి చేశారు. భారత తొలితరం శాస్త్రవేత్తల్లో ఒకరైన అన్నా మణి జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం - వృత్తి జీవితం

అన్నా మణి 1918, ఆగస్టు 23న కేరళలోని పీరుమేడులో సిరియన్ క్రిస్టియన్ కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే ఆమెకు పుస్తకాలు చదవడం అంటే విపరీతమైన ఇష్టం. 12 ఏళ్లకు స్థానిక లైబ్రరీలోని పుస్తకాలన్నీ చదివారు. పాఠశాల విద్యను త్రివేండ్రం (ప్రస్తుత తిరువనంతపురం)లోని 'హిస్ హైనెస్ ది మహారాజా స్కూల్ ఫర్ గర్ల్స్', ఆల్వేలోని 'క్రైస్తవ మహిళాలయం హైస్కూల్ ఫర్ గర్ల్స్'లో పూర్తి చేశారు.

☛ ఇంటర్మీడియట్ విద్యను మద్రాస్‌లోని ఉమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో పూర్తి చేశారు. 1939లో మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాల నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీలో బీఎస్సీ ఆనర్స్ డిగ్రీతో పట్టభద్రురాలయ్యారు. 1940లో ఆమె బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో రిసెర్చ్ స్కాలర్‌గా చేరారు. అక్కడ సర్ సీవీ రామన్‌తో కలిసి వజ్రాలు, రూబీల స్పెక్ట్రోస్కోపీపై పరిశోధనలు చేశారు.

చివరగా

నాటి సమాజంలోని కట్టుబాట్లను ఎదిరించి, చదువుపై ఉన్న మక్కువతో ఉన్నత విద్యను అభ్యసించిన ధీశాలి అన్నా మణి. తన ఆవిష్కరణలతో దేశ స్వావలంబనకు కృషి చేశారు. భారత వాతావరణ విభాగం అభివృద్ధికి అన్నా మణి ఎంతగానో తోడ్పడ్డారు. ఆమె గాంధేయవాది. మహాత్ముడి వైకోమ్ సత్యాగ్రహం నుంచి స్ఫూర్తి పొందిన ఆమె కేవలం ఖాదీ వస్త్రాలను ధరించేవారు. అన్నా మణి 2001, ఆగస్టు 16న తిరువనంతపురంలో మరణించారు.

అన్నా మణి పొందిన పురస్కారాలు - గౌరవాలు, రచనలు, వాతావరణ రంగానికి చేసిన కృషి, గతంలో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భౌతికశాస్త్రం


ఉష్ణం - ఉష్ణోగ్రత

శక్తి స్వరూపం

ఉష్ణం శక్తి స్వరూపం. ఇది పదార్థం లేదా వస్తువు చల్లగా లేదా వేడిగా ఉండటాన్ని తెలియజేస్తుంది. ఉష్ణశక్తి నిరంతరం అధిక ఉష్ణోగ్రత నుంచి అల్ప ఉష్ణోగ్రత వైపు ప్రసరిస్తుంది. పదార్థం లేదా వ్యవస్థలోని పరమాణువులు, అణువులు, ఇతర సూక్ష్మకణాల యాదృచ్ఛిక (Random) చలనం వల్ల కలిగే గతిజ, స్థితిజ శక్తుల మొత్తమే దాని ఉష్ణశక్తి.

ఉష్ణోగ్రత

వస్తువు చల్లదనం లేదా వెచ్చదన తీవ్రతను నిర్ణయించే ఒక సాపేక్ష ఉష్ణీయ స్థితిని ఉష్ణోగ్రత (Temperature) అంటారు. దీన్ని థర్మామీటర్ లేదా ఉష్ణోగ్రతా మాపకంతో కొలుస్తారు. ఉష్ణోగ్రతను కొలిచే శాస్త్రాన్ని థర్మోమెట్రి (Thermometry) అంటారు. ఉష్ణోగ్రతకు SI ప్రమాణం కెల్విన్ (K), వాడుకలో ఉన్న ఇతర ప్రమాణాలు సెల్సియస్, ఫారెన్‌హీట్.



కెలోరిఫిక్ విలువ, సెల్సియస్ - ఫారెన్‌హీట్ ఉష్ణోగ్రతామానాల మధ్య సంబంధం, ఉష్ణ ప్రసారం/ ఉష్ణ బదిలీ, ఉష్ణ ప్రభావం మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs at CCRH

The Central Council for Research in Homeopathy (CCRH) in New Delhi is conducting interviews to fill Research Associate, Research Fellow, JRF, Office Assistant, and Multi-Tasking Staff positions. Total no.of posts is 39. The interviews will be conducted on February 10-13, 16-18, and 24, as well as on March 10, 2026.

Workman Posts

Cochin Shipyard Limited (CSL), Kochi, is inviting applications for Workman posts in various departments on a contract basis. Total no.of posts is 260. The application fee is Rs.300. Last date for online application is 7 February 2026.

Posts in DRDO-CABS

DRDO-Centre for Airborne Systems (CABS), Bengaluru is inviting applications for the Junior Research Fellowship program in various departments. Total no.of posts is 10. Last date for application is 22 February 2026.

Did You Apply..?

Today (February 3) is the last date for the following Jobs

☛ 162 Development Assistant Jobs in NABARD.
Eligibility: Bachelor's Degree.

☛ CBI SO Recruitment - 350 Specialist Officer Posts.
Eligibility: Bachelor's/ Master's degree.

☛ 110 Senior Resident jobs at JIPMER.
Eligibility: MD/MS/DNB.

For more information and other notifications - scan QR code

Simplification

1. Find the value of

$\sqrt{90 + \sqrt{90 + \sqrt{90 + \sqrt{90 + ...}}}} \div \sqrt{90 - \sqrt{90 - \sqrt{90 - \sqrt{90 - ......}}}}$

A) $\frac{9}{10}$ B) $\frac{10}{9}$ C) 1 D) $\frac{3}{10}$ E) $\frac{11}{9}$

2. Simplify the equation, $3.75 \times 3.75 - 7.5 \times 0.75 + 0.75 \times 0.75$

A) 9 B) $(4.5)^2$ C) $(3.75)^2$
D) 10.25 E) 7

3. Find the value of x in the expression of

$14\frac{1}{7} \times 7\frac{1}{3} + 8\frac{1}{7} = x + \frac{349}{21}$

A) $95\frac{3}{7}$ B) $95\frac{5}{7}$ C) $95\frac{5}{21}$
D) $95\frac{20}{21}$ E) $97\frac{7}{11}$

4. If $\frac{a}{b} = \frac{2}{3}$, then $\frac{6a + 7b}{6a - 7b}$ is equal to:

A) $\frac{-3}{11}$ B) $\frac{11}{3}$ C) $\frac{3}{11}$
D) $\frac{-11}{3}$ E) $\frac{12}{5}$

5. What fraction must be subtracted from the sum of $\frac{2}{5}$ and $\frac{3}{7}$ to have an average of $\frac{3}{70}$ of all the three fractions?

A) $\frac{3}{10}$ B) $\frac{9}{10}$ C) $\frac{7}{10}$
D) $\frac{6}{35}$ E) $\frac{9}{7}$

6. If $a^2 + b^2 = 99$, and $ab = 35$, find the value of $\frac{1}{a} + \frac{1}{b}$.

A) 13 B) 169 C) $\frac{99}{35}$ D) $\frac{13}{35}$
E) None of the above

7. The value of $\left(2 - \frac{1}{2}\right)\left(2 - \frac{2}{3}\right)\left(2 - \frac{3}{4}\right)$ .... $\left(2 - \frac{49}{50}\right)$

A) $\frac{49}{2}$ B) $\frac{51}{2}$ C) $\frac{50}{3}$
D) $\frac{53}{2}$ E) $\frac{31}{3}$

8. When $\frac{1}{7}$ of a number is subtracted from $\frac{1}{5}$ of the same number, the remainder obtained is 16. The number is:

A) 280 B) $\frac{16}{35}$ C) 310
D) 275 E) 441

9. What is the difference between the largest and the smallest fractions of $\frac{7}{9}, \frac{20}{11}, \frac{11}{12}$ and $\frac{13}{6}$.

Bank Exams

Quantitative Aptitude

A) $\frac{275}{396}$ B) $\frac{275}{198}$ C) $\frac{195}{198}$
D) $\frac{55}{198}$ E) $\frac{11}{171}$

10. What is the value of

$999\frac{1}{3} + 999\frac{1}{5} + 999\frac{1}{6} + 999\frac{1}{10}$

A) $3996\frac{3}{5}$ B) $4000\frac{4}{5}$
C) $3996\frac{4}{5}$ D) $4000\frac{3}{5}$
E) None of the above

11. Twenty two times of a positive number is less than its square by 135. The value of positive number is:

A) 35 B) 21 C) 25 D) 27 E) 41

12. $\left(x + \frac{1}{x}\right)^2 = 3$, then the value of $(x^{78} + x^{60} + x^{48} + x^{30} + x^{24} + x^6 + 1)$ is:

A) 1 B) 0 C) −1 D) $\frac{1}{3}$ E) 3

13. The simplifies value of $\frac{2}{3} \div \left[\frac{3}{7} \text{ of } \frac{14}{5} \times 1\frac{2}{3} - \left(3\frac{1}{2} - 2\frac{1}{6}\right)\right]$ is

A) $\frac{1}{3}$ B) 1 C) 2 D) $\frac{2}{3}$ E) $\frac{3}{2}$

14. Find the value of $97\frac{93}{97} \times 97 - 93$

A) 9497 B) 9793 C) 9709
D) 9409 E) None of the above

15. Let x =

$\frac{5\frac{3}{4} - \frac{3}{7} \times 15\frac{3}{4} + 2\frac{2}{35} \div 1\frac{11}{25}}{\frac{3}{4} \div 5\frac{1}{4} + 5\frac{3}{5} \div 3\frac{4}{15}}$,

when y is added to x, the result is $\frac{7}{13}$.

What is the value of y?

A) $\frac{1}{13}$ B) $\frac{9}{13}$ C) $\frac{2}{13}$ D) $\frac{4}{13}$ E) $\frac{5}{12}$

16. Simplify the following expression

$\frac{4.3 \times 4.3 - 0.3 \times 0.3}{0.3 \times 0.3 - 2 \times 0.3 \times 4.3 + 4.3 \times 4.3}$

A) $1\frac{3}{20}$ B) $1\frac{1}{20}$
C) $2\frac{3}{20}$ D) $4\frac{3}{20}$
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Dr.Vangala Srinivas,
Subject Expert

(c) eenadu

10 కిలోల కణితి తొలగింపు

యువతి కడుపులో ఉన్న 10 కిలోల కణితిని వైద్యులు విజయవంతంగా తొలగించారు. రాజస్థాన్‌లోని సవాయి మాన్‌సింగ్ ఆసుపత్రిలో ఈ శస్త్ర చికిత్స జరిగింది. జైపుర్‌కు చెందిన 18 ఏళ్ల యువతి 6 నెలలుగా విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. చికిత్స కోసం అనేక ఆసుపత్రులకు తిప్పినా ప్రయోజనం లేకపోయింది. చివరగా ఆమె కుటుంబ సభ్యులు జైపుర్‌లోని సవాయి మాన్‌సింగ్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అక్కడ చేసిన వైద్య పరీక్షల్లో యువతి పొత్తి కడుపులో సుమారు 10 కిలోల కణితి బయటపడింది. ఇది కాలేయం, మూత్రపిండాలు, ఇతర అవయవాలకు అనుసంధానమై ఉంది.

వైద్యులు షాలు గుప్తా, బీఎల్ యాదవ్, హేమలత తదితరులు కొన్ని గంటలపాటు శ్రమించి 10 కిలోల కణితి విజయవంతంగా తొలగించారు. దీంతో యువతికి కొత్త జీవితం లభించింది. సర్జరీ జరిగిన రెండు రోజుల తర్వాత రోగి తినడం ప్రారంభించింది.



సర్జరీ చేసిన డాక్టర్ మృతితో విషాదం

ఈ విజయవంతమైన శస్త్ర చికిత్స గురించి ప్రకటన వెలువడిన కొద్ది నిమిషాలకే సర్జరీ చేసిన వైద్యుల్లో ఒకరైన బీఎల్ యాదవ్ అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యారు. ఆసుపత్రి వైద్యుల బృందం ఆయనను బతికించడానికి అన్ని విధాలా ప్రయత్నించింది. అయినా ఫలితం లేకపోయింది. బీఎల్ యాదవ్ కన్ను మూశారు. దీంతో విషాదం నెలకొంది.

భారత్
యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

132 ఏళ్లుగా పేదల పెళ్లిళ్లకు సాయం



ఆధునిక కాలంలో అనేక సంప్రదాయాలు కనుమరుగవుతున్నా బీకానేర్‌కు చెందిన ఓ కుటుంబం తరతరాలుగా ఒక ఆదర్శాన్ని కొనసాగిస్తూనే ఉంది. పుష్కర్ణ సామాజిక వర్గం నిర్వహించే సామూహిక వివాహ వేడుకల్లో నిరుపేద యువతులకు అండగా నిలుస్తోంది. ఇలా 132 ఏళ్ల నాటి ఘన వారసత్వాన్ని బిన్నానీ కుటుంబం కొనసాగిస్తోంది. ఈ సేవ కేవలం ఒక నైతిక బాధ్యతగానే కాకుండా, కుటుంబంలోని పెద్దలు దీనిని వీలునామాలో పొందుపరచడం ద్వారా చట్టపరమైన, భావోద్వేగపూరిత బాధ్యతగా మార్చారు.

ఈ సేవా వారసత్వం మేఘరాజ్ బిన్నానీ పూర్వీకుల కాలం నుంచి ప్రారంభమైంది. ఆయన కుమారుడు బులాకీ దాస్ బిన్నానీ ఈ విధానాన్ని మరింత పటిష్ఠం చేశారు. 2008లో బులాకీ దాస్ మరణించడానికి ముందు.. తన ముగ్గురు కుమారులకు సామాజిక, మతపరమైన బాధ్యతలను వీలునామా ద్వారా విభజించి ఇచ్చారు. ప్రతి కుమారుడు ఒక నిర్దిష్టమైన సేవను తప్పనిసరిగా కొనసాగించాలని పేర్కొన్నారు. ఆ వీలునామా ప్రకారం.. రాంగోపాల్ బిన్నానీకి ఒక ముఖ్యమైన బాధ్యత అప్పగించారు. పుష్కర్ణ సామూహిక వివాహాల్లో పెళ్లి చేసుకునే నిరుపేద యువతులకు వేల రూపాయల విలువైన గృహోపకరణాలను బహుమతిగా ఇవ్వాలని సూచించారు. ఇందుకోసం నిధిని కేటాయించి దానిపై వచ్చే వడ్డీని ఏటా ఈ కార్యక్రమం కోసం వినియోగించాలని ఆదేశించారు.

వీలునామాలో రాంగోపాల్ సోదరులకు ప్రత్యేక మతపరమైన విధులు కేటాయించారు. ఒక సోదరుడు క్రమం తప్పకుండా 'శ్రావణ' ఆచారాలను నిర్వహించాలని, మరొకరు ప్రతి రోజూ పావురాలకు, పక్షులకు ఆహారం అందించాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక నిధులను కేటాయించారు. కేటాయించిన మొత్తం తక్కువే అయినప్పటికీ, తదుపరి తరంవారు ఈ పద్ధతులను అత్యంత భక్తిశ్రద్ధలతో అనుసరిస్తున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరి 10న బీకానేర్‌లో వందల మంది యువతులకు వివాహాలు జరగనున్నాయి. వారందరికీ బిన్నానీ కుటుంబం వెండి ఆభరణాలు, నిత్యావసర సరకులు, వంట పాత్రలు, ఇతర చిన్నపాటి కానుకలతో సహా మొత్తం 23 రకాల వస్తువులను అందజేయనుంది.

అండాశయం నుంచి 23 కిలోల కణితి తొలగింపు

కోళికోడ్: కేరళలోని కోళికోడ్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల వైద్యులు 25 ఏళ్ల ఓ యువతికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించారు. ఆమె అండాశయం నుంచి 23 కిలోల బరువున్న కణితిని తొలగించారు. యువతికి కొంతకాలంగా పొత్తి కడుపు పరిమాణం పెరుగుతుండటంతో ఆసుపత్రిలో చేరింది. వైద్య పరీక్షల్లో ఆమె అండాశయంలో 45 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు ఉన్న కణితి ఉన్నట్లు తేలింది. దీంతో సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో వైద్య బృందం దాదాపు రెండు గంటల పాటు శ్రమించి శస్త్రచికిత్స చేసింది. కణితి పరిమాణం, బరువు కారణంగా ఆపరేషన్ సవాలుగా మారిందని వైద్యులు తెలిపారు. వైద్య బృందం నైపుణ్యాన్ని, అంకితభావాన్ని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ ప్రశంసించారు.

భారత్ వృద్ధిపై మస్క్ పోస్ట్..

రాహుల్ గాంధీకి నిర్మల చురకలు

ఇంటర్నెట్ డెస్క్: భారత్ వేగంగా అభివృద్ధి చెందుతుంటే కొందరు ప్రతిపక్ష నేతలు మాత్రం దేశ ఆర్థిక పరిస్థితులపై విదేశాల్లో తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దుయ్యబట్టారు. త్వరలో చైనాను కూడా దాటి మరింత ముందుకువెళ్లడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆమె పరోక్షంగా ప్రస్తావించారు. ప్రపంచ వృద్ధికి భారత్ చోదకశక్తిగా ఉందంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ పెట్టిన పోస్ట్‌పై నిర్మల స్పందించారు. ప్రపంచ జీడీపీ వృద్ధి రేటులో అమెరికా కంటే భారత్ ముందు స్థానంలో ఉన్నట్లు మస్క్ పంచుకున్న గణాంకాలను ఆమె ఉదహరించారు. చైనా 26%, భారత్ 17%, అమెరికా 9.9 శాతం వాటాను కలిగిఉన్నాయన్నారు. చైనా, భారత్ ఆర్థిక వ్యవస్థల నుంచే 43 శాతం వృద్ధి రేటు వస్తోందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందుతోందనడానికి ఇదో చక్కటి ఉదాహరణ అని వివరించారు. భారత్‌ను కించపరిచేలా విదేశీ పర్యటనల్లో రాహుల్ మాట్లాడతారని.. అది సరైన చర్య కాదని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. తాను సాధారణంగా విదేశీయులు చేసే పోస్టులపై స్పందించనని, కానీ ఓ బాధ్యత గల పౌరుడి స్థానంలో ఉండి.. దేశాన్ని ఇతరుల ముందు తక్కువచేసి మాట్లాడొద్దని రాహుల్‌కు తెలిపేందుకే మస్క్ పోస్టుపై స్పందిస్తున్నానని తెలిపారు.

అంతర్జాతీయ సైబర్ నేరస్థుల గుట్టురట్టు

- కీలక నిందితుడిని అరెస్టుచేసిన సీబీఐ

దిల్లీ: భారత్‌లో ఉంటూ వివిధ దేశాల్లోని ప్రజలను ఆన్‌లైన్ మోసాల ద్వారా దోచుకుంటున్న సైబర్ నేరస్థుల నెట్‌వర్క్‌లను సీబీఐ ఛేదించింది. ఈ ముఠాల్లోని నిందితులు భారత్‌తోపాటు అమెరికా, బ్రిటన్, కువైట్, ఐర్లాండ్, సింగపూర్‌లోని ప్రజలను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో వీరి గుట్టు రట్టు చేయడానికి ఆయా దేశాల దర్యాప్తు సంస్థల సమన్వయంతో జనవరి 30న సీబీఐ 'ఆపరేషన్ సైబర్ స్ట్రైక్' ప్రారంభించింది. దిల్లీ, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, తెలంగాణ, పశ్చిమబెంగాల్‌లలోని 35 ప్రాంతాల్లో సీబీఐ తనిఖీలు చేపట్టగా సైబర్ నేరస్థుల దందాలు బయటపడ్డాయి. దిల్లీలో కీలక నిందితుడిని అరెస్టు చేసి ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, హార్డ్ డిస్కులు వంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలను స్వాధీనం చేసుకుంది. అలాగే కువైట్‌లోని ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల పేరిట దిల్లీ, గాజియాబాద్, కర్ణాటక కేంద్రంగా నకిలీ వీసాలు, ఆఫర్ లెటర్లతో యువతను మోసగిస్తున్న ముఠాను సైతం ఛేదించి, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, రూ.60 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది.

మణిపుర్‌లో భాజపా కేంద్ర పరిశీలకుడి నియామకం

దిల్లీ: మణిపుర్‌లో తమ శాసనసభాపక్ష నేతను ఎన్నుకునే ప్రక్రియను పర్యవేక్షించడానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ చుగ్‌ను కేంద్ర పరిశీలకుడిగా భాజపా నియమించింది. దీంతో మణిపుర్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే వారంలో రాష్ట్రపతి పాలన ముగియనుండటంతో.. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే చర్చలు జరిపేందుకు మణిపుర్‌లోని ఎన్డీఏ ఎమ్మెల్యేలను దిల్లీకి రావాల్సిందిగా భాజపా కోరిన తరుణంలో ఈ చర్య చోటుచేసుకుంది. మైతెయి, కుకీ తెగల నడుమ నెలల తరబడి జాతి హింస చోటుచేసుకున్న తరువాత, 2025 ఫిబ్రవరి 13న మణిపుర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు.

ఐఐటీ నుంచి జీవోదయ పట్టు

దిల్లీ: సంప్రదాయంగా పట్టుగూళ్లను ఉడికించి పట్టుదారం తీస్తారు. ఆ క్రమంలో గూళ్లలోని లక్షల పట్టు పురుగులు నశించిపోతాయి. దీనికి స్వస్తి చెప్పడానికి ఐఐటీ రూపొందించిన జీవోదయ పట్టు తయారీ విధానం తోడ్పడనుంది. ఈ పద్ధతిలో మల్బరీ ఆకులను తిని పెరిగే పట్టు పురుగులను గూళ్లు కట్టనివ్వకుండా చదునైన ఉపరితలంపై పెరిగేలా చేస్తారు. అవి అక్కడే రూపాంతరం చెంది పట్టు దారం తయారు చేస్తాయి. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద కోల్ ఇండియా సంస్థ ఇచ్చిన ఆర్థిక సహాయంతో ఐఐటీ బొంబాయి మూడేళ్ల పరిశోధన ఫలించి జీవోదయ పట్టు తయారీ విధానం రూపుదిద్దుకుంది.

హడావుడిగా సునేత్ర ప్రమాణం ఎందుకు..?

- సూతక కాలాన్నీ పాటించలేదు
- శివసేన(ఉద్ధవ్) పత్రిక సామ్నాలో విమర్శలు

ముంబయి: దివంగత అజిత్ పవార్ సతీమణి సునేత్రా పవార్‌తో హడావుడిగా మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణం చేయించడంపై శివసేన (ఉద్ధవ్) పత్రిక సామ్నా తన సంపాదకీయంలో విమర్శలు గుప్పించింది. అజిత్ పవార్ చితాగ్ని చల్లారక ముందే, సునేత్రాను ముంబయికి పిలిపించి ప్రమాణ స్వీకారం చేయించారంది. ఆమె ప్రమాణ స్వీకారం చేసే చివరి నిమిషం దాకా తమకూ ఈ విషయం తెలియదని ఎన్‌సీపీ(ఎస్‌పీ) అగ్రనేతలు శరద్ పవార్, సుప్రియా సూలే పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. ఈ నిర్ణయం వెనుక కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ల పాత్ర ఉందని ఆరోపించింది. హిందూ మత విశ్వాసాలకు విరుద్ధంగా సూతక కాలం గడవక ముందే ఎలా పదవిని స్వీకరించారని ప్రశ్నించింది. ఎన్‌సీపీ పార్టీని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ నియంత్రిస్తున్నారని వ్యాఖ్యానించింది.

భాజపాను హెచ్చరించిన 10 రోజులకే అజిత్ దాదా మృతి: సంజయ్ రౌత్

నీటిపారుదల శాఖలో జరిగిన కుంభకోణాన్ని బయటపెడతానని భాజపాను హెచ్చరించిన 10 రోజులకే అజిత్ పవార్ హెలికాప్టర్ కూలిన ఘటనలో మరణించారని శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. భాజపాతో తెగదెంపులు చేసుకుని ఎన్‌సీపీలో తిరిగి విలీనం కావాలని అజిత్ పవార్ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈలోపే అజిత్ మరణించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కాబట్టి అజిత్ మరణంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

భారత సంతతి వాతావరణ శాస్త్రవేత్త వీరభద్రన్ రామనాథన్‌కు క్రాఫోర్డ్ ప్రైజ్

- భూ వాతావరణంపై సీఎఫ్‌సీల ప్రభావాన్ని కనుగొన్న తొలి శాస్త్రవేత్త



హ్యూస్టన్: భారత సంతతి వాతావరణ శాస్త్రవేత్త వీరభద్రన్ రామనాథన్(82)ను భూ విజ్ఞానశాస్త్రంలో నోబెల్‌గా భావించే క్రాఫోర్డ్ ప్రైజ్ వరించింది. కాలుష్య మేఘాలు, క్లోరోఫ్లోరో కార్బన్ (సీఎఫ్‌సీ)ల వంటి సూపర్ పొల్యూటెంట్లపై దశాబ్దాల పాటు చేసిన పరిశోధనకు ఆయనకు ఈ అవార్డును ఇస్తున్నట్లు రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. రామనాథన్ 'నాసా'కు పనిచేస్తున్న సమయంలో కార్బన్‌డయాక్సైడ్ కంటే ఫ్రిడ్జ్‌లు, ఏరోసోల్స్‌లో ఉపయోగించే సీఎఫ్‌సీలే 10 వేల రెట్లు ఎక్కువగా భూ వాతావరణంలో ఉష్ణాన్ని పట్టి ఉంచుతాయని కనుగొన్నారు. దీంతో గ్లోబల్ వార్మింగ్‌కు కార్బన్ డయాక్సైడే ప్రధాన కారణమని అప్పటి వరకూ ఉన్న భావనను ఆయన సమూలంగా మార్చేసినట్లయింది.

మదురైలో పుట్టి.. సికింద్రాబాద్‌లో ఉద్యోగం

తమిళనాడులోని మదురైలో రామనాథన్ జన్మించారు. చదువు తర్వాత తెలంగాణలోని సికింద్రాబాద్‌లో ఉన్న ఓ ఫ్రిజ్‌ల కర్మాగారంలో సీఎఫ్‌సీ విభాగం ఇంజినీర్‌గా పనిచేశారు. అనంతరం అన్నామలై యూనివర్సిటీ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో పైచదువులు చదువుకున్నారు. ఇండియన్ ఓషన్ ఎక్స్‌పెరిమెంట్ (ఇండోఎక్స్) పేరుతో నిర్వహించిన అంతర్జాతీయ అధ్యయనంలో ఆయన ప్రధానంగా దక్షిణాసియాపై దృష్టి సారించారు. ఇక్కడ కాలుష్య మేఘాలు (బ్రౌన్ క్లౌడ్స్) వాతావరణంలో పెరిగిపోయి భారత రుతుపవనాల ప్రభావాన్ని క్షీణింపజేస్తున్నాయని, హిమాలయాల్లోని హిమనదాలు కరిగిపోవడాన్ని వేగవంతం చేస్తున్నాయని కనుగొన్నారు. రామనాథన్ ప్రస్తుతం కాలిఫోర్నియా యూనివర్సిటీలోని స్క్రిప్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఓషనోగ్రఫీలో డిస్టింగ్విష్డ్ ప్రొఫెసర్ ఎమెరిటస్ హోదాలో ఉన్నారు. స్వీడన్‌లోని స్టాక్‌హోంలో మేలో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయనకు క్రాఫోర్డ్ ప్రైజ్‌తో పాటు 8 మిలియన్ స్వీడిష్ క్రూనార్ (రూ.8.23 కోట్లు)ల రివార్డును ప్రదానం చేయనున్నారు.

ఏపీసహా 8 రాష్ట్రాల్లో అరుదైన లోహాలు

దిల్లీ: ఆంధ్ర ప్రదేశ్ సహా 8 రాష్ట్రాల సముద్ర తీర ఇసుకలో, అగ్ని శిలల్లో మొత్తం 1.31 కోట్ల టన్నుల పైచిలుకు మోనజైట్ నిక్షేపాలున్నట్లు నిర్ధారణ అయిందని కేంద్ర బొగ్గు, గనులశాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి రాజ్యసభకు తెలిపారు. ఏపీ, తమిళనాడు, కేరళ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్ సముద్ర తీరాల్లో, లోతట్టు ఎర్ర నేలలు, ఒండ్రు మట్టి నేలల్లో ఉన్న ఈ మోనజైట్ నుంచి 72.3 లక్షల టన్నుల థోరియం, ఇతర అరుదైన లోహాలను ఉత్పత్తి చేయవచ్చని కేంద్ర అణుశక్తి శాఖకు చెందిన ఏఎండీ విభాగం అంచనా. ఇంకా రాజస్థాన్, గుజరాత్‌లలోని కఠిన శిలల్లో 12.9 లక్షల అరుదైన లోహాలను కనుగొన్నట్లు ఏఎండీ తెలిపింది. ఆంధ్రతోపాటు ఇతర రాష్ట్రాల సముద్ర తీర ఇసుకలోని మోనజైట్ రేడియోధార్మికత గల యురేనియం, థోరియం కోవకు చెందినది. అందువల్ల ఈ ఖనిజాలను తవ్వితీసి, వినియోగించడం పూర్తిగా ప్రభుత్వ అధీనంలో ఉంది. అరుదైన లోహాల వినియోగానికి కర్మాగారాలు, సాంకేతికత, నిపుణులైన సిబ్బంది ప్రపంచంలో 3, 4 దేశాలకే ఉన్నారు. వాటిలో భారత్ ఒకటి.

వేడి కూర పడిన ప్రయాణికుడికి రూ.25వేల పరిహారం

- ఇండిగోను ఆదేశించిన వినియోగదారుల కమిషన్

ఇంటర్నెట్ డెస్క్: విమాన ప్రయాణంలో వేడి కూర పడటంతో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొన్న ప్రయాణికుడికి రూ.25 వేల పరిహారం చెల్లించాలని ఇండిగో సంస్థను వినియోగదారుల కమిషన్ ఆదేశించింది. బాధిత ప్రయాణికుడు 2024 మార్చి 5న బ్యాంకాక్ నుంచి బెంగళూరుకు ఇండిగో విమానంలో వస్తుండగా, సిబ్బంది ఆహారం సరఫరా చేస్తున్న సమయంలో వేడి కూర అతడిపై పడింది. దీంతో ఆయన దుస్తులు పాడయ్యాయి. విషయం తెలిసిన విమానయాన సంస్థ పరిహారంగా రూ.5వేల ట్రావెల్ వోచర్‌ను ఆఫర్ చేసింది. దీన్ని తిరస్కరించిన ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. "వేడి కూర నాపై పడటంతో శరీరం కాలింది. నేను శాకాహారిని. మాంసాహారం మీద పడటంతో ఆ వాసన భరించలేకపోయాను. నా దుస్తులు, ఫోన్, వాచ్ అన్నీ పాడయ్యాయి. తోటి వారి ముందు నవ్వులపాలయ్యా. విమానం దిగేంత వరకు మానసిక వేదన అనుభవించా. సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఇదంతా జరిగింది" అని ఆ ప్రయాణికుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు గానూ విమానయాన సంస్థ నుంచి రూ. 5 లక్షల పరిహారం కావాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు విన్న కమిషన్ బాధితుడికి రూ.20 వేలు చెల్లించాలని, పిటిషన్ ఖర్చుల నిమిత్తం మరో రూ.5 వేలు ఇవ్వాలని ఇండిగోను ఆదేశించింది.



ఇటీవల జరిగిన భారత గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని అమెరికాలోని న్యూయార్క్‌లో భారత కాన్సులేట్ జనరల్ ఏర్పాటు చేసిన విందులో ఆకట్టుకున్న మేక్ ఇన్ ఇండియా ఉత్పత్తులు

'కారణం లేకుండా భర్తకు దూరంగా ఉంటే.. భరణం పొందే హక్కు ఉండదు'

ఈటీవీ భారత్: బలమైన, సహేతుకమైన కారణం లేకుండా, భర్త, అత్తమామలకు దూరంగా ఉండే భార్యకు భరణం పొందే హక్కు ఉండదని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు స్పష్టం చేసింది. ఓ కేసులో బిలాస్‌పుర్ కుటుంబ న్యాయస్థానం గతంలో ఇచ్చిన తీర్పును సమర్థించింది. బిలాస్‌పుర్‌కు చెందిన ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఈ కీలక తీర్పు వెలువరించింది. తనకు భర్త నుంచి నెలవారీ భత్యం కావాలని కోరుతూ బిలాస్‌పుర్‌కు చెందిన వేదుల ప్రవీణ్ కుమార్ అనే వ్యక్తి భార్య గతంలో ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. తన ఫిర్యాదులో భర్త, అతని కుటుంబంపై వరకట్న వేధింపుల ఆరోపణలు చేసింది. అయితే, విచారణలో ఈ వేధింపుల ఆరోపణలకు తగిన ఆధారాలు లేవని, భర్త తనను తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్నా, ఆమె కావాలనే వెళ్లడం లేదని న్యాయస్థానం గుర్తించింది. దీంతో ఆమె అభ్యర్థనను తోసిపుచ్చింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె ఛత్తీస్‌గఢ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక అంశాలను ప్రస్తావించింది. హిందూ వివాహ చట్టం సెక్షన్-9 కింద భర్త తన భార్యతో కలిసి ఉండాలని కోరుతూ వైవాహిక హక్కుల పునరుద్ధరణ కోసం పిటిషన్ దాఖలు చేసినప్పుడు, భార్య తిరిగి భర్త ఇంటికి రావడానికి సిద్ధంగా లేకపోతే అది ఆమె తప్పిదమని, అది సెక్షన్ 125(4)ను ఉల్లంఘించడమే అవుతుందని ధర్మాసనం స్పష్టం చేసింది. సరైన కారణం లేకుండా భర్తకు దూరంగా ఉండే భార్యకు భరణం పొందే అర్హత లేదని ఈ చట్టం స్పష్టంగా చెబుతోందని పేర్కొంది.

ఆయుర్దాయంలో సగ భాగం వారసత్వ ఫలితమే!


దిల్లీ: ఒక వ్యక్తి ఆయుర్దాయంలో దాదాపు 50 శాతానికి జన్యువులు కారణం కావొచ్చని తాజా అధ్యయనం పేర్కొంది. ఆయుష్షు నిర్ధారణలో వాటికి.. ఇప్పటివరకూ వేస్తున్న అంచనాల కన్నా మరింత గణనీయ పాత్ర ఉండొచ్చని తేలింది. ప్రమాదాలు, ఇన్‌ఫెక్షన్లు వంటి ఇతర కారణాలతో సంభవించే మరణాలనూ పరిగణనలోకి తీసుకుంటే ఈ విషయం వెల్లడవుతుందని ఇజ్రాయెల్, స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్తలు ఈ పరిశోధనలు చేశారు.

మానవ ఆయుర్దాయంలో వారసత్వం పాత్ర గురించి అర్థం చేసుకోవడం.. వార్ధక్యంపై చేసే పరిశోధనలకు కీలకమని శాస్త్రవేత్తలు తెలిపారు. అయితే ఆయుష్షు నిడివిపై జన్యువుల ప్రభావాన్ని నిర్ధారించడం సవాళ్లతో కూడుకున్న వ్యవహారం. ఆయుర్దాయంలో 15-33 శాతం వారసత్వంగా రావొచ్చని మునుపటి పరిశోధనలు పేర్కొన్నాయి. ప్రధానంగా అది 20-25 శాతంగా ఉండొచ్చని వివరించాయి. అయితే ప్రమాదాలు లేదా ఇన్‌ఫెక్షన్లు వంటి కారణాల వల్ల జరుగుతున్న మరణాలు ఈ అంచనాలను గందరగోళపరిచాయని శాస్త్రవేత్తలు తెలిపారు. ఆయుర్దాయంతో ముడిపడిన జన్యువులను గుర్తించినప్పటికీ.. వ్యాధులు, జీవన పరిస్థితుల వంటి బాహ్య అంశాలు జన్యు ప్రభావాలను మసకబార్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. "పర్యావరణంతో జన్యువులు చర్య జరిపి, గుర్తించదగ్గ ఒక లక్షణంగా మారుతున్న తీరును అర్థం చేసుకోవడానికి శాస్త్రవేత్తలు కవలలపై నిర్వహించే అధ్యయనాలపై ఆధారపడుతుండేవారు. అయితే వీటిలో మరణ కారణాలకు సంబంధించిన సమాచారం సరిపడా ఉండటంలేదు. ఇతరత్రా కారణాలతో జరిగే మరణాల అంశాలను సరిచేయడానికి ఇది అవసరం" అని శాస్త్రవేత్తలు వివరించారు. ఈ నేపథ్యంలో తాము గణిత నమూనాలను ఉపయోగించి కవల అధ్యయనాలను విశ్లేషించినట్లు తెలిపారు. మానవ జీవన నిడివిలో వారసత్వ అంశం 50శాతం పైనేనని ఇందులో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

ఈడీ పిటిషన్‌కు విచారణార్హత లేదు

- ఐ-ప్యాక్ కార్యాలయంలో సోదాలకు అడ్డుతగిలారన్న వ్యాజ్యంపై బెంగాల్ సర్కారు స్పందన

దిల్లీ: కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంలో సోదాలకు అడ్డు తగిలారని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) వేసిన పిటిషన్‌కు విచారణార్హత లేదని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం పేర్కొంది. ఈ తరహా పిటిషన్ ఒకటి ఇప్పటికే కలకత్తా హైకోర్టులో విచారణలో ఉన్న సంగతిని గుర్తుచేసింది. బెంగాల్ సర్కారు ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. కోల్‌కతాలోని ఐ-ప్యాక్ కార్యాలయంలో గత నెల 8న తాము చేపట్టిన సోదాలకు సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అడ్డు తగిలిందంటూ ఈడీ సుప్రీంను ఆశ్రయించింది. దానిపై గత నెల 15న మమత, బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ రాజీవ్ కుమార్, ఇతర సీనియర్ పోలీసు అధికారులకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ఐ-ప్యాక్ కార్యాలయంలో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై ఎఫ్ఐఆర్‌లను నిలిపివేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ పిటిషన్‌కు బెంగాల్ సర్కారు సుప్రీంకోర్టులో తాజాగా స్పందన దాఖలు చేసింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసే ప్రాథమిక హక్కులు ఈడీకి లేవని అందులో పేర్కొంది.



ఉత్తరాఖండ్‌లోని రుద్రప్రయాగ్ జిల్లాలో తాజా హిమపాతం అనంతరం మంచుతో నిండిపోయిన కేదార్‌నాథ్ ఆలయ పరిసరాలు

కేదార్‌నాథ్ కాలిబాట పునర్నిర్మాణం పూర్తి



ఈటీవీ భారత్: కేదార్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులకు, ఈ సీజన్ నుంచి ఉపశమనం కలగనుంది. 13 ఏళ్ల క్రితం సంభవించిన వరదల్లో ధ్వంసమైన రాంబారా- గరుడచట్టి పాత కాలిబాట పునర్నిర్మాణం దాదాపు పూర్తయింది. త్వరలో అది తిరిగి అందుబాటులోకి రానుంది. దీంతోపాటు మార్గం మధ్యలో పర్యాటకుల భద్రత, సౌకర్యాల కోసం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో పర్యాటకుల యాత్రా ప్రయాణం మరింత సులభంగా, సౌకర్యవంతంగా మారబోతోంది.

మత మార్పిడి నిరోధక చట్టాలపై కేంద్రానికి, 12 రాష్ట్రాలకు నోటీసులు

దిల్లీ: మత మార్పిడి నిరోధక చట్టాల చెల్లుబాటును ప్రశ్నిస్తూ దాఖలైన తాజా పిటిషన్‌పై కేంద్రం, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్ సహా 12 రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చెస్ తరఫున ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. వివిధ రాష్ట్రాలు తీసుకొచ్చిన మత మార్పిడి నిరోధక చట్టాల అమలును నిలిపివేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను పరిశీలించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం ఇప్పటికే దాఖలైన ఇటువంటి వ్యాజ్యాలతో జత చేస్తున్నట్లు తెలిపింది. విచారణకు త్రిసభ్య ధర్మాసనం ఏర్పాటు చేస్తామని వెల్లడించింది.

వ్యక్తుల కోసం ఎన్నికలను స్తంభింపజేయొద్దు: సుప్రీంకోర్టు

దిల్లీ: ఒకరిద్దరు వ్యక్తులకు ఎదురయ్యే ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుంటూ ఎన్నికల ప్రక్రియను స్తంభింపజేయడం తగదని సుప్రీంకోర్టు సోమవారం పేర్కొంది. విస్తృత ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని.. ఎన్నికలు నిరాటంకంగా జరిగేలా చట్టాలకు కట్టుబడి ఆదేశాలు జారీ చేసేందుకు మొగ్గుచూపాలని కోర్టులకు హితవు పలికింది. జిల్లా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఓ వ్యక్తిని అనుమతించాలని, ఆయనకు గుర్తు కేటాయించాలని ఉత్తరాఖండ్ హైకోర్టు నిరుడు జులైలో రిటర్నింగ్ అధికారికి మధ్యంతర ఉత్తర్వుల్లో ఆదేశాలు జారీ చేసింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం విచారణ నిర్వహించింది. హైకోర్టు జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను పక్కనపెట్టింది.

జెన్ జెడ్ తరహా ఆందోళనలకు రెచ్చగొట్టారు

- సోనమ్ వాంగ్‌చుక్‌పై సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

దిల్లీ: పర్యావరణ ఉద్యమ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ నేపాల్, బంగ్లాదేశ్‌లలో తలెత్తిన జెన్ జెడ్ తరహా ఆందోళనలకు యువతను రెచ్చగొట్టారని కేంద్రం ప్రభుత్వం, లద్దాఖ్ పాలనా యంత్రాంగం సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. అరబ్ దేశాల్లో పలు ప్రభుత్వాల కూల్చివేతకు కారణమైన అరబ్ వసంతం ఉద్యమాలను కూడా వాంగ్‌చుక్ తన ప్రసంగాల్లో ప్రస్తావించేవారని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. వాంగ్‌చుక్‌కు బెయిల్ మంజూరు కోసం ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.వి.వరాలే ధర్మాసనం ముందు ఈ వాదనలు వినిపించారు. జాతీయ భద్రతా చట్టం కింద వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసి జైలులో నిర్బంధించడాన్ని గీతాంజలి ఆంగ్మో ప్రశ్నించారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. మంగళవారం కూడా విచారణ కొనసాగనుంది.

పంజాబ్ కేసరి పత్రికపై దాడులు గర్హనీయం

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలను ఖండించిన ఐఎన్ఎస్

దిల్లీ: పంజాబ్‌లో ప్రముఖ దిన పత్రిక 'పంజాబ్ కేసరి', దాని అనుబంధ సంస్థలకు వ్యతిరేకంగా ఇటీవల ఆ రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు తీసుకున్న చర్యలను 'ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ' (ఐఎన్ఎస్) తీవ్రంగా ఖండించింది. పత్రికకు సంబంధించిన ప్రింటింగ్ ప్రెస్‌లో తనిఖీలు, దాడులు నిర్వహించడం, అనుబంధ సంస్థల కార్యకలాపాలకు అవరోధాలు కల్పించడంపై ఐఎన్ఎస్ అధ్యక్షుడు వివేక్ గుప్తా, ప్రధాన కార్యదర్శి మేరీ పాల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేతతో పాటు ఆర్థికంగా నష్టపరిచే చర్యలతో పంజాబ్ కేసరి రోజువారీ కార్యకలాపాలను అడ్డుకునే యత్నాలు జరగడం శోచనీయమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పత్రిక ముద్రణకు అవరోధాలు తొలగించడంపై ఐఎన్ఎస్ హర్షం వ్యక్తం చేసింది. మీడియా స్వేచ్ఛను అడ్డుకోవడం దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు, విలువలకు ముప్పు కలిగిస్తుందని తెలిపింది.

సింధూ జలాల ఒప్పందంపై ఆర్బిట్రేషన్ కోర్టు విచారణను గుర్తించబోం: భారత్

ఈటీవీ భారత్: సింధూ జలాల ఒప్పందంపై మళ్లీ విచారణ చేపట్టనున్నట్లు కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ తెలిపిన వేళ, భారత్ తీవ్రంగా స్పందించింది. ఈ విచారణలో తాము పాల్గొనబోమని స్పష్టం చేసింది. భారత్- పాకిస్థాన్ సింధు జలాల ఒప్పందానికి సంబంధించి కొత్త విచారణలు, ఆదేశాలతో హేగ్‌లోని అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్ట్ ముందుకు సాగుతున్న వేళ, ఈ విచారణల చట్టబద్ధతను గుర్తించబోమని భారత్ తేల్చిచెప్పింది. ఫిబ్రవరి 2-3 తేదీల్లో ఈ కేసును విచారిస్తామని ఈ కోర్టు భారత్‌కు తెలిపింది. భారత్ ఇంతవరకు ఎలాంటి ప్రతివాద నివేదికను దాఖలు చేయలేదని పేర్కొంది. అయితే, కోర్టు వ్యాఖ్యలపై భారత్ మండిపడింది. చట్టవిరుద్ధంగా ఏర్పాటైన ఈ కోర్టు, అసంబద్ధమైన విచారణలను కొనసాగిస్తోందని పేర్కొంది. దీని చట్టబద్ధతను తాము గుర్తించనందున, దాని ఆదేశాలపై స్పందించబోమని తేల్చిచెప్పింది.

(c) eenadu

జీతం బకాయిలు చెల్లించకుండా వైకాపా నాయకుడి వేధింపులు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: తాను, తన భార్య మూడేళ్లుగా ఓ వైకాపా నాయకుడి వద్ద పనిచేస్తున్నామని.. అందుకు తమకు ఇవ్వాల్సిన జీతభత్యాలు చెల్లించకుండా ఆయన తమను వేధిస్తున్నాడని గుంటూరు జిల్లా నల్లపాడుకు చెందిన బాలకృష్ణ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో సోమవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో వచ్చిన బాధితుల నుంచి మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, శెట్టి బలిజ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. గత ప్రభుత్వంలో తన భూమిని ఆన్‌లైన్‌లో వేరొకరి పేరుతో నమోదు చేశారని పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరానికి చెందిన కామిశెట్టి చెన్నకేశవరావు ఫిర్యాదు చేశారు.

బాయిలర్ అటెండెంట్ పరీక్షల నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ బాయిలర్ల విభాగంలో బాయిలర్ అటెండెంట్ పరీక్షల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆ విభాగం డైరెక్టర్ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది మే, జూన్ నెలల్లో నిర్వహించబోయే మొదటి, రెండో తరగతి పరీక్షల నిర్వహణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, విద్యార్హత, వయసు, పని అనుభవం లాంటి పూర్తి వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ www.ap.gov.in నుంచి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను మార్చి 31 సాయంత్రం ఐదు గంటలలోపు సమర్పించాలని తెలిపారు.

'బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గం'

ఈనాడు, అమరావతి: అంగన్‌వాడీలకు వేతనాల పెంపు, పథకాల నిర్వహణకు కేంద్ర బడ్జెట్‌లో సరిపడా నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని రాష్ట్ర అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల యూనియన్(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఆలిండియా కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర ప్రాజెక్టు, మండల కేంద్రాల్లో నిరసన తెలియజేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. బడ్జెట్ కాపీలను తగలబెట్టనున్నట్లు పేర్కొన్నారు.

కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైకాపా యత్నం

తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేందుకు వైకాపా నాయకులు ప్రయత్నిస్తున్నారని తెదేపా ఎస్టీ సెల్ అధ్యక్షుడు దారునాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం తెదేపా ఎస్టీ సెల్ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి హాజరయ్యారు. పలువురు ఎస్టీ సెల్ నాయకులు గిరిజనుల అభివృద్ధికి సలహాలు, సూచనలు చేశారు.

కులం కార్డును వినియోగించడం అలవాటుగా మారింది: నూకానమ్మ

ఈనాడు, అమరావతి: నోటికొచ్చినట్లు మురికి వ్యాఖ్యలు చేసి కులం కార్డును వినియోగించడం వైకాపా నాయకుడు జోగి రమేశ్‌కు అలవాటుగా మారిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఇన్‌ఛార్జ్ నూకానమ్మ మండిపడ్డారు. మహిళల్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేయడాన్ని ఏ పార్టీకి చెందిన బీసీలైనా సమర్థించబోరని సోమవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

ఏటీఎస్‌లు, ప్రభుత్వానికి మధ్య ఫీజు పంపిణీపై మార్గదర్శకాలు

ఈనాడు, అమరావతి: వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) వసూలు చేసే ఫీజులో ఏటీఎస్ నిర్వాహకులు, ప్రభుత్వానికి ఎంత మొత్తం చొప్పున, ఎలా పంపిణీ చేయాలనేది పేర్కొంటూ ప్రభుత్వం ఎస్‌ఓపీ జారీ చేసింది.

◆ వాహనదారుల నుంచి వసూలుచేసే ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ ఫీజు కలిపి తొలి రెండేళ్లు పూర్తిగా ఏటీఎస్‌ల నిర్వాహకులకే దక్కుతుంది. వీటి లేట్ ఫీజు, సర్వీసు ఫీజు మాత్రం ప్రభుత్వ ఖజానాలో జమవుతుంది.

◆ రెండేళ్ల తర్వాత ఫిట్‌నెస్ టెస్ట్ ఫీజు, సర్టిఫికెట్ జారీ ఫీజులో టెండరులో కోట్ చేసిన విధంగా విభజిస్తారు. ఆ మేరకు ప్రభుత్వ ఖజానా, ఏటీఎస్‌ల ఖాతాల్లో ఎవరి వాటా వారికి జమవుతుంది.

◆ ఈ ఫీజులపై 18 శాతం జీఎస్టీని ఏటీఎస్ నిర్వాహకులే చెల్లించాలి.

◆ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన ఏజెన్సీల ద్వారా రవాణాశాఖ ఏటీఎస్‌ల్లో ఆకస్మిక ఆడిట్‌లు నిర్వహిస్తుంది. ఈ ఖర్చును నిర్వాహకులే భరించాలి.

ఇద్దరు బాలికలపై బాలుడి అఘాయిత్యం

తెలంగాణలో ఘటన

చింతలమానెపల్లి,న్యూస్‌టుడే: తెలంగాణలోని కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా చింతలమానెపల్లి మండలంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలపై అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు(15) అఘాయిత్యానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... 8, 9 ఏళ్ల వయసున్న ఇద్దరు బాలికల కుటుంబాలు పక్కపక్క ఇళ్లల్లో నివాసం ఉంటున్నాయి. ఆదివారం సెలవు కావడంతో ఇంటి సమీపంలో ఆడుకుంటున్న బాలికల వద్దకు వెళ్లిన నిందితుడు... డబ్బులు ఇస్తానని ఆశ చూపాడు. తర్వాత నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లోకి వారిని తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. సాయంత్రం ఈ ఘటన వెలుగులోకి రావడంతో గ్రామంలో తీవ్ర కలకలం రేగింది. బాధితుల కుటుంబ సభ్యులు కుల పెద్దలను ఆశ్రయించడంతో అదే రోజు రాత్రి పంచాయితీ నిర్వహించారు. నిందితుడిని గ్రామ బహిష్కరణ చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఒప్పందాల ఫలప్రదానికి అడుగులు

- విశాఖ సదస్సు ఎంఓయూల గ్రౌండింగ్‌పై దృష్టి
- జనవరిలో 19 ఒప్పందాలకు ఎస్ఐపీబీలో ఆమోదం
- ఫిబ్రవరిలో 7 ఆమోదానికి కసరత్తు

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలో గత ఏడాది నవంబరులో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో వివిధ సంస్థలు ప్రభుత్వంతో కుదుర్చుకున్న 538 ఒప్పందాల్లో.. 165 ఒప్పందాలను గ్రౌండింగ్ చేసేందుకు పరిశ్రమల శాఖ కసరత్తు మొదలు పెట్టింది. ప్రతి నెలా కొన్ని ఒప్పందాలను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ)లో ఆమోదం తెలపడం ద్వారా.. సాధ్యమైనంత త్వరగా గ్రౌండింగ్ చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే జనవరిలో 19 ఒప్పందాలకు ఎస్ఐపీబీలో అనుమతులు ఇచ్చారు. ఫిబ్రవరిలో మరో 7 ఒప్పందాలకు అనుమతులు ఇచ్చేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. మిగిలిన వాటికీ దశల వారీగా ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. రూ.1,000 కోట్లు.. అంతకు మించి పెట్టుబడులు పెట్టే సంస్థల గ్రౌండింగ్‌పై అధికారులు ప్రస్తుతం దృష్టి సారించారు. వాటి ద్వారా వివిధ సంస్థలు రూ.2,06,547 కోట్ల పెట్టుబడులు.. 3,88,684 మందికి ఉపాధి లభిస్తుందని సంస్థలు అందించిన డీపీఆర్‌లో పేర్కొన్నాయి. వాటికి అవసరమైన అనుమతులు స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానంలో అధికారులు అందిస్తున్నారు. ఏపీ పార్టనర్‌షిప్ సమ్మిట్(పీఎస్-2025) పేరిట ప్రత్యేక పోర్టల్‌ను పరిశ్రమల శాఖ ఏర్పాటు చేసింది.

నెలవారీగా..కార్యాచరణ

ప్రస్తుతం 165 ఎంఓయూల అమలుకు అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. వాటిలో రూ.1,000 కోట్లు అంతకు మించి పెట్టుబడులు పెట్టే 78 ఎంఓయూల గ్రౌండింగ్‌పై దృష్టి పెట్టారు. వాటి ద్వారా రూ.1,88,573 కోట్ల పెట్టుబడులు రానున్నాయి. వాటికి 50 ఎకరాలు.. అంతకు మించి భూములను ప్రభుత్వం కేటాయించాల్సి ఉంది. అలాగే, ఏపీఐఐసీ ద్వారా భూముల కేటాయించాల్సిన 87 ఒప్పందాలూ గ్రౌండింగ్ చేయడం ద్వారా రూ.17,974 కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

■ జనవరిలో ఎస్ఐపీబీ ఆమోదించిన 19 ఒప్పందాల ద్వారా రూ.51,558 కోట్ల పెట్టుబడులు పెట్టే కంపెనీలు గ్రౌండింగ్ అయ్యాయి. వాటి ద్వారా 23,592 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు డీపీఆర్‌లో పేర్కొన్నాయి.

■ ఫిబ్రవరిలో రూ.17,458 కోట్ల పెట్టుబడులకు సంబంధించి.. ఏడు ఒప్పందాలను ఎస్ఐపీబీలో ఆమోదించనున్నారు. ఈనెల 4న సీఎస్ అధ్యక్షతన జరిగే ఎస్ఐపీబీ సమావేశంలో వాటిపై అధికారులు ప్రాథమికంగా చర్చించనున్నారు.

■ మిగిలిన 58 ప్రాజెక్టులకు ఆ తర్వాత నిర్వహించే ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం తెలపడం ద్వారా గ్రౌండింగ్‌పై దృష్టి పెట్టారు.

■ పరిశ్రమలకు 50 ఎకరాల్లోపు భూములను ఏపీఐఐసీ కేటాయించే అవకాశం ఉంది. అలాంటి 87 ప్రతిపాదనల ద్వారా సంస్థలు రూ.17,974 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి.

ఒప్పందాల విలువ..రూ.11.37 లక్షల కోట్లు!

విశాఖ సదస్సులో వివిధ రంగాలకు చెందిన 538 సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. వాటి ద్వారా రూ.11,37,880 కోట్ల పెట్టుబడులు.. 14,03,210 మందికి ఉపాధి కల్పించనున్నట్లు సంస్థలు డీపీఆర్‌లో పేర్కొన్నాయి.

■ 416 ఒప్పందాల ద్వారా రూ.7.76 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టే సంస్థలు... పరిశ్రమలు ఏర్పాటు చేసే జిల్లాలపై ఇప్పటికే స్పష్టత ఇచ్చాయి.

■ మిగిలిన 122 ఒప్పందాలకు సంబంధించి (రూ.3.62 లక్షల కోట్ల పెట్టుబడులు) ప్రాంతాలను ఇంకా ఎంపిక చేయాల్సి ఉంది.

సంస్థలు పెట్టే పెట్టుబడి పరిధి.. ఎంఓయూల సంఖ్య

పెట్టుబడి పరిధి రూ.కోట్లలో	ఎంఓయూలు	ఎంఓయూల విలువ రూ.కోట్లలో
0-50	78	2,017
51-100	58	4,528
101-500	160	46,523
501-1000	58	46,117
1001-5000	86	2,12,412
5001-10,000	20	1,50,095
10,001కు పైబడి	25	6,76,188
ఇతర ఒప్పందాలు	53	-----

■ ఇతర ఒప్పందాల కింద 53 ఎంఓయూలు కుదుర్చుకున్న సంస్థలు.. పెట్టుబడి పెట్టే మొత్తంపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు.

■ ఒప్పందాలను మంత్రులు, సెక్రటరీలు, జిల్లా కలెక్టర్లకు పీఎస్-2025 పోర్టల్‌లో ఉంచి.. వారికి లాగిన్ సదుపాయాన్ని కల్పించారు. ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్‌లో ఎప్పటికప్పుడు ఎంఓయూల స్థితిని తెలుసుకోవచ్చు.

భారీ మొత్తంలో పెట్టుబడులు వచ్చే కీలక రంగాలు

కేటగిరి	మొత్తం ఒప్పందాలు	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి
ఇంధనరంగం	50	4,66,075	2,48,117
పరిశ్రమలు, వాణిజ్యం	165	2,02,263	3,82,048
ఏపీ మారిటైం బోర్డు	25	1,65,396	1,15,875
ఐటీ, ఎలక్ట్రానిక్స్	91	1,24,448	2,32,087
ఏపీసీఆర్‌డీఏ	41	48,711	41,625
ఏపీఏడీసీఎల్	13	36,362	1,90,774
పర్యాటకం	102	18,448	97,076

ఏపీఎండీసీకి మరో 6 బీచ్ శాండ్ లీజులు

- సిఫార్సు చేసిన అణు ఇంధన శాఖ
- కేంద్ర గనుల శాఖ అనుమతే తరువాయి

ఈనాడు, అమరావతి: ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)కి దాదాపు ఐదు వేల హెక్టార్లలో మరో ఆరు బీచ్ శాండ్ లీజుల మంజూరుకు మార్గం సుగమమైంది. ఈ మేరకు అణు ఇంధన శాఖ (డీఏఈ) తాజాగా కేంద్రానికి సిఫార్సు చేసింది. దీంతో శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో ఆరు లీజులు ఏపీఎండీసీకి దక్కనున్నాయి. దీనికి కేంద్ర గనుల శాఖ ప్రాథమిక అనుమతి (ఎల్ఓఐ) జారీ చేస్తే, రాష్ట్ర గనుల శాఖ.. ఏపీఎండీసీకి ఆ లీజులు మంజూరు చేసే ప్రక్రియ చేపడుతుంది.

◆ రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు మొత్తం 16,604 హెక్టార్లలో 16 లీజుల మంజూరు కోసం గతం నుంచి ఏపీఎండీసీ ప్రయత్నాలు చేస్తోంది. వీటిలో 211 మిలియన్ టన్నుల బీచ్ శాండ్ నిల్వలు ఉంటాయని అంచనా వేస్తున్నారు.

◆ శ్రీకాకుళం జిల్లా గార మండలంలోని 909.85 హెక్టార్లలో రెండు లీజులు, విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో 90.15 హెక్టార్లలో ఒక లీజు కలిపి వెయ్యి హెక్టార్లలో మూడు లీజులు ఏపీఎండీసీకి గతంలో మంజూరయ్యాయి. వీటిలో తవ్వకాలు మొదలుపెడితే మిగిలిన లీజులు మంజూరు చేస్తామని గతంలో కేంద్రం తెలిపింది. ఈ మూడు లీజులకు టెండర్లు పిలిచి, మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్ (డీపీఓ) గుత్తేదారును ఎంపిక చేశారు. తవ్వకాలకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతో పాటు వివిధ అనుమతులు తీసుకుంటున్నారు. దీంతో ఇప్పుడు కొత్తగా మరో ఆరు లీజులు ఇచ్చేందుకు సానుకూల నిర్ణయం వెలువడింది. దీంతో ఏపీఎండీసీకి మొత్తం 9 బీచ్‌శాండ్ లీజులు దక్కినట్లు అవుతుంది.

అరుదైన ఖనిజాలతో అదనపు రాబడి

◆ బీచ్ శాండ్‌లో మోనజైట్, ఇల్మినైట్, రూటైల్, లుకోక్సెన్, జిర్కాన్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి ఖనిజాలు ఉంటాయి ◆ మోనజైట్‌లో అణుధార్మికత ఎక్కువగా ఉంటుంది. మిగిలిన ఖనిజాల్లో పరిమితంగా ఉంటుంది ◆ బీచ్ శాండ్ తవ్వకాలు చేసి, వాటిలో ఆయా ఖనిజాలను వేరుచేసి, తర్వాత విలువ జోడించే ప్రక్రియ చేపడతారు ◆ ఇప్పటికే మంజూరైన మూడు లీజుల్లో తవ్వకాలు, ఖనిజాలను వేరుచేయడం, వాటికి వాల్యూ యాడ్ చేయడం తదితరాల కోసం పిలిచిన టెండర్లను అదానీ గ్రూప్‌నకు చెందిన అల్లువియల్ హెవీ మినరల్స్ లిమిటెడ్ సంస్థ దక్కించుకుంది ◆ ఈ సంస్థ తవ్వకాలు.. తదనంతర ప్రక్రియ చేపట్టి, ఆయా ఖనిజాల విక్రయాలు మొదలుపెడితే.. ఏపీఎండీసీకి ఏటా రూ.150 కోట్ల వరకు రాబడి వస్తుంది ◆ ఇప్పుడు కొత్తగా మరో ఆరు లీజులకు కూడా టెండర్లు నిర్వహించి, తవ్వకాలు చేపడితే.. ఏపీఎండీసీ రాబడి భవిష్యత్తులో మరింత పెరగనుంది.

కొట్టిన చెట్టే.. ఆకట్టుకునేలా

తెలంగాణలోని మెదక్ జిల్లా నర్సాపూర్ ఎకో పార్కులో కాటేజీలను బుక్ చేసుకునే కార్యాలయంలో చెట్టు మొద్దునే బల్లగా వినియోగిస్తున్నారు. ఇటీవల ఈ ఎకో పార్కు ప్రారంభం కాగా నిర్వాహకులు మరో చోట పెద్ద వృక్షం నరికేసి ఉండడం చూసి దాని మొద్దును ఇక్కడికి తీసుకొచ్చారు. పై భాగంలో కొంత చెక్కి టేబుల్‌గా వినియోగిస్తున్నారు. పార్కుకు వచ్చిన పర్యాటకులను ఇది ఆకట్టుకుంటోంది. – న్యూస్‌టుడే, నర్సాపూర్



వైకాపా నేతలపై దాడుల అంశాలను దిల్లీలో ఎండగట్టాలి

వైకాపా ముఖ్యనేతల సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: 'కల్తీ నెయ్యి పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు వెంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్న విధానాన్ని జాతీయస్థాయిలో ఎండగట్టాలి. మాజీ మంత్రులు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్లపై జరిగిన దాడుల విషయం దిల్లీ స్థాయిలో చర్చ జరిగేలా చేయాలి' అని వైకాపా ముఖ్యనేతలు నిర్ణయించారు. దాడుల విషయం కేంద్ర హోంశాఖ, జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించారు. తాడేపల్లిలోని వైకాపా కార్యాలయంలో సోమవారం వారు సమావేశమై రాజకీయ పరిణామాలు, పార్టీ తరఫున చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. పార్టీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి, శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు పేర్ని నాని, కారుమూరి నాగేశ్వరరావు, మేరుగు నాగార్జున, గుడివాడ అమర్నాథ్, మాజీ ఎంపీ మార్గాని భరత్, కొందరు మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పాల్గొన్నారు. 'తిరుమల లడ్డూ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తాను చేసిన తప్పుపై భక్తులకు క్షమాపణ చెప్పకపోగా, ఆయన తప్పులను ప్రశ్నిస్తున్న వైకాపా నాయకులపై కుట్రలు చేస్తున్నారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల ఇళ్లపై తెదేపా వారు దాడులు చేస్తున్నారు. దాడులను పోలీసులు అడ్డుకోవడం లేదు.. కేసులూ నమోదు చేయడం లేదు. వీటన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లే కార్యక్రమాలను చేపట్టాలి' అని నిర్ణయించారు.

◆ వైకాపా అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ బుధవారం బెంగళూరు నుంచి తాడేపల్లికి రానున్నారు.

ఆర్ఎస్ఎస్ అర్థమవ్వాలంటే అందులో భాగమవ్వాలి!

ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్

మాదాపూర్, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) అర్థమవ్వాలంటే అందులో భాగం కావాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ పేర్కొన్నారు. సంఘ్ కార్య శతాబ్ది సందర్భంగా ఆదివారం '100 ఏళ్ల సంఘ్ యాత్ర-కొత్త ఆశయాలు' పేరిట మాదాపూర్ హెచ్ఐసీసీలో సమావేశం నిర్వహించినట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ సందర్భంగా డా.మోహన్ భాగవత్ మాట్లాడుతూ.. ఉత్తమ దేశ నిర్మాణమే సంఘ్ మొదటి లక్ష్యమన్నారు. దేశాభివృద్ధి అంటే అది ప్రభుత్వాల పని అని ప్రజలు అనుకుంటారని, అలా కాకుండా మనల్ని మనమే బాగు చేసుకోవాలన్నారు. సమాజంలో ఏకత, గుణాత్మకత వచ్చేవరకూ దేశ భవిత మారదని, మారకుంటే మనం ప్రమాదంలో పడినట్లేనన్నారు. ఏ దేశమైనా తమ జాతీయ ప్రయోజనాల మేరకు అంతర్జాతీయ వ్యవహారాలు నిర్వహిస్తుందని..భారత్ కూడా ఈ విషయంలో రాజీ లేని ధోరణినే అవలంబించాలని సూచించారు. ప్రపంచంలో ఎంత అలజడి ఉన్నప్పటికీ, బలమైన కుటుంబ వ్యవస్థ కారణంగా మనపై ఆ ప్రభావం లేదన్నారు. దేశంలోకి అక్రమంగా వచ్చినవారిని గుర్తించడం, నిర్బంధించడం, తిప్పి పంపడం ప్రభుత్వ విధులే అయినప్పటికీ పౌరులు బాధ్యతతో వ్యవహరించి అలాంటివారి వివరాలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రతి పల్లెకూ బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన సామగ్రి వినియోగం
- ఏపీ టెలికాం సర్కిల్ అంతటికీ విస్తరణ

ఈనాడు, ఒంగోలు: భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) ప్రైవేటుతో పోటీకి సన్నద్ధమవుతుంది. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న 3జీ సేవలను నిలిపేసి 4జీ సేవలను పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందుకోసం స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన యంత్ర పరికరాలను వినియోగించింది. నెట్‌వర్క్ విస్తరణలో భాగంగా సెల్‌టవర్లను పెంచడం, వినియోగదారులను ఆకర్షించే పనిలో ఉంది. 2015 తరువాత ప్రైవేట్ ఆపరేటర్లు విదేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం దిగుమతి చేసుకొన్న యంత్ర పరికరాలను వినియోగించి 4జీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. బీఎస్ఎన్ఎల్ పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన వాటినే వినియోగించాలన్న ఉద్దేశంతో 2019లో ప్రయోగాలు మొదలుపెట్టింది. రెండేళ్లపాటు శ్రమించి పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో బీటీఎస్, మిమో యాంటెన్నాలు రూపొందించారు. 2021లో ప్రయోగాత్మకంగా పంజాబ్‌లో సేవలు ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ టెలికాం సర్కిల్ పరిధిలో 2023 జూన్ నుంచి మొదలుపెట్టి గత ఏడాది మార్చి నాటికి పరికరాలు అమర్చారు. ఏడాది చివరికల్లా సాంకేతిక సమస్యలు దాదాపు అధిగమించారు. ఏపీ టెలికాం సర్కిల్ పరిధిలో దాదాపు 16 వేల చోట్ల 4జీ నెట్‌వర్క్‌కు బీటీఎస్ (బేస్ ట్రాన్సివర్ సిస్టం)లు అమర్చారు.



స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన బీటీఎస్

కీప్యాడ్ ఫోన్లు పని చేసేందుకు ఉపయోగించే 2జీ నెట్‌వర్క్‌ను బీఎస్ఎన్ఎల్ ఇప్పటికీ కొనసాగిస్తోంది. ఇంటర్నెట్ అవసరాలు పెరగడంతో మారుమూల పల్లెల్లోనూ 4జీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. తర్వాత దశలో 5జీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళిక రూపొందించింది.

సెల్‌టవర్ల విస్తరణ లేక కవరేజీ సమస్య

4జీ సేవలు అందించడంలో భాగంగా ఒక సెల్‌టవర్ పరిధిలో మూడు బ్యాండ్లలో రేడియో తరంగాలను విడుదల చేస్తారు. దీనిలో 700 మెగా హెర్ట్జ్ (ఎంహెచ్) బ్యాండ్‌లో తక్కువ సిగ్నల్స్‌తో దాదాపు మూడున్నర కిలోమీటరు దూరం కవరేజీ ఉంటుంది. 2100 ఎంహెచ్‌లో కాస్త తక్కువ దూరం కవరేజీతో సిగ్నల్స్ ఎక్కువగా ఉంటాయి. రద్దీగా ఉండే నగరాలు, పట్టణాల్లో కిలోమీటరు పరిధిలో ఎక్కువ సిగ్నల్స్ ఉండే 2,500 ఎంహెచ్ బ్యాండ్ వినియోగిస్తారు. ఇప్పుడు 3జీ, 4జీ నెట్‌వర్క్‌లో 2,100 ఎంహెచ్ బ్యాండ్ రెండింటికి వినియోగించడంతో సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో 3జీ సేవలను పూర్తిగా పక్కనపెట్టేశారు. సెల్‌టవర్ల విస్తరణ లేకపోవడంతో కవరేజీ సమస్య ఎదురవుతోంది. దీంతో రాష్ట్రంలో మరో వెయ్యి టవర్లను అమర్చేలా ప్రణాళిక రూపొందించారు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్‌కు వినియోగదారులు మళ్లుతున్నారని, రానున్న రోజుల్లో మరింత పెరగనున్నారని బీఎస్ఎన్ఎల్ ఒంగోలు డివిజనల్ మేనేజర్ వీరాంజనేయులు పేర్కొన్నారు. ప్రైవేటు ఆపరేటర్ల మాదిరిగానే తామూ రోజుకు 2జీబీ డేటా, ఉచిత కాల్స్‌తో కూడిన సిమ్ కనెక్షన్ రూపాయికే అందించడం వంటివి చేస్తున్నామని వివరించారు.

విశాఖ ఫ్లీట్ రివ్యూను విజయవంతం చేయాలి

అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్



విశాఖపట్నంలో జరగనున్న మిలాన్-2026 ఏర్పాట్లపై తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ నావల్ కమాండ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఇతర అధికారులతో చర్చిస్తున్న సీఎస్ విజయానంద్

ఈనాడు-అమరావతి: విశాఖలో ఈ నెల 18, 19 తేదీల్లో నిర్వహించే అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్), మిలాన్-2026 కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించాలని వివిధ ప్రభుత్వశాఖల అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రపతి, రక్షణశాఖ మంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి వంటి వీవీఐపీలు కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో తూర్పు నౌకాదళం ప్రధాన నావల్ కమాండ్ వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్, ఇతర నౌకాదళ అధికారులు, వివిధ రాష్ట్ర ప్రభుత్వశాఖల అధికారులతో సోమవారం సచివాలయంలో సీఎస్ సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల కార్యక్రమాలకు బందోబస్తు పరంగా తగు ఏర్పాట్లు చేయాలని సూచించారు. శ్రీలంక, ఇరాన్ తదితర 19 దేశాలకు చెందిన నౌకలు, 4 వేల మంది వరకు ప్రతినిధులు అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూకు హాజరవుతారని వైస్ అడ్మిరల్ సుశీల్ మీనన్ ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, ప్రోటోకాల్ అదనపు డైరెక్టర్ మోహన్‌రావు, హోం శాఖ ఐజీ (ఆపరేషన్స్) సీహెచ్ శ్రీకాంత్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు వర్చువల్‌గా హాజరయ్యారు.

18 నుంచి యాదగిరిగుట్టలో బ్రహ్మోత్సవాలు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: మహాదివ్య క్షేత్రమైన యాదగిరిగుట్టలో ఈ నెల 18 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 11 రోజులపాటు వేడుకలు కొనసాగుతాయని ఆలయ అధికారులు సోమవారం తెలిపారు. విశేష ఉత్సవాల్లో భాగంగా 24న స్వామివారికి ఎదుర్కోలు, 25న శ్రీలక్ష్మీనారసింహస్వామి తిరు కల్యాణ మహోత్సవం, 26న రథోత్సవం, 28న గర్భాలయంలోని మూలవరులకు నిర్వహించే శతఘటాభిషేకంతో ఈ వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు.

మైనింగ్ బ్లాక్‌ల అనుమతులకు రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీ

ఈనాడు, అమరావతి: వేలం నిర్వహించిన మైనింగ్ బ్లాక్‌లకు వివిధ అనుమతులు వేగంగా లభించేలా చూసేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కోఆర్డినేషన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వు జారీచేసింది. ఈ కమిటీకి సీఎస్ ఛైర్మన్‌గా ఉంటారు. గనులు, అటవీ-పర్యావరణ, పరిశ్రమలు, రెవెన్యూ శాఖల కార్యదర్శులు, కేంద్ర గనులశాఖ సంయుక్త కార్యదర్శి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ మదింపు సంస్థల సభ్య కార్యదర్శులు, అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్‌లు సభ్యులుగా ఉంటారు. గనుల శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. న్యాయ నిపుణులు, మైనింగ్ రంగానికి చెందిన వారిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమిస్తారు.

◆ ఈ కమిటీ శాఖల మధ్య కోఆర్డినేషన్ ద్వారా ఆయా మైనింగ్ బ్లాక్‌లకు పర్యావరణ, అటవీ ఇతర అనుమతులు, రెవెన్యూ శాఖ నుంచి ఎన్వోసీలు వేగంగా దక్కేలా చూస్తుంది.

◆ త్వరగా ఆయా లీజుల్లో కార్యకలాపాలు మొదలయ్యేలా కృషి చేస్తుంది.

◆ ఆయా లీజులకు ఏయే అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయి? రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎక్కడ సమస్యలు ఉన్నాయి? సుప్రీంకోర్టు, ఎన్‌జీటీ తీర్పులు ఏం చెబుతున్నాయి? వంటివి పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటుంది.

◆ సింగిల్ విండో క్లియరెన్స్ విధానానికి ప్రోత్సాహం అందిస్తుంది.

◆ ఈ కమిటీ నెలకు ఓ సారి సమావేశం అవుతుంది.

◆ వీటిపై ఏటా రాష్ట్రస్థాయి వర్క్‌షాపులు నిర్వహించి, ఉత్తమ విధానాలు తీసుకొచ్చేలా చూడాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొంది.

పనిభారంతోనే సేవల్లో లోపాలు

- మా వ్యవస్థను కించపరచడం తగదు
- పశు సంవర్ధక సహాయకుల సంఘం

ఈనాడు, అమరావతి: పశు వైద్య సేవల్లో జాప్యం, లోపాలుంటే.. అందుకు సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, వాహనాల కొరత, అదనంగా అప్పగించే సర్వేలు వంటి వ్యవస్థాపరమైన అంశాలే కారణాలు తప్ప, వ్యక్తుల నిర్లక్ష్యం కాదని పశు సంవర్ధక సహాయకుల (ఆహాల) సంఘం తెలిపింది. సేవా లోపాలకు కేవలం ఆహాలనే బాధ్యులను చేయడం సమంజసం కాదని పేర్కొంది. 'స్వర్ణగ్రామ వ్యవస్థల్లో పనిచేస్తున్న ఆహాలకు వారికి సంబంధం లేని సర్వేలు, డేటా సేకరణ, ఆన్‌లైన్ ఎంట్రీలు, నివేదికల తయారీ, ఇతర శాఖల విధులు కూడా కేటాయిస్తున్నారు. ఈ అదనపు భారం ఉన్నా, తమ ప్రధాన బాధ్యతలను విస్మరించకుండా పాడి రైతుల కోసం ఆహాలు పనిచేస్తున్నారు' అని ఆ సంఘం అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'పశువుల ఆరోగ్యం, వ్యాధుల గుర్తింపు, ప్రాథమిక చికిత్స వంటి అంశాలపై స్మైల్ (స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) ద్వారా ఆహాలు శిక్షణ పొందారు. గ్రామస్థాయిలో పశువుల జనన నమోదు, టీకాలు, డీవార్మింగ్, వ్యాధుల నివారణ, ప్రాథమిక చికిత్స వంటి విధులను పశు వైద్యాధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణలో ఆహాలు నిర్వర్తిస్తున్నారు' అని గుర్తుచేశారు.

ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకే పరస్పర దాడులు: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా తెదేపా, వైకాపా పరస్పర దూషణలు, దాడులకు తెగబడుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఓ ప్రకటనలో విమర్శించారు. "రాష్ట్రం చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల సొత్తు కాదు. రాష్ట్రం ప్రజల ఆస్తి అని అధికార, ప్రతిపక్షాలు గ్రహించాలి. ప్రజా సమస్యల్ని గాలికొదిలేసి, తిరుపతి లడ్డూ వంటి ఆధ్యాత్మిక అంశాన్ని రాజకీయ అస్త్రంగా మార్చి, పరస్పర దూషణలకు పాల్పడడం నేతల అవివేకానికి నిదర్శనం. హుందాతనాన్ని కోల్పోయి వైకాపా నేతలు అంబటి రాంబాబు, జోగి రమేష్‌లు చేసిన వ్యాఖ్యలతో తెదేపా శ్రేణులు సంయమనం కోల్పోయి ప్రవర్తించడంతో జరిగిన పరిణామాలు విచారకరం" అని పేర్కొన్నారు.

చిన్న హాట్‌మిక్స్ ప్లాంట్లు ఉన్నా టెండర్లకు అర్హులే

ఈనాడు, అమరావతి: రోడ్ల మరమ్మతులు, రెన్యువల్ పనులకు తొలిసారి టెండర్లలో ఎవరూ ముందుకు రాకపోతే, రెండో విడత టెండర్లలో 40/60 టీపీహెచ్ హాట్ మిక్స్ ప్లాంట్లు ఉన్న గుత్తేదార్లు కూడా అర్హులవుతారని పేర్కొంటూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసింది. గతంలో 100/120 టీపీహెచ్ బ్యాచ్ టైప్ ప్లాంట్ ఉండాలనే నిబంధన ఉంది. అయితే గుంతలు పూడ్చే పనులు, రోడ్ల రెన్యువల్స్ వేగంగా జరిగేలా చూసేందుకు, తక్కువ సామర్థ్యంతో హాట్‌మిక్స్ ప్లాంట్లు ఉన్న గుత్తేదార్లకు కూడా అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం టెండర్లకు మాత్రమే ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు.

(c) eenadu